


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 231

మంగళవారం 12-11-2024



90% కేసుల్లో యాంటీబయాటిక్స్ అవసరం లేదు

- IIలో



చివరి వారాల్లో అధ్యక్షపీఠంపై కమల?

- 6లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL





నేటి మధ్యాహ్నం 12.30 గంటలకు సాక్షి టీవీలో

SAKSHI TV

ఆశీస్సులే ఆయువు

ఆశ తొణుకుతున్నప్పుడు
ఆశీస్సు దానిని నిలబెట్టవచ్చు.
ఔషధం ఓడుతున్నప్పుడు
ప్రార్థన దానిని గెలిపించవచ్చు.
అశ్రువు ఉబుకుతున్నప్పుడు
ఆర్ద్రత దానిని మందస్మితం చేయవచ్చు.
డబ్బు ఖర్చు లేని
అనంత దయ, సేవ, ఆర్ద్రత, సాంత్వన
మన వద్ద ఉంటాయి.
నిజ హృదయంతో వెచ్చిస్తే పని చేస్తాయి.
ఈ పిల్లలకు అవన్నీ కావాలి.
ఈ పిల్లలు చిరంజీవులై వెలగాలి.
'సాక్షి' మీడియా చైల్డ్ సెలబ్రిటీలతో
తనదైన ప్రయత్నం చేసింది.
హైదరాబాద్ లక్డీకాపూల్‌లోని
ఎం.ఎన్.జె. కేన్సర్ హాస్పిటల్‌లో
చికిత్స పొందుతున్న బాలలు
ఒక పూట కువకువలాడారు.
పకపక నవ్వారు.

నవంబర్ 14 'బాలల దినోత్సవం' నేపథ్యంలో ఎం.ఎన్.జె. కేన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సుమారు 150 మంది చిన్నారులను పలకరించే ప్రయత్నం చేసింది సాక్షి మీడియా. 'పొట్టేల్'. 'సరిపోదా శనివారం', 'మన్మథుడు-2' వంటి సినిమాల్లో నటించిన బాలతారలు ఖ్యాతి, సాన్విక, స్నితిక్, జాతీయ క్రీడాకారిణి కార్తీకలను తీసుకొచ్చి వారితో ముచ్చటించేలా చేసింది. చైల్డ్ సెలబ్రిటీలు వారి కోసం ఆటలు, పాటలు, డ్యాన్సులతో అలరించారు. అలాగే తమ ఆరోగ్యస్థితిని చైల్డ్ సెలబ్రిటీలతో పంచుకున్నారు.

● కేన్సర్ బాధిత చిన్నారులను పలకరిస్తున్న చైల్డ్ సెలబ్రిటీలు ఖ్యాతి, సాన్విక, స్నితిక్, జాతీయ క్రీడాకారిణి కార్తీక

● చిన్నారులతో కలిసి స్టెప్పులేస్తున్న బాల తారలు



నాకు ప్రస్తుతం బాగానే ఉంది. డాక్టర్లు బాగా చూసుకుంటున్నారు. నాకు అల్లు అర్జున్ సినిమా లంటే ఇష్టం. నన్ను కలవడానికి వచ్చిన సెలబ్రిటీల కోసం పుష్ప సినిమా పాట పాడాను. నా కోసం సాన్విక కూడా పాట పాడింది. వారితో కలిసి మాట్లాడటం హ్యాపీగా ఉంది. **- జశ్వంత్**

* * *

మేం సిద్దిపేట నుంచి వచ్చాం. హాస్పిటల్ అంటే నాకు భయం.. కానీ ఇక్కడ బాగానే ఉంది. సినిమాల్లో నటించే వారు మా కోసం రావడం సంతోషంగా ఉంది. నాకు కూడా సినిమాలంటే ఇష్టం. చివరగా శ్యాం సింగరాయ్ సినిమా చూశాను. త్వరగా నయమైతే స్కూల్‌కు వెళ్లాలనుంది.

- రిషి ప్రియ, సిద్దిపేట

* * *

చాలా రోజుల నుంచి ఇక్కడే ఉన్నాను. నాకు చదువంటే చాలా ఇష్టం, ముఖ్యంగా మ్యాథ్స్ అంటే చాలా ఇష్టం. స్పైడర్‌మ్యాన్ నా ఫేవరెట్. సాన్విక అక్కతో ఆడుకున్నాను, లెక్కలు చెప్పాను.

- ఓ చిన్నారి, జహీరాబాద్ బర్దీపూర్

* * *

నాకు ఫుట్‌బాల్, దాగుడుమూతలు అంటే చాలా ఇష్టం. ఇప్పుడు అవన్నీ ఆడుకోలేకపోతున్నాను. ఇలా బాధ పడుతున్న సమయంలో వీరంతా వచ్చి నాతో ఆడుకున్నారు. చాలా ముచ్చట్లు చెప్పారు. నన్ను షూటింగ్‌కు తీసుకెళతానని కూడా చెప్పారు. **- చేతన్**



విభిన్న పేర్లతో పలు రకాల కేన్సర్లు ఉన్నప్పటికీ అవన్నీ హిమటలాజికల్ మ్యాలిగ్నెన్సెస్, సాలిడ్ ట్యూమర్స్ అనే రెండు విభాగాల కిందకు వస్తాయి. చిన్నారుల్లో దీర్ఘకాలం పాటు హై ఫీవర్, చలి జ్వరం, బ్లీడింగ్, చిగుర్లలో రక్తస్రావం.. శరీరంలో, ఛాతీలో అసౌకర్యం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, వయసుకు తగ్గట్టు బరువు పెరగక పోవడం లేదా బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉంటే అప్రమత్తం కావాలి. సాలిడ్ ట్యూమర్స్‌లో పిల్లలు అకస్మాత్తుగా స్పృహ కోల్పోవడం, ఫిట్స్ రావడం జరుగుతుంది. చికిత్స పొందుతున్న చిన్నారులకు క్యాన్సర్‌కు సంబంధించిన అవగాహన అంతగా ఉండకపోవడం వల్ల ఎక్కువగా భయం ఉండదు. కానీ నిత్యం హాస్పిటల్స్ చుట్టూ తిరగడం వల్ల మానసిక ఇబ్బందులకు గురవుతుంటారు. ఈ నేపథ్యంలో వారికోసం ప్రత్యేకంగా ప్లే స్టేషన్ ఏర్పాటు చేశాం. ఇలాంటి వ్యాధితోనే ఇబ్బంది పడుతున్న ఇతర చిన్నారులతో మమేకం చేస్తాం.

- అనుదీప్, మెడికల్ ఆంకాలజిస్ట్

అవగాహన వచ్చింది

కేన్సర్ గురించి కొంచెం అవగాహన ఉంది. అందుకే గతంలోనే ఇలాంటి చిన్నారుల కోసం నేను రెండుసార్లు నా హెయిర్ డొనేషన్ చేశాను. కానీ ఇలాంటి ప్లేస్‌కు రావడం ఇదే మొదటి సారి. వీరి విల్ పవర్ చూశాక సమస్య ల నుంచి ఎలా రాణించాలో ఒక అవగాహన వచ్చింది. మళ్లీ మళ్లీ ఇక్కడికి వచ్చి ఈ చిన్నారులతో ఆడుకోవాలనుంది.

- కార్తీక, నేషనల్ ప్లేయర్

హెయిర్ డొనేట్ చేస్తాను

ఈ హాస్పిటల్‌లో చిన్నారులను చూశాకే కేన్సర్ ఎంత ప్రమాదకరమైనదో తెలిసింది. వారిని చూస్తుంటే ఏడుపొచ్చేసింది. నేను కూడా గతంలో ఇలాంటి వారి కోసం హెయిర్ డొనేట్ చేశాను. మళ్లీ కూడా చేయాలని ఇప్పుడు నిర్ణయించుకున్నాను.

-ఖ్యాతి, సరిపోదా శనివారం ఫేమ్

వీరిని చూశాక లోపల ఎంతో బాధ కలిగినప్పటికీ దానిని దాచి వీరందరినీ సంతోషపెట్టడానికి ప్రయత్నం చేశాను. పాటలు పాడాను, నాటు నాటు డ్యాన్స్ చేశాను.

- సాన్విక, సరిపోదా శనివారం

* * *

వీరందరినీ ఇలా చూస్తుంటే భయమేసింది. అందరికీ నయం అయి త్వరగా ఇంటికి పోవాలని కోరుకుంటున్నాను. అందరితో ఆడుకున్నాను, డ్యాన్సులు చేశాను.

- స్నితిక్, పొట్టేల్ ఫేమ్

ఈ వారమంతా లిటిల్ స్టార్స్ సందడిని సాక్షి యూట్యూబ్‌లో చూడటానికి ఈ qr కోడ్‌ను స్కాన్ చెయ్యండి





భయం లేదు చికిత్సలు ఉన్నాయి

అనారోగ్యం అని తెలిశాక పరీక్షల నిర్ధారణతో పాటు చికిత్సలో భాగంగా అన్ని సేవలు ఎం.ఎన్.జె. కేన్సర్ హాస్పిటల్‌లో ఉచితంగానే అందుతాయి. వ్యాధి దశను బట్టి చికిత్స కొనసాగుతుంది. ఈ చిన్నారులకు న్యూట్రిషన్ చాలా అవసరం. దీనికోసం కడల్స్ ఆర్గనైజేషన్ భాగస్వామ్యంతో మంచి న్యూట్రిషన్ అందిస్తున్నారు. చిన్నారుల వయస్సు, బరువును బట్టి ప్రొటీన్ ప్యాకెట్స్, డ్రై ఫ్రూట్స్ తదితరాలను అందిస్తున్నారు. కీమో, రేడియేషన్ వంటి చికిత్సల కోసం రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వస్తున్న వారికి చుట్టుపక్కల విడిదికి కూడా సహాయం చేస్తున్నారు. కేన్సర్ వ్యాధి జన్యుపరంగా కూడా వస్తున్నప్పటికి అది 15 నుంచి 20 శాతం మాత్రమే. కేన్సర్లకు పలు రకాల కారణాలున్నాయి. కేన్సర్‌కు ఇతర దేశాల్లో అందిస్తున్న అధునాతన చికిత్సకు మనకు వ్యత్యాసం పెద్దగా ఏమీ లేదు. మన దగ్గర కూడా లేటెస్ట్ ట్రయల్స్ మందులు అందుబాటులో ఉన్నాయి.

- డి.జి. భవాని

- హనుమాద్రి శ్రీకాంత్

ఫొటోలు: అనిల్ కుమార్ మోర్ల

యోగ కాలమ్

ఏకాగ్రతకు... ట్రీ



పిల్లలకు ఏకాగ్రత ఉండటం లేదు, ఎదుగుదల సరిగా లేదు.. అని పెద్దల నుంచి కంప్లైంట్స్ తరచూ వింటూ ఉంటాం. పిల్లల్లో ఆందోళన, చికాకు తగ్గడానికి యోగాభ్యాసం ఎంతగానో ఉపయోగపడుతుంది. పెద్దలు చేసే విధంగా పిల్లలకు యోగా సాధన కుదరదు. చిన్న చిన్న మార్పులు చేసి, పిల్లలచే సాధన చేయిస్తే వారి ఉన్నతికి యోగా ఒక బలమైన పునాదిగా ఉంటుంది. ముందు ఓ పది నిమిషాలు పిల్లలతో చిన్న చిన్న స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయించాలి. దీనివల్ల వారి శరీరం యోగాభ్యాసానికి సిద్ధం అవుతుంది. ఆ తర్వాత 12 సూర్యనమస్కారాలు చేయించాలి. పిల్లలకు ఏకాగ్రత, ఎదుగుదలకు సహకరించేవి..

ఆక్సీజన్ గా..

ముందు నిటారుగా నిల్చోవాలి. రెండు కాళ్లలో ఒక కాలిని మోకాళ్ల వద్ద వంచుతూ, పాదాన్ని నిలుచుని ఉన్న కాలు తొడ భాగంలో ఉంచాలి. హృదయం దగ్గర నమస్కార భంగిమ లో చేతులను ఉంచి, రెండు శ్వాసలు తీసుకుని వదిలాక, చేతులు రెండూ పైకి ఎత్తి నిల్చోవాలి. ఈ ఆసనం ద్వారా శరీరాన్ని బ్యాలెన్స్‌గా ఎలా ఉంచాలో తెలుస్తుంది. ఒక చెట్టు ఆక్సిజన్‌ను ఎలా ఉత్పత్తి చేస్తుందో అలాంటి భంగిమ కాబట్టి పిల్లల శ్వాసక్రియ కూడా బాగా పనిచేస్తుంది. ఈ ఆసనం ద్వారా వారిలో ఏకాగ్రత పెరుగుతుంది.

- జి. అనూషారాకేష్
యోగ గురు

సాగుబడి
విశాఖ కార్తె:
నవంబర్ 6 నుంచి

90% కేసుల్లో యాంటీబయాటిక్స్ అవసరం లేదు

● సంప్రదాయ ఆయుర్వేద చికిత్సలతోనే 42 రకాల పశు వ్యాధులకు 90% ఖచ్చితత్వంతో చికిత్స
● ఎత్నో వెటర్నరీ మెడిసిన్ ప్రాక్టీసెస్ (ఈవీపీ) నిపుణులు ప్రొఫెసర్ డా. ఎన్. పుణ్యస్వామితో 'సాక్షి సాగుబడి' ముఖాముఖి



డా. ఎన్. పుణ్యస్వామి

పశువైద్యంలో సంప్రదాయ ఆయుర్వేద చికిత్సా పద్ధతుల (ఎత్నోవెటర్నరీ ప్రాక్టీసెస్ -ఈవీపీల) ద్వారా యాంటీ బయాటిక్స్ వాడకాన్ని 90% తగ్గించవచ్చంటున్నారు తమిళనాడుకు చెందిన విశ్రాంత పశువైద్య ఆచార్యుడు డా. ఎన్. పుణ్యస్వామి. గత 20 ఏళ్లుగా సంప్రదాయ పశువైద్యంపై ఆయన పరిశోధనలు చేస్తున్నారు. ఈ చికిత్సలు పొదుగువాపు సహా 42 పశువ్యాధులను 3-5 రోజుల్లో 90% ఖచ్చితత్వంతో తగ్గిస్తున్నాయని రుజువైంది. జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ (ఎన్.డి.డి.బి) దేశవ్యాప్తంగా వీటిని పశువైద్యంలో భాగం చేసింది. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎ.ఎం.ఆర్.) సమస్యను అధిగమించాలన్నా, యాంటిబయాటిక్స్‌ను రక్షించుకోవాలన్నా సంప్రదాయ పశువైద్యమే మేలైన మార్గమని ప్రొ. పుణ్యస్వామి స్పష్టం చేస్తున్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన 'గోసంజీవని' ఆంగ్ల పుస్తకావిష్కరణ సభలో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ప్రొ.పుణ్యస్వామితో 'సాక్షి సాగుబడి' ముచ్చటించింది. ముఖ్యాంశాలు.

● అల్లోపతి పశువైద్య శాస్త్రంలో ప్రొఫెసర్ అయిన మీ దృష్టి సంప్రదాయ ఆయుర్వేద పశు వైద్య (ఈవీపీ) పద్ధతుల వైపు ఎలా మళ్లింది?

పశువైద్యానికి సంబంధించి ఇప్పుడున్న వ్యవస్థ అరకొరగా ఉందని నా అభిప్రాయం. ప్రతి పశువుకు ఆరోగ్య సేవలు అందాలి. వనరులు రైతులకు తక్కువ ఖర్చుతో పరిసరాల్లోనే అందుబాటులో ఉండాలి. చికిత్సకు పొందబోయే ఫలితంపై ఖచ్చితమైన అంచనా ఉండాలి. అల్లోపతి పశు వైద్య వ్యవస్థలో ఇవి లోపించాయి. ఎంత ఖచ్చితంగా ఫలితం వస్తుందో చెప్పలేం. అందువల్లే ఆయుర్వేదం, సంప్రదాయ సిద్ధ వైద్య రీతులను 2001 నుంచి అధ్యయనం చేశా. 20 ఏళ్ల నుంచి ఈవీపీ పద్ధతులపై పనిచేస్తున్నాం. 42 పశువ్యాధులకు చికిత్సా పద్ధతులను అభివృద్ధి చేశాం. మేం సూచించిన ఇంట్లోని దినుసులతో రైతులే స్వయంగా ఈ మందులను తయారు చేసుకొని పశువైద్యం చేసుకుంటున్నారు. స్వల్ప ఖర్చుతోనే 3-5 రోజుల్లోనే 80-90% పశు వ్యాధులు ఖచ్చితంగా తగ్గిపోతున్నాయి. ఇది శాస్త్రీయంగా నిర్ధారణ అయిన సంప్రదాయ చికిత్స పద్ధతి. అందువల్లే ఈ సంప్రదాయ చికిత్సను జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ (ఎన్.డి.డి.బి.) అంగీకరించింది. 2016లో నన్ను సంప్రదించింది. అప్పటి నుంచి 12 రాష్ట్రాల్లో మిల్క్ యూనియన్లతో కలసి పనిచేస్తున్నాం. పశువైద్యులకు, పాడి రైతులకు శిక్షణ ఇచ్చాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా 9 రాష్ట్రాల్లో ఈవీపి పద్ధతుల్లో పశువైద్యం జరుగుతోంది.

● పొదుగు వాపు నమ్మకంగా తగ్గిపోతుందా?

తప్పకుండా తగ్గిపోతుంది. ఎన్.డి.డి.బి. పరిధిలో వేలాది రైతుల అనుభవాలే ఇందుకు నిదర్శనం. పొదుగు వాపు నుంచి గాంగ్రీన్ వరకు 10 రకాల పొదుగు సంబంధిత జబ్బులు వస్తుంటాయి. గాంగ్రీన్ మినహా మిగతా 9 రకాల పశువ్యాధులను 3-5 రోజుల్లోనే ఈవీపీ వైద్యం ద్వారా సమర్థవంతంగా 85-90% కేసుల్లో శాశ్వతంగా తగ్గించవచ్చని నిరూపితమైంది. నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో సిక్కింలో డాక్టర్లకు శిక్షణ ఇచ్చాం. బీహార్‌లో పశు సఖిలకు శిక్షణ ఇచ్చాం.

భారత ప్రభుత్వం కూడా ఎత్నో వెటరినరీ జ్ఞానాన్ని ప్రధాన స్రవంతిలోకి తీసుకురావటం ప్రారంభించింది. పశువైద్యంలో డిగ్రీ కోర్సు (బీవీఎస్సీ) సిలబస్‌లోకి ప్రభుత్వం చేర్చింది.

● అంతర్జాతీయంగా యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్(ఎఎంఆర్) సమస్యను పరిష్కరించేందుకు ఈవీపీ చికిత్సలు ఉపయోగపడతాయా?

ప్రపంచవ్యాప్తంగా అందరూ యాంటీబయాటిక్ ఔషధాలను పశువైద్యంలో తగ్గించాలంటున్నారు. అయితే, వీటికి ప్రత్యామ్నాయ మందుల్ని సూచించలేకపోతున్నారు. ఇండియాకున్న బలమైన సంప్రదాయ విజ్ఞానం పెద్ద ఆస్తి. ఈవీపీ పద్ధతుల ఉగాండా, ఇథియోపియాలో రైతులకు శిక్షణ ఇచ్చాం. అమలు చేయటం సులభం కాబట్టి ఆయా దేశాల్లో రైతులు సత్ఫలితాలు సాధించారు. నెదర్లాండ్స్ దేశంతో, వాగనింగన్ విశ్వవిద్యాలయంతో కలసి పనిచేస్తున్నాం. అక్కడి పశువైద్యులకు శిక్షణ ఇచ్చాం.

● ఆహార వ్యవసాయ సంస్థ (యు.ఎన్. ఎఫ్.ఎ.ఓ.) గుర్తించిందా?

ఐక్యరాజ్యసమితికి చెందిన ఎఫ్.ఎ.ఓ. కేంద్ర పశుసంవర్థక శాఖతో కలసి ఇటీవలే 'స్టాండర్డ్ వెటరినరీ ట్రీట్‌మెంట్ గైడ్‌లైన్స్'ను విడుదల చేసింది. ఇందులో కూడా ఈవీపీ సంప్రదాయ చికిత్సా పద్ధతులను చేర్చింది. అల్లోపతి పశు వైద్య చికిత్సా పద్ధతి ఆధిపత్యం గురించో, మరో పద్ధతి ఆధిపత్యం నిరూపణ గురించో మనం మాట్లాడటం లేదు. ఒక జబ్బుకు చికిత్స అందించే సమయంలో పశువైద్యులకు, రైతులకు అనేక రకాల చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉండేలా చూడాలంటున్నాం. ఇప్పటికే అమల్లో ఉన్న అల్లోపతి పశువైద్య చికిత్సా పద్ధతిని తీసివేసి సంప్రదాయ మూలికా వైద్య పద్ధతులను ఆచరణలోకి తేవాలని మేం అనుకోవటం లేదు. ఎవరూ తప్పుగా అర్థం చేసుకోకండి. నేనూ అల్లోపతి పశువైద్య శాస్త్రం చదువుకున్న వాడినే. రోగ నిర్ధారణకు అల్లోపతి జ్ఞానాన్ని, చికిత్సకు సంప్రదాయ పద్ధతిని వాడుతూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం.



> అల్లోపతి పశువైద్య చికిత్సా పద్ధతిని తీసివేసి సంప్రదాయ మూలికా వైద్య పద్ధతులను ఆచరణలోకి తేవాలని మేం అనుకోవటం లేదు. ఒక జబ్బుకు చికిత్స అందించే సమయంలో పశువైద్యులకు, రైతులకు అనేక రకాల చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉండేలా చూడాలంటున్నాం.

● యాంటీబయాటిక్స్ వాడకం తగ్గుతుందా?

పొదుగు వాపు వ్యాధి చికిత్సలో కూడా 90% కేసులలో యాంటీబయాటిక్ మందులను వాడాల్సిన అవసరం లేదు. దూరంలో ఉన్న వైద్యులు టెలిమెడిసిన్ వ్యవస్థ ద్వారా పశువులకు సత్వర చికిత్సను అందించడానికి ఈవిఎం చికిత్సా పద్ధతులు ఎంతో అనువైనవి. ఇతర వైద్య పద్ధతుల్లో ఇది వీలు కాదు. రైతులు నేర్చుకొని, అవసరం వచ్చినప్పుడు తమంతట తాము ఆచరించదగిన గొప్ప పద్ధతి ఎత్నోవెటరినరీ మెడిసిన్. పశువులకు గాలికుంటు వ్యాధి (ఎఫ్.ఎం.డి.) వంటి అంటువ్యాధులు ప్రబలినప్పుడు ఫోన్ ద్వారా రైతులకు సూచనలు ఇచ్చి చికిత్స చేయవచ్చు. గత 35-40 ఏళ్లలో ఏ ఒక్క కొత్త యాంటీ బయాటిక్‌ను తయారు చేసుకోలేకపోయాం. అదే సమయంలో మనుషుల చికిత్సకు వాడాల్సిన అనేక యాంటీ బయాటిక్స్‌ను పశు వైద్యంలో విస్తృతంగా వాడటంతో ఆ యాంటీబయాటిక్స్ రోగకారక క్రిముల నిరోధకత (మల్టిపుల్ డ్రగ్ రెసిస్టెన్స్)ను పెంపొందించుకున్నాయి. దీంతో ఆ యాంటీబయాటిక్స్ పనిచేయక మనుషులు ప్రాణాలు కోల్పోతున్నారు. యాంటీ బయాటిక్ ఔషధాలను మనం రక్షించుకోవాలి. యాంటీబయాటిక్ ఔషధాల జోలికి పోకుండానే పశువుల్లో జ్వరం, విరేచనాలు వంటి సాధారణ జబ్బులకు వైద్యం చేయటానికి ప్రత్యామ్నాయ చికిత్సా పద్ధతులను ఆచరించాలి.

● దేశీ ఆవులు, సంకరజాతి ఆవులు, బర్రెలు అన్నిటికీ ఈ వైద్యం పనిచేస్తుందా?

ఏ జాతి పశువులకైనా తప్పకుండా పనిచేస్తుంది. సంకరజాతి ఆవుల్లో మాదిరిగా అధిక పాలు ఇచ్చే సాహివాల్ ఆవుల్లోనూ పొదుగు సంబంధిత సమస్యలు ఎక్కువే. వీటన్నిటికీ ఈవీపీలో నమ్మదగిన పరిష్కారం ఉంది. కృష్ణా మిల్క్ యూనియన్‌లో పాడి రైతులు ఈవీపీల చికిత్స ద్వారా పొదుగువాపు తదితర జబ్బులతో పాటు వంధ్యత్వం వంటి సమస్యలను సైతం అధిగమించారు.

● కోళ్ల వ్యాధులకు కూడా..?

కోళ్ల ఫారాల్లో కూడా ఈవీపీ చికిత్సలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. నేల ఉసిరి (భూమి అమ్ల), జిలకర్ర కలిపి నూరి, ఉండలు చేసి.. గంట గంటకు కొక్కెర సోకిన కోళ్లకు తినిపిస్తే 1-2 రోజుల్లోనే తగ్గిపోతుంది. ఇలా ఏ జాతి పశువులైనా, కోళ్లయినా, బాతులైనా.. వాటికి ఇతర ఔషధాల మాదిరిగానే ఈవిఎం మందులను కూడా తయారు చేసుకొని వాడుకోవచ్చు.

● సేంద్రియ పాల ఉత్పత్తికి ఈవీపీలు దోహదం చేస్తాయా?

నిస్సందేహంగా. అంతర్జాతీయంగా ఇటీవల 'మెడిసినల్ అగ్రోఎకాలజీ' భావన బలం పుంజుకుంటున్నది. పంటలనే కాదు పశువులను కూడా రసాయనాల్లేకుండా పెంచటమే ఇందులో ముఖ్యాంశం.

(నవంబర్ 18 నుంచి 'వరల్డ్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వీక్' సందర్భంగా..)

నిర్వహణ: **పంతంగి రాంబాబు,** సాగుబడి డెస్క్

ములుగు అటవీ కళాశాలలో శ్రీగంధం, ఎర్రచందనం నర్సరీ



సిద్దిపేట జిల్లా ములుగులోని అటవీ కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన నర్సరీలో నాణ్యమైన శ్రీగంధం, ఎర్రచందనం మొక్కల్ని తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. డీన్ డా. ఎస్.జే. ఆశ ఆధ్వర్యంలో కళాశాల ప్రాంగణంలో 1.5 లక్షల శ్రీగంధం, 25 వే ఎర్ర చందనం మొక్కల నర్సరీని ఏర్పాటు చేశారు. సెంటర్ ఫర్ ఆగ్రో ఫారెస్ట్రీ రిసర్చ్ అండ్ ఎక్స్‌టెన్షన్ సర్వీస్ (కేర్స్ టీఎస్) ఆధ్వర్యంలో మొక్కలు విక్రయించటంతో పాటు శ్రీగంధం, ఎర్రచందనం సాగుపై రైతులకు శిక్షణ ఇస్తున్నారు. ప్రైవేట్ నర్సరీలతో పోల్చితే తక్కువ ధరకే నాణ్యమైన మొక్కలను అందిస్తున్నామని ఆగ్రో ఫారెస్ట్రీ హెడ్ డా. మిలకురి చిరంజీవ రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు.. 73309 69580.

బిఎస్ఎఫ్ పురుగులతో చవకగా చేపల మేత!

బ్లాక్ సోల్జర్ ఫ్లై (బిఎస్ఎఫ్) పురుగులను ప్రత్యామ్నాయ ప్రొటీన్ వనరుగా ఉపయోగిస్తున్న విషయం తెలిసిందే. ఎండబెట్టిన బిఎస్ఎఫ్ పురుగుల పిండితో బలపాల (పెల్లెట్ల) రూపంలో చేపల మేతను తయారు చేసుకునేందుకు మార్గం సుగమం అయ్యింది. కూరగాయలు, పండ్ల వ్యర్థాలను ముడిసరుకుగా వాడి పర్యావరణ హితమైన పద్ధతుల్లో బిఎస్ఎఫ్ పురుగులను ఉత్పత్తి చేసి, వాటి పండితో వాణిజ్య స్థాయిలో నాణ్యమైన చేపల మేతను ఉత్పత్తి చేసే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఐసిఎఆర్ సంస్థ సెంట్రల్ మెరైన్ ఫిష్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఎంఆర్ఎఫ్ఐ) ఇటీవల అభివృద్ధి చేసింది. ఫీడ్ కన్వర్షన్ రేషియో చాలా మెరుగ్గా ఉండటమే కాకుండా చేపల మేత ఖర్చు తగ్గటం ద్వారా ఆక్వా రైతులకు మేలు జరుగుతుందని సిఎంఆర్ఎఫ్ఐ తెలిపింది. ఇప్పటివరకు సోయాచిక్కుళ్ల పిండి, ఎండుచేపల పిండిని ప్రొటీన్ వనరుగా చేపల మేతల్లో వాడుతున్నారు.




ఇక మీదట బిఎస్ఎఫ్ పురుగుల పిండిని నిక్షేపంగా వాడొచ్చని వెల్లడైంది. అయితే, ఈ మేత ఏయే రకాల చేపల పెంపకంలో ఎలా ఉపయోగపడుతోంది? అన్నది పరీక్షించాల్సి ఉంది. ఈ పరిశోధనను కొనసాగించేందుకు సిఎంఎఫ్ఆర్ఐ అమల ఎకోక్లీన్ అనే కేరళకు చెందిన స్టార్టప్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది.

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 231
మంగళవారం 12-11-2024
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'మహిళల ముఖాలు కళకళలాడుతూ ఉంటేనే కుటుంబమూ, సమాజమూ బాగుంటాయి'


సంధి కాలం కాదు...
ఆస్ట్రేలియా పర్యటనలో సత్తా చాటుతామన్న హెడ్ కోచ్ గంభీర్ -12లో


మార్కెట్ గతేంటి?
ట్రంప్ రాకతో మన ఎకానమీకి ఇక్కట్లే అంటున్న విశ్లేషకులు -13లో


ఏ మతమూ ప్రోత్సహించదు
కాలుష్యాన్ని సృష్టించే ఏ రకమైన కార్యకలాపాలనూ ఏ మతమూ ప్రోత్సహించబోదని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.
వివరాలు 6లో ▸


సమాజ విభజనకు కుట్ర
భారత సమాజాన్ని విభజించి ముక్కలు చేయడానికి జాతివ్యతిరేక శక్తులు కుట్రలు పన్నుతున్నాయని మోదీ ఆరోపించారు.
వివరాలు 6లో ▸


ఇజ్రాయెల్‌పైకి రాకెట్లు
లెబనాన్ ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లా ఇజ్రాయెల్‌లోని ఉత్తర ప్రాంతంపై వందలాది రాకెట్లతో దాడి చేసింది.
వివరాలు 6లో ▸


యుద్ధాన్ని ఎలా ఆపుదాం?
ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపడం సహా కీలక అంశాలపై ట్రంప్, పుతిన్ ఫోన్లో మాట్లాడుకున్నట్లు 'వాషింగ్టన్ పోస్ట్' పేర్కొంది.
వివరాలు 6లో ▸

ఫార్మాపై రైతుల ఫైర్

సీఎం ఇలాఖాలో కలెక్టర్, రెవెన్యూ అధికారులపై దాడి

వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో ఫార్మా భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన

- పొలాల్లో విషం నింపొద్దని మండిపాటు
- భూసేకరణ సభ కోసం వచ్చిన కలెక్టర్, అడిషనల్ కలెక్టర్‌పై రైతుల ఆగ్రహం
- కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై చేయి చేసుకున్న ఓ మహిళా రైతు..
- ఇతర అధికారులపై కర్రలు, రాళ్లతో రైతుల దాడి.. పలు వాహనాలు ధ్వంసం
- పరుగులు పెట్టిన కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి
- బలగాల మోహరింపు.. ఉద్రిక్తత


కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై దాడికి యత్నిస్తున్న గ్రామస్తులు

కొడంగల్/ దుద్యాల్: సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం కొడంగల్ పరిధిలో ఫార్మా నిర్వాసిత రైతులు కన్నెర్ర జేశారు. భూసేకరణపై గ్రామసభ నిర్వహించేందుకు దుద్యాల మండలం లగచర్లకు వచ్చిన అధికారులపై విరుచుకుపడ్డారు. పచ్చని పొలాల్లో విషం నింపొద్దని, తమ భూముల్లోకి ఫార్మాను రానిచ్చేది లేదంటూ మండిపడ్డారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, 'కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా)' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిపై దాడికి దిగారు. కర్రలు, రాళ్లతో వెంటాడారు. వాహనాలను ధ్వంసం చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌పై ఓ మహిళా రైతు చేయి చేసుకోగా.. కొందరు ఆందోళనకారులు కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డిని పరుగెత్తిస్తూ వెంటపడి దాడి చేశారు. రైతుల ఆగ్రహాన్ని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లను కారులో ఎక్కించి అక్కడి నుంచి పంపేశారు. కానీ కొందరు రైతులు వెంబడించి రాళ్లు రువ్వడంతో వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటనతో లగచర్లలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. గ్రామంలో 250 మందికిపైగా అదనపు బలగాలను మోహరించారు.

అసలేం జరిగింది?
ఫార్మా కంపెనీల ఏర్పాటుకు భూసేకరణ ప్రక్రియలో భాగంగా సోమవారం గ్రామసభ
మిగతా 5వ పేజీలో ▶

ముందస్తు ప్రణాళికతోనే..
దాడిపై ఐజీ సత్యనారాయణ 5లో

పాలనా వైఫల్యంతోనే రైతుల తిరుగుబాటు: కేటీఆర్ 2లో

ఆశీస్సులే ఆయువు



నవంబర్ 14 బాలల దినోత్సవం నేపథ్యంలో కేన్సర్ బారిన పడిన చిన్నారులకు గమ్యస్థానంగా మారిన హైదరాబాద్ ఎమ్ఎన్‌జే ఆసుపత్రికి స్పోర్ట్స్ స్టార్ కార్తీక, బాలతారలు క్రితిక, ఖ్యాతి, సాన్విక, స్నతిక్‌లను తీసుకెళ్లింది సాక్షి. ఈ సందర్భంగా ఈ తారలు.. కేన్సర్ బాధిత చిన్నారులతో ముచ్చటించి, వారిని ఆటపాటలతో అలరించారు. ఈ కథనం ఫ్యామిలీలో...
- ఫ్యామిలీలో ▶

ఫోన్ ట్యాపింగ్ కేసు..
రాజకీయ మలుపు!

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు నోటీసులు
- ఈ నెల 14న హాజరవుతానని ఆయన సమాధానం
- అరెస్టయిన పోలీసు అధికారుల ఫోన్ డేటా రిట్రీవ్‌తో వెలుగులోకి వచ్చిన కీలక అంశాలు
- అప్పటి అదనపు ఎస్పీ తిరుపతన్నతో లింగయ్య సంప్రదింపులు జరిపినట్టు నిర్ధారణ
- త్వరలో మరికొందరు నేతలను విచారించేందుకు సన్నాహాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తు రాజకీయ నాయకుల వైపు మలుపు తిరిగింది. నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత చిరుమర్తి లింగయ్యకు దర్యాప్తు అధికారులు నోటీసులు జారీ చేశారు. సోమవారం విచారణకు హాజరుకావాలని వారు కోరగా... మూడు రోజులు గడువు ఇవ్వాలంటూ దర్యాప్తు అధికారికి లింగయ్య సమాచారం పంపారు. దీంతో గురువారం (14వ తేదీ) హాజరుకావడానికి అనుమతి ఇచ్చారు. ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్న కీలక నిందితుడు, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ అదనపు ఎస్పీ మేకల తిరుపతన్న తరచూ లింగయ్యతో సంప్రదింపులు జరిపినట్టు తేలడంతో.. అధికారులు నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది.

ఇప్పటివరకు పోలీసు అధికారుల చుట్టూనే..
ఈ ఏడాది మార్చిలో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైనప్పటి నుంచీ మొత్తం పోలీసు అధికారుల చుట్టూనే తిరిగింది. డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీలు నాయిని భుజంగరావు, మేకల తిరుపతన్న, మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు అరెస్టు అయ్యారు. కీలక సూత్రధారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుతోపాటు ఓ మీడియా చానల్ అధినేత శ్రవణ్‌కుమార్ అమెరికాలో ఉన్నారు. నిజానికి ఈ కేసులలో కొందరు రాజకీయ నాయకుల పేర్లు ప్రస్తావనకు వచ్చినా.. ఇప్పటివరకు ఎవరికీ నోటీసులిచ్చి విచారించలేదు. గతంలో ఓ ఎమ్మెల్సీపై లుకౌట్ సర్క్యులర్ (ఎల్ఓసీ)
మిగతా 3వ పేజీలో ▶

మరి కొందరు రాజకీయ నాయకులకూ..

నిందితుల ఫోన్ల నుంచి వెలికితీసిన డేటా ఆధారంగా మరికొందరు రాజకీయ నాయకులకు ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో లింకు ఉందని దర్యాప్తు అధికారులు గుర్తించినట్టు సమాచారం. ఆ డేటా ఆధారంగా లింగయ్యను విచారించిన తర్వాత మరికొందరు నేతలకు నోటీసులు జారీ చేసి, విచారించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిసింది. ఎన్నికల సమయంలో ప్రత్యర్థుల ఫోన్ల ట్యాపింగ్, రాజకీయ పార్టీకి చెందిన నగదు రవాణా అంశాలపైనే రాజకీయ నేతల్ని దర్యాప్తు అధికారులు ప్రశ్నించనున్నట్టు పోలీసు వర్గాలు చెప్తున్నాయి.

భూ అధీన సర్టిఫికెట్ ఎలా ఇస్తారు?

- రెవెన్యూ అధికారులెవరికీ ఆ అధికారం లేదన్న హైకోర్టు
- కేవలం సివిల్ కోర్టుకు మాత్రమే అర్హత ఉందని స్పష్టీకరణ
- సర్టిఫికెట్ ఎలా ఇచ్చారో వివరణ ఇవ్వాలని కలెక్టర్‌కు ఆదేశం..

3లో

'స్టార్టప్'లతో వికసిత భారత్!



- విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్నాం..
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి
- టెస్లా తరహాలో డ్రైవర్‌రహిత వాహనాల సాంకేతికత అభివృద్ధి చేస్తున్నాం

- వివరాలు 14లో






సడన్‌గా మధ్యలో హామీల అమలు విషయం లేవనెత్తారా సార్!

అమృత్ టెండర్లలో సీఎం భారీ అవినీతి!

ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ నిబంధన ఉల్లంఘనకు పాల్పడ్డారు: కేటీఆర్

- బావమరిది సృజన్ రెడ్డి కంపెనీకి రూ.1,137 కోట్ల పనులను అప్పగించారు.. విచారణ జరిపి టెండర్లను రద్దు చేయాలి
- రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలి
- కేంద్ర మంత్రి ఖట్టర్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫిర్యాదు



సాక్షి, న్యూఢిల్లీ: అమృత్ పథకం టెండర్లలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భారీస్థాయిలో అవినీతికి పాల్పడ్డారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ నిబంధనను ఉల్లంఘించి తన బావమరిది సృజన్ రెడ్డికి చెందిన కంపెనీకి రూ.1,137 కోట్ల విలువ చేసే పనులను అప్పగించారన్నారు. కేవలం సీఎం బావమరిది అనే ఒకే ఒక్క అర్హతతో ఇంత పెద్దఎత్తున పనులను కట్టబెట్టారని మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారంలో సీఎం రేవంత్ రెడ్డి కీలకంగా వ్యవహరించి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని విమర్శలు సంధించారు. ఈ మేరకు సోమవారం రాత్రి రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, దామోదరరావు, సురేశ్‌రెడ్డి, మాజీ ఎంపీలు మాలోత్ కవిత, బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి కేటీఆర్ కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కలిసి
మిగతా 2వ పేజీలో ▶

ఎవరి కాళ్లు మొక్కేందుకు ఢిల్లీకి..? కేటీఆర్‌పై పొంగులేటి ధ్వజం 2లో

తెలంగాణకు నీతో పనేం లేదు

నువ్వు ఫాంహౌస్‌లో అట్లనే పండుకో.. మాజీ సీఎం కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్ ఫైర్

- నీ పనై పోయింది.. రాష్ట్ర ప్రజలు నిన్ను మరిచిపోయారు
- పది నెలల్లో తెలంగాణ కోల్పోయిందేమీ లేదన్న సీఎం
- మీ ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోవడం తప్ప అంటూ ఎద్దేవా
- కొత్తగా ఎంపికైన ఏఎంవీఐలకు నియామక పత్రాల అందజేత

సాక్షి, హైదరాబాద్: 'పది నెలల్లో ఏం కోల్పోయారో తెలంగాణ ప్రజలకు ఇప్పుడు అర్థమైందని ఓ పెద్దాయన మాట్లాడుతున్నడు. అయనింట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోవడం తప్ప తెలంగాణ ప్రజలు కోల్పోయిందేమీ లేదు. కేసీఆర్.. నీ పనైపోయింది. జనం నిన్ను మర్చిపోయారు. ఎన్నికల్లో ఓడగొట్టి నిన్ను కూర్చోబెట్టారు. నువ్వు ఫాంహౌస్‌లో అట్లనే పండుకో. తెలంగాణకు నీతో పనేం లేదు..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. రవాణా శాఖలో కొత్తగా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఏఎంవీఐ) పోస్టులకు ఎంపికైన 96 మందికి సోమవారం ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం నియామక
మిగతా 2వ పేజీలో ▶


ఓ అభ్యర్థికి ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న సీఎం రేవంత్. చిత్రంలో మంత్రి పొన్నం, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత



సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా బాధ్యతల స్వీకరణ

- సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం
- రాష్ట్రపతి భవన్‌లో ముర్ము చేతుల మీదుగా కార్యక్రమం
- ఉపరాష్ట్రపతి, ప్రధాని, మాజీ సీజేఐలు తదితరుల హాజరు
- మే 13 దాకా సీజేఐగా కొనసాగనున్న జస్టిస్ ఖన్నా

- వివరాలు 6లో ▶

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్

హామీలు సూపర్ సిక్స్.. అమలులో క్లీన్‌బౌల్డ్

సూపర్ 6 హామీలకు బడ్జెట్‌లో మొండిచేయి

- మహిళలకు ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి ప్రస్తావనే లేదు
- రైతు భరోసాకు రూ.10 వేల కోట్లు కావాలంటే కేవలం రూ.వెయ్యి కోట్లే విదిల్చిన వైనం
- తల్లికి వందనానికి పంగనామాలు
- ఉచిత బస్సుకు ఇంకా స్టార్టింగ్ ట్రబులే
- కోటి మందికి నిరుద్యోగ భృతి ఎగనామం
- 'గ్యాస్' కోసం రూ.4 వేల కోట్లకు గాను రూ.895 కోట్లే
- అభివృద్ధి, సంక్షేమానికి తిలోదకాలు
- జాబ్ క్యాలెండర్ ఊసే లేదు.. స్వయం ఉపాధిపై స్పష్టత లేదు
- ఉద్యోగులు, పెన్షనర్లు, మహిళలకిచ్చిన హామీలన్నీ నీటి మూటలే
- ఆశా భంగం.. పేదల గృహ నిర్మాణం
- మోత మోగించేలా విద్యుత్ చార్జీలు డబుల్



11లో


మొత్తం బడ్జెట్ రూ.2.94 లక్షల కోట్లు

పాత పద్ధతిలోనే పత్తి కొనుగోళ్లు

దిగొచ్చిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా

- జిన్నింగ్ మిల్లులతో సీఎండీ చర్చలు
- మధ్యాహ్నం నుంచి యథావిధిగా కొనుగోళ్లు

- వివరాలు 5లో ▶



ట్రాన్స్‌కో సీఎండీగా కృష్ణ భాస్కర్

డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శికి 'పవర్'ఫుల్ పోస్టు!

- రాష్ట్రంలో పలువురు ఐఏఎస్‌లకు స్థానచలనం, పోస్టింగులు
- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తికి పూర్తి బాధ్యతలు
- పర్యాటక శాఖ కార్యదర్శిగా స్మితా సబర్వాల్
- పలువురు ఐఎఫ్ఎస్‌లూ బదిలీ

సాక్షి, హైదరాబాద్: ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక కార్యదర్శి డి.కృష్ణ భాస్కర్‌ను కీలకమైన తెలంగాణ విద్యుత్ సరఫరా సంస్థ (ట్రాన్స్‌కో) సీఎండీ పోస్టు వరించింది. ఈ మేరకు ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శిగా ఆయన అదనపు బాధ్యతల్లో
మిగతా 3వ పేజీలో ▶


కృష్ణ భాస్కర్


ఇలంబర్తి


స్మితా సబర్వాల్

క్లుప్తంగా...

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్.. రేపు ముంబై ప్రచారానికి..

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. జాతీయ మీడియా సంస్థ నిర్వహించనున్న కాన్క్లేవ్‌లో పాల్గొనేందుకు ఢిల్లీ వెళ్లనున్నట్టు సీఎంవో వర్గాలు వెల్లడించాయి. ఈ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆయన తిరిగి రాత్రికి హైదరాబాద్ చేరుకుంటారన్నారు. మళ్లీ బుధవారం ఉదయం మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ముంబైకి వెళ్తారని సమాచారం.

ప్రభుత్వ ఆదేశాలతోనే నాపై దాడులు: కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ ఆదేశాలతోనే పోలీసులు తనపై దాడి చేసి ఇష్టారీతిన వ్యవహరించారని, ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం భరిస్తానని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. ధర్నాలు చేస్తే తీవ్ర చర్యలుంటాయని, కేసులు పెడతామని స్థానిక ఏసీపీ తనను హెచ్చరిస్తున్నారని తెలిపారు. తెలంగాణ భవన్‌లో సోమవారం కౌశిక్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు అన్యాయం చేస్తోందని, లబ్ధిదారులకు రెండో విడత దళితబంధు డబ్బులు ఇవ్వకుండా ద్వేషంతో వ్యవహరిస్తోందన్నారు. దళితబంధు లబ్ధిదారులు అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇవ్వాలని కోరినందుకే తాను వెళ్లానని కౌశిక్‌రెడ్డి చెప్పారు. ప్రజల మీద బుల్డోజర్లు ఎక్కించేందుకు రేవంత్‌ను సీఎం చేయలేదని పేర్కొన్నారు.

కులగణనపై కుట్రలను తిప్పికొట్టండి

టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ పిలుపు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన చాలా ప్రతిష్టాత్మకమని, బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు అత్యంత ప్రాధాన్యతతో కూడిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ప్రజలకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు కులగణన చేపడుతున్నామని, దేశానికే రోల్‌మోడల్‌గా ఉండేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సోమవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. అయితే కులగణనను అడ్డుకునేందుకు, కాంగ్రెస్ పార్టీతో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేందుకు ప్రతిపక్షాలు కుట్ర చేస్తున్నాయని, ఈ కుట్రలను కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు.

ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర: ఎమ్మెల్యే కూనంనేని



జహీరాబాద్ టౌన్: పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై అవగాహన కుదరటంలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో సోమవారం నిర్వహించిన సీపీఐ పార్టీ వందో వార్షికోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ఇంకా సర్దుబాటు చేసుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు తెర వెనుక కుట్రలు జరుగుతున్నాయని కూనంనేని ఆరోపించారు. సీఎంను మారుస్తున్నారని బీజేపీ వారు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ జోడీ కట్టి పనిచేస్తున్నాయని ఆరోపించారు. హైడ్రా వల్ల పేదలకు ఎక్కువ నష్టం కలిగిందన్నారు. ఈనెల 14న అన్ని విషయాలు చర్చించేందుకు పెద్దల సమావేశం నిర్వహిస్తున్నామని, సీఎం కమ్యూనిస్టుల సలహాలు తీసుకోవాలని కూనంనేని సూచించారు. కేంద్రంలో 10 ఏళ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ పేద ప్రజల కోసం ఏం చేసిందని ప్రశ్నించారు.

ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారు

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అంధులను ఆదుకున్నందుకు తన తమ్ముడిని అక్రమంగా జైలులో పెట్టి బెయిల్ రాకుండా చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డిలతో కలసి సోమవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, మహబూబ్‌నగర్ జిల్లాకు కేసీఆర్ ఏమీ చేయలేదంటూ సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్దాలు చెపుతున్నారని మండిపడ్డారు. పాలమూరు జిల్లాలో పెండింగు ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు మహబూబ్‌నగర్ పట్టణంలో తాగునీటి ఎద్దడిని తీర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చేతనైతే మన్నెంకొండ ఆలయానికి నిధులు మంజూరు చేయాలని, కొత్త పరిశ్రమలను తీసుకురావాలని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పదేళ్లు ప్రశాంతంగా ఉన్న తెలంగాణ పల్లెలు తిరిగి కల్లోలంగా మారుతున్నాయని ఆయన అన్నారు.

మోదీ కూటమితో ముస్లిం కోటాకు ముప్పు!

- కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం... జాతీయ విద్యా దినోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: మోదీ కూటమితో ముస్లిం రిజర్వేషన్లకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాష్ట్ర పర్యటనకు వచ్చిన ప్రతిసారీ ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారని, కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నంతవరకు అది సాధ్యం కాదని స్పష్టం చేశారు. భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా సోమవారం రవీంద్రభారతిలో జరిగిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. 'మోదీ కూటమితో రాజ్యాంగం సైతం ప్రమాదంలో పడింది. దేశంలో రెండే వర్గాలు ఉన్నాయి. ఒకటి ప్రజల్లో వైషమ్యాలు రెచ్చగొట్టే మోదీ వర్గం, మరొకటి సమైక్యతకు పాటుపడే గాంధీ వర్గం. హిందూ ముస్లిం భాయ్ భాయ్ అన్నదే కాంగ్రెస్ విధానం. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం సాధ్యం. ప్రాంతీయ పార్టీలు స్థానిక ముస్లింలతో మమేకమైనట్లు నటిస్తూ ఢిల్లీలో మోదీ పంచన చేరుతున్నాయి. మైనారిటీలు మోదీ పరివార్‌తో ఉండాలో, గాంధీ పరివార్‌తో కొనసాగాలో నిర్ణయించుకోవాలి..'అని రేవంత్ అన్నారు. దేశంలో ఆధునిక విద్యకు మౌలానా అబుల్ కలాం బలమైన పునాది వేశారని గుర్తుచేశారు. కేంద్రంలో 11 సంవత్సరాల పాటు విద్యా శాఖ మంత్రిగా పనిచేసి దేశానికి అత్యుత్తమ విద్యా విధానాన్ని అందించారని కొనియాడారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ప్రారంభం

తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్‌ను సీఎం ప్రారంభించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్, మఖ్దూమ్ అవార్డులు, లైఫ్‌టైమ్ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్, తెలంగాణ ఉర్దూ అకాడమీ అధ్యక్షుడు తాహెర్ బిన్ అహ్మద్, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఫహీం, మాజీ ఎంపీ వి.హన్మంతరావు, ఇతర నేతలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం అభ్యర్థుల నినాదాలు

డీఎస్సీ–2024లోని ఉర్దూ మీడియం బ్యాక్‌లాగ్ పోస్టులను డీ రిజర్వేషన్ చేసి భర్తీ చేయాలని ఉర్దూ మీడియం మెరిట్ అభ్యర్థులు డిమాండ్ చేశారు. సీఎం ప్రసంగిస్తుండగా ప్ల కార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. దీంతో వారి డిమాండ్‌ను పరిశీలిస్తామని రేవంత్ వారికి హామీ ఇచ్చారు.

ఎవరి కాళ్లు మొక్కేందుకు ఢిల్లీకెళ్లారు?

- కేటీఆర్‌పై మంత్రి పొంగులేటి ధ్వజం
- ఈ–రేసింగ్ కేసు నుంచి బయటపడేందుకు తంటాలు
- మీ అవినీతి మొత్తం వెలికితీస్తే అంతరిక్షంలో దాక్కోడానికి వెళ్తారా?



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: లిక్కర్ స్కామ్‌లో కేంద్ర పెద్దలను ఒప్పించి తన చెల్లికి బెయిల్ పొందినట్లుగానే తనను తాను కాపాడుకునేందుకే మాజీ మంత్రి కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. ఫార్ములా ఈ–రేసింగ్ కేసు నుంచి బయటపడేందుకు తంటాలు పడుతున్నారని, ఆయన ఎవరి కాళ్లు మొక్కేందుకు ఢిల్లీ వెళ్లారో చెప్పాలని ఎద్దేవా చేశారు. ఖమ్మం రూరల్ మండలం చిన్న వెంకటగిరిలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశాక పొంగులేటి మాట్లాడారు. ఈ కేసు నుంచి తప్పించాలని అంబానీ, అదానీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ పెద్దలను కలిసేందుకు కేటీఆర్ ఢిల్లీ వెళ్లారని ఆరోపించారు. ఈ–రేసింగ్ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం విచారణను ఏసీబీకి అప్పగించిందని, ప్రజా ప్రతినిధులను అదుపులోకి తీసుకుని విచారించడానికి గవర్నర్ అనుమతి అవసరం ఉండటంతో ముందస్తుగా ఏసీబీ అనుమతి కోరిందని తెలిపారు. రేపోమాపో గవర్నర్ అనుమతి వస్తుందని గ్రహించిన కేటీఆర్ హైదరాబాద్ నుంచి ఢిల్లీకి మకాం మార్చారని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసేందుకే ఆయన వెళ్లినట్లు తమ వద్ద ఆధారాలు ఉన్నాయన్నారు. తాను పేల్చబోయే బాంబు ఏంటో కేటీఆర్‌కు తెలుసునని, గత ప్రభుత్వం పదేళ్లలో చేసిన అవినీతి బాగోతాలన్నీ వెలికితీస్తే భూమి మీద నుంచి అంతరిక్షంలోకి వెళ్లి దాక్కునేలా ఉన్నారని పొంగులేటి ఎద్దేవాచేశారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసి కూడా తనపై కేసు లేకుండా చూడాలని ప్రాధేయపడుతున్న కేటీఆర్, ఏ తప్పు చేయకపోతే ఎందుకు ఉలిక్కి పడుతున్నారని ప్రశ్నించారు.

తెలంగాణకు నీతో పనేం లేదు

▶ మొదటి పేజీ తరువాయి

పత్రాలను అందించారు. అనంతరం అభ్యర్థుల కుటుంబ సభ్యులు, రవాణా శాఖ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా రెండు రోజుల క్రితం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు.

పది నెలల్లో మేం ఎన్నో చేశాం..

'మనం బడి దొంగల గురించి విన్నాం, కానీ అసెంబ్లీకి రానోళ్లను చూసినమా? పది నెలల్లో ఏం జరిగిందని ప్రశ్నిస్తున్నారు. పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన జరిగింది, రుణమాఫీతో రైతులు రుణ విముక్తులయ్యారు, కోటి మందికి పైగా మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించి లబ్ధి పొందారు. నష్టాల ఆర్టీసీ లాభాల బాట పట్టింది, 49.90 లక్షల కుటుంబాలు ఉచితంగా 200 యూనిట్ల కరెంటును వాడుకున్నాయి. రూ.500కే ఆడబిడ్డలు వంటగ్యాస్ సిలిండర్ పొందుతున్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు ఉచిత వైద్య వసతి వచ్చింది. 21 వేల మంది టీచర్లు పదోన్నతులు పొందారు. 100 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. అడ్డంకులు అధిగమించి గ్రూప్ పరీక్షలు నిర్వహించాం. రైతులు, నిరుద్యోగులను ఆదుకున్నాం. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నాం. పది నెలల కాలంలోనే 50 వేల మందికి ఉద్యోగ ఎంపిక పత్రాలు అందించాం. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరలేదు. ఇప్పటికైనా వారిలో మార్పు రావాలి. ప్రభుత్వం చేసే మంచి పనులకు మద్దతిస్తూ, లోపాలుంటే సరిచేసుకునేందుకు సలహాలు ఇవ్వాలి..' అని రేవంత్ అన్నారు.

ఎవరిని స్ఫూర్తిగా తీసుకోవాలో యువత తెల్సుకోవాలి

'దీపావళి పండుగ రోజున డ్రగ్స్ తీసుకుని గృహప్రవేశం అని కొందరు బుకాయిస్తున్నారు. లీడర్ అందరికీ రోల్ మోడల్‌గా ఉండాలి. కానీ పండగ వస్తే డ్రగ్స్ తీసుకోవటం, చిచ్చుబుడ్లతో కాకుండా సారాబుడ్లతో దీపావళి చేసుకునేవారినేమనాలి? అలాంటి వారిని సామాజిక బహిష్కరణ చేయాలని యువతను కోరుతున్నా. రాష్ట్ర ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన శ్రీకాంతాచారి లాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలో.. డ్రగ్స్‌తో దావత్ చేసుకునే వారిని స్ఫూర్తిగా తీసుకోవాలో యువత తేల్చుకోవాలి. గంజాయి, డ్రగ్స్ రాష్ట్రంలోకి రాకుండా పోలీసులు, రవాణా శాఖ అధికారులు ఉక్కు పాదం మోపాలి..'అని సీఎం పిలుపునిచ్చారు.

రోడ్డు ప్రమాదాలను తగ్గిస్తాం: మంత్రి పొన్నం

వాహన ప్రమాదాల రూపంలో పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటం ఆవేదన కలిగిస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రకృతి విపత్తుల కంటే ఎక్కువగా రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారని, రాష్ట్రంలో సగటున నిత్యం 20 మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవటం ద్వారా ప్రమాదాల సంఖ్యకు అడ్డుకట్టవేసే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 37 ఆటోమేటిక్ వెహికల్ టెస్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, పలువురు రవాణా శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టే వ్యాపారులపై 'ఎస్మా'

- ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చూడాలి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతులను ఇబ్బందిపెట్టే వ్యాపారులపై అవసరమైతే అత్యవసర సేవల నిర్వహణ చట్టం (ఎస్మా) కింద కేసులు నమోదు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడ రైతులను వ్యాపారులు ఇబ్బందులకు గురిచేస్తున్న సంఘటనలు ప్రభుత్వం దృష్టికి రావటంతో స్పందించిన ఆయన.. సోమవారం ఉదయం సంబంధిత అధికారులతో మాట్లాడారు. రైతులు పండించిన పంట ఉత్పత్తుల కొనుగోళ్లలో మోసాలకు పాల్పడటం, గందరగోళానికి గురి చేయటం, వారిని వేధించటం లాంటి సంఘటనలపై కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రమంతటా ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా అన్ని జిల్లాల కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా ఇబ్బందులుంటే వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి సమస్యలు ఎదురు కాకుండా చూడాలని ఆదేశించారు.

14న ఎల్బీ స్టేడియంలో ప్రజా విజయోత్సవాలు ప్రారంభం

- 14 వేల మంది పాఠశాల విద్యార్థులతో సమావేశం
- సీఎస్ శాంతికుమారి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి అయిన సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల 14న ఎల్బీ స్టేడియంలో 14 వేల మంది పాఠశాల విద్యార్థులతో నిర్వహిస్తున్నట్టు సీఎస్ శాంతికుమారి తెలిపారు. ఏడాది కాలంలో విద్యార్థుల కోసం చేసిన గణనీయమైన మార్పులు, డైట్ చార్జీల పెంపు, రాష్ట్రంలోని అన్ని పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలకు ఉచిత కరెంట్, తదితర కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టినట్లు గుర్తుచేశారు. ఎల్బీ స్టేడియం కార్యక్రమ ఏర్పాట్లపై సోమవారం సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్షించారు. ఈనెల 14 నుంచి డిసెంబర్ 9 వరకు 26 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా విజయోత్సవాలను నిర్వహించాలని సీఎం ఆదేశించారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో మొదటి రోజైన 14న ప్రభుత్వ, గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థుల సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మోడల్ అసెంబ్లీ సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, విద్యా శాఖలో వచ్చిన గణనీయ మార్పులు, అభివృద్ధిపై ఏవీ ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. శాఖపై ప్రత్యేకంగా రూపొందించిన సావనీర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుంచి విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థులకు కనీస సౌకర్యాల కల్పన, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక వేదిక నిర్మాణం తదితర ఏర్పాట్లను చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ముఖ్య కార్యదర్శులు శ్రీధర్, బుర్రా వెంకటేశం, కార్యదర్శి శరత్ సమావేశానికి హాజరయ్యారు.

పాలనా వైఫల్యంతోనే రైతుల తిరుగుబాటు

సీఎం మూర్ఖత్వం వల్ల అధికారులు దెబ్బలు తినే పరిస్థితి: కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: 'కొడంగల్‌లో కలెక్టర్‌పై రైతులు తిరగబడటం రాష్ట్రంలో పరిపాలనా వైఫల్యం, శాంతిభద్రతల వైఫల్యానికి ప్రతీక. ముఖ్యమంత్రి మూర్ఖత్వం వల్ల అధికారులు దెబ్బలు తినాల్సి రావడం దురదృష్టకరం. రేవంత్ దురాశ, అవగాహనారాహిత్యం వల్లే ఈ దుస్థితి వచ్చింది. అన్ని అనుమతులున్న ఫార్మాసిటీని రద్దు చేసి రాష్ట్రంలో పది చోట్ల ఫార్మా క్లస్టర్లు పెట్టాలనే తుగ్లక్ ఆలోచన వల్లనే ఈ అలజడి రేగింది. ఫార్మా సిటీకోసం సేకరించిన భూములు అమ్ముకొని సొమ్ముచేసుకుందామన్న రేవంత్ కుత్సిత బుద్ధితోనే శాంతిభద్రతల సమస్య తలెత్తింది'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేస్తాయని హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం జరిగిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి కార్యక్రమంలో కేటీఆర్ ప్రసంగించారు.

అమృత్ టెండర్లలో సీఎం భారీ అవినీతి!

▶ మొదటి పేజీ తరువాయి

అమృత్ టెండర్లలో జరిగిన స్కాంపై ఫిర్యాదు చేశారు.

అనుభవం, అర్హత లేని కంపెనీకి..

అమృత్ టెండర్లలో ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డికి చెందిన కంపెనీ 'శోధా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్'రూ.1,137 కోట్ల పనులను దక్కించుకుందని కేటీఆర్ ఆరోపించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో కేవలం రూ. 2.20 కోట్ల లాభాన్ని చూపించిన కంపెనీకి రూ.1,137 కోట్ల పనులు ఎలా కట్టబెడతారని ఫిర్యాదులో ప్రశ్నించారు. ఏమాత్రం అనుభవం, అర్హత లేని కంపెనీకి ఇన్ని కోట్ల పనులు అప్పగించారంటే తెర వెనుక భారీ అవినీతి బాగోతం నడిచిందనే విషయం అర్థమవుతోందని చెప్పారు. ఈ వ్యవహారంలో స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే అవినీతికి పాల్పడ్డారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి బావమరిది కంపెనీ కావటంతోనే ఇండియన్ హ్యూమ్ పైప్స్ లిమిటెడ్ సంస్థ మొత్తం ప్రాజెక్టులో 80 శాతం పనులను శోధా సంస్థకు అప్పగించిందన్నారు. ఈ టెండర్లలో సీఎం బావమరిది ప్రధాన భాగస్వామి అని తెలిపారు.

ఆ నిబంధన కింద వేటువేయొచ్చు..

ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ అనే నిబంధనను ఉల్లంఘించిన వారు ఎంతటి వారైనా.. వారిపై వేటు వేయొచ్చని కేటీఆర్ చెప్పారు. ఇందుకు సంబంధించి పలు కేసులను కూడా ఆయన ఉదహరించారు. జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ గనుల కేటాయింపు, 1983లో బిహారిలాల్ దోబ్రే వర్సెస్ రోషన్ లాల్ దోబ్రే కేసు, 2005లో శత్రుచర్ల చంద్రశేఖర్ రాజు వర్సెస్ వైరిచెర్ల ప్రదీప్ కుమార్ దేవ్ కేసు, 2001లో జయా బచ్చన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు, 2003లో దివ్య ప్రకాష్ వర్సెస్ కులతార్ చంద్ రాణా కేసులను కేటీఆర్ కేంద్రమంత్రికి వివరించారు. 2014లో హరియాణాలో సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రా కేసులనూ ప్రస్తావించారు. ముఖ్యమంత్రి అవినీతిని అరికట్టాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని చెప్పారు. టెండర్లలో చట్టవిరుద్ధంగా జరిగిన కేటాయింపులు, అక్రమ ఒప్పందాలపై విచారణ జరపాలని, అక్రమాలు నిజమని తేలితే టెండర్లను రద్దు చేసి రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అప్పుడే వణికితే ఎలా?

కేంద్ర మంత్రి ఖట్టర్‌తో భేటీ నిమిత్తం కేటీఆర్ ఢిల్లీకి రాగా.. కేసుల నుంచి తప్పించుకోవడానికే ఆయన ఢిల్లీకి వెళ్లారంటూ రాష్ట్ర మంత్రులు ఆరోపించారు. ఈ క్రమంలో ఢిల్లీ నుంచి కేటీఆర్ తన 'ఎక్స్'ఖాతా ద్వారా స్పందించారు. 'జస్ట్ ఇప్పుడే ఢిల్లీలో ల్యాండ్ అయ్యాను. ఇప్పటికే హైదరాబాద్‌లో ప్రకంపనలు వస్తున్నాయని విన్నాను. అప్పుడే వణికిపోతే ఎలా?'అంటూ పోస్ట్ చేశారు.

ముందుగానే గవర్నర్ అనుమతి కోరాం

ఫార్ములా రేస్ వ్యవహారంలో కేటీఆర్ విచారణకు ఒప్పుకుంటే మంచిది: పొన్నం



సాక్షి, హైదరాబాద్: ఫార్ములా రేస్ కుంభకోణంలో మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు ప్రభుత్వం 15 రోజుల ముందే గవర్నర్ అనుమతి కోరిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో ఇప్పటికైనా కేటీఆర్ చేసిన తప్పును ఒప్పుకుని విచారణకు సహకరించాలని కోరారు. సోమవారం రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ తనను తాను రక్షించుకునేందుకే ఆయన ఢిల్లీ వెళ్లారని ఎద్దేవా చేశారు. అమృత్‌లో అవినీతి జరిగితే కేంద్రానికి ఫిర్యాదు చేయొచ్చని, అయితే కేటీఆర్ మాత్రం తనపై జరిగే విచారణను ఆపుకునేందుకే ఢిల్లీకి వెళ్లినట్లు అర్థమవుతోందని అన్నారు. కేంద్రం వద్ద మోకరిల్లి విచారణ నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కార్ రేసింగ్‌కు అనుమతులు లేకుండా తానే డబ్బులు ఇచ్చానని కేటీఆర్ స్వయంగా ఒప్పుకున్నందున తప్పు నిజాయితీగా ఒప్పుకుంటే మంచిదన్నారు. ఈ–రేసింగ్ అక్రమాలపై తమ ప్రభుత్వం చట్టపరంగా ముందుకెళ్తుందని చెప్పారు.

రేవంత్ పాలన పిచ్చోడి చేతిలో రాయి

- ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమితో రియల్ దందా
- పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి ఉన్న టైమ్ రైతుల కోసం లేదా: మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: ఫార్మాసిటీ పేరిట పచ్చని పంట పొలాల నుంచి రైతులను తరిమివేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి 'కిసాన్ హఠావో'అంటూ పిలుపు ఇస్తున్నాడని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు మండిపడ్డారు. రాష్ట్రంలో రేవంత్ పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందన్నారు. సీఎం మీద ఉన్న కోపాన్ని రైతులు కలెక్టర్, అధికారులపై చూపుతున్నారన్నారు. రేవంత్ అసమర్థ పాలనకు ఐఏఎస్ అధికారులు ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తోందని సోమవారం విడుదల చేసిన ప్రకటనలో హరీశ్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌కు సమీపంలో కాలుష్యం లేకుండా పరిశ్రమల ఏర్పాటుకు 15 వేల ఎకరాలను నాటి కేసీఆర్ ప్రభుత్వం సేకరించి సిద్ధం చేసిందని చెప్పారు. పర్యావరణ, అటవీ అనుమతులు ఉన్న ఫార్మాసిటీని పక్కన పెట్టి పచ్చటి పంట పొలాల్లో ఫార్మా పరిశ్రమల పేరిట రేవంత్ చిచ్చు పెడుతున్నాడని మండిపడ్డారు. న్యాల్‌కల్‌లోనూ నిమ్జ్ ఏర్పాటుకు సేకరించిన భూములను ఫార్మా పరిశ్రమల కోసం దారి మళ్లిస్తున్నాడన్నారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిని రియల్‌ఎస్టేట్ దందా కోసం వినియోగించేందుకు రేవంత్ కుట్రలు చేస్తున్నాడని తెలిపారు. రేవంత్ పాలన మీద రాష్ట్రంలో తిరగబడని వర్గమంటూ లేదని, పంట పొలాల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మద్దతు ధరకు పత్తి అమ్ముకోలేని దుస్థితి

రైతులు పత్తిని కనీస మద్దతు ధరకు కూడా అమ్ముకోలేని పరిస్థితుల్లోకి ప్రభుత్వం నెట్టిందని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో దిగుబడి తగ్గి ఇప్పటికే నష్టపోయిన పత్తి రైతులకు, కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం శాపంగా మారిందన్నారు. సీసీఐ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా పత్తి కొనుగోలు చేయబోమని రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు ప్రకటించాయన్నారు. దీంతో పత్తి కొనుగోళ్లు నిలిచిపోయినా, ప్రభుత్వం సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అలసత్వం, సమన్వయలోపంతో పత్తి రైతులు చిత్తవుతున్నా పట్టించుకునే వారే లేరని వాపోయారు.

బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

- ఘటనపై తల్లిదండ్రుల అనుమానాలు
- సీనియర్ వేధింపులే కారణమన్న మృతురాలి సోదరుడు
- ఏబీవీపీ ఆందోళన.. ఒకరి తలకు తీవ్ర గాయం



స్వాతిప్రియ (ఫైల్)



ఎస్సై కాలర్ పట్టుకుని నిలదీస్తున్న మృతురాలి తల్లి



రోదిస్తున్న స్వాతిప్రియ తల్లిదండ్రులు



ఏబీవీపీ కార్యకర్త సాయిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

భైంసా/బాసర/నిజామాబాద్ నాగారం: నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్‌ఐటీలో పీయూసీ2 చదువుతున్న పూరి స్వాతిప్రియ(18) ఆదివారం అర్ధరాత్రి హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలియగానే స్వాతి తల్లిదండ్రులు పూరి రవీందర్–ఉజ్వల బాసర ట్రిపుల్‌ఐటీకి చేరుకున్నారు. ఉజ్వల తన కూతురి ఆత్మహత్యపై అనుమానాలు వ్యక్తంచేసింది. క్యాంపస్‌లో ఏం జరిగిందో తెలియదుకానీ తన కూతురును హత్యచేశారని ఆరోపించింది. తాము రాకముందే తమ కుమార్తె శవాన్ని మార్చురీకి ఎలా తరలిస్తారంటూ బాసర ఎస్సై గణేశ్‌ను కాలర్ పట్టుకుని నిలదీసింది. తమ కూతురుకు సంబంధించిన వివరాలు, సాక్ష్యా లను తారుమారు చేసేందుకు అధికారులు ప్రయ త్నిస్తున్నారని కన్నీటి పర్యంతమైంది. చదువుకునేందుకు పంపిన తన కూతురును చంపేసి శవాన్ని అప్పగిస్తున్నారంటూ శాపనార్థాలు పెట్టింది. స్వాతిప్రియ మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి కు టుంబీకులకు అప్పగించారు. వ్యక్తిగత కారణాలతోనే స్వాతిప్రియ ఆత్మహత్య చేసుకుందని క్యాంపస్ అధికారులు ప్రకటన విడుదల చేశారు. మృతురాలి స్వస్థలం నిజామాబాద్ జిల్లా పెర్కిట్‌లోని తిరుమల కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఏబీవీపీ ఆందోళన.. ట్రిపుల్ ఐటీలో ఉద్రిక్తత

స్వాతిప్రియ ఆత్మహత్యతో ట్రిపుల్‌ఐటీ వద్ద ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో ప్రధాన ద్వారం వద్ద పోలీసులను మోహరించారు. సెక్యూరిటీ గార్డులు ఎవరినీ లోపలకు అనుమతించలేదు. ఈ ఘటనపై కలెక్టర్ అభిలాషఅభినవ్, ఎస్పీ జానకీషర్మిల దృష్టి సారించారు. భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు క్యాంపస్‌ను ముట్టడించారు. గేట్లవైపు వెళుతున్న ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు, సెక్యూరిటీ గార్డులు అడ్డుకొని లాఠీచార్జ్ చేసి చెదరగొట్టారు. ఈ సంఘటనలో ఏబీవీపీ నాయకుడు సాయికుమార్ తలకు తీవ్ర గాయమైంది. అతడిని చికిత్సకోసం భైంసా ఏరియా ఆస్పత్రికి అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. సెక్యూరిటీ గార్డులు కర్రలతో దాడి చేశారని ఏబీవీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. జారిపడడంతోనే సాయికుమార్ తలకు గాయమైందని పోలీసులు చెబుతున్నారు. సాయికుమార్‌ను నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల నరేశ్ తదితరులు పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఐ గూండా మాదిరిగా ఏబీవీపీ కార్యకర్తలపై కర్రలతో దాడిచేయించడం సరికాదన్నారు. సీఐని సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

సీనియర్ వేధింపులతోనే ఆత్మహత్య

సీనియర్ విద్యార్థి వేధింపుల వల్లనే స్వాతిప్రియ ఆత్మహత్య చేసుకుందని ఆమె సోదరుడు బజరంగ్ ఆరోపించారు. భైంసా ఏరియా ఆస్పత్రి వద్ద మాట్లాడుతూ వర్సిటీలో జూనియర్లపై సీనియర్ల వేధింపులు ఎక్కువయ్యాయని స్వాతిప్రియ తనకు చెప్పిందన్నారు. ఓ సీనియర్ విద్యార్థి రోజూ ఫోన్ చేయాలని వేధిస్తున్నాడని.. తనతో చెప్పి బాధపడిందని పేర్కొన్నాడు. ఈ విషయమై వర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు.

రైతు సమస్యలు గాలికొదిలి.. ఎన్నికల ప్రచారంలో సీఎం

చౌటుప్పల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన లక్ష్మణ్



జైకేసారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కె.లక్ష్మణ్

చౌటుప్పల్, చౌటుప్పల్ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను గాలికి వదిలి మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలోని జైకేసారం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. 'హలో కలెక్టర్ గారు.. ఏంటి ఇంత నిర్లక్ష్యమా? చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి చిన్న కొండూర్‌కు చెందిన రైతు చింతపల్లి పుల్లారెడ్డి 35 రోజుల కిందట ధాన్యం తెచ్చాడు. ఈ మధ్యలో నాలుగుసార్లు కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. అయినా ఆరబోసుకున్నాడు. కొనుగోలు చేయమని అడిగితే మాయిశ్చర్ రాలేదంటున్నారు. ఈరోజు నా సమక్షంలో మాయిశ్చర్ తీస్తే 15.8 వచ్చింది. ఇదంతా మిల్లర్లతో కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనడానికి నిదర్శనం'అని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావుతో లక్ష్మణ్ ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో నల్లగొండ బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విధ్వంసం టు ఫోన్ ట్యాపింగ్!

తొలుత అప్పటి డీఎస్పీ ప్రణీత్‌రావుపై కేసు నమోదు • కుట్ర, ప్రజా ఆస్తుల విధ్వంసం ఆరోపణలు
ఆపై కేసులో టెలిగ్రాఫ్ యాక్ట్ కూడా జోడింపు • ఇప్పటివరకు ముగ్గురు పోలీసులు, ఒక మాజీ అధికారి అరెస్టు



సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని గ్రీన్ ల్యాండ్స్ చౌరస్తాలో ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) ఆఫీసు కేంద్రంగా జరిగిన అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసు ఎన్నో మలుపులు తిరుగుతోంది. ఇది మొదట ప్రజా ఆస్తుల విధ్వంసం అంశంతో మొదలై.. ఇప్పుడు రాజకీయ నేతల అరెస్టు వరకు చేరింది. ఈ కేసులో ఇప్పటి వరకు ముగ్గురు పోలీసులు, ఓ మాజీ అధికారి అరెస్టు కాగా... ఇద్దరు కీలక నిందితులు పరారీలో ఉన్నారు.

మార్చి నెలలో మొదలై..

పలు ఆరోపణల నేపథ్యంలో ఎస్ఐబీ మాజీ డీఎస్పీ దుగ్యాల ప్రణీత్‌కుమార్ అలియాస్ ప్రణీత్‌రావును ఉన్నతాధికారులు ఈ ఏడాది మార్చి మొదటి వారంలో సస్పెండ్ చేశారు. అదే నెల 10న హైదరాబాద్‌లోని పంజగుట్ట పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. ఆ సమయంలో ఎస్ఐబీ అదనపు ఎస్పీగా పనిచేస్తున్న డి.రమేష్ ఫిర్యాదు ఆధారంగా... కుట్ర, నమ్మక ద్రోహం, నేరపూరిత చర్యలు, ప్రజా ఆస్తుల విధ్వంసం తదితర సెక్షన్లను చేర్చారు. తర్వాత టెలిగ్రాఫ్ యాక్ట్‌ను కూడా జోడించడంతో అక్రమ ఫోన్ ట్యాపింగ్‌గా మారింది. ఈ ఏడాది మార్చి 13న ప్రణీత్‌రావు, 24న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, 28న మాజీ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు అరెస్టు అయ్యారు. కీలక నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావుతోపాటు ఓ మీడియా చానల్ అధినేత శ్రవణ్‌రావు అమెరికాలో తలదాచుకున్నారు. అరెస్టయిన వారిని విచారించిన సమయంలో ఓ రాజకీయ పార్టీ, కొందరు కీలక నేతల పేర్లు బయటికి వచ్చినట్టు పోలీసులు కోర్టుకు సమర్పించిన పత్రాల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మాజీ ఎమ్మెల్యే లింగయ్యకు నోటీసులు ఇవ్వడం సంచలనంగా మారింది.

అక్రమంగా ట్యాపింగ్ చేసి..

ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ప్రణీత్‌రావు నేతృత్వంలో ఎస్ఐబీ కార్యాలయంలో స్పెషల్ ఆపరేషన్ టీమ్ ఏర్పాటు చేశారు. వారి కోసం ప్రత్యేకంగా రెండు గదులు, హైస్పీడ్ ఇంటర్నెట్ కనెక్షన్ తీసుకున్నారు. దాదాపు 17 అత్యాధునిక కంప్యూటర్లు ఏర్పాటు చేసి.. మావోయిస్టులు, ఉగ్రవాదులు, సంఘ విద్రోహక శక్తుల ఫోన్ ట్యాపింగ్ పేరిట పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖుల ఫోన్లు ట్యాప్ చేశారు. విదేశాల నుంచి తీసుకొచ్చిన పలు అత్యాధునిక పరికరాలతో చట్టవిరుద్ధంగా కూడా అక్రమ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని.. కేవలం రాజకీయ, ఎన్నికల ప్రయోజనాలకే కాకుండా బెదిరింపు వసూళ్లకు దిగారని ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో కీలకమైన టి.ప్రభాకర్‌రావును అమెరికా నుంచి వెనక్కి రప్పించడం కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఇంటర్‌పోల్ సాయంతో బ్లూ కార్నర్ నోటీసులు ఇచ్చేందుకు ప్రతిపాదనలు పంపారు. తీవ్రత మరింత పెంచేందుకు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయాలంటూ రూపొందించిన మరో ప్రతిపాదన ప్రస్తుతం సీబీఐ వద్ద పెండింగ్‌లో ఉంది. అంతేకాదు ఆయన పాస్‌పోర్టు రద్దు చేయాలంటూ రీజినల్ పాస్‌పోర్టు అధికారికి లేఖ కూడా రాశారు. ఇది ప్రస్తుతం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ వద్ద పెండింగ్‌లో ఉంది.

భూ అధీన సర్టిఫికెట్ ఎలా ఇస్తారు?

- రెవెన్యూ అధికారులెవరికీ ఆ అధికారం లేదన్న హైకోర్టు
- హైకోర్టు, సుప్రీం కోర్టుకు కూడా ఆ అధికారం లేదు
- కేవలం సివిల్ కోర్టుకు మాత్రమే అర్హత ఉందని స్పష్టీకరణ
- తూప్రాన్‌పేట్‌లోని 2 ఎకరాల భూ వివాదంపై స్టేటస్ కో

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయ భూములను ఎవరికైనా అప్పగిస్తూ భూ అధీన సర్టిఫికెట్ (పొజిషన్ సర్టిఫికెట్)ను జారీ చేసే అధికారం రెవెన్యూ అధికారులకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. తెలంగాణ హక్కులు–పట్టాదార్ పాసుపుస్తకాల చట్టం 2020 ప్రకారం తహసీల్దార్, రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా కలెక్టర్, రెవెన్యూ ముఖ్య కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శుల్లో ఎవరికీ ఈ సర్టిఫికెట్‌ను జారీ చేసే అధికారం లేదని తేల్చిచెప్పింది. ఆ మాటకొస్తే సివిల్ కోర్టులకు తప్ప.. హైకోర్టు, సుప్రీంకోర్టుకు కూడా ఆ అధికారం లేదని వ్యాఖ్యానించింది. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట్ గ్రామం సర్వే 122లోని 2 ఎకరాల భూమికి సంబంధించి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ జారీ చేసిన అధీన ధ్రువీకరణ పత్రాన్ని సవాల్ చేస్తూ నార్లకొండ మల్లయ్య, ఇతరులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమర్పించిన పంచనామా, నివేదిక ఆధారంగా చౌటుప్పల్ తహసీల్దార్ సదరు భూమి స్వాధీనం విషయమై ఆర్డీవోకు నివేదిక సమర్పించారు. ఆ నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేశారు. కాగా 1985లో ఆ భూమిని సాదా బైనామా ద్వారా కొనుగోలు చేశామని పిటిషనర్ తెలిపారు. దీనికి సంబంధించిన వివాదం పెండింగ్‌లో ఉండగానే, భూమిని అమ్మిన వ్యక్తి, అతని కుమారుడు వెంకట్‌రెడ్డి అధికారులను తమవైపు తిప్పుకుని ఇతరులకు భూమిని విక్రయించి, జిల్లా కలెక్టర్ నుండి అధీన ధ్రువీకరణ పత్రాలు కూడా పొందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనల అనంతరం.. సదరు భూమికి సంబంధించిన అన్ని లావాదేవీలపై స్టేటస్ కో ఉత్తర్వులు జారీ చేసింది. అధీన ధ్రువీకరణ పత్రాన్ని ఎలా జారీ చేశారో వివరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను డిసెంబర్ 9వ తేదీకి వాయిదా వేసింది.

ధర్నాచౌక్‌లోనే నిరసనలకు అనుమతి

సచివాలయానికి 500 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఉన్న ధర్నాచౌక్ మినహా మరెక్కడా నిరసనలకు అనుమతిలేదని సిటీ కొత్వాల్ సీవీ ఆనంద్ సోమవారం స్పష్టం చేశారు. నగరవ్యాప్తంగా 163 సెక్షన్ (గతంలో 144 సెక్షన్) అమలులో ఉన్న నేపథ్యంలో ఎక్కడా ఐదుగురు, అంతకంటే ఎక్కువమంది గుమిగూడవద్దని స్పష్టం చేశారు. సచివాలయానికి 500 మీటర్ల పరిధిలో నిషేధాజ్ఞలు విధిస్తున్నామని, ఈ ప్రాంతంలో ఆందోళనలు, నిరసనలు, ప్లకార్డుల ప్రదర్శనలు చేయవద్దని స్పష్టం చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు.

ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ప్రజలను చైతన్యం చేయండి

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌కు హైకోర్టు సూచన

సాక్షి, హైదరాబాద్: పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను తిరిగి ఎన్నుకోకుండా ప్రజలను చైతన్యం చేయాలని, ఓ రాజకీయ పార్టీగా ఆ బాధ్యత మీకే ఉందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌కు హైకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగపరమైన అంశాల్లో వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోర్టులను ఒత్తిడి చేయడం తగదని వ్యాఖ్యానించింది. 'అనర్హత' అంశంపై దాఖలైన అప్పీళ్లలో విచారణ కొనసాగుతోందని, వాదనలు విన్న తర్వాత చట్టప్రకారం నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని చెప్పింది. తదుపరి విచారణ ఈ నెల 28కి వాయిదా వేసింది. ఆలోగా కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. ఒక పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన శాసనసభ్యులు వెంటనే మరో పార్టీలోకి ఫిరాయిస్తున్నారని.. ఇలాంటి వారి శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేసేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కేఏ పాల్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పార్టీ ఇన్‌పర్సన్‌గా పాల్ హాజరై వాదనలు వినిపిస్తూ.. 'ఓ ఎమ్మెల్యే కాంగ్రెస్ నుంచి గెలిచి రాజీనామా చేయకుండా గతంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఇప్పుడు అదే ఎమ్మెల్యే బీఆర్ఎస్ నుంచి గెలిచి రాజీనామా చేయకుండా కాంగ్రెస్‌లో చేరారు. విలువలు అంటూ లేకుండా ఇటు నుంచి అటు.. అటు నుంచి ఇటు చేరుతున్నారు. 4 వారాల్లో షెడ్యూల్ అందజేయాలని సింగిల్ జడ్జి ఆదేశాలిచ్చి 10 వారాలు కావొస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి స్పందన లేదు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాకుండా ఆదేశాలు ఇవ్వాలి' అని కోరారు. వాదనలు పూర్తి కాకుండా ఇలాంటి అంశాల్లో ఉత్తర్వులు జారీ చేయలేమని హైకోర్టు చెప్పింది.

రిజిస్టర్ పోస్టులో పంపినా నిరాకరణ

శాసనసభ్యుల పార్టీ ఫిరాయింపుల అంశంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం అవసరం లేదని, 'అనర్హత' పిటిషన్లను స్పీకర్ ముందు ఉంచాల్సిన బాధ్యత అసెంబ్లీ కార్యదర్శికి ఉందని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. ఖైరతాబాద్ నుంచి బీఆర్ఎస్ తరఫున విజయం సాధించిన దానం నాగేందర్.. రాజీనామా చేయకుండానే కాంగ్రెస్ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారన్నారు. దీనిపై స్పీకర్ కార్యాలయానికి, ఇంటికి రిజిస్టర్ పోస్టులో ఫిర్యాదు పంపినా స్వీకరించలేదని, దీంతో హైకోర్టును ఆశ్రయించామని వెల్లడించారు. అనంతరం తదుపరి విచారణను ధర్మాసనం మంగళవారానికి వాయిదా వేసింది. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లో చేరడాన్ని సవాల్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్, ఖైరతాబాద్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఏజీ వాదనల కోసం తదుపరి విచారణ మంగళవారం మధ్యాహ్నం 3.30కి వాయిదా వేసింది.

ట్రాన్స్‌కో సీఎండీగా కృష్ణ భాస్కర్

▶ మొదటి పేజీ తరువాయి

కొనసాగనున్నారు. ఆయనతో పాటు మరికొందరు ఐఏఎస్ అధికారులను కూడా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య ఐఏఎస్ అధికారుల తుది కేటాయింపుల్లో భాగంగా ఇటీవల పలువురు ఐఏఎస్‌లు తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లగా, ఏపీ నుంచి పలువురు తెలంగాణకు వచ్చారు. ఈ నేపథ్యంలో ఖాళీ అయిన పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఈ బదిలీలను నిర్వహించింది. ఏపీ నుంచి వెయిటింగ్‌లో ఉన్నవారికి పోస్టులు కేటాయించింది.

పర్యాటక శాఖ కార్యదర్శిగా స్మితా సబర్వాల్

రవాణా శాఖ కమిషనర్ కె.ఇలంబర్తి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఇప్పటివరకు జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉండగా, ఇకపై పూర్తిస్థాయి బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఆబ్కారీ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్ బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఆయనకు దేవాదాయ శాఖ శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా అదనపు బాధ్యతల నుంచి బుర్రా వెంకటేశంను తప్పించింది. గనుల శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్‌కు రవాణా శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించింది. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను యువజన అభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా బదిలీ చేసింది. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్య కార్యదర్శిగా, పురావస్తు శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతల్లో ఆమె కొనసాగనున్నారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ స్త్రీ, శిశు, వికలాంగ, వయోజనుల శాఖ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. ఏపీ నుంచి వచ్చి వెయిటింగ్‌లో ఉన్న జి.శ్రీజన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. కార్మిక శాఖ డైరెక్టర్ ఎస్.కృష్ణ ఆదిత్య కీలకమైన ఇంటర్మీడియెట్ విద్య డైరెక్టర్‌గా, ఇంటర్ బోర్డు కార్యదర్శిగా బదిలీ అయ్యారు. తెలంగాణ ఎడ్యుకేషన్, వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీడబ్ల్యూఈఐడీసీ) వీసీ, ఎండీగా సైతం కృష్ణ ఆదిత్య అదనపు బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఈ పోస్టు అదనపు బాధ్యతల నుంచి ఈవీ నరసింహారెడ్డిని ప్రభుత్వం తప్పించింది. కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ముఖ్యకార్యదర్శి సంజయ్‌కుమార్‌కు కార్మిక శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. అలాగే ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్‌కు జీఏడీ (సమన్వయం) కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్‌గా ప్రియాంక వర్గీస్

పలువురు ఐఎఫ్ఎస్ అధికారులను కూడా ప్రభుత్వం బదిలీ చేసింది. చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ (ఐటీ, డబ్ల్యూపీ)గా ఉన్న ప్రియాంక వర్గీస్‌ను చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్‌గా నియమించింది. హైదరాబాద్ ఎస్టీసీ సర్కిల్‌లో డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్‌గా (డీసీఎఫ్) పనిచేస్తున్న శివాల రాంబాబును మహబూబ్‌నగర్ జోగుళాంబ సర్కిల్ డీఎఫ్‌వోగా బదిలీ చేసింది. ఆయనను అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ పోస్టులోనూ ఎఫ్ఏసీగా కొనసాగిస్తున్నారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జూపార్క్ క్యూరేటర్‌గా ఉన్న సునీల్ ఎస్.హీరేమత్ జూపార్కుల డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ములుగు ఎఫ్‌సీఆర్ఐలో జేడీ/డీసీఎఫ్‌గా పనిచేస్తున్న పి.శ్రీనివాసరావు సిద్దిపేట డీఎఫ్‌వోగా నియమితులయ్యారు. అక్కడ పనిచేస్తున్న కె.శ్రీనివాస్‌ను హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఆ పోస్టులో పనిచేస్తున్న ఎస్వీ ప్రదీప్‌కుమార్ శెట్టికి హైదరాబాద్ ఎస్టీసీ సర్కిల్‌లో డీసీఎఫ్‌గా పోస్టింగ్ ఇచ్చారు. జయశంకర్ భూపాలపల్లి డీఎఫ్‌వోగా ఉన్న జె.వసంతను నెహ్రూ జూపార్క్ క్యూరేటర్‌గా బదిలీ చేశారు. జోగుళాంబ, గద్వాల డీఎఫ్‌వోగా ఉన్న మందడి నవీన్‌రెడ్డికి జయశంకర్ భూపాలపల్లి డీఎఫ్‌వోగా పోస్టింగ్ ఇచ్చారు. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.

ట్రాన్స్‌కోకు 10 నెలల్లో నాలుగో సీఎండీ

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడిచిన 10 నెలల్లో ట్రాన్స్‌కో సీఎండీగా బాధ్యతలు చేపట్టనున్న నాలుగో అధికారి కృష్ణ భాస్కర్. తొలుత ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి, ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీగా ఎస్ఏఎం రిజ్వీని ప్రభుత్వం నియమించింది. ఆరు నెలలు గడవక ముందే బదిలీ చేసింది. ఆయన స్థానంలో ఈ పోస్టుల్లో నియమితులైన రొనాల్డ్ రోస్ గత నెలలో ఏపీ కేడర్‌కు బదిలీ అయ్యారు. నాటి నుంచి ఈ మూడు పోస్టుల్లో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. తాజాగా ఆయన్ను ఒక్క ట్రాన్స్‌కో సీఎండీ బాధ్యతల నుంచి ప్రభుత్వం తప్పించింది. కృష్ణ భాస్కర్‌ను ఆ పోస్టులో నియమించింది. దక్షిణ/ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల ఆర్థిక వ్యవహారాల్లో కీలక నిర్ణయాలను ట్రాన్స్‌కో తీసుకుంటుండడంతో ఈ పోస్టుకు ప్రాధాన్యత పెరిగింది. అలాగే తెలంగాణ పవర్ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ హోదాలో ట్రాన్స్‌కో సీఎండీ రాష్ట్ర విద్యుత్ రంగ నిర్ణయాల్లో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుండడం వల్ల కూడా ఈ పోస్టు పవర్‌ఫుల్‌గా మారింది.

కొందరు ఐఏఎస్‌ల స్థానచలనం ఇలా..

ఐఏఎస్ అధికారి	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
స్మితా సబర్వాల్	మెంబర్ సెక్రటరీ, తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్	కార్యదర్శి, యువజన అభ్యుదయం, పర్యాటక, సాంస్కృతిక శాఖ,
ఇ.శ్రీధర్	కమిషనర్, ఎక్సైజ్ శాఖ	కార్యదర్శి, బీసీ సంక్షేమ శాఖ
అనితా రామచంద్రన్	కమిషనర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ	కార్యదర్శి, స్త్రీ, శిశు, వికలాంగులు, వయోజనుల సంక్షేమ శాఖ
కె.ఇలంబరి	కమిషనర్, రవాణా శాఖ	కమిషనర్, జీహెచ్ఎంసీ
సీహెచ్ హరికిరణ్	వెయిటింగ్	డైరెక్టర్, ఆబ్కారీ శాఖ
డి.కృష్ణ భాస్కర్	డిప్యూటీ సీఎం/ ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి	సీఎండీ, ట్రాన్స్‌కో
శివశంకర్ లోతేటి	వెయిటింగ్	సీఈఓ, ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్
జి.శ్రీజన	వెయిటింగ్	డైరెక్టర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ
చిట్టెం లక్ష్మీ	వెయిటింగ్	డైరెక్టర్, ఆయూష్
ఎస్.కృష్ణ ఆదిత్య	డైరెక్టర్, కార్మిక శాఖ	డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య, సెక్రటరీ, ఇంటర్ బోర్డు

16న విద్యార్థులతో జిల్లా కలెక్టరేట్ల ముట్టడి

కాచిగూడ (హైదరాబాద్): ఫీజు బకాయిలు చెల్లించాలని, స్కాలర్‌షిప్‌లు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 16వ తేదీన కాలేజీ విద్యార్థులు తరగతులు బహిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పిలుపునిచ్చారు. అదే రోజు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడించాలని కోరారు.

రాజకీయ మలుపు!

▶ మొదటి పేజీ తరువాయి

జారీ అయింది. అయితే తొలిసారిగా మాజీ ఎమ్మెల్యేను దర్యాప్తు అధికారులు విచారణకు పిలిచారు. నకిరేకల్ ఎమ్మెల్యేగా వ్యవహరించిన చిరుమర్తి లింగయ్య బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు కావడం గమనార్హం.

ఫోన్ల నుంచి డేటాను వెలికితీసి..

ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదు తర్వాత కొన్ని రోజులకు పోలీసు అధికారుల అరెస్టులు జరిగాయి. ఈ క్రమంలో నిందితులు తిరుపతన్న, మరికొందరు అధికారులు, మాజీ అధికారులు తమ ఫోన్లను మార్చేయడం, ఫార్మాట్ చేయడం వంటి చేశారు. అయితే పోలీసులు ప్రణీత్‌రావు, తిరుపతన్న, భుజంగరావు, రాధాకిషన్‌రావుల అరెస్టు తర్వాత వారి నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని.. ఫార్మాట్ చేసిన, డిలీట్ చేసిన డేటాను వెలికితీయడానికి (రిట్రీవ్) ఆ ఫోన్లను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఇటీవలే ల్యాబ్ నుంచి నివేదికలు వచ్చాయి. నిందితుల ఫోన్ల నుంచి వెలికితీసిన డేటాను అధికారులు విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతన్న ఫోన్ డేటాను విశ్లేషించగా.. ఆయనతో చిరుమర్తి లింగయ్య చేసిన సంప్రదింపులు బయటపడ్డాయి. 2022 అక్టోబర్ రెండో వారంలో జరిగిన మునుగోడు ఉప ఎన్నికతోపాటు గతేడాది డిసెంబర్‌లో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో.. వీరి మధ్య కీలక అంశాలకు సంబంధించి సమాచార మార్పిడి జరిగినట్లుగా గుర్తించినట్టు తెలిసింది. దీనితో సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న జూబ్లీహిల్స్ ఏసీపీ ఎదుట హాజరుకావాల్సిందిగా ఆదేశిస్తూ లింగయ్యకు నోటీసులు జారీ చేశారు. అనారోగ్య కారణాల నేపథ్యంలో విచారణకు హాజరుకావడానికి మూడు రోజుల సమయం ఇవ్వాలని లింగయ్య కోరగా.. గురువారం విచారణ రావాలని అధికారులు తెలిపారు.











నైతికతకు మూలం కరుణ.
– ఆర్థర్ షోపెన్‌హోవర్

సాక్షి
మంగళవారం, 12 నవంబర్ 2024

నిధులు రావాలి! నిశ్చయం కావాలి!

పర్యావరణ మార్పుల సమస్యపై ప్రపంచ దేశాలు మరోసారి చర్చకు కూర్చున్నాయి. పర్యావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) శిఖరాగ్ర సదస్సు 'కాప్‌–29' అజర్‌బైజాన్‌లోని బాకూలో సోమవారం మొదలైంది. బొగ్గు, ముడిచమురు, సహజవాయువుల వినియోగం నుంచి దూరం జరగాలని చరిత్రాత్మక ఒప్పందం కుదిరిన ఏడాది తరువాత జరుగుతున్న ఈ 12 రోజుల మేధామథనం అనేక విధాల ప్రాధాన్యం సంతరించుకుంది. గడచిన 2023, ఆ వెంటనే వర్తమాన 2024... ఇలా వరుసగా రెండో ఏడాది కూడా అత్యధిక వేడిమి నిండిన వత్సరంగా రుజువవుతున్న వేళ జరుగుతున్న సదస్సు ఇది. అలాగే, అమెరికా కొత్త అధ్యక్షుడిగా ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన కొద్ది రోజులకే ఇది జరుగుతోంది. పర్యావరణ సంక్షోభం వట్టి నాటకమన్నది ఆది నుంచి ట్రంప్ వైఖరి కావడంతో మిగతా ప్రపంచమంతా బాకూ వైపు ఆసక్తిగా చూస్తోంది.

నిజానికి, ఈ 2024 చరిత్రలోనే అత్యధిక ఉష్ణోగ్రతా నామ సంవత్సరం కానున్నట్లు కోపర్నికస్ క్లైమేట్ ఛేంజ్ సర్వీస్ లాంటి నివేదికలు సూచిస్తున్నాయి. పారిశ్రామికీకరణ ముందు నాటి కన్నా 1.5 డిగ్రీల సెంటీగ్రేడ్ మేర ఉష్ణోగ్రత ఎక్కువైన తొలి ఏడాదే ఇదే కానుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పర్యవసానంగా కరవు, తుపానులు, వరదలు ప్రపంచమంతటిపై ప్రభావం చూపుతున్నాయి. ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో కాప్‌–29 జరుగుతుండడం గమనార్హం. గమనిస్తే, ప్రపంచ కాలుష్య ఉద్గారాలలో ఇప్పటికే చైనా ప్రథమ స్థానంలో, అమెరికా రెండో స్థానంలో ఉంటే, భారత్ మూడో స్థానంలో నిలిచింది. అయితే, ఈసారి సదస్సుకు అమెరికా, చైనా, భారత్, బ్రిటన్, జర్మనీ, బ్రెజిల్, ఫ్రాన్స్ దేశాల అగ్రనేతలు హాజరు కావడం లేదు.

అధ్యక్షుడు బైడెన్ రావట్లేదు. కొత్తగా ఎన్నికైన ట్రంప్ ఎలాగూ రారు. అయితేనేం, అమెరికా ప్రభావం ఈ కాప్‌–29పై అమితంగా ఉండనుంది. నిరుటి చర్చల్లో చేసుకున్న ప్రధాన వాగ్దానానికి కట్టుబడడంలో అనేక దేశాలు విఫలమయ్యాయి. ఉదాహరణకు, అన్ని దేశాల కన్నా అత్యధికంగా ముడిచమురును ఉత్పత్తి చేస్తున్న అమెరికా తన పద్ధతి మార్చుకోనే లేదు. ఇప్పుడు ట్రంప్ గద్దెనెక్కినందున చమురు ఉత్పత్తి, వినియోగం పెరుగుతుందే తప్ప తగ్గే సూచన లేదు. పర్యావరణ పరిరక్షణ చర్యల నుంచి అమెరికా పూర్తి దూరం జరిగినా జరగవచ్చు. ఇది ప్రమాద ఘంటిక. అగ్ర దేశాలు హాజరు కాకున్నా సమస్య తీవ్రతయితే మారదు. వాతావరణ సంక్షోభ నివారణకు మరిన్ని నిధులవసరం. అందుకే, కాప్‌–29 కొత్త వాతావరణ పరిరక్షణనిధిని ప్రాధాన్యాంశంగా ఎంచుకుంది.

వర్ధమాన దేశాలు తమ ఉద్గారాల సమస్యను దీటుగా ఎదుర్కొని, పెరుగుతున్న వాతావరణ ముప్పును వీలైనంత తగ్గించాలంటే ఆ దేశాలకు తగినంత ఆర్థిక సహాయం అవసరం. అందుకు 100 బిలియన్ డాలర్ల వార్షిక లక్ష్యాన్ని 2009లోనే నిర్ణయించారు. 2020 కల్లా దాన్ని చేరాలని భావించారు. కానీ, అంతకంతకూ పెరుగుతున్న వాతావరణ సంక్షోభ పరిస్థితుల మధ్య ఆ నిధులు ఇప్పుడు ఏ మూలకూ రావు. కాబట్టి, వర్తమాన పరిస్థితులకూ, అవసరాలకూ తగ్గట్టు దాన్ని ఇప్పుడు సవరించుకోవాల్సిన పరిస్థితి. భాగస్వామ్య పక్షాలైన 198 దేశాలకూ వీటో ఉన్న నేపథ్యంలో ఏకాభిప్రాయ సాధన సులభమేమీ కాదు. అలాగే, ఈ మొత్తంలో ఎంత మేర ప్రజాధనం సేకరించాలనేది కూడా కీలక ప్రశ్నే. అనేక దేశాలు ఆర్థిక భారంతో ఉన్న వేళ దీని పైనా అందరి వైఖరీ ఒకేలా లేదు. అయితే, చర్యలు చేపట్టడం ఆలస్యమైన కొద్దీ మరింత భారీగా నిధులు అవసరమవుతాయి.

నిధులెంత కావాలన్నదే కాదు... వాటిని ఎలా సేకరించాలి, పర్యావరణ మార్పుల కష్టనష్టాల నుంచి కోలుకొనేందుకు దేశాలకు ఎలా ఆ నిధుల్ని పంచాలి, సంక్షోభ పరిష్కారానికి రూపొందించాల్సిన ఆర్థిక వ్యవస్థ ఏమిటనేది కూడా సదస్సులో కీలక చర్చనీయాంశాలే. పర్యావరణ, ఆర్థిక, మానవ నష్టాలను నిరోధించాలంటే పరిస్థితి చేతులు దాటక ముందే ఉద్గారాల్ని తగ్గించడం కీలకం. వాతావరణ ఉత్పాతాలతో విస్తృతంగా నష్టం, పర్యవసానాలు తప్పవు. నష్టం పెరిగిన కొద్దీ ఆ దేశాల పునరుజ్జీవానికి మరింత ఖర్చవుతుంది. ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్న పుడమి పరిస్థితి మరింత క్షీణించకుండా ఉండాలంటే, తక్షణ చర్యలు అవసరం. అభివృద్ధి చెందిన దేశాలు గతంలో కోవిడ్‌–19 సమయంలో తమ పౌరులకూ, వ్యాపారాలకూ అండగా నిలిచేందుకు 48 నెలల్లోనే దాదాపు 8 లక్షల కోట్ల డాలర్లను అందించి, ఆ సవాలును ఎదుర్కొన్నాయి. అప్పటి కోవిడ్‌లానే ఇప్పుడీ పర్యావరణ మార్పు సమస్యనూ అంతే అత్యవసరంగా చూడడం ముఖ్యం. ప్రజాధనంతో పాటు ప్రైవేట్ రంగ ఆర్థిక సాయం కూడా లేకుంటే కష్టమని కాప్‌–29 బాధ్యులు సైతం తెగేసి చెబుతున్నారు.

హరిత పర్యావరణ నిధి అంటూ పెట్టినా, సమకూరింది తక్కువే. ఇప్పటికైతే ఏటా కనీసం లక్ష కోట్ల డాలర్లు అవసరమంటున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు బాధ్యతను విస్మరించి వ్యవహరిస్తుండడంతో, వర్ధమాన దేశాల స్వచ్ఛ అభివృద్ధి, దారిద్ర్య నిర్మూలనకు గండి పడుతోంది. అసలు ఆ నిధుల్లోనూ 60 శాతం పైగా రుణాలైతే, 30 శాతం పైగా ఈక్విటీలు. కేవలం 5 శాతమే గ్రాంట్లు. అసలే కునారిల్లుతున్న అనేక పేద దేశాలకు ఇది మోయలేని భారమే. ఇవన్నీ దృష్టిలో ఉంచుకొని, కాప్‌–29 చర్చించడం ముఖ్యం. బలమైన ఆర్థికవ్యవస్థగా రూపొందుతున్న భారత్ సైతం చొరవ తీసుకోవాలి. హరిత ఇంధన టెక్నాలజీ, పరిశోధన – అభివృద్ధి, తక్కువ ఖర్చు పరిష్కారాల వైపు ప్రపంచం దృష్టి సారించేలా చూడాలి. ఏమైనా, గండం గట్టెక్కాలంటే మరిన్ని నిధులు కావాలి. అదీ వేగంగా అందాలి. వనరుల సమీకరణ సాధ్యమేనని చరిత్ర చెబుతోంది గనక, ఇప్పుడిక రాజకీయ కృతనిశ్చయముందా అన్నదే ప్రశ్న. ఈ 12 రోజుల సదస్సులో దానికి సమాధానం స్పష్టం కానుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** శు.ఏకాదశి ప.12.23 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర రా.3.28 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** ప.2.05 నుండి 3.33 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.22 నుండి 9.10 వరకు, తదుపరి రా.10.30 నుండి 11.18 వరకు, **అమృతఘడియలు:** రా.10.55 నుండి 12.20 వరకు, ప్రబోధనైకాదశి.

సూర్యోదయం : 6.06
సూర్యాస్తమయం: 5.22
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

వాస్తవాలను నిరాకరిస్తున్నామా?

విశ్లేషణ



జ్యోతి మల్హోత్రా

ట్రంప్ విజయ ప్రసంగం చేసిన తర్వాత కూడా కొన్ని అమెరికా ఉదారవాద పత్రికలు అధ్యక్షుడిగా ఆయన గెలుపును ఒప్పుకోలేకపోయాయి. జార్జియా లాంటి నల్లజాతి ప్రజలున్న ప్రాంతాలు కూడా దాదాపుగా ట్రంప్ వైపు మారాయి. గత 40 ఏళ్లలో ఇతర ఏ రిపబ్లికన్ అభ్యర్థి కన్నా శ్వేతజాతీయేతర ఓట్లను ట్రంప్ అధికంగా గెలుచుకున్నారు. ఆయన దోషి కావొచ్చు, కానీ దేనికీ గట్టిగా నిలబడలేదు కాబట్టే కమలా హ్యారిస్ ఓడిపోయారు. ఇది వాస్తవం. భారతదేశంలోనూ మోదీ విజయం పట్ల ఇదే తరహా స్పందన కనబడింది. ప్రజలు నిజంగా ఏమి చెబుతున్నారో చూడటానికి, వినడానికి నిరాకరిస్తున్నామా? వారి ఆలోచనలు, కోరికలు, ఆత్రుతలను సరిగ్గా పట్టించుకుంటున్నామా అన్నది ప్రశ్న.

డోనాల్డ్ ట్రంప్ వైట్ హౌస్‌కి తిరిగి రావడం అనేది నేటి అమెరికాలో... నరేంద్ర మోదీ గత దశాబ్దంలో అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ భారతదేశం అనుభవించిన భావోద్వేగ తీవ్రతను రేకెత్తిస్తోంది. 'లిబరల్ ప్రెస్' అని పిలవబడుతున్న మీడియా దీన్ని ఒక అంధకారయుతమైన, వినాశకర దినానికి సంబంధించిన దృష్టాంతంగా చిత్రించడానికి ఆపసోపాలు పడింది. అదే సమయంలో ఎలాన్ మస్క్ 'ఎక్స్' నేతృత్వంలోని 'సంప్రదాయవాద మీడియా'... కష్టకాలంలో, ప్రమాదకరమైన పరిస్థితి నుంచి అమెరికాను బయటపడేసిన వీరుడిగా ట్రంప్‌ను అభివర్ణించడంలో పోటీపడుతోంది.

మోదీకి వ్యతిరేకంగా భారత ప్రజల భావోద్వేగ మిశ్రమానుభూతి... ట్రంప్ పట్ల అమెరికన్ల ప్రతిస్పందనలతో సమానంగా ఉండటం అసాధారణం. 2014, 2019, 2024లో మోదీ గెలిచిన మూడు ఎన్నికలలోనూ ఎన్నికల పారవశ్యం వర్సెస్ తీవ్ర ఆగ్రహం ప్రధాన లక్షణంగా ఉండింది. కచ్చితంగా, అమెరికాలో లాగానే భారతదేశంలోనూ మధ్యస్థులుగా ఉండేవాళ్లు ట్రంప్, మోదీ లాంటి విభజిత వ్యక్తిత్వాల బరువుతో చాలావరకు కనుమరుగయ్యారు. పెద్ద ప్రశ్న ఏమిటంటే, మీడియా కానీ, రెండు దేశాల్లోని పోల్ నిపుణులు కానీ ఎక్కడ పొరబడుతున్నారు? మోదీ, ట్రంప్‌ను ద్వేషించడాన్ని మనం ఎంతగానో ఇష్టపడుతున్నామా? ప్రజల ఆలోచనలు, కోరికలు, ఆత్రుతలను పట్టించుకుంటున్నాం అనుకుంటున్నప్పటికీ, వారు నిజంగా ఏమి చెబుతున్నారో చూడటానికి, వినడానికి నిరాకరిస్తున్నామా?

ట్రంప్ ఫ్లోరిడాలో తన విజయ ప్రసంగం చేసిన తర్వాత కూడా, 'న్యూయార్క్ టైమ్స్' వంటి గౌరవప్రదమైన వార్తాపత్రికలు ట్రంప్ గెలిచినట్లు అంగీకరించడానికే నిరాకరించాయి. భారతదేశంలో కూడా, 2014, 2019 ఎన్నికల్లో నమ్మశక్యం కాని విధంగా మన బుద్ధిని కాకుండా మన హృదయం చెప్పిందానికి తలూపాం. భారతీయులు సంపూర్ణ ఆమోదంతో మోదీకి ఓటు వేస్తున్నారని నమ్మలేకపోయాం. 2022లో యోగి ఆదిత్యనాథ్ ఉత్తరప్రదేశ్‌ను కైవసం చేసుకున్నారని నమ్మడానికి నిరాకరించాం. కోవిడ్ –19 సమయంలో సంభవించిన వేలాది మంది మరణాలు దేవుడే ఆయనకు వ్యతిరేకంగా మారినట్లు రుజువు అని చెప్పుకున్నాం. 2024లో, అదే ఉత్తరప్రదేశ్ బీజేపీకి పూర్తిగా ఓట్లను బట్వాడా చేయడానికి నిరాకరించినప్పుడు కూడా మనం సమానంగా షాక్ అయ్యాము.

ఈ అన్ని సందర్భాల్లోనూ క్షేత్ర వాస్తవికతను పట్టించుకోకుండానే మనం కథలో చాలా లోతుగా మునిగిపోయాం. ప్రజా తీర్పు మన ముందుకు వచ్చిన తర్వాత కూడా, దాన్ని అంగీకరించడానికి నిరాకరించాం. మోదీ, ట్రంప్‌లలో ఏదో తప్పు ఉందని నొక్కిచెప్పాం. ఇది నిజం కావచ్చు, కాకపోవచ్చు. మరింత అధ్వాన్నంగా, రాహుల్ గాంధీకి లేదా కమలా హ్యారిస్‌కు అదే కఠినమైన ప్రమాణాలను వర్తింప జేయడానికి నిరాకరించాం.



నరేంద్ర మోదీ, డోనాల్డ్ ట్రంప్

కాబట్టి ఈ రోజు వాస్తవాలను ఎదుర్కొందాం. ఏ వైపూ స్థిరంగా నిలబడలేదు కాబట్టే హ్యారిస్ ఓడిపోయారు. ట్రంప్ దోషి, స్త్రీ లోలుడు, ఇంకో ఘోరం వలసలను ఆపి (భారతదేశానికి మంచిది కాదు) అమెరికాకు ఉద్యోగాలు తెస్తానని వాగ్దానం చేశారు. రాహుల్ విషయానికొస్తే, నాలాంటి వ్యక్తులు డిన్నర్ టేబుల్ వద్ద ఆయన అనేక ఆలోచనలతో మనస్ఫూర్తిగా ఏకీభవిస్తారు. కానీ ఆయన దేని కోసం గట్టిగా నిలబడతారో అర్థం చేసుకోవడం ఇబ్బందికరంగానే ఉంటోంది.

అమెరికా, భారతదేశం వంటి గజిబిజి ప్రజాస్వామ్యాలు ట్రంప్, మోదీలనే ఎన్నుకుంటాయి. ఎందుకంటే వారు క్షీణతలో లేదా పరివర్తనలో సమాజాల ద్వారా ఏర్పడే గందరగోళాన్ని సరళీకృతం చేయగలరు. 2021 జనవరి 6న అమెరికన్ క్యాపిటల్‌పై దాడి, 2002 గుజరాత్ అల్లర్లలో చాలామంది మరణించడం లాంటివి ఉన్నప్పటికీ మనం ఎన్నుకున్న నాయకుల జీవితాల్లోని చీకటి కోణాలను విస్మరిస్తాము. ఎందుకంటే ఈ రోజు మన కష్టతరమైన జీవితాలను మెరుగుపరుస్తారని వారు హామీ ఇచ్చారు. వారి ప్రస్తుత హామీలు మనకు ఓదార్పునిస్తాయి. వారు మనతో సింపుల్‌గా మాట్లాడతారు. మనం వారి ప్రత్యర్థులను నమ్మినదానికంటే, వీరి పట్ల తక్కువ అపనమ్మకం చూపుతాం.

డెమోక్రాట్ అనుకూల దక్షిణ యూఎస్ రాష్ట్రం జార్జియాలోని నల్లజాతి ప్రజలున్న జిల్లాలు దాదాపు పూర్తిగా ట్రంప్ వైపు మారాయి. అలాగే ఆయన లాటిన్ అమెరికన్ల ఓటును 14 శాతం మెరుగుపరుచుకున్నారు. ట్రంప్‌కు ఎందుకు ఓటు వేశారని అడిగితే వాళ్లు చెప్పిన ఒక కారణం: ఎటూ వేస్తారని డెమోక్రాట్లు వారి ఓటును తేలిగ్గా తీసుకోవడం. ఇది విన్నట్టు అనిపిస్తోందా?

హ్యారిస్‌ను శిక్షించినట్టుగానే హరియాణాలో భూపీందర్ సింగ్ హుడాను ఓటర్లు శిక్షించారు. కుమారి సెల్జా, రణదీప్ సూర్జేవాలా, రావ్ బీరేందర్ సింగ్ వంటి పార్టీలోని తిరుగుబాటుదారులను తన వెంట తీసుకోవడానికి హుడా నిరాకరించారు. హరియాణాలోని ప్రతి నియోజక వర్గంలోనూ జాట్‌యేతర ఓట్లపై బీజేపీ సూక్ష్మ దృష్టి పెట్టినట్టుగానే, గత 40 ఏళ్లలో ఇతర ఏ రిపబ్లికన్ అభ్యర్థి కన్నా శ్వేతజాతీయేతర ఓట్లను ట్రంప్ అధికంగా గెలుచుకున్నట్లు డేటా చూపిస్తోంది.

విచిత్రంగా, యూపీలో బీజేపీ 29 స్థానాలను కోల్పోయినప్పుడు దాని మెజారిటీ తగ్గిందని కాంగ్రెస్ హర్షధ్వానాలు చేయకుండా ఉండలేకపోయింది. మరో వైపున మోదీకి ఈ ప్రపంచంలో సగం గర్వం రావడం అనేది ఉండదని తెలుసు. పూర్తి మెజారిటీ ఉన్నప్పటిలాగానే ప్రధానమంత్రిగా తాను చేయాల్సిన పనుల్ని చేయగలరు. పైగా అధికారాన్ని సంఘటితం చేసుకోవడానికీ, యూపీలో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవడానికీ రాబోయే శాసనసభ ఎన్నికలలో గెలవడమే మార్గం. హరియాణా. మహారాష్ట్ర. జార్ఖండ్.

కాకపోతే మోదీపై తిరగబడి మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకోవాలని బలవంతం చేసిన పంజాబ్‌కు భిన్నమైన నియమాలు వర్తింపజేయబడుతున్నాయి. గత కొన్ని వారాలుగా వరి సేకరణలో ఉన్న అపారమైన కష్టాల గురించి చాలా ప్రశ్నలు రేగుతున్నాయి. పంజాబ్ సున్నితమైన సరిహద్దు రాష్ట్రంగా ఉండి వ్యవసాయంపై గణనీయంగా ఆధారపడి ఉన్నందున దీనిని నివారించలేమా? పంజాబ్ నుండి దేశంలోని ఇతర ప్రాంతాలకు వరి తరలింపులో కేంద్రం మరింత అవగాహన చూపలేదా? తడిసిన బియ్యాన్ని అరుణాచల్‌ప్రదేశ్, కర్ణాటకకు పంజాబ్ విక్రయించినట్లు ఈ ఏడాదే ఎఫ్‌సీఐ ఎందుకు గుర్తించింది?

బహుశా, వీటిలో కొన్ని వైరల్ అయిన కుట్ర సిద్ధాంతాల్లా అనిపిస్తాయి. ఈ చిక్కుముడి ప్రశ్నలకు సమాధానం కావాలంటే – మోదీ, చెప్పాలంటే ట్రంప్ కూడా అధికార స్వభావాన్ని బాగా అర్థం చేసుకున్నారు. ఆ రాజకీయం కిట్టీ పార్టీ కాదు, ఎన్జీవో కాదు. ఓటర్లు నిర్దిష్ట సంఖ్యకు మించి మీకు ఓటు వేయకపోతే అప్పుడు ఇతర చర్యలు తీసుకోవాలి. ఉదాహరణకు 2024 లోక్‌సభ ఎన్నికలలో పంజాబ్‌లో బీజేపీకి వచ్చినవి 18.3 శాతం ఓట్లు. అప్పుడు విభజించు పాలించు అనే పురాతన నియమం ఉండనే ఉంది.

ఇప్పుడు ట్రంప్ అమెరికాను గెలుచుకున్నందున, స్వదేశంపై మనం దృష్టి పెట్టాల్సిన సమయం వచ్చింది. మహారాష్ట్రతో పాటు, నవంబర్ 20న మొదలయ్యే పంజాబ్‌లోని నాలుగు నియోజకవర్గాల ఉప ఎన్నికలతో ఆట ప్రారంభిద్దాం.


వ్యాసకర్త సీనియర్ సంపాదకురాలు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తగ్గుతూనే ఉంది!



2011 నుండి ప్రతి సంవత్సరం డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ ఐదు శాతం తగ్గింది. పదమూడేళ్లలో 44 నుండి 84 రూపాయలకు పడిపోయింది.

– దేబర్ఘ్య దాస్, వెంచర్ క్యాపిటలిస్ట్

ఆనందాన్ని పోనివ్వొద్దు!



మన పొద్దుటి కాఫీకి బదులుగా గ్రీన్ టీ తాగడం మొదలుపెడితే, మన జీవితంలో ఇంకా మిగిలివున్న చిన్న సంతోషంలో 30 శాతం కోల్పోతాం.

– ఇంతియాజ్ మహమూద్, వ్యాఖ్యాత

ముందు నుంచే అవగాహన



నేను పశ్చిమ లండన్‌లో క్యాన్సర్ సేవల డైరెక్టర్‌గా ఉన్నప్పుడు, మేము నిర్మించిన క్యాన్సర్ సెంటర్‌లో స్మోకింగ్ రూమ్‌ను ఏర్పాటుచేశాం. పొగతాగడానికి ఎందుకు అనుమతిస్తారని చాలామంది ప్రశ్నించారు. జీవితాంతం ధూమపానం చేసిన వ్యక్తులు కీమోథెరపీ సమయంలో ఒత్తిడిని తట్టుకోవడానికి ధూమపానం చేస్తారని బదులిచ్చాను. కచ్చితంగా ఆ వ్యసనం నుంచి దూరం చేయాల్సిందే. కానీ ఆసుపత్రికి వచ్చాక కాదు, అంతకు చాలా ముందే జరగాలి.

– కరోల్ సైకోరా, ప్రపంచ ఆరోగ్య సంస్థ క్యాన్సర్ ప్రోగ్రామ్ మాజీ డైరెక్టర్

ఆగరా?



చాలామంది భారతీయుల్లోని చిరెత్తించే గుణాల్లో ఒకటి ఏమిటంటే, లిఫ్టులో ఉన్నవాళ్లు ఇంకా బయటకు రాకముందే, వీళ్లు లోపలికి వెళ్లిపోవడం.

– అభిజిత్ మజుందార్, సంపాదకుడు

ఏం చేస్తారు?



యూఎస్‌లో ఆశ్రయం కోరుతున్న అక్రమ భారతీయ వలసదారులు గత కొన్నేళ్లలో 800 శాతం పెరిగి 41,000 మంది అయినట్టుగా ఒక పత్రికా కథనం. ఇక, ఆశ్రయం కోరని భారతీయ అక్రమ వలసదారులు చాలా రెట్లు ఎక్కువ. ఇందులో అధిక భాగం గుజరాతీలు. మరి మోదీని కౌగిలించుకున్న ట్రంప్ వారితో ఎలా వ్యవహరిస్తారో చూడాలి!

– ఎం.కె. వేణు, సంపాదకుడు

ఎన్నికలప్పుడే...



మహిళలు ప్రియమైన సోదరీమణులు అనీ, వారికి నెలవారీ పాకెట్ మనీ అవసరమనీ ఎన్నికల ముందు మాత్రమే రాజకీయ పార్టీలు ఎందుకు గుర్తిస్తాయి? అప్పుడు మాత్రమే ఉద్యోగాలు కల్పించాలి, వంట గ్యాస్‌ను చౌకగా ఇవ్వాలని ఎందుకు గుర్తొస్తుంది. పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఓట్ల కొనుగోలుకు ఉపయోగిస్తున్నారా?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఎన్ని ప్రాణాలు?




జమ్ము – కశ్మీర్ ప్రత్యేక బలగాలకు చెందిన ఒక మనిషిని చంపేశారు. తుపాకీ కాల్పుల్లో ముగ్గురు సైనికులు గాయపడ్డారు. ఇంకా ఎన్ని విషాదాలకు మనం సాక్షిగా ఉండాలి? ఇంకా ఎంత మంది సైనికులు గాయపడాలి? మోదీజీ, దయచేసి మాకు జవాబివ్వండి!

– కపిల్ సిబల్, రాజ్యసభ సభ్యులు

ఇన్ బాక్స్

బహుముఖ సేవాతత్పరుడు

గాంధీజీ సిద్ధాంతాలనూ, ఆశయాలనూ తన జీవితంగా మలచుకున్న త్యాగశీలి చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు. వీరు సర్వోదయ నాయకులుగా, మంత్రిగా, విద్యాప్రదాతగా, 'గాంధీ భవనం' రూపకర్తగా ప్రజలకు బహుముఖ సేవలు అందించారు. 1919 డిసెంబర్ 16న జన్మించారు. ఆ తర్వాత 3 దశాబ్దాల పాటు శాసన సభ్యునిగా, రాష్ట్ర మంత్రిగా సేవలందించారు. సంస్కృత, తెలుగు మాధ్యమాలతో 66 వరకు బాల బాలికల పాఠశాలలు, కళాశాలలు స్థాపించారు. ఆయన విద్యారంగానికి అందించిన సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి జైల్‌సింగ్ చేతుల మీదుగా 'విద్యాప్రదాత' అవార్డు అందుకున్నారు.



చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు

1955లో ఆచార్య వినోబా భావే పశ్చిమ గోదావరి జిల్లా పాదయాత్రలో చేసిన ప్రసంగాలను హిందీ నుంచి తెలుగులోనికి అనువదించారు. 1961 ఉంగుటూరు గ్రామంలో వీరు ఏర్పాటు చేసిన అఖిల భారత సమ్మేళనానికి రాష్ట్రపతి రాజేంద్రప్రసాద్, లోక్ నాయక్ జయ ప్రకాష్ నారాయణ వంటి ప్రముఖులు వచ్చారు. నేను సమ్మేళన స్వాగత కార్యాలయంలో పని చేశాను. మూర్తిరాజు గారు ఆంధ్రప్రదేశ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టినా... ఎంతో నిరాడంబరంగా ఉండేవారు. వచ్చినవారితో ఆప్యాయంగా మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారు. పశ్చిమ గోదావరి జిల్లా పెద్ద నిండ్రకొలను గ్రామంలో సుమారు కోటి రూపాయల ఖర్చుతో భారత పార్లమెంట్‌ను పోలిన భవనాన్ని నిర్మించి దానికి 'మహాత్మా గాంధీ భవనం' అని పేరుపెట్టారు.

జయప్రకాష్ నారాయణ జయంతి ఉత్సవాలను 2002లో విజయవాడ గాంధీ పర్వత అభివృద్ధి కమిటీ అధ్యక్షునిగా ఉంటూ జరిపారు. 2004 నుండి 2014 వరకూ 'ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి' అధ్యక్షులుగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీజీ నిర్మాణ కార్యక్రమాల్లో సూచించిన ప్రకృతి చికిత్స విధానాన్ని విశ్వసించారు. అందుకే ఆయన నిండ్రకొలనులో 2010లో అఖిల భారత ప్రకృతి చికిత్స సమ్మేళనాన్ని నిర్వహించారు. రాష్ట్ర సర్వోదయ మండలి అధ్యక్షునిగా నేను ఈ సమ్మేళన స్వాగత సమితి కార్యదర్శిగా పని చేయడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఇలా సమాజానికి బహుముఖ సేవలు అందించిన మూర్తిరాజు గారు 2012 నవంబర్ 12న తుది శ్వాస విడిచారు. ఆయన జీవితం నుంచి యువత స్ఫూర్తి పొందాలి.

– జి.వి. (భూదానం) సుబ్బారావు,
తెలంగాణ గాంధీ స్మారక నిధి అధ్యక్షులు
(నేడు సీహెచ్‌వీపీ మూర్తిరాజు వర్ధంతి)

కృష్ణ జింకల రక్షకుడు!

ఒక లక్ష్యం కోసం దశాబ్దాలుగా అవిశ్రాంతంగా శ్రమిస్తూ, పని చేస్తున్నవారు సమాజంలో చాలా అరుదుగా ఉంటారు. 48 ఏళ్ల అనిల్ బిష్ణోయ్ అటువంటివాడే. ఆయన విద్యావంతుడే కాదు రైతు కూడా! ఆవాలు, పత్తి పండించే వాడు. వన్యప్రాణుల ప్రేమికుడు, జంతువులు... ముఖ్యంగా కృష్ణ జింకలు అంటే ఆయనకు చిన్న తనం నుంచీ ప్రేమ ఎక్కువ! జంతువులను వేటాడేవారిని అతడు తీవ్రంగా నిరసిస్తాడు. హనుమాన్ గఢ్‌లోని శ్రీగంగా నగర్‌లో జంతువులను రక్షించే మిషన్‌ను ప్రారంభించడానికి వేటగాళ్లే కారణం అంటాడు అనిల్.

బిష్ణోయ్ కమ్యూనిటీ వారికి కృష్ణ జింక పవిత్ర జంతువు. ఈ కమ్యూనిటీ వారి గురువైన భగవాన్ జాంబేశ్వర్ అడవినీ, వన్యప్రాణులనూ రక్షించాలనీ, తద్వారా మాత్రమే పర్యావరణ పరిరక్షణ ఉంటుందనీ చెప్పేవారు! ఆ బోధనల ప్రభావం బిష్ణోయ్ కమ్యూనిటీపై ఎక్కువ ఉంది. బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ మీద ఇదే ప్రాంతంలో జింకను చంపిన కేసు నమోదు అవ్వడం గమనార్హం. ఇప్పుడు ఆయనకు చంపుతామనే బెదిరింపులు రావడం ఆందోళన కలిగిస్తున్న అంశం. నిజానికి బిష్ణోయ్ సమాజానికి చెందిన వారు సల్మాన్‌ను తమ మందిర్‌కు వచ్చి క్షమాపణ కోరమన్నారు. దీనిని ఆసరా చేసుకుని జైల్లో ఉన్న లారెన్స్ బిష్ణోయ్ అనే గ్యాంగస్టర్ ముఠా బెదిరింపులకు దిగిందని అంటారు. జాతీయ మీడియా అసలు హీరో అనిల్‌ను వదిలేసి లారెన్స్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వడం సరికాదు.




హనుమాన్ గఢ్ జిల్లా శ్రీగంగా నగర్‌కు చెందిన అనిల్ చిన్న నాటి నుంచే జింకల వేటగాళ్ల పట్ల కోపంగా ఉండేవాడు! వారిని పోలీస్‌లకు పట్టించేవాడు, సాక్ష్యం చెప్పి వారికి శిక్షలు పడే విధంగా చూసేవాడు! 30 ఏళ్లుగా ఈ సంరక్షకుడు 10 వేల కృష్ణ జింకలను వేటగాళ్ల ఉచ్చు నుంచి కాపాడాడు! వాటి రక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేశాడు. గత మూడు దశాబ్దాలుగా జింకల రక్షణ కోసం ప్రచారం చేస్తున్నాడు. 50 పంచాయతీలలో కృష్ణ జింకల సహజ ఆవాసాలకు కలిగిన నష్టం, వేటగాళ్ల దుశ్చర్యల గురించి ప్రచార కార్యక్రమం చేపట్టాడు. కృష్ణ జింకలకు నీరు వంటి కనీస వసతులు కల్పించడానికి పూనుకుని... తన గ్రామ ప్రజల నుంచి రెండు లక్షల రూపాయలు చందా పోగు చేశాడు. దానికి తన సొంత డబ్బు కొంత జతచేసి కృష్ణ జింకల అవసరాలను తీర్చడానికి 60కి పైగా చిన్న, మధ్య తరహా నీటి వనరులను ఏర్పాటు చేశాడు. వాటికి గాయాలు అయినపుడు చికిత్స ఏర్పాట్లు కూడా చేశాడు.

1990లో సూరత్ గఢ్‌లో కళాశాల చదువు చదువుతున్న కాలంలోనే అటవీ రక్షణ, వన్య ప్రాణుల రక్షణ మీద జరిగిన ఒక సదస్సులో అనిల్ పాల్గొన్నాడు. 'ఈ సదస్సు నా మనస్సుపై చాలా ప్రభావాన్ని చూపింది' అంటాడు అనిల్! బీఏ. బీఈడీ చదువు పూర్తి కాగానే గ్రామానికి వచ్చి వ్యవసాయం చేయడం మొదలు పెట్టాడు. రాజస్థాన్‌లోని 12 జిల్లాలలో 3,000 మంది వివిధ ఉద్యోగాలు చేసుకునే వారితో కలిసి వన్యప్రాణ రక్షణ మీద, శాంతి ర్యాలీలు, సమావేశాలు పెట్టడం మొదలు పెట్టాడు. ఇప్పటి దాకా వేటగాళ్ల మీద 200లకు పైగా కేసులు నమోదు చేయడం జరిగింది. ఇందులో 30 కేసులు ముగింపు దశకు చేరాయి. కొందరికి జరిమానాలు పడ్డాయి. అనిల్ బిష్ణోయ్ తుంహే సలాం!

– ఎండి. మునీర్
సీనియర్ జర్నలిస్ట్ | 99518 65223

చింత – చింతన

చింత అంటే బాధ, విచారం. ఒకే విషయాన్ని గురించి పదే పదే చింతిస్తూ కూర్చుంటే ఆ దుఃఖం ఎక్కువవుతుందే కాని తగ్గదు. దాని వల్ల అనర్థమే తప్ప మంచి జరగదు. అందుకే జ్ఞానులు ఎప్పుడూ చింతిస్తూ కూర్చోరు. క్రియాశీలురై, మనసును జ్వలించే బాధ అనే అగ్నిని వివేకమనే శక్తితో ఆర్పివేయగలుగుతారు.



జ్యోతిర్మయం

భారత యుద్ధంలో నూరుగురు పుత్రులు గతించారని తెలిసి దుఃఖిస్తున్న ధృతరాష్ట్రునితో విదురుడు, 'మృత్యువు సమీపించినపుడు యముడు పాశం వేసి లాక్కునిపోతాడు. ఎవరినీ వదిలి పెట్టడు. యుద్ధం చేస్తేనే మరణించాలని లేదు. ఇంట్లో కూర్చున్నా సమయం వస్తే మరణించవలసిందే. నీ కుమారులు ఉత్సాహంతో ఆటలా యుద్ధం చేసి స్వర్గానికి వెళ్లారు. తపోదీక్షలో చిరకాలం వున్నవారికి ఏ పుణ్యగతులు కలుగుతాయో యుద్ధంలో వీర మరణం చెందినవారికీ అవే పుణ్యగతులు కలుగుతాయి. కాబట్టి నీ పుత్రుల విషయంలో చింత అనవసరం' అంటాడు. అంతేకాక, విదురుడు 'పండితుడవు, విద్యా సంపన్నుడవు, జ్ఞానివి, ఇలా బాధ పడటం న్యాయం కాదు' అంటాడు ధృతరాష్ట్రునితో.

సమగ్ర జ్ఞానం చింతన తోనే సాధ్యం అవుతుంది. చింతను చింతనతో ఉపశమింప చేసుకోవచ్చు. చింతన అంటే స్మరణ. భగవంతుని స్మరణ వల్ల బాధలు దూరమవుతాయి. వైరాగ్యం ఉదయిస్తుంది. పుట్టిన ప్రతివారినీ మృత్యువు వరిస్తుందనీ, దీనికై చింతించటం వ్యర్థమనే వివేకం చింతన వల్ల కలుగుతుంది. చింతనా పరులను ప్రియా ప్రియ వస్తువులు రెండూ ఏమీ చేయలేవు.

భాగవతంలోని నవ విధ భక్తి మార్గాలలో స్మరణ ఒకటి. భగవంతుని గురించే చింతన చేస్తూ, ఆ ప్రపంచం లోనే భ్రమిస్తూ ఉంటే లౌకికమైన దుఃఖం బాధించదు. అయితే, వేదాంత విషయాలు కేవలం వినటం, చదవటంతో సరిపెట్టకుండా ఆచరణలో పెట్టినప్పుడే, చింతనలో ఏకాగ్రత ఉన్నప్పుడే చింతకు దూరమై చింతనకు దగ్గర కాగలుగుతారు. అయితే ఇంద్రియాలు మనసు కంటె బలవత్తరమైనవని ధృతరాష్ట్రుని విషయంలో వ్యాస, విదురులు చేసిన బోధలు నిష్ఫలమవటం వల్ల తెలుస్తుంది.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

మావోయిస్టుల కట్టడికి సమన్వయంతో పనిచేయాలి



- డీజీపీ జితేందర్

బూర్గంపాడు: మావోయిస్టుల కట్టడికి పొరుగు రాష్ట్రాల పోలీస్ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని డీజీపీ జితేందర్ అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాకలో సోమవారం ఆయన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధి జరగకుండా మావోయిస్టులు అడ్డుపడుతున్నారని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రతాచర్యలు చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణ సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులు, పొరుగు రాష్ట్ర పోలీస్ అధికారులతో సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి, విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ఈ సమావేశంలో ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, మల్టీజోన్ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, భద్రాద్రి, ములుగు, భూపాలపల్లి ఎస్పీలు గ్రే హౌండ్స్ ఎస్పీ పాల్గొన్నారు.

తరచూ తిడుతున్నాడని తండ్రిని నరికేశాడు

- హత్య తర్వాత పరారైన కుమారుడు

మునుగోడు: తరచూ తిడుతున్నాడని తండ్రిని కుమారుడు గొడ్డలితో నరికి చంపాడు. ఈ ఘటన సోమవారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం చొల్లేడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చొల్లేడు గ్రామానికి చెందిన కట్కూరి రామచంద్రం (60)కు నలుగురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఐదుగురికీ వివాహాలు అయ్యాయి. పెద్ద కుమారుడు నర్సింహని రామచంద్రం కొద్దిరోజులుగా చీటికిమాటికి తిడుతుండటంతో పాటు నర్సింహ భార్యపై నిందలు వేయడం మొదలుపెట్టాడు. ఈ విషయమై ఇటీవల కుటుంబ సభ్యులు చర్చించుకుని మరలా తగవు పెట్టుకోవద్దని ఇరువురికీ చెప్పారు. అయినప్పటికీ రామచంద్రం గత రెండు రోజులుగా నర్సింహతో పాటు అతడి భార్యను బూతులు తిడుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. దీంతో ఆగ్రహించిన నర్సింహ సోమవారం ఇంటి ముందు రామచంద్రంను గొడ్డలితో తలపై నరికాడు. తర్వాత అక్కడి నుంచి పరారయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

కాపురంలో ఐదు రూపాయల చిచ్చు

- దంపతుల మధ్య వివాదం
- భార్య పుట్టింటికి వెళ్లడంతో భర్త బలవన్మరణం



సంజీవ్

సుల్తానాబాద్ రూరల్ (పెద్దపల్లి): కేవలం ఐదు రూపాయలు.. వారి కాపురంలో చిచ్చు పెట్టాయి. గొడవకు దారితీసి ఓ నిండు ప్రాణం బలైంది. వాటర్ బాటిల్ కొనుక్కునేందుకు రూ.5 ఇవ్వాలని అడిగిన భర్త క్యాదాసి సంజీవ్ (44).. భార్యతో జరిగిన ఘర్షణ నేపథ్యంలో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం తొగర్రాయిలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై శ్రావణ్ కుమార్ కథనం ప్రకారం.. సంజీవ్, మమత దంపతులు. వీరికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. సంజీవ్ కొంతకాలం జేసీబీ డ్రైవర్‌గా పనిచేసి మానేశాడు. ఖాళీగా ఉంటుండటంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం మద్యం తాగి ఇంటికి వెళ్లాడు. మరోసారి మద్యం తాగేందుకు వాటర్ బాటిల్ కొనుక్కోవడానికి రూ.5 తక్కువై డబ్బులు ఇవ్వాలని భార్యను అడిగాడు. అయితే, తన వద్ద రూ.500 నోటు ఉందని, చిల్లర లేదని ఆమె చెప్పింది. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య గొడవ ముదిరింది. సంజీవ్ ఆమెను కొట్టడంతో ఇద్దరు కూతుళ్లను తీసుకుని మమత పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ ఘటనతో మనస్తాపం చెందిన సంజీవ్.. రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం అతని తల్లి లింగమ్మ ఇంటి తలుపు తట్టి పిలవగా ఎంతకూ స్పందించ లేదు. ఇరుగుపొరుగు వారి సాయంతో తలుపులు పగులకొట్టి చూడగా సంజీవ్ మృతి చెంది కనిపించాడు.



ఆదిలాబాద్ మార్కెట్‌కు భారీగా వచ్చిన పత్తి బండ్లు



ఎనుమాముల మార్కెట్‌కు రైతులు అమ్మకానికి తీసుకొచ్చిన పత్తి

పాత పద్ధతిలోనే పత్తి కొనుగోళ్లు

- దిగొచ్చిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా
- జిన్నింగ్ మిల్లులతో సీఎండీ చర్చలు
- మధ్యాహ్నం నుంచి యథావిధిగా కొనుగోళ్లు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్: పత్తి కొనుగోళ్లు నిలిపేస్తామన్న జిన్నింగ్ మిల్లుల హెచ్చరికలతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) దిగొచ్చింది. సోమవారం ఢిల్లీ నుంచి నగరానికి వచ్చిన సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా, రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్‌కుమార్.. రాష్ట్ర కాటన్ జిన్నింగ్ మిల్లుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, కె.రమేష్ తదితరులతో చర్చలు జరిపారు. నిబంధనలను సడలించే వరకు పత్తి కొనుగోలు చేయబోమని ఈ సందర్భంగా మిల్లర్లు స్పష్టం చేశారు. దీంతో పత్తి కొనుగోళ్లలో కొత్తగా అమలు చేసిన ఎల్–1, ఎల్–2, ఎల్–3 విధానాన్ని నిలిపివేసి, పాత పద్ధతిలోనే ఒకేసారి అన్ని మిల్లుల్లో కొనుగోలుకు అధికారులు అంగీకరించారు. దీంతో తమ నిరసనను విరమించుకుంటున్నట్లు మిల్లుల యాజమాన్యాలు ప్రకటించాయి. మధ్యాహ్నం నుంచి అన్ని జిన్నింగ్ మిల్లుల్లో యథావిధిగా పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి.

ఏమిటీ వివాదం?: పత్తి కొనుగోళ్లలో ఒకేసారి అన్ని మిల్లుల్లో పత్తి కొనుగోలు విధానానికి స్వస్తి పలికి.. ఒక మిల్లు నిండిన తర్వాత మరో మిల్లులో పత్తి కొనుగోలు చేసే విధానాన్ని సీసీఐ కొత్తగా తెరపైకి తీసుకొచ్చింది. దీనిపై జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయ్యింది. మొన్నటి దాకా తేమ అంటూ ఆంక్షలు పెట్టిన సీసీఐ ఇప్పుడు ఎల్–1, ఎల్–2, ఎల్–3 అంటూ కొత్త రకం ఆంక్షలు పెట్టడం వల్ల పత్తి రైతులకు, జిన్నింగ్ మిల్లులకు రవాణా నష్టాలు వస్తున్నాయంటూ మిల్లర్లు ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువకు కోట్ చేసిన మిల్లుల్లో మొదటగా పత్తి కొనుగోలు చేస్తే మిగిలిన మిల్లులకు పత్తి రాదని పేర్కొన్నారు. సోమవారం నుంచి పత్తి కొనుగోళ్ల బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో రంగంలోకి దిగిన సీసీఐ సీఎండీ మిల్లర్లతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించారు. రైతులు తమకు దగ్గరలో వున్న సీసీఐ కొనుగోలు కేంద్రాల వద్ద తమ పత్తి పంటను నేరుగా అమ్ముకోవచ్చని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఒక ప్రకటనలో వెల్లడించారు.

సీసీఐ, జిన్నింగ్ మిల్లుల మధ్య నెలకొన్న వివాదంతో సీసీఐ కేంద్రాల్లో కొనుగోళ్లు మధ్యాహ్నం వరకు నిలిచాయి. ఖమ్మం జిల్లాలోని తొమ్మిది సీసీఐ కేంద్రాల్లో

మధ్యాహ్నం వరకు బంద్

కొనుగోళ్లు నిలిచిపోవడంతో మంత్రి తుమ్మల ఖమ్మం నుంచి హైదరాబాద్‌లోని సీసీఐ ప్రతినిధులతో మాట్లాడారు. ఎట్టకేలకు వివాదం పరిష్కారం కావడంతో మధ్యాహ్నం తర్వాత కొనుగోళ్లు మొదలయ్యాయి. పంట దిగుబడిని విక్రయించేందుకు ఆదిలాబాద్ మార్కెట్‌కు సోమవారం వందల సంఖ్యలో రైతులు తరలిరాగా..మధ్యాహ్నం వరకు కొనుగోళ్లు జరపకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ జాతీయ రహదారిపై పంజాబ్ చౌక్ వద్ద రాస్తారోకో చేపట్టారు. వరంగల్ ఎనుమాముల మార్కెట్‌లో కూడా మధ్యాహ్నం వరకు నిలిచిపోయిన కొనుగోళ్లు ఆ తర్వాత మొదలయ్యాయి.

ఫార్మాపై రైతుల ఫైర్

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించడానికి అధికారులు ఏర్పాటు చేశారు. భూములు తీసుకునే లగచర్లలో కాకుండా రెండు కిలోమీటర్ల దూరంలో దుద్యాల– హకీంపేట మార్గంలో సభ ఏర్పాటు చేశారు. దీన్ని వ్యతిరేకించిన నిర్వాసిత రైతులు.. తమ గ్రామంలోనే సభ నిర్వహించాలని అధికారులను కోరారు. రైతుల పక్షాన ఓ వ్యక్తి గ్రామ సభ వేదిక వద్దకు వచ్చి కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు ఈ విషయాన్ని వివరించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ గ్రామంలోనే సభ నిర్వహిద్దామంటూ లగచర్లకు బయలుదేరారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, 'కడా' ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి కలెక్టర్ వాహనాన్ని అనుసరించారు. అధికారులు లగచర్లకు చేరుకోగానే గ్రామస్తులు భూసేకరణకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆందోళనకారులను సముదాయించడానికి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ ప్రయత్నించారు. కానీ కొందరు గ్రామస్తులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి దిగారు.



కొడంగల్ తహసీల్దార్ కారుపై బండరాయి వేస్తున్న ఆందోళనకారుడు

పోలీసుల వైఫల్యం!

గ్రామసభ కోసమని ఏర్పాటు చేసిన వేదిక వద్ద సుమారు 200 మంది వరకు పోలీసులు విధుల్లో ఉన్నారు. కలెక్టర్, ఇతర అధికారులు లగచర్ల గ్రామానికి వెళ్తున్నప్పుడు వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మినహా పోలీసులెవరూ వెంట వెళ్లలేదు. ఆగ్రహంతో దాడికి దిగిన గ్రామస్తులు, నిర్వాసిత రైతులను అదుపు చేయడం వీలుకాలేదు. నిఘా వ్యవస్థ, పోలీసుల వైఫల్యం కారణంగానే.. ఈ ఘటన జరిగిందనే విమర్శలు వస్తున్నాయి.

అనుకోకుండా జరిగింది.. అందరూ మనవాళ్లే..

లగచర్ల ఘటనను కలెక్టర్ ప్రతీక్ జైన్ అంత సీరియస్‌గా తీసుకోలేదు. ఘటనా స్థలం నుంచి కలెక్టరేట్‌కు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. "వారందరూ మన ప్రజలే, మన రైతులే.. మాట్లాడుదామని మమ్మల్ని పిలిస్తేనే వెళ్లాం.. కొందరు వ్యక్తులు అనుకోకుండా తోసుకుని ముందుకు వచ్చి అలా చేశారు. దయచేసి ఈ ఘటనకు దాడి అనే పదం వాడకండి.." అని కలెక్టర్ పేర్కొన్నారు.

మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్న రైతులు

దుద్యాల మండలంలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, పులిచెర్లతండా, రోటిబండ తండాల్లో మొత్తం 1,358 ఎకరాల భూసేకరణ కోసం ఐదు నెలల క్రితం చర్యలు ప్రారంభించింది. ఇందులో 547 ఎకరాలు అసైన్డ్ భూమి, 90 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉండగా.. 721 ఎకరాల పట్టా భూమి ఉంది. సుమారు 800 రైతులు భూములు కోల్పోనున్నారు. వారంతా పేద రైతులే. చాలా వరకు గిరిజనులే. ఈ భూముల్లో వ్యవసాయం తప్ప వేరే జీవనోపాధి లేదని వారు మొదటి నుంచీ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు భూములు ఇచ్చేందుకు అంగీకరించారని అధికారులు చెప్తున్నా... చాలా మంది వ్యతిరేకిస్తున్నారు. పచ్చని పంట పొలాల్లో విషం చిమ్మే ఫార్మా కంపెనీలను అనుమతించేది లేదంటూ ఆందోళన చేస్తున్నారు.



'కడా' ప్రత్యేకాధికారిపై దాడి చేస్తున్న గ్రామస్తులు

రిలే నిరాహార దీక్షలు చేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం భూసేకరణపై ముందుకు వెళ్తుండటం, ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించడంతో.. జిల్లా అధికారులకు తలనొప్పిగా మారింది. రైతుల ఆగ్రహాన్ని గమనిస్తూనే భూసేకరణ ప్రక్రియ చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే నిర్వాసితులకు ప్రభుత్వం ఇస్తామన్న పరిహారంపైనా ఆందోళన వ్యక్తమవుతోంది. ఎకరం సగటు ధర రూ.30 లక్షలకుపైగా ఉందని రైతులు వాపోతున్నారు. మరోవైపు ప్రభుత్వం రూ.10 లక్షలు, ఇంట్లో ఒకరికి ఉద్యోగం, కోల్పోయే ఒక్కో ఎకరానికి 125 గజాల ప్లాటు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామన్నా.. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో నిర్వాసితుల ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా అధికారులపై దాడి వరకు వెళ్లింది.

రాజకీయ కుట్రతోనే దాడి: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచే అధికారులపై దాడి చేయడం హేయమైన చర్య అని.. దీని వెనుక రాజకీయ కుట్ర ఉందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి మండిపడ్డారు. ఫార్మా కోసం భూసేకరణపై అభిప్రాయ సేకరణ కోసం లగచర్ల గ్రామానికి వెళ్లిన కలెక్టర్, ఇతర అధికారులపై కొందరు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. జిల్లా అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు ఫార్మా కంపెనీలు తీసుకువస్తున్నారన్నారు. పరిశ్రమలు స్థాపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందనే అక్కసుతోనే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు.

త్వరలో డెడికేటెడ్ కమిషన్ క్షేత్రస్థాయి పర్యటనలు

- విజ్ఞాపనలు స్వయంగా స్వీకరించిన చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల నిర్ధారణకు ఏర్పాటైన డెడికేటెడ్ కమిషన్ త్వరలో క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని నిర్ణయించింది. ప్రస్తుతం రెండ్రోజులపాటు కమిషన్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు, విజ్ఞాపనలు, సలహాలు, సూచనలు స్వీకరిస్తోంది. ఇందులో భాగంగా సోమవారం మాసాబ్‌ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమభవన్ నాలుగో అంతస్తులోని డెడికేటెడ్ కమిషన్ కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వినతులు స్వీకరించగా.. మంగళవారం స్వచ్ఛంద సంస్థలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీల నుంచి కూడా వినతుల స్వీకరణ కొనసాగించనుంది. డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన విశ్రాంత ఐఏఎస్ అధికారి బుసాని వెంకటేశ్వరరావు సోమవారం ప్రత్యక్షంగా వినతుల స్వీకరణలో పాల్గొన్నారు స్వీకరించిన వినతులు, విజ్ఞాపనలను క్రోడీకరించనున్నారు. ఆ తర్వాత జిల్లాల వారీగా పర్యటనలు చేపట్టి అధ్యయనం చేయనున్నట్టు కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వరరావు 'సాక్షి'తో అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత కొనసాగిన రాష్ట్ర బీసీ కమిషన్‌లు పలు అంశాలపై అధ్యయనం చేశాయి. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌గా తొలుత బీఎస్.రాములు ఆధ్వర్యంలోని కమిషన్, ఆ తర్వాత వకుళాభరణం కృష్ణమోహన్ కమిషన్‌తోపాటు ప్రస్తుతమున్న జి.నిరంజన్ కమిషన్ కూడా క్షేత్రస్థాయిలో బీసీల స్థితిగతులపైన అధ్యయనం చేశాయి. ఆయా కమిషన్‌లు చేసిన నివేదికలను కూడా పరిగణనలోకి తీసుకుని నివేదిక తయారు చేయాలని డెడికేటెడ్ కమిషన్ భావిస్తోంది.

21 నుంచి శిల్పారామంలో 'లోక్ మంథన్'

- ప్రారంభించనున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

సాక్షి, హైదరాబాద్: భారతీయ జానపద సంస్కృతిని పరిరక్షించడమే లక్ష్యంగా హైదరాబాద్ వేదికగా లోక్ మంథన్ కార్యక్రమం జరగనుంది. ప్రతి రెండేళ్లకోసారి జరిగే ఈ వేడుకలను ఈ సారి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నవంబర్ 21 నుంచి 24 వరకు నగరంలోని శిల్పారామంలో ఈ కార్యక్రమం కొనసాగనుంది. దేశంలోని దాదాపు 2 వేల మంది జానపద కళాకారులు హాజరై తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు రోజూ దాదాపు లక్షన్నర మంది హాజరవుతారని నిర్వాహకులు చెబుతున్నారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఈ వేడుకలను ప్రారంభించనున్నారు. నవంబర్ 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ వేడుకలను తిలకించేందుకు వస్తారని నిర్వాహకులు వెల్లడించారు.

ఉపసంఘం నివేదిక రాగానే రైతుభరోసా

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: రైతుభరోసా అమలుపై ప్రభుత్వం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క నేతృత్వాన నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటికే జిల్లాల వారీగా అభిప్రాయ సేకరణ చేపట్టిందని, ఆ సంఘం నుంచి నివేదిక అందగానే రైతుల ఖాతాల్లో రైతు భరోసా నగదు జమ చేస్తామని రాష్ట్రవ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఖమ్మంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రంలో రూ.2 లక్షలలోపు 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. అలాగే ఈలోపు రుణం తీసుకున్న రైతులు ఇంకా 4 లక్షల పైచిలుకు ఉన్నారని వీరి రూ.2,700 కోట్ల మేర రుణాలను ప్రభుత్వం మాఫీ చేస్తుందన్నారు. ఇక రూ.2 లక్షలకు పైగా రుణం తీసుకున్న వారు 15 లక్షల మంది రైతులు ఉండగా, షెడ్యూల్ ప్రకటించి వీరి రుణాలను మాఫీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. రూ.31 వేల కోట్ల మేర రైతులకు రుణమాఫీ చేస్తామనే హామీని నెరవేరుస్తామని తెలిపారు. గత ప్రభుత్వం 40 లక్షల మంది రైతులకు రైతుబంధు వేయాల్సి ఉండగా.. సగం మందికే వేసిందని, తమ ప్రభుత్వం రైతు పక్షపాతిగా ఉన్నందున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రైతులందరికీ మేలు చేస్తామని తుమ్మల తెలిపారు.

'కాళేశ్వరం' కమిషన్ గడువు పొడిగింపు!

- ప్రతిపాదనలపై సీఎం రేవంత్ సంతకం

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంపై విచారణ చేస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరో రెండు నెలలు పొడిగించింది. గత నెలాఖరుతో కమిషన్ గడువు ముగియగా, పొడిగించాలని కోరుతూ నీటిపారుదల శాఖ పంపిన ప్రతిపాదనలపై ఎట్టకేలకు సీఎం రేవంత్ రెడ్డి సంతకం చేసినట్టు తెలిసింది. ఆ వెంటనే నీటిపారుదల శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. గత మార్చి 14న ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, ఇప్పటికే పలు దఫాలుగా కమిషన్ విచారణ నిర్వహించింది. త్వరలో మూడోవిడత క్రాస్ ఎగ్జామినేషన్‌లో భాగంగా ఈ నెలలో ఐఏఎస్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులను విచారించనుంది. వచ్చే నెలలో గత ప్రభుత్వంలోని కీలక ప్రజాప్రతినిధులకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించి నివేదికను సమర్పించే అవకాశం ఉంది.

పెండింగ్ బిల్లులకోసం రోడ్డెక్కిన మాజీలు

- కలెక్టరేట్ ముట్టడికి మాజీ సర్పంచుల ప్రయత్నం



సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద పోలీసులను తోసుకొని వస్తున్న మాజీ సర్పంచులు

సిరిసిల్ల అర్బన్: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ తాజా, మాజీ సర్పంచులు సోమవారం రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్ ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో గేటు ఎదుట బైఠాయించారు. ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలోనే గేట్ దూకేందుకు వారు యత్నించగా అడ్డుకున్న పోలీసులు వ్యాన్‌లో ఎక్కించుకొని స్టేషన్‌కు తరలించారు. కలెక్టరేట్ ముట్టడితో తాజా, మాజీ సర్పంచుల జేఏసీ అధ్యక్షుడు అక్కెనపల్లి భాస్కర్, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, గౌరవ సలహాదారులు పాల్గొన్నారు.

ముందస్తు ప్రణాళికతోనే దాడి

- లగచర్ల ఘటనపై ఐజీ సత్యనారాయణ వెల్లడి
- ముగ్గురు అధికారులకు బలమైన గాయాలయ్యాయి
- 120 మంది వరకు ఘటనలో పాల్గొన్నారు.. 15 మందిని ఇప్పటికే గుర్తించాం
- మూడు కేసులు నమోదు.. దర్యాప్తు కోసం ముగ్గురు అధికారుల నియామకం
- బాధ్యులను వదిలిపెట్టబోమని వ్యాఖ్య

వికారాబాద్: కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లలో ముందస్తు ప్రణాళిక ప్రకారమే అధికారులపై దాడి చేశారని.. బాధ్యులను వదిలిపెట్టే ప్రసక్తేలేదని ఐజీ సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం రాత్రి ఆయన ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి వికారాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఫార్మాసిటీ ఏర్పాటు విషయంలో రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, కొడంగల్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఇతర రెవెన్యూ ఉద్యోగులు సోమవారం ఉదయం 11 గంటలకు లగచర్లకు వెళ్లారని ఐజీ తెలిపారు. "గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో టెంటు వేసుకుని అధికారులు ఉండగా.. స్థానికుడు బోగమోని సురేశ్ కలెక్టర్ వద్దకు వచ్చి తమ గ్రామంలోకి వచ్చి రైతులతో మాట్లాడాలని కోరాడు. దీనితో కలెక్టర్ బయలుదేరారు. రైతులతో మాట్లాడటానికి పోలీసులు ఎందుకంటూ.. వెంటరాబోయిన పోలీసులను వారించి, అదనపు కలెక్టర్, కడా చైర్మన్‌లను తీసుకుని వెళ్లారు. కలెక్టర్ గన్‌మన్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి మాత్రమే అధికారుల వెంట వచ్చారు. కలెక్టర్ వెళ్లి రైతులతో మాట్లాడుతుండగా.. కొందరు వ్యక్తులు నినాదాలు చేస్తూ దూసుకువచ్చారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, కడా చైర్మన్ వెంకట్‌రెడ్డిలపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కూడా తోసేశారు.." అని ఐజీ పేర్కొన్నారు. దాడిలో లింగ్యానాయక్, వెంకట్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిలకు బలమైన గాయాలు అయ్యాయని, వారిని మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రికి తరలించామని తెలిపారు. దాడి ఘటనలో 120 మంది వరకు పాల్గొన్నట్టు భావిస్తున్నామని.. కీలకంగా వ్యవహరించిన 15 మందిని ఇప్పటికే గుర్తించామని చెప్పారు. కొందరు దాడికి ప్రేరేపించినట్టు, ముందస్తు ప్లాన్ ప్రకారమే ఘటన జరిగినట్టు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఘటనపై మూడు కేసులు నమోదు చేశామని, దర్యాప్తుకోసం ముగ్గురు అధికారులను నియమించామని చెప్పారు. బాధ్యులను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు.

అధికారులపై దాడి హేయం: ఉద్యోగ సంఘాలు

సాక్షి, హైదరాబాద్: లగచర్ల ఘటనలో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఇతర అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ప్రకటించింది. అధికారులపై దాడి హేయమని.. దీనికి ఉసిగొల్పిన, పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. తమ విధి నిర్వహణ కోసం వచ్చిన అధికారులపై హింసాత్మకంగా దాడి చేయడం సరికాదని.. సమస్యలు ఉంటే శాంతియుతంగా ఆందోళన చేసుకోవాలని తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కె.రాములు, రాష్ట్ర అధ్యక్షుడు సాల్మన్ నాయక్, కార్యదర్శి తిరుపతి నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వికారాబాద్ కలెక్టర్‌పై దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు చేపట్టాలని.. లేకుంటే అధికారుల మనోధైర్యం దెబ్బతింటుందని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సంఘం (టీపీఎస్‌ఏ) అధ్యక్షుడు పి.మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ.శ్రీనివాస్ పేర్కొన్నారు.



వికారాబాద్‌లో ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ సత్యనారాయణ

సీజేఐగా జస్టిస్ ఖన్నా బాధ్యతల స్వీకరణ

సుప్రీంకోర్టు 51వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం

రాష్ట్రపతి భవన్‌లో ముర్ము చేతుల మీదుగా కార్యక్రమం

- ఉపరాష్ట్రపతి, ప్రధాని, మాజీ సీజేఐలు తదితరుల హాజరు
- మే 13 దాకా సీజేఐగా కొనసాగనున్న జస్టిస్ ఖన్నా


ప్రమాణ స్వీకారం అనంతరం సీజేఐగా బాధ్యతలు స్వీకరిస్తున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా

సాక్షి, న్యూఢిల్లీ: భారత సర్వోన్నత న్యాయస్థానం 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణం చేశారు. సోమవారం ఉదయం రాష్ట్రపతి భవన్‌లోని గణతంత్ర మండపంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. ఆంగ్లంలో దైవసాక్షిగా ఆయన పదవీ స్వీకార ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, మాజీ సీజేఐలు జస్టిస్ జె.ఎస్.ఖేహర్, జస్టిస్ ఎన్.వి. రమణ, జస్టిస్ డీవై చంద్రచూడ్, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారంతా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మోదీ ఈ మేరకు ఎక్స్‌లో కూడా పోస్టు చేశారు. సీజేఐగా ఆదివారం రిటైరైన జస్టిస్ చంద్రచూడ్ స్థానంలో జస్టిస్ ఖన్నా బాధ్యతలు స్వీకరించారు. ఆయన 183 రోజుల పాటు పదవిలో కొనసాగుతారు. 2025 మే 13న పదవీ విరమణ చేస్తారు. అయితే కృష్ణమీనన్ మార్గ్‌లోని సీజేఐ అధికారిక నివాసంలోకి మారకూడదని జస్టిస్ ఖన్నా నిర్ణయించుకున్నారు. పదవీ కాలం తక్కువగా ఉండడంతో ప్రస్తుత నివాసంలోనే కొనసాగనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.


జస్టిస్ ఖన్నాకు శుభాకాంక్షలు తెలుపుతున్న జస్టిస్ చంద్రచూడ్

కీలక తీర్పుల్లో భాగస్వామి

జస్టిస్ ఖన్నా 1960 మే 14న న్యాయమూర్తుల కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి దేవ్ రాజ్ ఖన్నా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా చేశారు. ఇక సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రాథమిక హక్కులపై ఆయన పెదనాన్న జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా ఇచ్చిన తీర్పు భారత న్యాయ చరిత్రలోనే మైలురాయిగా నిలిచిపోయింది! తండ్రి తనను అకౌంటెంట్‌గా చూడాలనుకున్నా జస్టిస్ ఖన్నా న్యాయవాద వృత్తికేసి మొగ్గుచూపేందుకు పెదనాన్న స్ఫూర్తే కారణమంటారు. ఆయన 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సేవలందిస్తున్నారు. ఈ ఆరేళ్లలో 117 తీర్పులిచ్చారు. 456 తీర్పుల్లో సభ్యుడిగా భాగస్వాములయ్యారు.

తొలి రోజే 45 కేసుల విచారణ!

సీజేఐగా తొలి రోజే జస్టిస్ ఖన్నా 45 కేసులను విచారించారు. న్యాయాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రాధాన్యమిస్తానని జస్టిస్ ఖన్నా పేర్కొన్నారు. దేశ న్యాయ వ్యవస్థకు సారథ్యం వహించే అవకాశం దక్కడాన్ని గొప్ప గౌరవంగా భావిస్తున్నట్టు చెప్పారు. ''న్యాయ వ్యవస్థ పాలన యంత్రాంగంలో అంతర్భాగమే. అయినా అది స్వతంత్ర వ్యవస్థ. రాజ్యాంగానికి కాపలాదారుగా, ప్రాథమిక హక్కుల పరిరక్షకురాలిగా న్యాయ వ్యవస్థ తన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించేలా చూసేందుకు కృషి చేస్తా'' అని తెలిపారు. న్యాయ వ్యవస్థ పలు సవాళ్లను ఎదుర్కొంటోందన్నారు.

పెదనాన్నకు ఇందిర నిరాకరించిన పీఠంపై...

అది 1976. ఎమర్జెన్సీ రోజులు. సుప్రీంకోర్టు సీనియర్ మోస్ట్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ హన్స్‌రాజ్ ఖన్నా హరిద్వార్‌లో గంగా తీరాన సోదరితో కలిసి సేదదీరుతున్నారు. ''నేనో తీర్పు ఇవ్వబోతున్నా. దాని వల్ల బహుశా నాకు సీజేఐ పదవి చేజారవచ్చు'' అని ఆమెతో అన్నారు. సరిగ్గా అలాగే జరిగింది. ప్రధాని ఇందిరాగాంధీ సిఫార్సు మేరకు పౌరుల ప్రాథమిక హక్కులను సస్పెండ్ చేస్తూ నాటి రాష్ట్రపతి ఫక్రుద్దీన్ అలీ అహ్మద్ ఉత్తర్వులిచ్చారు. వాటిని పలు రాష్ట్రాల హైకోర్టులు కొట్టేశాయి. ఆ తీర్పులను ఇందిర సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అది పౌరుల హక్కులకు సంబంధించి కీలక ప్రశ్నలు లేవనెత్తిన ఏడీఎం జబల్‌పూర్ వర్సెస్ శివకాంత్ శుక్లా కేసుగా చరిత్రలో నిలిచిపోయింది. రాష్ట్రపతి ఉత్తర్వులను సమర్థిస్తూ సీజేఐ ఏఎన్ రే సారథ్యంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 4-1 మెజారిటీతో తీర్పు వెలువరించింది. జస్టిస్ ఖన్నా ఒక్కరే దానితో విభేదించారు. ఎమర్జెన్సీ కాలంలోనైనా సరే, ప్రాథమిక హక్కులను నిషేధించే అధికారం కేంద్రానికి లేదంటూ మైనారిటీ తీర్పు వెలువరించారు. ఇది భారత న్యాయ చరిత్రలోనే మైలురాయిగా నిలిచిపోయింది. ప్రాథమిక హక్కుల ప్రస్తావన వచ్చినప్పుడల్లా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు ఈ తీర్పును అనివార్యంగా ఉటంకిస్తారు. అప్పట్లో విదేశీ మీడియా కూడా జస్టిస్ ఖన్నా తీర్పును ఎంతగానో కొనియాడింది. అత్యంత నిర్భీతితో కూడిన తీర్పులిచ్చిన భారత న్యాయమూర్తుల్లో అగ్రగణ్యులుగా జస్టిస్ ఖన్నా నిలిచిపోయారు. దీనిపై ఆగ్రహించిన నాటి ప్రధాని ఇందిరాగాంధీ సీనియర్ మోస్ట్ న్యాయమూర్తి అయిన ఆయన్ను కాదని జస్టిస్ హమీదుల్లా బేగ్‌ను 15వ సీజేఐగా ఎంపిక చేశారంటారు. అందుకు నిరసనగా అదే రోజున న్యాయమూర్తి పదవికి రాజీనామా చేసిన అరుదైన వ్యక్తిత్వం జస్టిస్ ఖన్నాది. అలా 48 ఏళ్ల క్రితం చేజారిన అత్యున్నత న్యాయ పీఠం తాజాగా ఆయన కుమారుని వరసయ్యే జస్టిస్ సంజీవ్ ఖన్నాకు దక్కింది. ఈ ఉదంతంపై చర్చోపచర్చలతో సోషల్ మీడియా హోరెత్తిపోతోంది. దీన్ని ప్రకృతి చేసిన న్యాయంగా నెటిజన్లు అభివర్ణిస్తున్నారు. జబల్‌పూర్ కేసులో మెజారిటీ తీర్పు వెలువరించిన నలుగురు న్యాయమూర్తుల్లో తాజా మాజీ సీజేఐ డి.వై.చంద్రచూడ్ తండ్రి జస్టిస్ వై.వి.చంద్రచూడ్ కూడా ఉండటం విశేషం. ఆయన జస్టిస్ బేగ్ అనంతరం 16వ సీజేఐ అయ్యారు. ఇక జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా ఎమర్జెన్సీ అనంతరం లా కమిషన్ చైర్మన్‌గా సేవలందించారు. అనంతరం చరణ్‌సింగ్ మంత్రివర్గంలో కేంద్ర న్యాయ మంత్రిగా నియమితులైనా మూడు రోజులకే రాజీనామా చేశారు. 1982లో విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా రాష్ట్రపతి పదవికి పోటీ చేసి జైల్‌సింగ్ చేతిలో ఓడిపోయారు.

పెదనాన్న కోర్టు గదిలోనే...

జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా న్యాయమూర్తిగా తీర్పులు వెలువరించిన సుప్రీంకోర్టులోని రెండో నంబర్ గదిలో ఆయన నిలువెత్తు చిత్రపటం ఇప్పటికీ సమున్నతంగా వేలాడుతూ ఉంటుంది. సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా కూడా సీజేఐగా తన తొలి రోజు కేసుల విచారణను అదే గదిలో చేపట్టడం విశేషం. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఆయన కెరీర్ మొదలైంది కూడా ఇదే కోర్టు గదిలో! సీజేఐగా ఆయన పదవీకాలం ఫలవంతంగా సాగాలని మాజీ అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గీ తదితర న్యాయవాదులు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. విచారణకు కేసుల సీక్వెన్సింగ్‌కు సంబంధించిన అంశాన్ని సుప్రీంకోర్టు బార్ నేత ఒకరు లేవనెత్తగా ఆ అంశం తన దృష్టిలో ఉందని, దాన్ని పరిశీలిస్తానని పేర్కొన్నారు. లెటర్ ఆఫ్ సర్క్యులేషన్ ద్వారా కూడా వాయిదాలు కోరే విధానాన్ని పునరుద్ధరించాలన్న ఒక లాయర్ విజ్ఞప్తిని కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్టు నూతన సీజేఐ పేర్కొన్నారు.

పూర్వీకుల ఇంటికోసం అన్వేషణ

జస్టిస్ సంజీవ్ ఖన్నా తన పూర్వీకుల ఇంటికోసం చిరకాలంగా అన్వేషిస్తున్నారు! ఆయన తాతయ్య సరవ్‌దయాల్ బ్రిటిష్ ఇండియాలో లాయర్‌గా చేశారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జలియన్‌వాలాబాగ్ సమీపంలోని కట్రా షేర్‌సింగ్ ప్రాంతంలో ఓ ఇంటిని కొనుగోలు చేశారట. జస్టిస్ ఖన్నా ఐదేళ్ల వయసులో తండ్రితో కలిసి ఆ ఇంటికి వెళ్లారు. తాతయ్య మరణానంతరం 50 ఏళ్ల కింద ఆ ఇంటిని అమ్మేశారట. ఇన్నేళ్లలో కొత్త నిర్మాణాలు తదితరాలతో ఆ ప్రాంతం రూపురేఖలు గుర్తు పట్టలేనంతగా మారిపోయాయి. కానీ ఆ ఇంటి తాలూకు తన చిన్ననాటి జ్ఞాపకాలు జస్టిస్ ఖన్నా మదిలో అలాగే ఉండిపోయాయి. అందుకే దాన్ని వెతకడానికి జస్టిస్ ఖన్నా ఇప్పటికీ ప్రయత్నిస్తూనే ఉంటారట. అమృత్‌సర్ వెళ్లినప్పుడల్లా విధిగా కట్రా షేర్‌సింగ్ ప్రాంతానికి వెళ్తారని ఆయన సన్నిహితులు తెలిపారు. వేసవి సెలవుల్లో తాతయ్యతో గడిపిన జ్ఞాపకాలను కూడా జస్టిస్ ఖన్నా ఇప్పటికీ నెమరేసుకుంటూ ఉంటారు.

చివరి వారాల్లో అధ్యక్ష పీఠంపై కమల?

బైడెన్ గద్దె దిగి ఆమెకు బాధ్యతలు ఇవ్వాలంటూ వెల్లువెత్తుతున్న డిమాండ్లు



వాషింగ్టన్: అధ్యక్ష ఎన్నికల హోరాహోరీ పోరులో కాస్తంత వెనకబడి తొలి మహిళా దేశాధినేతగా అధ్యక్షపీఠంపై కూర్చునే సువర్ణావకాశాన్ని పోగొట్టుకున్న డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్‌ను గద్దెనెక్కించాలని గట్టిగానే డిమాండ్లు వినిపిస్తున్నాయి. వివాదాలకు కేంద్రబిందువైన ట్రంప్ స్థానికత సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి అంతర్జాతీయ దౌత్యనీతిని పక్కకునెట్టి, దిగజారుడు వ్యక్తిగత దూషణలకు దిగి ఎలాగోలా పాపులర్ ఓటును ఒడిసిపట్టారన్న విమర్శల వేళ అగ్రరాజ్యంలో కొత్తరకం డిమాండ్ తెరమీదకొచ్చింది. చిట్టచివర్లో రేసులోకి దిగి, ఎన్నికల్లో చివరిదాకా పోరాడి అద్భుత పోరాటస్ఫూర్తిని ప్రదర్శించిన కమలాహారిస్‌కు చివరివారాల్లో అయినా అధ్యక్ష పట్టాభిషేకం చేయాలని చాలా మంది డెమొక్రాట్లు కోరుకుంటున్నారు. అయితే ఇదేతరహా డిమాండ్లకు తలొగ్గి అధ్యక్ష రేసు నుంచి అనూహ్యంగా తప్పుకున్న బైడెన్ ఈసారి ఏకంగా అధ్యక్ష పదవినే త్యాగం చేస్తారా? ఒకవేళ త్యజించినా హారిస్ అధ్యక్షపీఠమెక్కడం నైతికంగా ఎంత వరకు సబబు? అనే పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. '' బైడెన్ అద్భుతమైన నేత. ప్రజల ఎన్నో కోరికలను ఆయన నెరవేర్చారు. ఈ ఒక్క విన్నపాన్నీ ఆయన మన్నించాలి. అధికార మార్పిడికి ఒప్పుకుని హారిస్‌కు అవకాశం ఇవ్వాలి. ట్రంప్ రెండోసారి అధికారం చేపట్టడానికంటే ముందే హారిస్ ఈ చివరి వారాలు అధికారంలో ఉంటే నైతిక విజయం కమలదే అనే బలమైన వాదనను వినిపించినవాళ్లమవుతాం. తదుపరి అధ్యక్ష ఎన్నికల్లో ఆమె విజయావకాశాలూ మెరుగవుతాయి. చివరి రోజుల్లో బైడెన్ చేయగల గొప్పపని అంటూ ఏదైనా ఉందంటే అది ఇదే'' అని కమలాహారిస్ కమ్యూనికేషన్స్ విభాగ మాజీ డైరెక్టర్ జమాల్ సైమన్స్ ఆదివారం విజ్ఞప్తిచేశారు. '' దేశవ్యాప్తంగా ట్రంప్‌తో పోలిస్తే కేవలం 36 లక్షల ఓట్లు మాత్రమే హారిస్‌కు తక్కువ వచ్చాయి. కోట్లాది మంది హారిస్‌ను అధ్యక్షపీఠంపై చూడాలనుకున్నారు. బైడెన్ దిగిపోయి హారిస్‌కు అవకాశమిస్తే వారి కల నెరవేరుతుంది. అమెరికా సైతం తొలి అధ్యక్షురాలిని చూస్తుంది'' అని మరో డెమొక్రటిక్ నేత, నటుడు ఆండీ ఓస్ట్రీ అన్నారు.

ట్రంప్‌తో ముఖాముఖి డిబేట్‌కు ముందువరకు బైడెనే డెమొక్రటిక్ అభ్యర్థి. డిబేట్‌లో పేలవ ప్రదర్శన తర్వాత అత్యున్నతస్థాయి డెమొక్రటిక్ నేతలు అప్రమత్తమయ్యారు. వెంటనే బైడెన్‌ను రేస్ నుంచి తప్పించారు. కమలను బరిలో నిలిపారు. ఈసారి కూడా టాప్ డెమొక్రాట్ల లాబీయింగ్ పనిచేస్తుందో లేదో ఎవరికీ తెలీదు. అసలు ఈ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయా లేవా అనే వార్తపై కూడా అంతర్జాతీయ మీడియాకు లీకులు రావడం లేదు.

25వ సవరణ ఏం చెప్తోంది?

అమెరికా రాజ్యాంగం ప్రకారం చూస్తే కమల ప్రెసిడెంట్ కావడం సాధ్యమే. రాజ్యాంగంలోని 25వ సవరణలోని ఒకటో సెక్షన్ ప్రకారం అధ్యక్షుడిని ఆ పదవి నుంచి తొలగించినా, అధ్యక్షుడు రాజీనామా చేసినా, లేదంటే చనిపోయినా అప్పటి ఉపాధ్యక్ష స్థానంలో ఉన్నవారే అధ్యక్షులవుతారు. ప్రస్తుతం కమల ఉపాధ్యక్షురాలు కాబట్టి ఒకవేళ బైడెన్ రాజీనామా చేసి తప్పుకుంటే సహజంగానే కమలకు అధ్యక్షపగ్గాలు చేతికొస్తాయి. అయితే ఇలా ఉద్దేశపూర్వకంగా చేయడం అనైతికమవుతుందని రిపబ్లికన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. '' ఈ దుశ్చర్య ఏకంగా అధ్యక్షుడికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర'' అని కాబోయే అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు. కమల ఎందుకు అధ్యక్ష పదవికి అనర్హురాలో మరికొందరు భాష్యం చెబుతున్నారు. ఒక రాష్ట్రంలో అత్యధిక ఎలక్టోరల్ ఓట్లు గెలిస్తే ఆ రాష్ట్రంలోని ఓట్లన్నీ ఒక్క అభ్యర్థికే ధారాదత్తం అవుతాయి. ఈ విధానం కారణంగానే 2016 ఎన్నికల్లో ట్రంప్ గెలిచారు. ఆ ఎన్నికల్లో హిల్లరీక్లింటర్‌ను దేశవ్యాప్తంగా అత్యధిక ఓట్లు వచ్చాయి. అంటే పాపులర్ ఓటు సాధించారు. కానీ ఎలక్టోరల్ ఓట్లలో మెజారిటీ సాధించలేకపోయారు. ఈసారి ఎన్నికల్లో కనీసం పాపులర్ ఓటు సాధించిఉంటే కమలకు నైతిక అర్హత ఉండేదేమోనని కొందరు అభిప్రాయపడ్డారు. ఈసారి ఎన్నికల్లో ట్రంప్ పాపులర్ ఓటుతోపాటు అత్యధిక ఎలక్టోరల్ ఓట్లనూ సాధించడం విశేషం. ఏదేమైనా పార్టీ తరఫున అభ్యర్థిత్వ రేసు నుంచి అనూహ్యంగా తప్పుకున్న బైడెన్ ఈసారి శ్వేతసౌధం నుంచి కూడా అర్ధంతరంగా బయటికొస్తారేమోనని కమల అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

కొలీజియం సభ్యునిగా జస్టిస్ అభయ్ ఓకా

న్యూఢిల్లీ: ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియంలో న్యాయమూర్తి జస్టిస్ అభయ్ ఎస్.ఓకాకు స్థానం దక్కింది. జస్టిస్ డి.వై.చంద్రచూడ్ రిటైర్ కావడంతో ఏర్పడిన ఖాళీలో ఆయన నియమితులయ్యారు. నూతన సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులను ఎంపిక చేసే ఐదుగురు సభ్యుల కొలీజియంలో ప్రస్తుతం సీజేఐ ఖన్నాతో పాటు న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ హృషీకేశ్ రాయ్ ఉన్నారు. హైకోర్టు న్యాయమూర్తులను ఎంపిక చేసే ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియంలో సీజేఐతో పాటు జస్టిస్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ సభ్యులు.

సమాజాన్ని విభజించాలని చూస్తున్నారు

అహ్మదాబాద్: భారత సమాజాన్ని విభజించి ముక్కలుచెక్కలు చేయడానికి జాతివ్యతిరేక శక్తులు కుట్రలు పన్నుతున్నాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. కులగణన పేరిట దేశంలోని భిన్న కులస్తుల మధ్య విపక్షాల 'ఇండియా' కూటమి చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందని బీజేపీ విమర్శల వేళ మోదీ పరోక్షంగా ఆ అంశాన్ని ప్రస్తావించడం గమనార్హం. సోమవారం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో శ్రీ స్వామి నారాయణ్ ఆలయం 200వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఖేడా జిల్లాలోని వడ్తాల్‌లో జరిగిన కార్యక్రమంలో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు.

అభివృద్ధిభారత్‌కు ఐక్యతే పునాది

''ఐక్యమత్యంతో పనిచేసే పౌరులు, దేశ సమగ్రతతోనే భారత్ 2047 సంవత్సరంలో అభివృద్ధి చెందిన ఆధునిక భారత్‌గా అవతరించగలదు. దురదృష్టవశాత్తు కొందరు సమాజాన్ని కులం, మతం, ప్రాంతం,జాతి, లింగం, స్వస్థలం పేరిట విభజిస్తున్నారు. సంకుచిత మనస్తత్వంతో కొన్ని విభజన శక్తులు చేస్తున్న జాతవ్యతిరేక కుట్ర లివి. ఈ జాతివ్యతిరేక శక్తుల ఉద్దేశాలు ఎంత ప్రమాద కరమో మనం గమనించాలి. కుట్రల పర్యావసానాలను ఊహించాలి. ఈ దుష్టశక్తుల ఆటకట్టించేందుకు మనందరం ఐక్యంగా నిలబడదాం. పోరాడి వాటిని ఓడిద్దాం'' అని అన్నారు. ఆత్మనిర్భరత మంత్రంతో ముందుకుసాగి అభివృద్ధిభారత్‌ను సాక్షాత్కారం చేసుకుందాం'' అని పిలుపునిచ్చారు.



ఆలయంతో ఆత్మీయ అనుబంధం

''నాటి దుర్భర పరిస్థితులకు ప్రజలు తమను తామే నిందించుకుంటూ కడుపేదరికంలో, బానిసత్వంలో బతుకీడుస్తున్న కాలంలో స్వామినారాయణ అవతరించారు. ఆపత్కాలంలో స్వామినారాయణ, సాధువులు భారతీయులకు తమ కర్తవ్యబోధ చేసి ఆత్మగౌరవం గొప్పతనాన్ని తెలియజెప్పారు. దీంతో నూతన ఆధ్యాత్మిక శక్తితో ప్రజలు తమ అసలైన గుర్తింపును తెల్సుకోగలిగారు. వడ్తాల్ స్వామి నారాయణ్ ఆలయంతో నాకు దశాబ్దాల అనుబంధం ఉంది. ముఖ్యమంత్రిని అయ్యాక బంధం బలపడింది. 200 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కేంద్రప్రభుత్వం సైతం స్మారక నాణెంను ఆవిష్కరించింది'' అని గుర్తుచేశారు.

16, 17 తేదీల్లో అయోధ్య రామాలయంపై దాడి

ఖలిస్తాన్ ఉగ్రవాది పన్నూ హెచ్చరికలు

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామాలయం సహా పలు ఆలయాలపై ఈ నెల 16, 17వ తేదీల్లో దాడులు చేస్తామని ఖలిస్తానీ ఉగ్రవాది గురు పత్వంత్ సింగ్ పన్నూ హెచ్చరించాడు. నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే)సంస్థ పేరిట పన్ను ఒక వీడియో విడుదల చేశాడు. కెనడాలోని బ్రాంప్టన్‌లో రికార్డు చేసినట్లుగా ఉన్న ఆ వీడియోలో హిందూ ప్రార్థనాస్థలాలపై దాడులను ప్రేరేపిస్తున్నట్లుగా ఉంది. అయోధ్య రామాలయంలో ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ పూజలు చేస్తున్న దృశ్యాలున్నాయి. హిందూ ఆలయాలపై ఖలిస్తానీల దాడులకు దూరంగా ఉండాలని భారతీయులకు అతడు హెచ్చరికలు చేశాడు. భారత్‌లో మత సామరస్యానికి భంగం కలిగించేలా ఇటీవలి కాలంలో పన్ను పలు వ్యాఖ్యలు చేయడం తెలిసిందే.



ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఎలా ఆపుదాం!

- ఫోన్‌లో మాట్లాడుకున్న ట్రంప్, పుతిన్
- అమెరికా మీడియా కథనం
- అలాంటిదేమీ లేదన్న రష్యా

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఫోన్‌లో మాట్లాడుకున్నారని, ఇద్దరూ ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ఆపడం సహా పలు కీలక అంశాలపై చర్చించారని వాషింగ్టన్ పోస్ట్ ఓ కథనంలో పేర్కొంది. యూరప్‌లో శాంతి సాధన లక్ష్యమై మాట్లాడుకున్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి త్వరలో పరిష్కారం కనుగొనే అంశంపై పుతిన్‌తో మరోసారి మాట్లాడేందుకు ట్రంప్ ఆసక్తి కనబరిచినట్లు విశ్వసనీయంగా తెలిసినట్లు ఆదివారం నాటి ఆ ప్రత్యేక కథనం వివరించింది. ఫ్లోరిడాలోని తన రిసార్ట్ నుంచి ట్రంప్ మాట్లాడినట్లు తెలిపింది. ఉక్రెయిన్‌పై దాడులను మరింత తీవ్రతరం చేయవద్దని, యూరప్‌లో అమెరికా సైన్యం గణనీయమైన సంఖ్యలో ఉన్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని ట్రంప్ చెప్పారని ఓ మాజీ అధికారి తమకు వెల్లడించినట్లు అందులో తెలిపింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడులు తీవ్ర తరమైతే తనకు కొత్త సమస్యలు ఎదురవుతాయని ట్రంప్ చెప్పినట్లు వాషింగ్టన్ పోస్ట్‌కథనం పేర్కొంది. ట్రంప్, పుతిన్‌ల ఫోన్ సంభాషణ విషయం ఉక్రెయిన్‌కు కూడా తెలుసునని వెల్లడించింది. అయితే, పుతిన్, ట్రంప్‌లు ఫోన్‌లో సంభాషించుకున్నట్లు వచ్చిన వార్తలను రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పెష్కోవ్ ఖండించారు. 'వాళ్లిద్దరు మాట్లాడుకున్నారన్నది పూర్తిగా అబద్ధం. కేవలం కల్పితం'అని స్పష్టం చేశారు. పుతిన్‌తోపాటు ఇతర నేతలతో ట్రంప్ జరిపిన ప్రైవేట్ సంభాషణ లపై స్పందించేందుకు ట్రంప్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవెన్ చ్యుంగ్ నిరాకరించారు. ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ట్రంప్ ఇప్పటి దాకా 70మందికి పైగా ప్రపంచ నేతలతో సంభాషించారు.

కాలుష్యాన్ని ఏ మతమూ ప్రోత్సహించదు

- ఏడాదంతా నిషేధం విధించాలా వద్దా అనే అంశాన్ని తేల్చండి
- ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: కాలుష్యాన్ని సృష్టించే ఏ రకమైన కార్యకలాపాలనూ ఏ మతమూ ప్రోత్సహించబోదని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఏడాదంతా బాణసంచాను ఢిల్లీ పరిధిలో నిషేధించాలా వద్దా అనే అంశంపై 15 రోజుల్లోపు వివరణ ఇవ్వాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. ఢిల్లీలో బాణసంచా తయారీ, విక్రయాలపై నిషేధం అమల్లో ఉన్నాసరే దీపావళి వేళ ఢిల్లీ వ్యాప్తంగా విపరీతంగా బాణసంచా కాల్చడంతో సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. సంబంధిత కేసును సోమవారం సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మాసిహ్‌ల ధర్మాసనం విచారించింది. ''కాలుష్యరహిత వాతావరణంలో జీవించడం అనేది ప్రతి ఒక్క పౌరుడి ప్రాథమిక హక్కు. దీనిని రాజ్యాంగంలోని 21వ ఆర్టికల్ రక్షణ కల్పిస్తోంది. కాలుష్యకారక ఏ పనినీ ఏ మతమూ ప్రోత్సహించదు. సరదాగా బాణసంచా కాల్చినాసరే తోటి పౌరుల ఆరోగ్యకర జీవన హక్కుకు భంగం వాటిల్లినట్లే'' అని వ్యాఖ్యానించింది. సంవత్సరం పొడవునా ఢిల్లీలో బాణసంచాపై నిషేధం అంశంపై ప్రభుత్వానికి కోర్టు సూచన చేసింది. '' సంబంధిత అన్ని వర్గాలతో సంప్రతింపులు జరపండి. ఆ తర్వాత నవంబర్ 25వ తేదీలోపు మీ నిర్ణయాన్ని తెలియజేయండి'' అని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీ రాష్ట్రాల్లోనూ బాణసంచా తయారీ, నిల్వ, అమ్మకాలు, వినియోగంపై నిషేధం విధించడంపై స్పందన తెలియజేయాలని ఢిల్లీ పొరుగు రాష్ట్రాలనూ కోర్టు కోరింది.

ఢిల్లీ పోలీసులకు చీవాట్లు

నిషేధం ఉన్నాసరే ఊపిరాడనంతగా బాణసంచా కాల్చుతుంటే చూస్తూ ఊరుకున్నారని ఢిల్లీ పోలీసులపై కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. '' నిషేధించాలంటూ గతంలో మేం ఇచ్చిన ఆదేశాలను ఢిల్లీ పోలీసులు బేఖాతరు చేశారని స్పష్టమైంది. గతంలో బాణసంచా తయారీ, నిల్వ, అమ్మకం అనుమతులు తీసుకున్న సంస్థలకు మా ఉత్తర్వుల కాపీలు అందినట్లు కనిపించట్లేదు. మొదట ఢిల్లీ పోలీసులు చేయాల్సిన పని లైసెన్స్‌దారులు టపాకాయలు విక్రయించకుండా అడ్డుకోవాలి. అమ్మకాలను ఆపేశారని, నిషేధం అమల్లోకి వచ్చిందని, ఆన్‌లైన్ వేదికలపై విక్రయాలు, డెలివరీ సౌకర్యాలను స్తంభింపజేసేలా సంబంధిత వర్గాలకు ఢిల్లీ పోలీసు కమిషనర్ తక్షణం సమాచారం ఇవ్వాలి. ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయండి. క్షేత్రస్థాయిలో నిషేధాన్ని అమలు చేయాల్సిన బాధ్యత స్థానిక పోలీస్‌స్టేషన్‌లదే. అక్టోబర్ 14వ తేదీదాకా మా ఉత్తర్వులు ఎవరికీ అందకుండా ఢిల్లీ ప్రభుత్వం చేసిన ఆలస్యం చూస్తుంటే మాకే ఆశ్చర్యంవేస్తోంది'' అని కోర్టు వ్యాఖ్యానించింది.

సాకులు చెప్పిన పోలీసులు

దీనిపై ఢిల్లీ పోలీసులు తప్పును ఆప్ సర్కార్‌పై నెట్టే ప్రయత్నంచేశారు. ఢిల్లీపోలీసుల తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటీ వాదించారు. '' మాకు ఉత్తర్వులు రాలేదు. దసరా అయిపోయిన రెండ్రోజుల తర్వాత ఆప్ సర్కార్ ఆదేశాలు జారీచేసింది. ఆదేశాలు వచ్చాకే మేం నిషేధం అమలుకు ప్రయత్నించాం'' అని భాటీ అన్నారు. దీపావళి, ఆ తర్వాతి రోజు ఢిల్లీలో వా యునాణ్యత దారుణంగా పడిపోవడంతో సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. ఆదేశాలు అమలుకాకపోవడంపై కోర్టు ధిక్కరణగా భావించింది.

వలసల నియంత్రణాధికారిగా టామ్ హోమన్

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ ప్రకటన




న్యూయార్క్: అమెరికా వలసల నియంత్రణ అధికారిగా యూఎస్ ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మాజీ డైరెక్టర్ టామ్ హోమన్‌ను నియమిస్తున్నట్లు అధ్యక్ష పదవికి ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దేశం నుంచి అక్రమ వలసదారులను వెళ్లగొడతానన్న ఎన్నికల హామీకి అనుగుణంగా ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 'వలసల నియంత్రణ విషయంలో నిక్కచ్చిగా వ్యవహరించే టామ్ హోమన్‌ను మన దేశ సరిహద్దులకు ఇన్‌చార్జిగా నియమిస్తున్నానని తెలిపేందుకు సంతోషిస్తున్నా'అంటూ ట్రంప్ తన ట్రూత్ సోషల్ సైట్‌లో వెల్లడించారు. దేశ దక్షిణ, ఉత్తర సరిహద్దులతోపాటు సముద్ర, గగనతల బాధ్యతలను కూడా ఆయన తీసుకుంటారన్నారు. దేశంలో అక్రమ వలసదారులను గుర్తించి వారి సొంత దేశాలకు పంపేయడాన్ని ఆయన పర్యవేక్షిస్తారన్నారు. ఈ బాధ్యతలకు టామ్ హోమన్‌నే ట్రంప్ నియమిస్తారంటూ ఇటీవల పలు కథనాలొచ్చాయి.కాగా, తాజా నియామకానికి సెనేట్ ఆమోదం అవసరం లేదు. అక్రమ వలసదారులను దేశం నుంచి పంపేందుకు సైన్యం సాయం తీసుకోబోమంటూ ఇటీవల టామ్ హోమన్ ఇటీవల ఫాక్స్ న్యూస్ చానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడం గమనార్హం. ఇమిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సమర్థంగా ఇటువంటి విధులను నిర్వర్తిస్తారని ఆయన అన్నారు. అదేవిధంగా, ఐరాసలో అమెరికా రాయబారిగా కాంగ్రెస్ సభ్యురాలు ఎలిస్ స్టెఫానిక్‌ను నియమిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.


కిర్యట్ అటా నగరంలో ఓ భవనంపై రాకెట్ దాడితో చెలరేగిన మంటలు

ఇజ్రాయెల్‌పైకి వందలాది రాకెట్లు

- మరోసారి విరుచుకుపడ్డ హెజ్‌బొల్లా
- పలు సైనిక లక్ష్యాలపై భారీ దాడులు
- చిన్నారి సహా ఏడుగురికి గాయాలు

బీరూట్: కొద్దిపాటి విరామం తర్వాత లెబనాన్ ఉగ్రవాద సంస్థ హెజ్‌బొల్లా మరోసారి ఇజ్రాయెల్‌పై విరుచుకుపడింది. ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై సోమవారం వందలాది రాకెట్లతో దాడికి దిగింది. సెప్టెంబర్‌లో లెబనాన్‌వ్యాప్తంగా వేలాది మంది హెజ్‌బొల్లా సాయుధులను గాయపరచడమే గాక వందల మంది మరణానికి కారణమైన పేజర్ దాడులు తమ పనేనని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రకటించిన మర్నాడే ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషం. తమ దేశ ఉత్తర ప్రాంతంపై నిమిషాల వ్యవధిలోనే 165కు పైగా రాకెట్లు వచ్చిపడ్డట్టు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ వార్తా పత్రిక పేర్కొంది. వాటిలో 50కి పైగా కార్మియెల్ ప్రాంతం, పరిసర పట్టణాలను లక్ష్యంగా చేసుకున్నట్టు వివరించింది. మరోవైపు రేవు పట్టణం హైఫాపైకి రెండు విడతల్లో 90కి పైగా రాకెట్లు దూసుకెళ్లాయి. గలిలీ, కార్మియెల్ ప్రాంతాల్లోని సైనిక లక్ష్యాలపై తాము చేసిన వ్యూహాత్మక దాడులు విజయవంతమైనట్టు హెజ్‌బొల్లా ప్రకటించింది. అనంతరం రాకెట్ దాడుల దృశ్యాలతో కూడిన వీడియోలను ఇజ్రాయెల్ సైన్యం సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఈ మతిలేని దూకుడు బారినుంచి ఉత్తర ప్రాంతంలోని తమ పౌరులను పూర్తిస్థాయిలో కాపాడుకుంటామని పేర్కొంది. హెజ్‌బొల్లా రాకెట్లను చాలా వరకు ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ అడ్డుకుని సురక్షితంగా కూల్చేసింది. అయినా పలు రాకెట్లు పౌర ఆవాసాలతో పాటు సైనిక స్థావరాలను కూడా తాకినట్టు సమాచారం. దాడుల్లో బినా పట్టణంలో ఏడాది వయసున్న ఓ చిన్నారితో పాటు ఏడుగురు గాయపడ్డట్టు ఇజ్రాయెల్ తెలిపింది. అక్టోబర్ 8న కూడా ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా భారీగా రాకెట్ దాడులకు దిగడం తెలిసిందే. లెబనాన్‌తో కాల్పుల విరమణ దిశగా చర్చల్లో పురోగతి కన్పిస్తోందని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి గైడెన్ సార్ ప్రకటించిన కాసేపటికే ఈ పరిణామం చోటుచేసుకుంది.



ఆన్‌లైన్‌లో గంజాయి దందా

గంజాయి దందా కొత్త పుంతలు తొక్కుతోంది. ఆన్‌లైన్ వేదికగా గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురు పెడ్లర్లను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. -8లో



వుయ్ ఆర్ విదేశీ

భాగ్యనగరం.. ఎవరు వచ్చినా ఆదరిస్తుంటుంది. వేరే రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా ఎంతో మంది వ్యాపారం, పర్యాటకం, ఉన్నత చదువుల కోసం కూడా ఇక్కడికి వస్తున్నారు. -సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/18.0

నగరంలో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉదయం పొగమంచు వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 32 కనిష్టంగా 18 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.







చలి ఉంది.. జాగ్రత్త!

వాతావరణం మారుతోంది. శీతాకాలం వచ్చేసింది. క్రమేణా చలి పెరుగుతోంది. చలిపులి విజృంభించక ముందే దాని బారి నుంచి రక్షణ కోసం నగరవాసులు జాగ్రత్త పడుతున్నారు. క్యాప్‌లు, స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. వాటిని కొనుగోలు చేసేందుకు షాపుల దారి పడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం పలువురు క్యాపులు, స్వెట్టర్లు కొనుగోలు చేశారు.

మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్‌లపై 10 శాతం రాయితీ

సాక్షి, సిటీబ్యూరో: మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్‌పాస్ ఉన్న ప్రయాణికులకు శుభవార్త. వీరు ఏసీ బస్సుల్లో 10 శాతం రాయితీ పొందవచ్చు. వీకెండ్స్, సెలవు రోజుల్లో హైదరాబాద్ నుంచి దూరప్రాంతాలకు, సొంత ఊళ్లకు వెళ్లే ఈ ప్రయాణికులకు ఈ డిస్కౌంట్ ఉంటుందని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటనలో తెలిపారు. లహరి, రాజధాని, గరుడ ప్లస్, ఈ–గరుడ తదితర ఏసీ సర్వీసుల్లో పయనించేందుకు ముందస్తుగా టికెట్ రిజర్వ్ చేసుకొనే ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లే అన్ని టీజీఎస్ఆర్టీసీ ఏసీ బస్సుల్లో ఈ 10 శాతం డిస్కౌంట్ వర్తిస్తుంది. మెట్రోఎక్స్ ప్రెస్‌తోపాటు మెట్రో డీలక్స్, గ్రీన్ మెట్రో, ఎయిర్ పోర్ట్ పుష్పక్ బస్‌పాస్ వినియోగదారులు కూడా ఈ రాయితీని పొందవచ్చు. జనవరి 31వ తేదీ వరకు ఇది అమల్లో ఉంటుంది. హైదరాబాద్‌లో సుమారు 70 వేల మంది ప్రయాణికులు మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్‌లను వినియోగిస్తున్నారు. వారిలో ఎక్కువగా వీకెండ్‌లో సొంతూళ్లకు వెళ్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఈ రాయితీ ఇవ్వాలని నిర్ణయించినట్లు ఎండీ పేర్కొన్నారు. సంస్థ అధికారిక వెబ్‌సైట్ tgsrtcbus.in లో ముందస్తు రిజర్వేషన్ చేసుకుని రాయితీ పొందవచ్చు.

ఆకర్షణకు అభినందనలు

లైబ్రరీకి సీఎం పలు పుస్తకాల అందజేత



ఆకర్షణకు పుస్తకాలు అందజేస్తున్న సీఎం రేవంత్

సనత్‌నగర్: చిరుప్రాయంలోనే పఠనాసక్తిని పెంచాలనే ఆశయంతో గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకర్షణను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. చిన్నారి ఇప్పటి వరకు వివిధచోట్ల 17 లైబ్రరీలను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర డీజీపీ జితేందర్ ఆమెను తన కార్యాలయానికి ఆహ్వానించారు. డీజీపీతోపాటు ఐజీ రమేశ్ చిన్నారి ఆకర్షణను అభినందించి పలు పుస్తకాలు అందజేశారు. అనంతరం ఆకర్షణను సీఎం రేవంత్ రెడ్డి వద్దకు తీసుకువెళ్లి చిన్నారి చేస్తున్న గ్రంథాలయ యజ్ఞం గురించి ఆయనకు తెలియజేశారు. దీంతో సీఎం ఆమెను అభినందించి కొన్ని పుస్తకాలను అందించారు. వచ్చేనెల మొదటివారంలో మధురానగర్ మెట్రోస్టేషన్‌లో ఉచిత లైబ్రరీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించాల్సిందిగా సీఎం రేవంత్‌రెడ్డిని ఆకర్షణ ఆహ్వానించింది. దీనికి సీఎం అంగీకారం తెలిపినట్లుగా ఆమె తండ్రి సతీశ్ తెలిపారు. ఈ నెల 25న మూసాపేటలోని శ్రీసత్య సాయి బాలికల అనాథ ఆశ్రమంలో ఆకర్షణ ఏర్పాటు చేసే 18వ లైబ్రరీ ప్రారంభోత్సవానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

ఓటీఎస్-2024 నిబంధనల్లో సడలింపు

సాక్షి, సిటీబ్యూరో: నల్లా నీటిబిల్లుల బకాయిలు చెల్లింపుదారుల కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకం(ఓటీఎస్)–2024 నిబంధనలను సడలించినట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి వెల్లడించారు. ఓటీఎస్–2020 కింద ప్రయోజనం పొందిన వినియోగదారులకు మాత్రమే వడ్డీ, ఆలస్యం రుసుములో 50 శాతం మాఫీ వర్తిస్తుందని, అంతకుముందు ఏ ఓటీఎస్ ద్వారా ప్రయోజనం పొందినా వంద శాతం రాయితీ వర్తించే విధంగా నిబంధనలను సడలించినట్లు తెలిపారు. బకాయి చెల్లింపు సమయంలో వినియోగదారులు అఫిడవిట్ స్థానంలో హామీపత్రం సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఓటీఎస్ పథకంపై ఏవైనా సందేహాలుంటే.. జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313కు ఫోన్ చేసి వాటిని నివృత్తి చేసుకోవచ్చన్నారు.

హైడ్రా కమిషనర్ ఇంటా 'సర్వే'

వెంగళరావునగర్: రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వే వెంగళరావునగర్ డివిజన్‌లో ముమ్మరంగా సాగుతోంది. 150 ఇళ్లకు ఒకరు చొప్పున ఎన్యుమరేటర్లు సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం మధురానగర్ కాలనీలోని హైడ్రా కమిషనర్ రంగనాథ్ నివాసగృహాన్ని ఎన్యుమరేటర్, ఆశా వర్కర్లు సందర్శించారు. ఆయన నుంచి సమాచారాన్ని సేకరించి కృతజ్ఞతలు తెలియజేశారు.



హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను వివరాలు అడుగుతున్న ఎన్యుమరేటర్

పెట్ డాగ్స్ ఇష్టమే..

లైసెన్సులకు మాత్రం నో!

గ్రేటర్ హైదరాబాద్‌లో జంతుప్రేమికులెందరో ఉన్నారు. కుక్కలు, పిల్లులు, బాతులు తదితర జంతువులు, పక్షులను పెంచుకునేవారు ఎందరో ఉన్నారు. వీరిలో డాగ్ లవర్సే అత్యధికం. పెంపుడు కుక్కలను కుటుంబసభ్యులుగా, అల్లారుముద్దుగా పెంచుతూ, బర్త్‌డేలు ఇతరత్రా ఫంక్షన్లు సైతం నిర్వహిస్తుండటం తెలిసిందే. కుక్కలపై ఇంత శ్రద్ధ చూపుతున్న వారిలో చాలామంది వాటి వివరాలను మాత్రం జీహెచ్ఎంసీ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకొని లైసెన్సులు తీసుకోవడం లేదు. గతంలో ఇందుకు లైసెన్సు ఫీజు ఉన్నప్పటికీ, ఎక్కువమందిని ఆకర్షించేందుకు ఉచిత రిజిస్ట్రేషన్ అవకాశాన్ని జీహెచ్ఎంసీ కల్పించింది. అంతేకాదు, జీహెచ్ఎంసీ కార్యాలయాల దాకా వెళ్లనవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే పొందే సదుపాయం కల్పించినా ప్రజల నుంచి స్పందన కనిపించడం లేదు. గ్రేటర్‌లో దాదాపు 1.50 లక్షల వరకు పెంపుడు కుక్కలుంటాయని అంచనా. వీరిలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నవారు 11 వేలు కూడా లేరు. అంటే.. పదిశాతం కూడా లేరు.

– సాక్షి, సిటీబ్యూరో



- రిజిస్ట్రేషన్లు ఉచితమే అయినా.. 10 శాతం కూడా లేని లైసెన్సులు
- ఇదీ జీహెచ్ఎంసీలో పరిస్థితి



పెంపుడు పిల్లులను రిజిస్ట్రేషన్ చేసి, లైసెన్సులు పొందినవారు 520 మంది ఉండగా, ఇతర జంతువులు, పక్షులను నమోదు చేసుకున్నవారు 314 మంది ఉన్నారు.

నమోదు తప్పనిసరి

జీహెచ్ఎంసీ చట్టం, నిబంధనల మేరకు పెంపుడు కుక్కలను కలిగినవారు వాటి వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. నిర్ణీత వ్యవధుల్లో టీకాలు ఇప్పించాలి. డీవార్మింగ్ చేయించాలి. రిజిస్ట్రేషన్ చేయించుకుంటే పొరపాటున పెంపుడు కుక్కలు తప్పిపోతే యజమానిని గుర్తించేందుకు వీలవుతుంది. రిజిస్ట్రేషన్ చేసుకొని, లైసెన్స్ పొందడం వల్ల చట్టపరమైన యాజమాన్య హక్కు లభిస్తుంది. యాజమాన్య వివాదాలు తలెత్తినప్పుడు పరిష్కరించేందుకూ ఉపకరిస్తుంది. రిజిస్ట్రేషన్ చేయించుకున్న యజమానులకు కుక్కల సంరక్షణకు సంబంధించిన జాగ్రత్తలు, నిర్ణీత వ్యవధుల్లో టీకాలు ఇప్పించడం వంటివాటి గురించి జీహెచ్ఎంసీ మెసేజీల ద్వారా 'అలర్ట్' చేస్తుంది. సందర్భానుసారం సలహాలు, సూచనలు తెలియజేస్తుంది.

ఇవీ బాధ్యతలు..

- లైసెన్సులు పొందే యజమానులకు తగిన బాధ్యతలూ ఉన్నాయి. తగిన ఆహారం ఇవ్వాలి. ఆశ్రయం కల్పించాలి. వాటిపై క్రూరత్వం చూపొద్దు. వాటివల్ల ఇతరుల ఆరోగ్యానికి ప్రమాదకర పరిస్థితి ఎదురైతే లైసెన్సును రద్దు చేస్తారు.
- పెంపుడు జంతువుకు మంచి ఆరోగ్యం ఉండేలా చూడాలి. సకాలంలో యాంటీ రేబీస్ టీకాలు, ఇతర రోగనిరోధక టీకాలు వేయించాలి.
- రిజిస్ట్రేషన్ సందర్భంగా తప్పుడు వివరాలు నమోదు చేస్తే, వాటిని గుర్తించినప్పుడు లైసెన్సు రద్దవుతుంది.
- కుక్కలుండే ప్రాంగణాన్ని ఎలాంటి నోటీసు లేకుండానే జీహెచ్ఎంసీ అధీకృత అధికారి తనిఖీ చేసేందుకు అధికారం ఉంటుంది.
- పెంపుడుకుక్కలను బయటకు తీసుకువెళ్లేటప్పుడు వాటి లైసెన్సు(రిజిస్ట్రేషన్) ప్రతిని యజమానులు వెంట ఉంచుకోవాలి.
- కుక్కల మెడకు పట్టీ ఉంచాలి. బహిరంగ ప్రదేశాల్లో వదిలిపెట్టరాదు.
- బహిరంగ ప్రదేశంలో పెంపుడు కుక్కలు మలవిసర్జన చేయకుండా జాగ్రత్త వహించాలి. ఒకవేళ అలా చేస్తే ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచే బాధ్యత యజమానిదే.
- యజమాని అందించిన సమాచారం మేరకు లైసెన్స్ జారీ చేస్తారు.
- అమలులో ఉన్న చట్టాలు, నిబంధనలకు అనుగుణంగా యజమాని నడుచుకోవాలి.
- బహుశా, ఇన్ని నిబంధనలుండటం వల్లే చాలామంది పెంపుడు కుక్కలను రిజిస్ట్రేషన్ చేయించుకోవడంలేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

శబరిమల.. చేరేదెలా!

హైదరాబాద్ నుంచి 5 లక్షల మందికిపైగా అయ్యప్ప భక్తులు

- డిసెంబర్, జనవరి నెలల్లో శబరికి వెళ్లే రైళ్లలో భారీ రద్దీ
- ఇప్పటికే వందల్లో వెయిటింగ్.. శబరి ఎక్స్‌ప్రెస్‌లో 'నో బెర్త్'

ఇప్పటివరకు ప్రత్యేక రైళ్ల ఏర్పాటుపై దృష్టి సారించని రైల్వే





సాక్షి, సిటీబ్యూరో: శబరిమల.. అయ్యప్ప సన్నిధి.. హైదరాబాద్ నుంచి అయ్యప్ప సన్నిధికి నేరుగా వెళ్లేందుకు శబరి ఎక్స్‌ప్రెస్ ఒక్కటే శరణ్యం. కానీ, అందులో ఇప్పటికే 'నో బెర్త్' దర్శనమిస్తోంది. హైదరాబాద్ మీదుగా శబరిమల వైపు రాకపోకలు సాగించే పలు రైళ్లన్నీ ఇప్పటికే భర్తీ అయ్యాయి. అన్నింటిలోనూ ఫిబ్రవరి ఆఖరు వరకు వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. భక్తుల రద్దీ మేరకు అదనపు రైళ్ల ఏర్పాటుపై దక్షిణ మధ్య రైల్వే ఇప్పటి వరకు ఎలాంటి ప్రణాళికలను సిద్ధం చేయలేదు. దీంతో భక్తుల్లో ఆందోళన నెలకొంది. ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తే చార్జీలు భారీగా ఉంటున్నాయని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా మాలధారణతోపాటే భక్తులు ప్రయాణ సదుపాయాలను కూడా ఏర్పాటు చేసుకుంటారు. కానీ, చివరి నిమిషం వరకు ప్రత్యేక రైళ్లను ప్రకటించకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి నెలకొంటోంది.

ఒకే ఒక్క రైలు...

ఏటేటా అయ్యప్ప భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఈ ఏడాది గ్రేటర్ హైదరాబాద్ నుంచి 5 లక్షల మందికిపైగా శబరిమలకు వెళ్లే అవకాశం ఉన్నట్లు అంచనా. వారిలో చాలావరకు రైళ్లపైనే ఆధారపడతారు. ప్రైవేట్ వాహనాలు, విమానాల్లో ప్రయాణించేవారి సంఖ్య తక్కువే. రెగ్యులర్‌గా వెళ్లే శబరి ఎక్స్‌ప్రెస్ ఇప్పటికే పూర్తిగా నిండిపోయింది. మరో నెల వరకు టికెట్ బుక్ చేసుకొనేందుకు కూడా అవకాశం లేదు. మరోవైపు ఈ నెలా ఖరు నుంచే భక్తుల ప్రయాణాలు మొదలవుతాయి. జనవరిలో మకరజ్యోతి దర్శనం కోసం ఎక్కువమంది ఆసక్తి చూపుతారు. కానీ, ఇందుకు తగినట్లుగా రైళ్లను ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. "సకాలంలో రైళ్లు వేయకపోవడం వల్ల పది, పదిహేనుమంది భక్తులు కలిసి ఓ ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాన్ని బుక్ చేసుకొని వెళ్లవలసి వస్తుంది. ఇలా వాహనాలను బుక్ చేసుకున్న తరువాత ప్రత్యేక రైళ్లు వేస్తే ఏం లాభం"అని బోడుప్పల్‌కు చెందిన అయ్యప్ప భక్తుడు సాంబశివరావు అభిప్రాయపడ్డారు.

సంక్రాంతి ప్రయాణం కష్టమే..

- ఈ సారి సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు కూడా రైలు కష్టాలు తప్పేలా లేవు. హైదరాబాద్ నుంచి ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అన్ని రెగ్యులర్ రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ భారీగా ఉంది. ఫిబ్రవరి వరకు కూడా వెయిటింగ్ లిస్టు 200 నుంచి 250 వరకు ఉంది. కొన్ని రైళ్లలో రిగ్రెట్ కనిపిస్తుంది. అయ్యప్ప భక్తులతోపాటు సంక్రాంతి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా కూడా ప్రత్యేక రైళ్లను వేయవలసిన అవసరం ఉంది. ప్రస్తుతం నగరంలోని సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, లింగంపల్లి, హైటెక్ సిటీ తదితర ప్రధానస్టేషన్ల నుంచి ప్రతిరోజు 2.5 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా జనవరి మొదటి వారం నుంచి ఇంచుమించు ఆ నెలాఖరు వరకు రోజుకు 50 వేల నుంచి లక్ష మంది చొప్పున అదనంగా ప్రయాణం చేయనున్నట్లు అంచనా.
- సంక్రాంతి సందర్భంగా కనీసం 25 లక్షల మంది నగరం నుంచి సొంత ఊళ్లకు వెళ్లి తిరిగి వస్తారు. ఈ మేరకు ముందస్తుగా అధికారులు రైళ్లను ప్రకటించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా తీరా పండుగ సమీపించాక అదనపు రైళ్లు వేస్తున్నారు. దీంతో అప్పటికే ప్రయాణికులు బస్సులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తారు. పైగా పండుగ ముందు అప్పటికప్పుడు ప్రత్యేక రైళ్లు వేయడం వల్ల ఎక్కువ శాతం సీట్లు దళారులే ఎగురేసుకుపోతున్నారు. సాధారణంగా శబరిమల ప్రత్యేక రైళ్లలో ఏటా ఇలాగే దళారుల దందా కొనసాగుతోంది. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా ముందస్తుగా ప్రత్యేక రైళ్లను ప్రకటించకపోవడం వల్ల సంక్రాంతి స్పెషల్ ట్రైన్స్‌లోనూ దళారులు పాగా వేసే అవకాశం ఉంది. గోదావరి, విశాఖ, గరీబ్‌రథ్, నర్సాపూర్, ఫలక్‌నుమా, గౌతమి, మచిలీపట్నం, నర్సాపూర్, సింహపురి, నారాయణాద్రి, వెంకటాద్రి, పద్మావతి, రాయలసీమ తదితర అన్ని ప్రధాన రైళ్లలో ఇప్పటికే భారీ వెయిటింగ్ ఉంది.

ఇలంబర్తికి పూర్తి పగ్గాలు

జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియామకం

సాక్షి, సిటీబ్యూరో: అదనపు బాధ్యతలతో పని చేస్తున్న ఇలంబర్తిని జీహెచ్ఎంసీ పూర్తిస్థాయి కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఆయన రవాణాశాఖ కమిషనర్‌గా ఉంటూ, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో పనిచేస్తున్నారు. తాజా ఐఏఎస్‌ల బదిలీల్లో భాగంగా ఆయనకు రవాణా శాఖ బాధ్యతలు తప్పించి, జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియ మించడంతో ఇక దీనిపైనే దృష్టి సారించనున్నారు. ప్రస్తుతం ఝార్ఖండ్‌లో ఎన్నికల అబ్జర్వర్‌గా ఉన్న విషయం తెలిసిందే. గతంలో జోనల్ కమిషనర్‌గా ఉండటం, జీహెచ్ఎంసీలోని వివిధ విభాగాలు, నగర పరిస్థితులు పూర్తిగా తెలిసి ఉండటంతోపాటు అదనపు బాధ్యతల్లోనూ ఆయన పనితీరును పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం జీహెచ్ఎంసీ కమిషనర్‌గా నియమించినట్లు తెలుస్తోంది.

కొత్త చట్టాలపై అవగాహన



సదస్సును ప్రారంభిస్తున్న డీజీ సౌమ్యమిశ్రా, ఐజీలు రాజేశ్, మురళీబాబు, డీఐజీ డాక్టర్ శ్రీనివాస్

చంచల్‌గూడ: కొత్త చట్టాలపై జైలు అధికారులు, సిబ్బందికి అవగాహన ఉండాలని జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా అన్నారు. రాష్ట్ర జైళ్ల శాఖ, బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో కారాగార సంబంధిత విషయాలపై కొత్త నేరచట్టాలు–2023పై జైళ్ల శాఖ అధికారులకు, సిబ్బందికి చంచల్‌గూడలోని సీకా శిక్షణ సంస్థ అవగాహన కల్పిస్తోంది. గత నెలలో మొదటి విడత అవగాహన సదస్సును నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మూడు రోజులపాటు సాగే రెండో విడత సదస్సును సోమవారం సౌమ్యమిశ్రా ప్రారంభించారు. సదస్సులో మేఘాలయ, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జైళ్ల శాఖ అధికారులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ఐజీలు యెర్రంశెట్టి రాజేశ్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, సూపరింటెండెంట్ నవాబు శివకుమార్‌గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి

అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ అనుదీప్

సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అదనపు కలెక్టర్ కదిరవన్ పలనితో కలసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వివిధ సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పక్కాగా జరగాలని, ఆ దిశగా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటాచారి, ఆర్డీఓలు రామకృష్ణ, సాయిరామ్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

తెలంగాణ స్పైస్.. క్రిమినల్ కేస్



పేలుడు జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

బంజారాహిల్స్: నిర్లక్ష్యంగా వ్యవహరించి గ్యాస్ లీకేజీ, పేలుళ్లకు కారణమైన తెలంగాణ స్పైస్ కిచెన్ యాజమాన్యంపై జూబ్లీహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–1లో ఉన్న తెలంగాణ స్పైస్ కిచెన్ అండ్ బార్‌లో ఆదివారం తెల్లవారుజామున గ్యాస్ లీకై భారీ శబ్దంతో పేలుళ్లు జరిగాయి. ఈ ధాటికి గోడ కుప్పకూలి పక్కనే ఉన్న దుర్గా భవానీ నగర్ బస్తీ ఇళ్లపై పడింది. ఈ ఘటనలో పది ఇళ్లు ధ్వంసం కాగా పూజ అనే మహిళకు గాయాలయ్యాయి. ఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తెలంగాణ స్పైస్ కిచెన్ యాజమాన్యంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–1లో ఆదివారం ఉదయం పేలుడు జరిగిన తెలంగాణ స్పైస్ కిచెన్‌ను క్షేత్ర స్థాయిలో సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. పేలుడు ధాటికి హోటల్ వెనుక భాగంలో ఉన్న గదులు, ప్రహరీ కూలి రాళ్లు, ఇనుపరాడ్లు, రేకులు, వంద మీటర్ల వరకు ఎగిరిపడడంతో పేలుళ్ల తీవ్రతను పరిశీలించి కారణాలను తెలుసుకున్నారు. హైడ్రా రీజనల్ ఫైర్ ఆఫీసర్ జయప్రకాష్, జిల్లా ఫైర్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావులతోపాటు పలువురు అధికారులు రంగనాథ్ వెంట ఉన్నారు.

ప్రదక్షిణలు చేస్తూ గుండెనొప్పితో వ్యక్తి మృతి



మృతి చెందిన కానంపల్లి విష్ణువర్ధన్

కేపీహెచ్‌బీకాలనీ: గుడిలో ప్రదక్షిణలు చేయటానికి వెళ్లిన ఓ వ్యక్తి గుండెనొప్పితో మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కేపీహెచ్‌బీ రోడ్డు నెంబర్ 1లో అమ్మ హాస్టల్‌లో కానంపల్లి విష్ణువర్ధన్(31) ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. అతడు ప్రతిరోజు ఉదయం ఆలయానికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 7 గంటలకు కేపీహెచ్‌బీ టెంపుల్ బస్‌స్టాప్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లాడు. గుడి చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయి, అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇతర భక్తులు సీపీఆర్ చేసి ఆసుపత్రికి తరలిస్తుండగా అంతలోనే మృతి చెందాడు. విషయాన్ని ఆయన సోదరి హేమలతకి ఫోన్ ద్వారా తెలియచేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రిఫండ్ రావడమే ముప్పయింది!

ట్రేడింగ్ ఫ్రాడ్‌లో డాక్టర్ దంపతులకు ఈ-నేరగాళ్ల టోకరా

- తమిళనాడులో మనీమ్యూల్ ఖాతా గుర్తించిన సైబర్ కాప్స్
- రూ.5 లక్షలు ఫ్రీజ్ చేసి కోర్టు ద్వారా బాధితుల ఖాతాలోకి
- చెన్నైలోని ఓ మహిళను మోసం చేసిన ఇదే సైబర్ కేటుగాళ్లు
- ఆమె ఫిర్యాదుతో అక్కడున్న పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు
- నగర వైద్యుడి ఖాతాను ఫ్రీజ్ చేసిన ఆ దర్యాప్తు అధికారులు
- న్యాయం కోసం బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్ వద్దకు బాధితులు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన వైద్య దంపతులు సోషల్‌మీడియా యాప్ ద్వారా సైబర్ నేరగాళ్ల బారినపడ్డారు. ఈ-కేటుగాళ్ల బారినపడి ట్రేడింగ్ ఫ్రాడ్‌లో రూ.5 లక్షలు నష్టపోయారు. వీరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేశారు. తమిళనాడులోని ఓ మనీమ్యూల్ ఖాతాలో ఉన్న నగదు ఫ్రీజ్ చేసి నిబంధనల ప్రకారం బాధితుల ఖాతాలోకి రిఫండ్ చేశారు. ఇంకేముంది కథ సుఖాంతం అనుకుంటున్నారా..? అసలు కథ అప్పుడే మొదలైంది. అదేమింటంటే...

మనీమ్యూల్స్ ఖాతాలతో...

పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ సైబర్ నేరగాళ్లు బాధితుల నుంచి నగదు డిపాజిట్/బదిలీ చేయించుకోవడానికి తమ సొంత బ్యాంకు ఖాతాలు వాడరు. కమీషన్లు తీసుకుంటూ తమ బ్యాంకు ఖాతాలను అందించడానికి, వీరికి అవసరమైన ఖాతాలు సరఫరా చేయడానికి కొందరు ఖాతాదారులు, దళారులు అన్ని నగరాలు, పట్టణాల్లోనూ పని చేస్తుంటారు. ఇలా బ్యాంకు ఖాతాలు అందించే వారిని సాంకేతికంగా మనీమ్యూల్స్ అని పిలుస్తుంటారు. సైబర్ క్రైమ్ పోలీసులు తమ దర్యాప్తులో బాధితుల నగదు పలు ఖాతాలు మారిందని, తమిళనాడుకు చెందిన ఓ మనీమ్యూల్ ఖాతాలోకి వెళ్లినట్లు గుర్తించారు. బ్యాంకు అధికారులకు లేఖ రాయడం ద్వారా రూ.5 లక్షలు ఫ్రీజ్ చేయించారు. ఆపై న్యాయస్థానం అనుమతి పొంది ఆ ఖాతా నుంచి రూ.5 లక్షలు డాక్టర్ ఖాతాలోకి రిఫండ్ చేయించారు.

చెన్నైలో మరో బాధితురాలు ఫిర్యాదు...

ఉత్తరాది కేంద్రంగా ఇలాంటి సైబర్ నేరాలు చేసే ఈ-క్రిమినల్స్ దేశ వ్యాప్తంగా అనేక మందికి ఎర వేస్తుంటారు. ఎంత మంది తమ వలకు చిక్కితే అందరినీ మోసం చేసి అందినకాడికి దండుకుంటారు. సదరు సైబర్ నేరగాళ్ల చేతిలో నగరానికి చెందిన వైద్య దంపతులతో పాటు చెన్నైకి చెందిన మహిళ కూడా మోసపోయారు. ఇక్కడి బాధితులు ఇక్కడ ఇచ్చినట్లే ఆమె అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న ఆ అధికారులూ నగదు ఎక్కడకు వెళ్లిందనేది గుర్తించడంపై దృష్టి పెట్టారు. ఈ నేపథ్యంలో ఆ నగదు తమిళనాడు ఖాతా నుంచి హైదరాబాద్‌కు చెందిన వైద్యుడి ఖాతాలోకి వెళ్లినట్లు తేల్చారు. అది రిఫండ్ వచ్చిన మొత్తమని తెలియని ఆ అధికారులు ఈ వైద్యులు సైతం మనీమ్యూల్స్ అని భావించారు. దీంతో వారికి సంబంధించిన అన్ని బ్యాంకు ఖాతాల వివరాలు తెలుసుకుని, వాటిని ఫ్రీజ్ చేసేశారు.

అంబుడ్స్‌మెన్‌కు బాధితులు...

బ్యాంకు ఖాతాలన్నీ ఫ్రీజ్ అయ్యాయని తెలుసుకున్న వైద్య దంపతులు తొలుత బ్యాంకు అధికారులను సంప్రదించారు. చెన్నై పోలీసులు రాసిన లేఖ ఆధారంగానే అలా చేశామంటూ వాళ్లు సమాధానం ఇచ్చారు. దీంతో బాధితులు చెన్నై అధికారుల్ని ఫోన్ ద్వారా సంప్రదించి విషయం చెప్పారు. తమ నిర్దోషత్వం నిరూపణకు అవసరమైన అన్ని ఆధారాలను వాట్సాప్ ద్వారా పంపారు. అయినప్పటికీ స్పందించని చెన్నై పోలీసులు తమ వద్దకు వచ్చి వివరణ ఇవ్వాలంటూ పట్టుబట్టారు. దీంతో బాధిత దంపతులు రిజర్వ్ బ్యాంకు ఆధీనంలోని బ్యాంకింగ్ అంబుడ్స్‌మెన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అకారణంగా తమ బ్యాంకు ఖాతాలను బ్యాంకు అధికారులు ఫ్రీజ్ చేశారని, వాటిని డీ ఫ్రీజ్ చేయించాలని కోరారు. అయితే ఈ ఫ్రీజింగ్, డీ ఫ్రీజింగ్ తమ పరిధిలోని అంశం కాదంటూ అంబుడ్స్‌మెన్ సమాధానం ఇచ్చింది. దీంతో వైద్య దంపతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

మేడ్చల్‌రూరల్: కుటుంబ కలహాలతో మనస్తాపానికి లోనైన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని సోమారం గ్రామానికి చెందిన కుమార్(34) కూలీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య మేఘన కుమారుడితో సహా బయట నిద్రపోయింది. సోమవారం తెల్లవారు జామున ఇంట్లోకి వెళ్లి చూడగా కుమార్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో అతడిని కిందకు దించి చూడగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

సమ్మేళనాలతో స్నేహ సంబంధాలు మెరుగు



వేడుకలను ప్రారంభిస్తున్న సౌమ్య మిశ్రా తదితరులు

అఫ్జల్‌గంజ్: సమ్మేళనాలు ప్రజల్లో ఐక్యత, స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని రాష్ట్ర జైళ్లశాఖ డీజీపీ సౌమ్య మిశ్రా అన్నారు. సోమవారం అబిడ్స్ తాజ్‌మహల్ హోటల్‌లో రాజస్థానీ ప్రగతి సమాజ్ నిర్వహించిన దీపావళి సమ్మేళనంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపావళి సమ్మేళనం ఉత్తర భారతీయులను సంఘటితం చేసేందుకు దోహదపడుతుందన్నారు. రాజస్థానీ ప్రగతి సమాజ్ కార్యదర్శి గోవింద్‌రాఠి మాట్లాడుతూ.... ఉత్తర భారతీయుల సంక్షేమానికి రాజస్థానీ ప్రగతి సమాజ్ ముందుంటుందన్నారు. ప్రతి పండుగను హిందూ సంస్కృతి, సంప్రదాయాలు చాటి చెప్పేలా నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏకె. మోహంకా, తాజ్‌మహల్ ఎండీ చంద్రశేఖర్‌రావు,ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి సురేందర్ రెడ్డి, కమల్‌నారాయణ అగర్వాల్, సుమిత్ రాఠి, రమేష్ బంగ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ టీచర్ వేధింపులు తాళలేక హెచ్‌ఎం ఆందోళన



పాఠశాల ఆవరణలో ఆందోళన చేస్తున్న హెచ్‌ఎం ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు

రాజేంద్రనగర్: సైన్స్ టీచర్ వేధింపులకు తాళలేక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలితో సహా టీచర్లు ఆందోళనకు దిగిన సంఘటన సోమవారం రాజేంద్రనగర్ బుద్వేల్ జడ్పీహెచ్‌ఎస్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ మండల విద్యాధికారి, రాష్ట్ర ముదిరాజ్ సంఘం చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సంఘటనా స్థలానికి చేరుకొని హెచ్‌ఎంకు నచ్చచెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి మాట్లాడుతూ... సైన్స్ టీచర్‌గా పని చేస్తున్న వేణుగోపాల్ రావు విద్యార్థినులను స్పెషల్ క్లాస్‌ల పేరిట అసభ్యకరంగా మాట్లాడుతూ వేధిస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై తాను అడిగినా దురుసుగా సమాధానం చెబుతున్నాడని. తోటి ఉపాధ్యాయులపై సైతం దురుసుగా ప్రవరిస్తున్నాడని తాను ఏం పని చెప్పినా పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నాడన్నారు. ఇష్టానుసారం పాఠశాలకు వస్తుండటంతో ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేవలం విద్యార్థినులకు మాత్రమే స్పెషల్ క్లాస్‌లు తీసుకుంటున్నాడని, గతంలో స్పెషల్ క్లాస్ పేరిట విద్యార్థినులతో ద్వంద్వార్థాలతో మాట్లాడుతున్న విషయం తన దృష్టికి రావడంతో నిలదీశానన్నారు. వారం రోజులుగా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ వీడియోలు తీస్తూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం విద్యార్థులు రాసిన పరీక్ష పేపర్ల విషయమై ప్రశ్నించగా దురుసుగా మాట్లాడటంతో ఆందోళనకు దిగినట్లు తెలిపారు. దీనిపై సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ముందు జాగ్రత్తగా ఉపాధ్యాయుడు వేణుగోపాల్ రావును స్టేషన్‌కు తరలించారు. వికలాంగుడైన ఉపాధ్యాయుడు వేణుగోపాల్ రావుపై విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఏఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై జ్ఞానేశ్వర్ జిల్లా విద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగిసిన 'న్యూ క్రిమినల్ లా'స్ సదస్సు

సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా 'న్యూ క్రిమినల్ లాస్ ఏస్ ఎరా ఆఫ్ ట్రాన్స్‌ఫామిషన్ ఆఫ్ క్రిమినల్ జస్టిస్ సిస్టం' అనే అంశం పై 2 రోజుల పాటు నిర్వహించిన సెమినార్ సోమవారం ముగిసింది. అనంత లా కాలేజ్, విశ్వభారతి కాలాజ్ ఆఫ్ లా, యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ లా , ఓయూ అనుసంధానంతో ఈ సదస్సును నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రముఖ విద్యావేత్తలు ఈ ఎఫ్ఐఆర్, అడ్మిసబిలిటీ ఆఫ్ ఎవిడెన్స్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ సహా తదితర అంశాలపై వివరంగా చర్చించారు. ఈ సందర్భంగా 'న్యూ క్రిమినల్ లాస '' వ్యాసాల సంకలనాన్ని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేష్ భీమాపక, ప్రొఫెసర్ నల్సార్ యునివర్సిటీ ప్రొ.వి.బాలకిష్టా రెడ్డి, తదితరులు ఆవిష్కరించారు. రెండవ రోజు జరిగిన వాలిడిక్టరీ సభలో యూజీసీ మాజీ జాయింట్ సెక్రటరీ డా.ఎస్.వెంకటేశ్వర్లు న్యూ క్రిమినల్ లాలోని వివిధ సెక్షన్లపై వివరించారు. కార్యక్రమంలో అనంతలా కాలేజ్ ప్రిన్సిపాల్ డా.ఎమ్.వీ. చంద్రమతి తదితరులు పాల్గొన్నారు.



ఆన్‌లైన్ వేదికగా గంజాయి దందా

- విదేశీ గంజాయి సైతం దిగుమతి
- ముగ్గురు నిందితుల అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

పహాడీషరీఫ్: ఆన్‌లైన్ వేదికగా గంజాయి సరఫరా చేస్తున్న ఫెడ్లర్లను బాలాపూర్ పోలీసులు అరెస్ట్ చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు. పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వరం డీసీపీ డి.సునితా రెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంత రెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. టోలిచౌకి ప్రాంతానికి చెందిన మహ్మద్ ఇద్రీస్ కలీం అలియాస్ ఫర్హాన్, మహ్మద్ అబ్బాస్ కొన్నాళ్లుగా గంజాయి వ్యాపారం చేస్తున్నారు. ఇందుకోసం స్థానికంగా రాజేంద్రనగర్‌కు చెందిన బండారి సునీల్ అలియాస్ సులేమాన్ (30), దారుస్సలాంకు చెందిన మహ్మద్ అస్లాం(32), మెహిదీపట్నంకు చెందిన మహ్మద్ అక్రం(30)ను ఫెడ్లర్లుగా నియమించుకున్నారు. విదేశాల నుంచి ఓజీ (ఓసియన్ గాంజ.. నీళ్లలో ప్రత్యేకంగా పండించే గాంజ)ని డార్క్ వెబ్ నెట్‌తో కొరియర్‌లో దిగుమతి చేసుకోవడం ప్రారంభించారు. ఇలా దిగుమతి అయిన ఓజీని మూడు, ఐదు గ్రామల ప్యాకెట్లలో ప్యాక్ చేసి రూ.12వేలు, రూ.18 వేలుగా ధర నిర్ణయించారు. దీంతో పాటు స్థానిక డ్రై గంజాయిని సైతం ఫెడ్లర్ల ద్వారా బంజారా హిల్స్, ఫిల్మ్‌నగర్, మియాపూర్, ఉప్పల్, బాలాపూర్, శంషాబాద్ ప్రాంతాల్లో వినియోగదారులకు సోషల్ మీడియా యాప్‌ల ద్వారా బుక్ చేసుకున్న విధంగా విక్రయిస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న డేటాను డిలీట్ చేస్తుంటారు. తాజాగా ఆదివారం రాత్రి ఆర్‌సీఐ రోడ్డులో గంజాయిని విక్రయించేందుకు ముగ్గురు ఫెడ్లర్లు సిద్ధంగా ఉండగా, విశ్వసనీయ సమాచారం అందుకున్న బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ నేతృత్వంలో దాడులు నిర్వహించి నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.72.81 లక్షల విలువైన 34 ప్యాకెట్లలో ఉన్న 170 గ్రాముల ఓజీ, తొమ్మిది కిలోల ఎండు గాంజ, రూ.2.04 లక్షల నగదు, నాలుగు సెల్ ఫోన్లు, రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక తూకపు మిషన్ స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు ఫెడ్లర్లను అరెస్ట్ చేయగా, ప్రధాన నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

- రైతులకు ఇబ్బంది లేకుండా చూస్తాం
- గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి



పండ్ల రైతుల సమస్యలు తెలుసుకుంటున్న చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారంలోని గడ్డిఅన్నారం వ్యవసాయ పండ్ల మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చొరవ తీసుకుంటామని, వ్యాపారుల సహకారంతో మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తామని మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. పాలకవర్గం, అధికారులతో కలిసి సోమవారం బాటసింగారం పండ్ల మార్కెట్‌లో కొనసాగుతున్న క్రయ విక్రయాలను పరిశీలించారు. మార్కెట్‌లో ఉన్న ప్రతి వర్తకుడి అమ్మకాలను తనిఖీ చేసి కొనుగోలు దారులు, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మట్లాడుతూ.. గత ప్రభుత్వ నిర్వాకంతోనే వ్యాపారులు రోడ్డున పడ్డారని.. వ్యాపారం సరిగ్గా లేక నష్టపోయారని ఆరోపించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వంలో రైతులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూనే కోహెడలో నూతన మార్కెట్ నిర్మాణానికి ముమ్మర చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నూతన పాలకవర్గం సహకారంతో రైతులకు న్యాయం చేస్తామని.. వచ్చే మామిడి సీజన్‌లో ఇబ్బంది లేకుండా చూసేందుకు ఉన్నతస్థాయి అధికారులతో మాట్లాడి ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తామన్నారు. ఎక్కువ కమీషన్ తీసుకునే వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని, మార్కెట్‌లోని రైతులకు న్యాయం చేయాలన్నదే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర చారి, మార్కెట్ డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, అంజయ్య, మేకం లక్ష్మి, మచ్చేందర్ రెడ్డి, రఘుపతి రెడ్డి, గణేశ్ నాయక్, నరసింహ, గోవర్ధన్ రెడ్డి, వెంకట్ గుప్తా, ఇబ్రహీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్- లైంగిక దాడి

నిందితుడి రిమాండ్

రాంగోపాల్‌పేట్: ప్రేమ పేరుతో ఓ బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి వెస్ట్‌బెంగాల్‌కు చెందిన షేక్ మీరాజ్ (26) ఆరేళ్ల క్రితం నగరానికి వచ్చి అదే ప్రాంతానికి చెందిన గోల్డ్‌స్మిత్ వద్ద స్టోన్ ఫిట్టింగ్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. యజమాని కుమార్తె (17)పై కన్నేసిన అతను ఆమెతో చనువుగా ఉంటుండటాన్ని గుర్తించిన యజమాని కొన్నాళ్ల క్రితం అతడిని పనిలో నుంచి తొలగించగా మరో వ్యక్తి వద్ద పని చేస్తూ సదరు బాలికతో ప్రేమాయాణం సాగిస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బైక్ అదుపుతప్పి..

వ్యక్తి మృతి



కిశోర్‌రెడ్డి మృతదేహం

మేడ్చల్‌రూరల్: బైక్ అదుపు తప్పి కిందపడడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెల్లూరు జిల్లా, దువ్వూరు గ్రామానికి చెందిన గడ్డం కిశోర్‌రెడ్డి(49) కుటుంబంతో సహా నగరానికి వలసవచ్చి దేవరయాంజల్‌లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం అతను బైక్‌పై గండిమైసమ్మకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలోని ఆయోధ్య చౌరస్తా సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు మేడ్చల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిటీలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్ల బదిలీ

సాక్షి, సిటీబ్యూరో : నగరంలో ఆరుగురు ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ కమిషనర్ సీవీ ఆనంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అఫ్జల్‌గంజ్, లాలాగూడ, సీఐలు లింగేశ్వర్ రావు, పైళ్ల కరుణాకర్‌రెడ్డిలను సీసీఎస్‌కు బదిలీ చేయగా మల్టీజోన్ నుంచి వచ్చిన నునావత్ రవికి అఫ్జల్‌గంజ్, కలమాల రఘుబాబుకు లాలాగూడ ఎస్‌హెచ్‌ఓగా, కలమ సతీష్‌రెడ్డికి సైబర్‌క్రైమ్‌లో బాధ్యతలు అప్పగించారు. సీసీసీలో పనిచేస్తున్న పల్లె పద్మను సీసీఎస్‌కు బదిలీ చేశారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

నిమ్స్‌లో విద్యార్థినులను పరామర్శించిన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ



లక్డీకాపూల్‌: పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ క్రమంలో గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు కార్పొరేట్‌ స్థాయిలో వైద్యం అందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్‌ రాజనర్సింహ తెలిపారు. నిమ్స్‌ని మరింత బలోపేతం చేస్తున్నామని స్పష్టం చేశారు. సోమవారం ఆయన నిమ్స్‌లో చికిత్స పొందుతున్న కొమురం భీం ఆసిఫాబాద్‌ జిల్లా వాంకిడి మండలం ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులు మహాలక్ష్మి, జ్యోతి, శైలజలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులతో మంత్రి జరిగిన ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తిగా కోలుకొని స్కూల్‌ కి వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వారికి మంత్రి భరోసా కల్పించారు. ఈ నెల 3న ఆస్పత్రికి వచ్చిన విద్యార్థినులలో మహాలక్ష్మి, జ్యోతిలు డీహైడ్రేషన్‌, కిడ్నీ, ప్లేట్‌లెట్‌ సమస్యతో బాధపడ్డారన్నారు. ప్రస్తుతం వారు కోలుకుంటున్నారని తెలిపారు. అలాగే శైలజ ఇంటెన్సివ్‌ కేర్‌ యూనిట్‌లో చికిత్స పొందుతూ ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌ కారణంగా ఈ నెల 5 వరకు వెంటిలేటర్‌పై ఉందన్నారు. ఆ తరువాత కోలుకున్నా మళ్లీ సోమవారం తెల్లవారుజామున శైలజ శ్వాసకోశ సమస్యతో బాధపడుతుందని ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందన్నారు. వాస్తవానికి వాంతులు, విరోచనాలతో బాధపడుతూ నిమ్స్‌లో చేరిన ఈ విద్యార్థులకు కార్పొరేట్‌ తరహాలో వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. రోగులకు, వారి సహాయకులు ఉచిత ఆహార సదుపాయంతో పాటు అటెండర్లకు ప్రైవేట్‌ వార్డులో ఉచిత వసతి సౌకర్యాన్ని సైతం కల్పించామన్నారు. అనంతరం మంత్రి దామోదర్‌ రాజనర్సింహ ఆస్పత్రిలోని పలు విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మంత్రి వెంట నిమ్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ బీరప్ప, డాక్టర్లు నిమ్మ సత్యనారాయణ, డాక్టర్‌ గంగాధర్‌ లు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి మేధావుల మాట పట్టదా..?



ఆందోళన చేస్తున్న అంబేడ్కర్‌ వర్సిటీ ఉద్యోగులు

అంబేడ్కర్‌ వర్సిటీ జేఏసీ

బంజారాహిల్స్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలాన్ని జవహర్‌లాల్‌ నెహ్రూ ఆర్కిటెక్చర్‌ అండ్‌ ఫైన్‌ ఆర్ట్స్‌ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ ఆలోచనను నిరసిస్తూ అంబేడ్కర్‌ వర్సిటీ కార్యాచరణ సమితి సభ్యులు నిరసనను కొనసాగించారు. అధ్యాపక, అధ్యాపకేతర, ఉద్యోగ సంఘాల నేతలు సోమవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో విశ్వవిద్యాలయంలోని పరిపాలనా భవనం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్‌పర్సన్‌ పల్లవీ కాబ్డే, సెక్రటరీ జనరల్‌ వేణుగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ భవిష్యత్తు అంతా ఓపెన్‌ యూనివర్సిటీలదేనన్నారు. తెలంగాణ మేధావులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ భూములను ఎవరికీ కేటాయించరాదని లేఖ రాసినా, ఉద్యోగులు 53 రోజులుగా విశ్వవిద్యాలయంలో నిరసన కార్యక్రమాలు చేస్తున్నా ఇప్పటి వరకు భూ కేటాయింపు లేఖను ఉపసంహరించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు పుష్పా చక్రపాణి, ఎండీ హబీబుద్దీన్‌, ప్రమీల కేతావత్‌, కాంతం ప్రేమ్‌కుమార్‌, రజనీకాంత్‌, రాములు, షబ్బీర్‌, జహంగీర్‌, అవినాష్‌, కిషోర్‌, రాఘవేందర్‌ తదితరులు పాల్గొన్నారు.

రెండు శాఖల మధ్య చిచ్చురేపిన ప్రహరీ వివాదం

• గోడను నిర్మిస్తున్న మీసేవా అధికారులు • అభ్యంతరం తెలుపుతున్న జీహెచ్‌ఎంసీ అధికారులు • ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



బంజారాహిల్స్‌రోడ్‌ నెం 7లో నిర్మిస్తున్న గోడ ఇదే..

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌రోడ్‌ నెం 7లోని మీసేవా కార్యాలయ అధికారుల ప్రహరీ నిర్మాణం రెండు శాఖల అధికారుల మధ్య చిచ్చురేపింది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్న కాలంలో ఈ భవనంలో మీసేవా ప్రధాన కార్యాలయం కొనసాగింది. ఆ తర్వాత కొన్ని రోజుల పాటు ఏపీ మీసేవా కార్యాలయం,తెలంగాణ మీసేవా కార్యాలయాలు కొనసాగాయి. ఏపీ మీసేవ ప్రధాన కార్యాలయంలో ఏపీకి మారిన తర్వాత భవనంపై అంతస్తుకు తెలంగాణ మీసేవా కార్యాలయాన్ని మార్చారు. అప్పటి నుంచి జీహెచ్‌ఎంసీ సర్కిల్‌-18 వార్డు కార్యాలయంలోని శానిటేషన్‌, ట్యాక్సేషన్‌ విభాగంలో కింది భవనంలో కొనసాగుతున్నాయి.తాజాగా మీసేవా తెలంగాణ ప్రధాన అధికార కార్యాలయ అధికారులు గత కొద్ది రోజుల నుంచి కార్యాలయ మరమ్మతు పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా సెపరేట్‌గా గేటు నిర్మించారు.ఈ గేటుగుండానే జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో కొనసాగుతున్న వివిధ విభాగాల అధికారులు,సిబ్బంది సైతం నడుస్తుంటారు. అయితే మీసేవ కార్యాలయ అధికారులు ముందు వైపున్న జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయ ద్వారాన్ని పూర్తిగా మూసివేస్తూ గోడ నిర్మాణం చేపట్టడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పటికే మీసేవకు వస్తున్న వారితోపాటు వార్డు కార్యాలయానికి వస్తున్న వారి వల్ల పార్కింగ్‌ సమస్యలు వస్తున్నాయని ఇప్పుడు ఈ గోడ నిర్మిస్తే కార్యాలయం లోపల వెంటిలేషన్‌ పూర్తిగా పోతుందని దానికి తోడు కార్యాలయానికి వెళ్లాలంటే వెనుక ద్వారం గుండా వెళ్లాల్సి వస్తుందంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు పనులు నిలిపివేశారు. ఈ సమస్యను ఇరు శాఖల అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి నిర్ణయం తర్వాత ఇక్కడ గోడ కడతారా లేదా అని తేలనుంది.

ప్రతి బాలిక చదువుకోవాలి

వెంగళరావునగర్‌: సమాజంలో ప్రతి బాలిక తప్పనిసరిగా చదువుకోవాలని జవహర్‌నగర్‌ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతాబాయి రాథోడ్‌ అన్నారు. వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో రూం టు రీడ్‌ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 'మార్పు దిశగా కౌమారులు' అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శాంతాబాయి రాథోడ్‌ మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకోవడానికి ముందుగా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని తెలియజేశారు. కౌమారదశలో ఆడపిల్లలు చదువుపైనే దృష్టిసారించాలని పేర్కొన్నారు. ఇందుకు పేరెంట్స్‌తో పాటుగా స్కూల్‌, సంఘం ప్రతి ఒక్కరి ప్రోత్సాహం నిరంతరం కొనసాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రూం టు రీడ్‌ సంస్థ ప్రతినిధులు మమత, రాధిక, స్కూల్‌ టీచర్లు, విద్యార్థినులు, సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



అవగాహనా కార్యక్రమంలో టీచర్లు

ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడండి



తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దుర్గాభవానీనగర్‌ నివాసితులు

బంజారాహిల్స్‌: జూబ్లీహిల్స్‌ చెక్‌పోస్టు సమీపంలోని తెలంగాణ స్పైసీ కిచెన్‌ హోటల్‌లో జరిగిన పేలుడు ఘటనలో దుర్గాభవానీనగర్‌లో ఇళ్లు ధ్వంసమై నిరాశ్రయులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాల్సిందిగా బస్తీ నివాసితులు షేక్‌పేట తహశీల్దార్‌ అనితారెడ్డికి విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నాయకుడు మామిడి నర్సింగరావు నాయకత్వంలో హోటల్‌ ప్రమాద ఘటన బాధితులు సోమవారం తహశీల్దార్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమ ఇళ్లన్నీ ధ్వంసమయ్యాయని, దీంతో తాము ఉండడానికి ఇళ్లు కూడా లేవని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం తరుపున వీరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా చూడాలని నర్సింగరావు తహశీల్దార్‌ను కోరారు. దీనికి స్పందించిన ఆమె ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీనిచ్చారు. తహశీల్దార్‌కు వినతి పత్రం సమర్పించిన వారిలో బస్తీ అధ్యక్షుడు శ్రీనునాయక్‌, మనూనాయక్‌, జానీనాయక్‌ తదితరులు ఉన్నారు.

వాల్వ్‌ లీకేజీతో వృథాగా పోయిన మంచినీరు

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌ రోడ్‌ నెం.12 లోని ఓమెగా ఆస్పత్రి వద్ద సోమవారం మంచినీటి వాల్వ్‌ లీకేజీ వల్ల పెద్దఎత్తున నీరు వృథాగా పోయింది. వాల్వ్‌ వద్ద సాంకేతిక సమస్య ఉందని తెలుసుకున్న జలమండలి అధికారులు అక్కడికి చేరుకొని రెండుగంటల పాటు శ్రమించి లీకేజీ వాల్వ్‌కు మరమ్మతులు చేశారు. పెద్ద ఎత్తున లీకేజీ అయిన నీరు ఎమ్మెల్యే కాలనీ వైపు వెళ్లడంతో కాలనీ మొత్తం బురదమయంగా మారింది.



16 నుంచి మండల పూజా మహోత్సవాలు



కరపత్రం ఆవిష్కరిస్తున్న ఆలయ ఈవో శ్రీనివాసశర్మ,అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్‌ కాలనీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఈ నెల 16వ తేదీ నుంచి డిసెంబర్‌ 27వ తేదీ వరకు మండల పూజా మహోత్సవాలు వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు. సోమవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయ్యప్ప స్వామి ఆలయ గురుస్వామి జె.శ్రీనివాస్‌తో కలిసి ఆయన కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా మాదిరిగానే ఈసారి కూడా స్వామివారి పడిపూజలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. డిసెంబర్‌ 8వ తేదీన 108 కలశాలతో స్వామివారికి అభిషేకం, 15వ తేదీన గజారోహణ మహోత్సవం, 27వ తేదీన మహా పూర్ణాహుతి, లక్ష పుష్పార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు మురళీధర శర్మ, శేషాచార్యులు, శశికుమారా చార్యులు, వేద పండితుడు జ్యోతిశ్చంద్ర శర్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర కలశాభిషేకం



ఆలయంలో సహస్ర కలశాభిషేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఫిలింనగర్‌: ఫిలింనగర్‌ దైవసన్నిధానంలోని అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన సహస్ర కలశాభిషేక పూజలు వైభవంగా జరిగాయి. కేరళ నుంచి ప్రత్యేకంగా వచ్చిన వాయిద్యకారుల వాయిద్యాలు, అర్చకులు వేద మంత్రాల నడుమ స్వామివారికి నిర్వహించిన విశేష పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణమంతా అయ్యప్ప స్వామి శరణుఘోషతో మార్మోగింది. ఈ సందర్భంగా స్వామివారికి గణపతి పూజ, విశేష ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు.

తిరుగులేని శక్తిగా బీజేపీ



ఎల్లారెడ్డిగూడలో బీజేపీ సభ్యత్వ నమోదులో లంకల దీపక్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణలో బీజేపీ తిరుగులేని శక్తిగా ఎదుగుతుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తేవటం ఖాయమని జూబ్లీహిల్స్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి లంకల దీపక్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి ఎల్లారెడ్డిగూడలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వాలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నేతలు శాంతికుమార్‌, గారపాటి అనంతలక్ష్మి, సుప్రియ, నరేందర్‌ యాదవ్‌, శ్రీధర్‌, కృష్ణగౌడ్‌ పాల్గొన్నారు.

బ్యాటరీల చోరీపై విచారిస్తే.. బంగారం చోరీ గుట్టువీడింది..

బంజారాహిల్స్‌: పంజగుట్టలో జరిగిన చోరీ కేసులో నిందితులను విచారించగా బంజారాహిల్స్‌లో జరిగిన బంగారం గుట్టు వీడిన ఘటన బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్‌ రోడ్డునెంబర్‌-12లోని ఎమ్మెల్యే కాలనీలో నివసించే అను టెస్ట్‌ట్యూబ్‌ బేబీ సెంటర్‌ వైద్యుడు డాక్టర్‌ ఎల్‌.నరేంద్రనాథ్‌ ఇంట్లో గత నాలుగున్నర సంవత్సరాలుగా దిలీప్‌గుప్తా, ఆయన భార్య దుర్గ పని మనుషులుగా పనిచేస్తున్నారు. నెలలో వీరిద్దరూ రెండుసార్లు సోమాజిగూడలోని అను టెస్ట్‌ ట్యూబ్‌ బేబీ సెంటర్‌ క్లినిక్‌కు పని నిమిత్తం వెళ్తుంటారు. ఇటీవల క్లినిక్‌లో 18 బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. పంజగుట్ట పోలీసులు వీరిద్దరినీ విచారణ చేయగా బంజారాహిల్స్‌లోని నరేంద్రనాథ్‌ ఇంట్లో బంగారం చోరీ చేసిన విషయాన్ని కూడా వెల్లడించారు. తన ఇంట్లో సుమారుగా 48 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించిన దిలీప్‌గుప్తా, ఆయన భార్య దుర్గపై చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు బంజారాహిల్స్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే బ్యాటరీల చోరీపై విచారించిన పోలీసులకు బంగారం చోరీ కేసు గుట్టువీడడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమలో విఫలమై కశ్మీరీ యువతి ఆత్మహత్య..!



ఇరం నబీ దార్‌ (ఫైల్‌)

ఫిలింనగర్‌: జమ్మూకశ్మీర్‌ పాకిస్తాన్‌ సరిహద్దులోని బారాముల్లా ప్రాంతానికి చెందిన ఓ యువతి ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి ప్రేమలో విఫలమై ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫిలింనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బారాముల్లా మాలాపొరా ప్రాంతానికి చెందిన ఇరం నబీదార్‌ (23) షేక్‌పేట గుల్షన్‌కాలనీలో ఓ పెంట్‌హౌస్‌లో అద్దెకు ఉంటూ బ్యాంక్‌ ఆఫ్‌ అమెరికాలో సాఫ్ట్‌వేర్‌ ఇంజినీర్‌గా గత జనవరి నుంచి పనిచేస్తున్నది. ఈ నెల 8వ తేదీన ఉదయం ఆమె స్నేహితుడు అబ్దుల్‌ ఆమెకు ఫోన్‌ చేయగా ఆమె ఫోన్‌ లిఫ్ట్‌ చేయలేదు. కొద్దిసేపటికే ఆమె తల్లి కూడా అబ్దుల్‌కు ఫోన్‌ చేసి తన కూతురు ఫోన్‌ లిఫ్ట్‌ చేయడం లేదని, ఒకసారి ఇంటికి వెళ్లి చూసి రావాలని తెలిపింది. ఆందోళన చెందిన అబ్దుల్‌ సాయంత్రం 5.30 గంటలకు ఇరం ఉంటున్న గదికి వెళ్లి తలుపు తట్టగా ఎంతకూ తెరవలేదు. దీంతో పక్కనే ఉన్న వాచ్‌మెన్‌ను పిలిచి తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే అంబులెన్స్‌ సహాయంతో ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. అబ్దుల్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్‌ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అంతకముందు రోజు అర్ధరాత్రి 2 గంటల వరకు కశ్మీర్‌లోని బారాముల్లాలో ఉండే తన ప్రియుడితో మాట్లాడినట్లుగా నిర్ధారించారు. ప్రేమ విఫలం కావడం వల్లనే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని విమానంలో కశ్మీర్‌కు తరలించారు. ఫిలింనగర్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం

జస్టిస్‌ విజయ్‌సేన్‌రెడ్డి

బంజారాహిల్స్‌: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని హైకోర్టు జడ్జి జస్టిస్‌ విజయ్‌సేన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌ ఓపెన్‌ టెన్నిస్‌ అసోసియేషన్‌ (హోట) ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్‌ ఇంటర్నేషనల్‌ సెంటర్‌ (జేఐసీ)లో జరుగుతున్న 19వ ఓపెన్‌ టెన్నిస్‌ టోర్నమెంట్‌ ముగింపు కార్యక్రమానికి హైకోర్టు జడ్జి జస్టిస్‌ విజయ్‌సేన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే అవి మన భవిష్యత్తును పూర్తిగా మార్చివేస్తుందన్నారు. కొందరు పెద్దగా చదువులేకపోయినా క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయిలో నిలిచారన్నారు. లింగమనేని లక్ష్మీ మెమోరియల్‌ కప్‌ పేరుతో నిర్వహించిన ఈ పోటీలు ఈ నెల 7న ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 30 ఏళ్ల వయస్సు నుంచి 70 ఏళ్ల వయస్సు వారు 323 మంది తమ పేర్లను సింగిల్స్‌, డబుల్స్‌లో నమోదు చేసుకున్నారు. 70 ఏళ్ల వయస్సు సింగిల్స్‌ విజేతగా గజపతి, డబుల్స్‌లో అంకయ్య, గజపతి, 60 ఏళ్ల వయస్సులో సింగిల్స్‌లో రమేష్‌, డబుల్స్‌లో రమేష్‌, మెహర్‌లు, 50 ఏళ్ల వయస్సులో సింగిల్స్‌లో శ్రీధర్‌, డబుల్స్‌లో డాక్టర్‌ సాంబశివరెడ్డి, శ్రీధర్‌, 40 ఏళ్ల సింగిల్స్‌లో డీఎస్పీ నంద్యాల నర్సింహారెడ్డి, డబుల్స్‌లో రాజా, లగాని శ్రీనివాస్‌, 30 ఏళ్ల సింగిల్స్‌లో విశాల్‌, డబుల్స్‌లో విజయ్‌, శ్రీరాంలు విజేతలుగా నిలిచారు. 70 ఏళ్ల వయస్సులో సింగిల్స్‌, డబుల్స్‌లో విజేతగా నిలిచిన గజపతిని ఇక్కడ ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు హోట ఆధ్వర్యంలో అవార్డులను అందించారు. ఈ సందర్భంగా అవార్డులు గెలుచుకున్న వారిని జస్టిస్‌ విజయసేన్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్‌ ఇంటర్నేషనల్‌ సెంటర్‌ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, హోట అధ్యక్షుడు నంద్యాల నర్సింహారెడ్డి, స్పోర్ట్స్‌ కన్వీనర్‌ ప్రవీణ్‌రెడ్డి, హోట సభ్యులు రఘోత్తంరావు, లగడపాటి శ్రీధర్‌, లగాని శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



ట్రోఫీల ప్రదానోత్సవంలో జస్టిస్‌ విజయ్‌సేన్‌రెడ్డి

మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

పంజగుట్ట: తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ దశాబ్ది ఉత్సవాలు, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 21వ తేదీన ప్రతీ గ్రామంలో ముదిరాజ్‌ జెండా ఎగరవేసి ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని తెలంగాణ ముదిరాజ్‌ మహాసభ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ గుర్రాల మల్లేషం పిలుపునిచ్చారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిళా అధ్యక్షురాలు మందుల వరలక్ష్మి, ఉపాధ్యక్షులు బల్ల సత్తయ్య, యువజన అధ్యక్షుడు పండుగ బాలులు మాట్లాడుతూ ముదిరాజ్‌ మహాసభ గత 10 సంవత్సరాల క్రితం డాక్టర్‌ బండ ప్రకాష్‌ ముదిరాజ్‌ నేతృత్వంలో ప్రారంభమై అనేక విజయాలు సాధించిందని ముఖ్యంగా కోకాపేటలో 300 కోటుల విలువైన 5 ఎకరాల స్థలం, 5 కోట్ల రూపాయల మంజూరు, మత్స్యకారులకు వెయ్యి కోట్ల బడ్జెట్‌ 75 శాతం రాయితీతో వివిధ పథకాలు, ముదిరాజ్‌లను బీసీ డి నుంచి బీసీఏ లోకి మార్చే ప్రక్రియలో భాగంగా గత రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌ ద్వారా సుప్రీంకోర్టుకు సానుకూలంగా వినతి పంపించడం లాంటి అనేక విజయాలు సాధించిదని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు బి.యాదగిరి, కృపాసాగర్‌, కనకయ్య, బొక్క శ్రీనివాస్‌, ఉషా ముదిరాజ్‌, చెరుకు సాంబరాజ్‌, రమేష్‌ ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

కొడుకు వైద్య కోసం తెచ్చిన డబ్బులు కొట్టేశారు..!

బంజారాహిల్స్‌: ఓ వ్యక్తి తన కొడుకు వైద్యం కోసం తెచ్చుకున్న డబ్బులు చోరీకి గురైన సంఘటన బంజారాహిల్స్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. మెదక్‌ జిల్లా, బులుపల్లి హవేలీ గ్రామానికి చెందిన ఎర్రంశెట్టి భానుచందర్‌ తన కుమారుడి వైద్య చికిత్స కోసం ఆదివారం బసవతారకం ఆస్పత్రికి వచ్చాడు. మధ్యాహ్నం ఆస్పత్రి బయట కొందరు అన్నదానం చేస్తుండగా భానుచందర్‌ తన కుమారుడితో సహా క్యూలైన్‌లో నిలబడ్డాడు.ఆ సమయంలో కుమారుడి చికిత్స నిమిత్తం తెచ్చుకున్న రూ.20 వేల నగదును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్‌ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

శాటిలైట్‌ ద్వారా విద్యాబోధన స్ఫూర్తిదాయకం

ఎడ్యుకేషన్‌ స్టూడియోను ప్రారంభించిన మాజీ ఐపీఎస్‌ అధికారి జేడీ

లక్డీకాపూల్‌: మూరుమూల గ్రామ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు ఇంటర్‌నెట్‌తో సంబంధం లేకుండా శాటిలైట్‌ ద్వారా విద్యా బోధన అందించడం స్ఫూర్తిదాయకమని మాజీ ఐపీఎస్‌ అధికారి జేడీ లక్ష్మినారాయణ అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థులకు పాఠాలు చేర్పించే టెక్నాలజీని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. సోమవారం లక్డీకాపూల్‌లో గ్రామీణ విద్యాజ్యోతి భారత్‌ సంస్థ ఆధ్వర్యంలో ఐ లెర్న్‌ ఇంజిన్స్‌, మెటా లెర్న్‌ ఇన్‌స్పైర్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంయుక్తంగా ఏర్పాటు చేసిన శాటిలైట్‌ డిజిటల్‌ ఎడ్యుకేషన్‌ స్టూడియోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ఇంటర్‌నెట్‌ అనేది పరిపాటిగా మారిందని.. కానీ ఇప్పటికీ ఇంటర్‌నెట్‌ లేని గ్రామాలు, రిమోట్‌ ఏరియాలు చాలా ఉన్నాయన్నారు. ఆ ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల కోసం శాటిలైట్‌ టీవీ టెక్నాలజీ ద్వారా పాఠాలు నేర్పించేందుకు ఈ సంస్థలు ముందుకు రావడం మంచి పరిణామన్నారు. ప్రపంచంలో విద్యను మించిన ఆయుధం లేదని.. క్వాలిటీ విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో ఆయా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామీణ విద్యాజ్యోతి ఫౌండర్‌ డాక్టర్‌ సోమ శేఖర్‌ మాట్లాడుతూ తాము ముందుగా ఈ శాటిలైట్‌ డిజిటల్‌ ఎడ్యుకేషన్‌ను ట్రిస్మా సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉండే బడ్జెట్‌ స్కూళ్ళలోకి తీసుకొస్తున్నామని అంచెలంచెలుగా దీన్ని మరింత విస్తరింప చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రిస్మా రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ శివరాత్రి యాదగిరి, లెర్న్‌ ఇన్‌స్పైర్‌ చైర్మన్‌ కళ్యాణ్‌ హట్టి, నేషనల్‌ ఇండిపెండెంట్‌ స్కూల్‌ అధ్యక్షుడు డాక్టర్‌ కులభూషణ్‌ శర్మ, ఆలిండియా ప్రైవేట్‌ స్కూల్స్‌ అసోసియేషన్‌ డైరెక్టర్‌ షిజు అగస్టీన్‌, శేఖర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా రుద్రయాగ సహిత నవచండీ మహాయాగం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్‌ ఆస్పత్రి ఆవరణలోని శ్రీ విజయగణపతి ఆలయంలో సోమవారం రుద్రయాగ సహిత నవచండీ మహాయాగం వేడుకగా ప్రారంభమైంది. తొమ్మిది రోజులపాటు ఈ చండీ మహాయాగం జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకులు విష్ణుభట్ల ఆంజనేయ చయనులు తెలిపారు. తొలిరోజు విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, ఋత్వికరణములు, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, వాస్తు మంటప పూజ, అగ్ని ప్రతిష్ఠాపనం, రుద్రహోమం ఆరంభం, చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం పూజాదికాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల హెరిటేజ్‌ ఫీల్డ్‌ ట్రిప్‌

శ్రీనగర్‌కాలనీ: విద్యార్థులు హెరిటేజ్‌ ఫీల్డ్‌ ట్రిప్‌లో సందడిగా గడుపుతూ చారిత్రాత్మక విషయాలతో పాటు పలు ఆసక్తికర అంశాలను తెలుసుకున్నారు. ఎర్రగడ్డ సంస్కార్‌ ది లైఫ్‌ స్కూల్‌ విద్యార్థులు సోమవారం చౌమొహల్లా ప్యాలెస్‌, ఖుతుబ్‌షాహీ టూంబ్స్‌తో పరిసర ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు హైదరాబాద్‌ చరిత్ర, నాగరికత, సంస్కృతి, కట్టడాల విశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. స్కూల్‌ సీఈఓ మోహనవంశీ, డైరెక్టర్‌ మధుమతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





హైదరాబాద్ వైబ్స్


భాగ్యనగరం.. రోజూ వేలాది మంది నగరానికి వస్తుంటారు. వారందరికీ హైదరాబాద్ పట్నం.. ఓ కల్పతరువులా మారుతోంది. ఎవరు వచ్చినా అందరినీ ఆదుకుంటుంది.. ఆదరిస్తుంటుంది. ఇలా రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాలు, వేరే రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర దేశాల నుంచి కూడా ఎంతో మంది వస్తుంటారు. వారందరినీ హైదరాబాద్ అక్కున చేర్చుకుంటోంది.. వ్యాపారం, పర్యాటకం కోసమే కాకుండా పై చదువుల కోసం కూడా ఇక్కడికి వస్తున్నారు. వీరందరినీ అమ్మలా ఆదరిస్తోంది భాగ్యనగరం.. వారంతా ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు, భాషపై ఎంతో మక్కువ చూపిస్తున్నారు. మన సంస్కృతిని అలవర్చుకుంటున్నారు. ఇక్కడి వారితో స్నేహం చేస్తూ.. కలిసిమెలిసి జీవనం సాగిస్తున్నారు. వేర్వేరు దేశాల నుంచి.. వేర్వేరు సంస్కృతుల నుంచి తమ కలలను సాకారం చేసుకునేందుకు ఎల్లలు దాటి ఇక్కడికి వచ్చిన కొందరు విదేశీ విద్యార్థుల మనోగతం తెలుసుకుందాం..

– సాక్షి, సిటీబ్యూరో

వుయ్ ఆర్ విదేశీ

నగరానికి భారీగా పరదేశీ విద్యార్థులు

- ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు నేర్చుకుంటూ
- భద్రత విషయంలో హైదరాబాద్ బెస్ట్ అంటున్న స్టూడెంట్స్
- నిజాం కాలేజీ, హెచ్‌సీయూ, ఓయూలో చేరేందుకు ఆసక్తి
- తెలుగు, ఉర్దూ భాషలు నేర్చుకునేందుకు ప్రయత్నం
- స్థానిక విద్యార్థులతో స్నేహం చేస్తూ కలివిడిగా ఉంటున్న ఫారినర్స్
- సొంత దేశాలకు వెళ్లినా ఇక్కడి సంస్కృతిపై అభిమానం





దేశం కాని, దేశం.. భాష కాని భాష.. అనుకోకుండా కొందరు.. ఇష్టంతో కొందరు ఇలా ఎంతో మంది భాగ్యనగరం గడ్డపై అడుగుపెట్టారు. కొత్త వాతావరణం, కొత్త మనుషులు, కొత్త ఆహారం ఇక్కడి పరిస్థితులు ఎలా ఉంటాయోనన్న భయం.. అనుమానం.. వాటన్నింటినీ భాగ్యనగరం ప్రజలు, వాతావరణం పటాపంచలు చేశాయి. కొత్త, వింత అనుకున్న సంస్కృతి, సంప్రదాయమే ఇప్పుడు వారికి ఎంతో ఇష్టంగా మారిపోయింది. ఈ సంస్కృతిలో భాగమవుతున్నారు. ఎలాంటి భయం లేకుండా మాతృభూమిపై ఉన్నట్టుగా స్వేచ్ఛగా జీవిస్తున్నారు. తెలుగుతో పాటు ఉర్దూ భాషలపై మమకారం పెంచుకుని వాటిని నేర్చుకునేందుకు ప్రయతిస్తున్నారు. ఇక్కడి పర్యాటక ప్రదేశాలను చూసి మురిసిపోతున్నారు.

ఎంతోమంది స్నేహితులు

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, నిజాం కాలేజీల్లో విదేశీ విద్యార్థులకు డిగ్రీ, పీజీ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. ఈ కోర్సుల్లో చేరేందుకు వేలాది మంది ఇక్కడికి వచ్చి కాలేజీల్లో చేరుతున్నారు. నిజాం కాలేజీలోనే దాదాపు 300 మంది విద్యార్థులు ఏటా వస్తున్నారని చెబుతున్నారు. ఇక, వేరే కాలేజీలు, యూనివర్సిటీలు కలిపి 2 వేలకు పైగా విద్యార్థులు ఏటా వస్తున్నారు.

నిబద్ధతతో నేర్చుకుంటారు..

ఇక్కడికి వచ్చే విదేశీ విద్యార్థులు పాఠాలను ఎంతో నిబద్ధతతో నేర్చుకుంటారు. ఏటా వందలాది మంది విద్యార్థులు వివిధ దేశాల నుంచి వస్తుంటారు. ఇక్కడ చదువుకుని వెళ్లిన వారు వారి బంధువులకు కూడా ఈ కాలేజీ గురించి చెప్పి ఇక్కడికి పంపిస్తుంటారు. అక్కడికి వెళ్లిన తర్వాత వారు మంచి ఉద్యోగాలు సాధించామని ఫోన్ చేసి చెబుతుంటారు. ఇక్కడి పిల్లలతో కలిసిపోతుంటారు. విదేశీ విద్యార్థులకు కాలేజీలో ఎలాంటి ఇబ్బందులూ రాకుండా మేం చూసుకుంటాం.

– ప్రొ.మహ్మద్ అబ్దుల్ అలీ, విదేశీ విద్యార్థులు కో–ఆర్డినేటర్, నిజాం కాలేజీ



సంస్కృతి చాలా ఇష్టం..

హైదరాబాద్ సంస్కృతి అంటే చాలా ఇష్టం. మట్టిగాజులు, మెహందీ మా దేశంలో ఎవరూ వేసుకోరు. కానీ నాకు వాటిపై ఎంతో ఇష్టం పెరిగింది. అందుకే ఎప్పుడూ మెహందీ పెట్టుకుంటాను. గాజులు వేసుకుంటాను. ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాల గురించి ఫ్రెండ్స్‌ను అప్పుడప్పుడూ అడిగి తెలుసుకుంటాను. భారత్‌కు ముఖ్యంగా హైదరాబాద్ రావడం చాలా సంతోషంగా ఉంది.

– దుర్సుంజెమల్ ఇబ్రుముజకోవా, బీఏ ఫస్ట్ ఇయర్, నిజాం కాలేజీ, తుర్క్‌మెనిస్తాన్

సొంతూర్లో ఉన్నట్టే..

ఇక్కడ చదువుకున్న ఓ బంధువు నిజాం కాలేజీ గురించి చెబితే ఇక్కడ చేరాను. మొదట్లో ఇక్కడి వాతావరణం, ఆహారంతో కాస్త ఇబ్బంది పడేదాన్ని. కానీ ఇప్పుడు అలవాటైంది. స్టూడెంట్స్, ప్రొఫెసర్స్ చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. స్నేహితులతో కలిసి ఓ ఫ్లాట్‌లో ఉంటాం. మా వంట మేమే చేసుకుంటాం. అప్పుడప్పుడూ ఇక్కడి స్నేహితులతో కలిసి బయటకు వెళ్లి.. హైదరాబాద్ రుచులను ఆస్వాదిస్తుంటాం. చార్మినార్, గోల్కొండ కోట వంటి ప్రదేశాలకు చాలాసార్లు వెళ్లాం.

– మహ్రీ అమన్‌దుర్దీయువా, బీఏ థర్డ్ ఇయర్, నిజాం కాలేజీ, తుర్క్‌మెనిస్తాన్



చాలా సంతోషంగా ఉంది..

ఇక్కడికి రావడం చాలా సంతోషంగా ఉంది. మొదట్లో కాస్త ఇబ్బంది పడినా.. ఇప్పుడు అంతా సెట్ అయ్యింది. ఇక్కడి వారితో పాటు మా దేశం నుంచి వచ్చిన ఫ్రెండ్స్‌తో టైం పాస్ చేస్తుంటాం. ఇక్కడి ఫుడ్, కల్చర్ చాలా నచ్చింది.

– అనస్, బీఏ ఫస్ట్ ఇయర్, సూడాన్

ఫీజులు కాస్త తక్కువ..

తమ దేశాలతో పోలిస్తే ఇక్కడ ఫీజులు కాస్త తక్కువగా ఉండటమే కాకుండా, చదువు కూడా క్వాలిటీ ఉంటుందనే ఉద్దేశంతో ఇక్కడికి వస్తున్నారు. సుడాన్, తుర్క్మెనిస్తాన్, యెమెన్, సోమాలియా వంటి దేశాల నుంచి ఎక్కువగా వస్తుంటారని నిజాం కాలేజీ విదేశీ విద్యార్థుల కో–ఆర్డినేటర్ మహ్మద్ అబ్దుల్ అలీ తెలిపారు. స్థానిక విద్యార్థులు కూడా విదేశీ విద్యార్థులతో కలివిడిగా ఉంటూ, వారికి ఏ అవసరం ఉన్నా కూడా సాయపడుతున్నారు. భాష సమస్య ఉన్నా కూడా అందరూ కలిసిమెలిసి ఉంటామని, ఇంగ్లిష్‌లో కమ్యూనికేట్ అవుతుంటామని నిజాం కాలేజీలోని పలువురు విదేశీ విద్యార్థులు పేర్కొన్నారు. తమకు ఇక్కడి వారు చాలా మంది స్నేహితులు ఉన్నారని, సెలవులు ఉన్నప్పుడు వారితో హైదరాబాద్‌లోని సందర్శనీయ ప్రదేశాలకు వెళ్లి వస్తుంటామని వివరించారు.

కేక్ మిక్సింగ్ ఫెస్ట్

ఖైరతాబాద్: క్రిస్మస్ వేడుకలకు భాగ్యనగరం సిద్ధమవుతోంది. సోమవారం లక్డీకాపూల్‌లోని అశోక హోటల్‌లో కేక్ మిక్సింగ్ ఫెస్ట్‌తో క్రిస్మస్ సంబరాలను ప్రారంభించారు. వివిధ రకాల డ్రై ఫ్రూట్స్, దేశీయ మద్యంతోపాటు ఖరీదైన వైన్‌తో కేక్ తయారీకి అవసరమైన మిక్సింగ్‌ను తయారు చేశారు. ఈ కేక్ మిక్సింగ్‌ను డిసెంబర్ రెండో వారం వరకూ నానబెట్టి సోక్ చేసి చివరగా కేక్ తయారీ ప్రారంభిస్తామని హోటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రవితేజస్విని రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ జావెద్‌లు తెలిపారు. ఈ సందర్భంగా హోటల్ సిబ్బంది పోటీపడి కేక్ మిక్సింగ్ చేశారు.




కత్రియాలో ఉత్సాహంగా..

పంజగుట్ట: క్రిస్టమస్, నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్ మిక్సింగ్ కార్యక్రమం సోమాజిగూడలోని హోటల్ కత్రియాలో సోమవారం నిర్వహించారు. మాస్టర్ చెఫ్ భక్తి అరోరా, గోపిల ఆధ్వర్యంలో సిబ్బంది బాదాం, వివిధ రంగుల చెర్రీస్, అందులో పలు రకాల లిక్కర్ పోసి కలిపారు. ఇలా కలిపిన మిశ్రమాన్ని కొన్ని రోజులపాటు పులియబెట్టి అనంతరం ఫ్లమ్ కేకులు, పుడ్డింగ్‌లు తయారు చేస్తామని మాస్టర్ చెఫ్ భక్తి అరోరా తెలిపారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శివరామ రాజు, జాయింట్ డైరెక్టర్ గాయత్రి, జనరల్ మేనేజర్ రమేష్ బాబు, ఫుడ్ మేనేజర్ అశోక్ పాల్గొన్నారు.



ఇఫ్తెకార్ ఇంటి విందుకు సోనుసూద్

శంషాబాద్: భారత–అమెరికా ద్వంద్వ పౌరసత్వ ప్రథమ పౌరుడు ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ శంషాబాద్‌లోని తన ఇంట్లో ఇచ్చిన ప్రత్యేక విందుకు సినీనటుడు సోనుసూద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇఫ్తెకార్ అహ్మద్ షరీఫ్ సోనుసూద్‌కు స్వాగతం పలికి సన్మానం చేశారు. అనంతరం వివిధ సామాజిక సేవా కార్యక్రమాలకు సంబంధించిన అనుభవాలను సోనుసూద్ ఆయనతో పంచుకున్నారు. రియల్ హీరోగా సోనుసూద్ చేస్తున్న కార్యక్రమాలను ఈ సందర్భంగా ఇఫ్తెకార్ అభినందించారు. అనంతరం విందులో పాల్గొన్నారు.



అలరించిన నారీ శక్తి



గన్‌ఫౌండ్రీ: జై జవాన్ జై కిసాన్ జై కళాకార్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నారీశక్తి నాట్యహేళ పేరిట సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నవజనార్ధన పారిజాతం, పేరిణి తాండవం అంశాలపై 90 నిమిషాల పాటు ఏకధాటిగా నర్తకీమణులు దువ్వూరి వాచ్సల్యేంద్ర, అభిమాణికా యాదవ్‌లు నర్తించి భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మాజీ మంత్రి ఎస్.వేణుగోపాలచారి ముఖ్య అతిథిగా హాజరై కళాకారులను అభినందించారు. భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన నర్తకిమణులు తల్లీ కూతుళ్లు కావడం విశేషం. ఈ కార్యక్రమంలో సినీ నటి ప్రగతి, జబర్దస్త్ ఫేమ్ సునామి సుధాకర్, ప్రముఖ నృత్య గురువు బండి కుమారస్వామి, భారత్ వరల్డ్ రికార్డ్స్ అధ్యక్షుడు లయన్ కేవీ.రమణరావు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి హైపెక్స్ 2024 ఎగ్జిబిషన్

సుల్తాన్‌బజార్: పిలాటెలిక్ అండ్ హాబీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుండి 17 వరకూ ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ రెడ్ హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ, చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఎస్‌టీసీసీఐ)లో మూడు రోజుల 'హైపెక్స్–2024' తపాల స్టాంపులు, నాణేలు, పేపర్ కరెన్సీ, పురాతన వస్తువుల ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు పిలాటెక్ అండ్ హాబీస్ సొసైటీ కార్యదర్శి సాగి శ్రీనివాస్‌రాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సొసైటీ ప్రతినిధులతో కలిసి మాట్లాడారు. ఈ ఎగ్జిబిషన్‌లో దేశం మొత్తం నుంచి 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురేష్‌కుమార్ సింఘాల్, ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ (ఎస్‌టీసీసీఐ), చీఫ్ పోస్ట్‌మాస్టర్ హైదరాబాద్ జీపీఓ వై.ప్రసాద్‌లు హాజరు కానున్నట్లు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ప్రముఖ కాయిన్ కలెక్టర్ డి.రాజారెడ్డి, వై.ప్రసాద్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు గుర్తుగా తాము ఒక స్మారక సావనీర్ లేబుల్ తీసుకొస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలు, ఇతర సంస్థలలో ప్రదర్శనలు, సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ట్రెజరర్ నిధి వికాస్ లఖోటియా, జాయింట్ సెక్రెటరీ ఎస్ శ్రీకాంత్, ఎంసీ మెంబర్ బద్దం సంతోష్‌రెడ్డి, మణికిరణ్, ఉపాధ్యక్షులు డి.రాధాకృష్ణ, పి.రాధాకృష్ణ పాల్గొన్నారు.



సహజ ఉత్పత్తులతోనే సౌందర్యం

ప్రముఖ న్యూట్రీషనిస్ట్ పూజా మఖీజా వ్యాఖ్య ■ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నరిష్ టు ఫ్లరిష్ ప్రోగ్రామ్



సాక్షి, సిటీబ్యూరో: ప్రకృతిలో సహజంగా లభ్యమయ్యే ఉత్పత్తులతో సౌందర్యం సొంతం చేసుకోవచ్చని సెలబ్రిటీల న్యూట్రీషనిస్టు పూజా మఖీజా పేర్కొన్నారు. ఆరోగ్యం కాపాడుకోవాలంటే సరైన ఆహారం తీసుకోవాలని సూచించారు. నగరంలోని ఓ హోటల్‌లో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నరిష్ టు ఫ్లరిష్ అనే ప్రోగ్రామ్ సోమవారం నిర్వహించారు. పోషకాలతోనే అందం అనే కాన్సెప్ట్‌తో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కార్బోహైడ్రేట్స్ తీసుకుంటే ఏదో జరిగిపోతుందనే అపోహ విడిచిపెట్టాలని, కాకపోతే చాలా తెలివితో ఆహారం తీసుకోవాలని చెప్పారు. సహజసిద్ధమైన ఆహారం తీసుకుంటే అందం, ఆరోగ్యం రెండూ మన సొంతం అవుతాయని పేర్కొన్నారు. ఎక్కువగా నీరు తాగడం అలవాటు చేసుకోవాలని, 73 శాతం భారతీయులు ఎక్కువగా ప్రొటీన్ తీసుకోరని చెప్పారు. మగవారికన్నా స్త్రీలకే ఎక్కువగా నిద్ర అవసరమన్నారు. ఇక, భారతీయ తాలీ ప్రపంచంలోనే అద్భుతమైన పోషకాలు అందించేదని వివరించారు. ప్రముఖ రచయిత సువర్ణ త్రిఖ మాట్లాడుతూ.. సహజసిద్ధమైన ఆహారం తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. సహజసిద్ధ ఉత్పత్తులు వాసన, రంగు సరిగ్గా ఉండకపోయినా అవి చర్మానికి, జుట్టుకు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు.





వైఫల్యాలు, మోసాలపై నిలదీస్తామని పాలక పక్షానికి భయం

పార్టీ ప్రజాప్రతినిధులతో భేటీలో వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, సూపర్ సిక్స్ మోసాలపై శాసనసభలో పాలకపక్షాన్ని నిలదీస్తామనే భయంతోనే 40 శాతం ఓట్లు సాధించిన వైఎస్సార్‌సీపీని ప్రతిపక్షంగా గుర్తించడం లేదని పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి సర్కారు వైఫల్యాలను సభ వెలుపల ప్రభుత్వ సాక్ష్యాధారాలతో ఎండగట్టాలని పార్టీ ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. శాసన మండలిలో ప్రజా గళాన్ని గట్టిగా వినిపించి వైఫల్యాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని ఎమ్మెల్సీలకు సూచించారు. ప్రశ్నించే స్వరమే వినిపించకూడదనే ఆలోచనతో ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కేసులు పెడతారని ఎవరూ భయపడవద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం శాసన సభ్యులతో, మధ్యాహ్నం శాసన మండలి సభ్యులతో వైఎస్ జగన్ సమావేశమయ్యారు.

మరిన్ని వివరాలు బడ్జెట్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఈ బడ్జెట్ అగమ్యగోచరం



2024-25 బడ్జెట్‌పై మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఆగ్రహం

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు నిధులు కేటాయించకుండా, రూ.41 వేల కోట్లు పెంచుతూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం రనౌట్ అయ్యిందని ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ధ్వజమెత్తారు. తాము 2019 మే 30న ప్రభుత్వం ఏర్పాటు చేసిన నెలన్నరలోనే జూలై 12న ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. కోవిడ్ వంటి ఇబ్బందులున్నప్పటికీ వరుసగా బడ్జెట్లు ప్రవేశపెడుతూ వచ్చామన్నారు. కానీ.. అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు.. అధికారంలోకి వచ్చాక పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశ పెట్టడానికి ఐదు నెలల సమయం తీసుకున్నారంటూ దెప్పి పొడిచారు. బడ్జెట్ ప్రసంగంలో 21 సార్లు గత ప్రభుత్వమంటూ ప్రస్తావించారని ఎత్తిచూపారు. తీరా బడ్జెట్ చూస్తే అగమ్యగోచరం అని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో లోపాలు, లొసుగులను ఎత్తిచూపారు. 'ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని రీతిలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి నేతలు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ పేరుతో ప్రచారం చేశారు. నీకు రూ.15 వేలు.. నీకు రూ.18 వేలు అంటూ ప్రచారం చేసి ప్రజలకు ఆశ కల్పించారు. వలంటీర్లను కొనసాగిస్తామని, గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారు. ఇప్పుడు వాటి ఊసే లేదు' అని కడిగి పారేశారు. ఈ సందర్భంగా బుగ్గన ఇంకా ఏమన్నారంటే..

రూ.41 వేల కోట్ల పెరుగుదల ఎలా సాధ్యం?

- 2024–25 వార్షిక బడ్జెట్ రూ.2,94,427 కోట్లు కాగా, గత ఏడాది సవరించిన అంచనాల మేరకు బడ్జెట్ రూ.2,53,500 కోట్లు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి రూ.41 వేల కోట్ల పెరుగుదల ఎలా సాధ్యం? అందులోనూ ఒక్క దీపం పథకంలో ఒక సిలిండర్ మినహా, సూపర్ సిక్స్ సహా సంక్షేమ పథకాలకు కేటాయింపులు చూపలేదు. అంటే సంక్షేమం లేకున్నా, రూ.41 వేల కోట్లు ఎక్కువ చూపిస్తున్నారు. ఇక అమరావతి పనుల కోసం చూపిన రూ.15 వేల కోట్లు.. గ్రాంటా? లేక అప్పా? అనేది ప్రశ్నార్థకం.
- పన్ను రాబడి రూ.24 వేల కోట్లు ఎక్కువ చూపిస్తున్నారు. వాస్తవానికి ఆదాయం తగ్గింది. కాగ్ లెక్కల ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్‌లో పన్నుల ఆదాయంలో దాదాపు 11 శాతం పెరుగుదల నమోదు కాగా, మేలో –2.8 శాతం, జూన్ లో –8.9 శాతం, జూలైలో –5.3 శాతం, ఆగస్టులో –1.9 శాతం, సెప్టెంబర్ లో –4.5 శాతం.. అలా మొత్తమ్మీద మైనస్ 2 శాతం ఆదాయం నమోదైంది. ఈ నేపథ్యంలో పన్ను రాబడి ఏకంగా రూ.24 వేల కోట్లు ఎలా పెరుగుతుంది?

ప్రతి ఒక్కరూ ఆలోచించాలి

- జీఎస్టీ ఆదాయంలో రూ.16 వేల కోట్ల నుంచి రూ.21,500 కోట్ల పెరుగుదల ఎలా సాధ్యం? స్టాంప్స్–రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా రూ.4 వేల కోట్ల నుంచి రూ.9,500 కోట్లు, సేల్స్ ట్యాక్స్ పన్ను రూ.8,500 కోట్ల నుంచి రూ.16 వేల కోట్లు, ఎక్సైజ్ డ్యూటీ రూ.8 వేల కోట్ల నుంచి రూ.17,500 కోట్లు, ఇతర పన్నులు రూ.2400 కోట్ల నుంచి రూ.5700 కోట్లు వస్తాయని ఎలా అంచనా వేస్తున్నారు?
- తొలి ఆరు నెలల్లో రాబడి రూ.41,500 కోట్లు అయితే, మిగిలిన ఆరు నెలల్లో రూ.78 వేల కోట్ల ఆదాయం ఎలా సాధ్యం? నెట్ పబ్లిక్ అకౌంట్.. అంటే ప్రభుత్వం వద్ద ఉండే ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన డబ్బును రూ.16 వేల కోట్ల నుంచి రూ.1,800 కోట్లకు తగ్గిస్తాం అంటున్నారు. ఆ ప్రకారం ఉద్యోగులకు పెండింగ్ ప్రావిడెంట్ ఫండ్ లాంటివి అన్నీ కట్టేయాలి. మరి ఈ ఐదు నెలల్లో ఆ పని చేశారా?

సూపర్ సిక్స్ పేరుతో మోసం

- యువగళం కింద యువతకు ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతిగా ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.
- తల్లికి వందనం పథకం కింద స్కూలుకు వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15 వేలు ఇస్తామని చెప్పారు. బడ్జెట్‌లో స్పష్టంగా కేటాయింపులు లేవు. బీసీ సంక్షేమంలో రూ.2,400 కోట్లు, ఎకనమిక్ వీకర్ సెక్షన్స్‌లో రూ.1160 కోట్లు.. ఇలా అన్ని కలిపి చూపినా తల్లికి వందనం పథకానికి రూ.5,300 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. వాస్తవానికి తల్లికి వందనంలో 83 లక్షల మంది పిల్లలకు ఇవ్వాలంటే రూ.12,450 కోట్లు కావాలి. అలాంటప్పుడు ఇప్పుడు కేటాయించిన మొత్తం ఎంత మందికి సరిపోతుంది?
- అన్నదాత సుఖీభవ పథకానికి బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయింపు కనిపిస్తోంది. వ్యవసాయ మంత్రి చెప్పిన ప్రకారం ఆ పథకానికి రూ.4,500 కోట్లు కేటాయించారు. మిగతా రూ.3500 కోట్లు పీఎం కిసాన్ నుంచి వచ్చేది. నిజానికి ఈ పథకంలో అర్హులైన రైతులు 53.53 లక్షల మందికి ఇవ్వాలంటే రూ.10,706 కోట్లు కావాలి.
- దీపం పథకానికి రూ.895 కోట్లు కేటాయించారు. ఈ మొత్తంతో 95 లక్షల కుటుంబాలకే ఇవ్వడం వీలవుతుంది. రాష్ట్రంలో 1.42 కోట్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఈ లెక్కన మిగతా వారందరికీ ఇవ్వరా? వాస్తవాలు ఇలా ఉంటే.. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం వంటి అన్ని పథకాలు అమలు చేసినట్లు ఎలా చెబుతారు?
- ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రూ.37,300 కోట్లు కావాలి. ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున 2,07,30,000 మందికి ఇవ్వాలి. దీని ఊసే లేదు. మహిళలకు ఉచిత బస్సు ప్రస్తావనే లేదు.
- 2014 ఎన్నికల్లో కూడా వ్యవసాయ రుణాల మాఫీ, సున్నా వడ్డీ రుణాలు, ధరల స్థిరీకరణ నిధి, డ్రాక్రా రుణాల మాఫీ, కాపులు, చేనేతలకు సాయం, నిరుద్యోగ భృతి.. ఇలా అన్ని హామీలు నెరవేర్చకుండా మోసం చేశారు. బాబు తీరు మొదటి నుంచీ ఇంతే. (బాబు తీరుపై వైఎస్సార్, రోశయ్యలు మాట్లాడిన వీడియో ప్రదర్శించి చూపారు).

హామీలు సూపర్ సిక్స్.. అమలులో

క్లీన్ బౌల్డ్



శాసన సభలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న పయ్యావుల కేశవ్

బాబు బడ్జెట్‌లో అప్పుల వాత.. పన్నుల మోత!

సాక్షి, అమరావతి: సూపర్ సిక్స్ హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తామనిగానీ.. నిర్దిష్ట కేటాయింపులుగానీ లేకుండానే సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం 2024–25 పూర్తి స్థాయి బడ్జెట్‌ను సోమవారం అసెంబ్లీకి సమర్పించింది. సంక్షేమం, అభివృద్ధి, సంపద సృష్టి బడ్జెట్‌లో ఎక్కడా ప్రతిబింబించకపోగా భారీగా పన్నుల మోత, అప్పుల వాతలు మాత్రం ప్రస్ఫుటంగా కనిపించాయి. సూపర్ సిక్స్ హామీలు డకౌట్ కావడంతో కూటమి సర్కారు తొలిసారిగా ప్రవేశపెట్టిన పూర్తి స్థాయి బడ్జెట్ ఇంట్లో ఈగల మోత.. బయట పల్లకీ మోత సామెతను తలపిస్తోంది. గత ఆర్థిక ఏడాది కంటే ఈదఫా పన్ను ఆదాయం ఏకంగా రూ.23,894 కోట్లు అదనంగా వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. అంటే పన్నుల రూపేణా ప్రజలపై మరింత భారం మోపనున్నారు. ఇందులో మద్యం ద్వారా అదనంగా రూ.10 వేల కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. గత ఆర్థిక ఏడాది మద్యం ద్వారా రూ.15,977 కోట్లు ఆదాయం రాగా ఈ ఆర్థిక ఏడాది రూ.25,597 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. పన్నేతర ఆదాయం గత ఆర్థిక ఏడాది కన్నా రూ.3,000 కోట్లకు పైగా అదనంగా వస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు. భారీ అప్పులు చేసి ప్రజలపై రుణం భారం మోపడమే లక్ష్యంగా 2024–25 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సోమవారం అసెంబ్లీకి సమర్పించారు. ఈ ఆర్థిక ఏడాది ప్రజా రుణం ఏకంగా రూ.91,443 కోట్లుగా బడ్జెట్‌లో పేర్కొన్నారు.

'సూపర్'.. బాదుడే!

సూపర్ సిక్స్‌లో తొలి హామీగా నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు చొప్పున భృతి ఇస్తామని చెప్పినప్పటికీ బడ్జెట్‌లో అసలు ఆ విషయాన్నే ప్రస్తావించకుండా యువతను ఎప్పటిలాగానే చంద్రబాబు సర్కారు మోసం చేసింది. రైతులకు పెట్టుబడి సాయం కోసం అన్నదాతా సుఖీభవ పథకాన్ని ఎప్పటి నుంచి అమలు చేస్తారో నిర్దిష్టంగా బడ్జెట్‌లో చెప్పకుండా తూతూ మంత్రంగా రూ.1,000 కోట్లు విదిలించి మసిబూసి మారేడుకాయ చేశారు. సూపర్ సిక్స్‌లో భాగంగా 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఇస్తామన్న హామీ గురించి బడ్జెట్‌లో కనీసం ప్రస్తావించకుండా మహిళలను దగా చేశారు. స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని సూపర్ సిక్స్‌లో చెప్పిన హామీని ఎప్పటి నుంచి అమలు చేస్తారనేది నిర్దిష్టంగా వెల్లడించకుండా వివిధ కార్పొరేషన్ల పేరుతో కొన్ని చోట్ల, జెండర్ బడ్జెట్‌లో కొన్ని చోట్ల కేటాయింపులు చేసినట్లు చూపించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యానికి పైసా కేటాయింపుల చేయకపోగా త్వరలో అమలు చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి కేశవ్ ముక్తాయించారు. మరోపక్క విద్యుత్ రంగానికి కేటాయింపుల్లో భారీగా కోత విధించారు. 2023–24లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.14,867.18 కోట్లు వ్యయం చేస్తే 2024–25లో సగానికిపైగా కోత విధించి కేవలం రూ.8,155.31 కోట్లను కేటాయించారు. అంటే వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం పడుతుందని చెప్పకనే కూటమి ప్రభుత్వం చెప్పింది. పేదల ఇళ్ల నిర్మాణాలకు అరకొర నిధుల కేటాయింపుతో సరిపుచ్చారు. 2023–24లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలకు రూ.6,866 కోట్ల వ్యయం చేయగా 2024–25లో కూటమి ప్రభుత్వం కేవలం రూ.4,012 కోట్లు మాత్రమే కేటాయించింది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ద్వారా భారీ ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో అంచనా వేశారు. అంటే భూమి విలువలను పెంచడం ద్వారా ప్రజలపై స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ రూపంలో ప్రజలపై అదనపు పన్నుల భారం వేయనున్నారు. 2023–24 లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖకు రూ.9,542 కోట్లు ఆదాయం రాగా 2024–25లో రూ.13,500 కోట్లు ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో పేర్కొన్నారు.

మొత్తం బడ్జెట్ స్వరూపం(రూ.కోట్లు)

రెవెన్యూ రాబడి	2,01,173.61
ప్రజా రుణం	91,443.01
రుణ రికవరీ	12.00
ప్రజా ఖాతా	1798.63
మొత్తం రాబడి	2,94,427.25
రెవెన్యూ వ్యయం	2,35,916.99
మూల ధన వ్యయం	32,712.84
అప్పు చెల్లింపులు	24,498.98
రుణాలు–అడ్వాన్స్‌లు	1298.44
మొత్తం వ్యయం	2,94,427.25

ఆదాయం, అప్పులు భారీగా..

సంపద సృష్టించడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటూ ఎన్నికల ముందు నమ్మబలికిన చంద్రబాబు బడ్జెట్‌లో ఆ మాటే గుర్తు లేనట్లు వ్యవహరించారు. ప్రభుత్వ రంగంలో పోర్టులు, వైద్య కళాశాలల నిర్మాణం గురించి అసలు ప్రస్తావనే చేయలేదు. మొత్తం మీద పన్నుల రూపంలో భారీ ఆదాయం, భారీ అప్పులతో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.2.94 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి ప్రవేశపెట్టారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2.35 లక్షల కోట్లు, మూలధన వ్యయం రూ.32,712 కోట్లుగా పేర్కొన్నారు. ద్రవ్యలోటు రూ.68,742 కోట్లు, రెవెన్యూ లోటు రూ.34,743 కోట్లుగా ఉంటుందని అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు.

పన్నుల రూపంలో భారీ ఆదాయం ఇలా

రంగం	2023-24	2024-25 (కోట్లలో)
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్	9,542.35	13,500.00
మద్యం (ఎక్సైజ్)	15,997.60	25,597.00
వాణిజ్య పన్నులు	49,605.39	61,989.18
వాహనాల పన్ను	4,557.09	5,203.00
పన్నేతర ఆదాయం	7,432.11	10,576.00

నగర వార్తలు

బోగస్ సర్వేతో ప్రయోజనమేంటి?

- ప్రజాధనం దుర్వినియోగంపై పిల్ దాఖలు చేస్తా
- మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వే లోపభూయిష్టంగా ఉందని, దీని వల్ల కోట్లాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగం తప్ప ఎలాంటి ప్రయోజనం లేదని మల్కాజిగిరి కార్పొరేటర్, బీజేపీ నాయకుడు శ్రవణ్ ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలోని ఎన్యూమరేటర్ల వద్ద ఉన్న సర్వే మార్గదర్శకాల పుస్తకాల్లో నమోదు చేయాల్సిన కోడ్ నంబర్లలో వ్యత్యాసముందన్నారు. ఒక పుస్తకంలో హిందువులైతే 01 కోడ్ ఉండగా, మరో పుస్తకంలో 02 కోడ్‌గా ఉందన్నారు. రెండు రకాల్లోని పుస్తకాల ఆధారంగా ఇద్దరు ఎన్యూమరేటర్లు నమోదు చేసే వివరాలు వేర్వేరుగా ఉన్నప్పుడు అసలు వాస్తవాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఈ సర్వేలోని ఇలాంటి కోడ్‌ల వల్ల హిందువుల లెక్కలు మారే ప్రమాదం ఉందన్నారు. అలాగే బీసీల గుర్తింపుగా ఒక బుక్‌లో కోడ్ 03 ఉంటే, మరో బుక్‌లో 04 ఉందని చెబుతూ, ఇలా సర్వేలో పలు లోపాలున్నాయని ఆరోపించారు. ఇలాంటి సర్వేలతో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు తదితరులకు ఎలా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. హిందువులను ముస్లింలుగా చూపే ప్రమాదం ఉందన్నారు. ప్రామాణికత లేకుండా నిర్వహిస్తున్న ఇలాంటి సర్వేలతో ప్రజాధనం దుర్వినియోగం తప్ప మరోటి కాదంటూ ఈ అంశంపై తాను ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేయనున్నట్లు చెప్పారు. ఆరు గ్యారంటీలు అమలు చేయలేక, ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ సర్వేకు తెర తీశారని ఆరోపించారు. ప్రజాపాలన దరఖాస్తుల్ని సైతం ఫ్లైఓవర్లపై పడేయడం వల్ల గతంలో ఎందరికో నష్టం జరిగిందన్నారు. చాలామందికి నేటికీ ఆ ప్రయోజనాలు అందడం లేదన్నారు. ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందస్తుగా అన్ని పార్టీలతో చర్చించి, ప్రజలకు అవగాహన కలిగించాక సర్వే ప్రారంభించేదన్నారు. గతంలో ఇలాంటి సర్వేలు ఎందుకన్న ప్రభుత్వ పెద్దలు ఆ విషయాన్ని మరిచినట్లుందన్నారు. రాజకీయ పదవుల గురించి, ప్రజల ఆస్తుల గురించి మీకెందుకని ప్రశ్నించారు.

భారతదేశం అనేక రకాల అస్తిత్వాలకు నిలయం

- మాజీ ఎమ్మెల్సీ, రిటైర్డ్ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్



డీజేఏసీ లోగోను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ నాగేశ్వర్ తదితరులు

పంజగుట్ట: దక్షిణ భారతదేశం గురించి మాట్లాడినంత మాత్రాన దేశాన్ని వ్యతిరేకించడం కాదని, సగౌరవంగా తాను భారతీయుడ్ని అని చెప్పుకుంటానని, భారతదేశంలో ఉన్న అసమానతలను తొలగించడం ఒక భారతీయుడిగా తన కర్తవ్యమని మాజీ ఎమ్మెల్సీ, రిటైర్డ్ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. భారతదేశం అనేక రకాల అస్తిత్వాలకు మూలమని, ఏ వర్గం అన్యాయానికి గురైనా వారి గురించి తప్పకుండా మాట్లాడాలని ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో దక్షిణాది జాయింట్ యాక్షన్ కమిటీ(డీజేఏసీ) ఆధ్వర్యంలో సెన్సెస్, డీలిమిటేషన్, త్రెట్ టు సౌత్ ఇండియా అనే అంశంపై సోమవారం సమావేశం నిర్వహించారు. డీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ నాగేశ్వర్ మాట్లాడుతూ.. 1970ల్లో అప్పటి భారత ప్రభుత్వం కుటుంబ నియంత్రణకు పిలుపునివ్వగా సౌత్ ఇండియా వారు సంపూర్ణంగా దాన్ని అమలు చేయగా, నార్త్ ఇండియా వారు చేయలేకపోయారని తెలిపారు. వాస్తవానికి దేశంలో పుట్టేవారి సంఖ్య, చనిపోయే వారి సంఖ్యతో సమానంగా ఉండాలని, కానీ సౌత్ ఇండియాలో పుట్టేవారి సంఖ్య 1.8కు పడిపోగా నార్త్ ఇండియాలో 2.3గా ఉందని, దీంతో పనిచేసే వారి సంఖ్య తక్కువై, వృద్ధుల సంఖ్య ఎక్కువ అవుతుందని, ఇది అతిపెద్ద ఎకనామీ ఛాలెంజ్‌గా మారుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించే సమయంలో జనాభా ప్రాతిపదికన మొదట్లో 1971 సెన్సెస్ ప్రకారం కేటాయింపులు ఉండేవని, కానీ 2018 నుంచి 2011 సన్సెస్ ప్రకారం నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. దీంతో గతంలో సౌత్ ఇండియాకు 18 శాతం నిధులు వస్తుండగా ఇప్పుడు 16.2 శాతం మాత్రమే వస్తున్నాయని నార్త్ ఇండియాకు 41 శాతం నిధులు వెళ్తున్నాయని పేర్కొన్నారు. సౌత్ ఇండియా మొత్తం అన్ని రాష్ట్రాలకు కలిపి వచ్చే నిధులు కేవలం ఉత్తర ప్రదేశ్‌కు వెళ్తున్నాయన్నారు. జనాభా లెక్కల ఆధారంగా రాజ్యసభ సీట్లు కేటాయించాల్సి ఉంటుందని, మొత్తం సౌత్ ఇండియా అన్ని రాష్ట్రాల్లో కలిపి 130 రాజ్యసభ సీట్లు ఉండగా కేవలం ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలకు 120 ఉన్నాయని, ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం మనకు మరిన్ని తగ్గే అవకాశం ఉందన్నారు. విశారదన్ మహరాజ్, పాశం యాదగిరి, కరీం, రాజేష్, అంజన్న, సునీత, స్వరూప పాల్గొన్నారు.

బాలుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా

లింగోజిగూడ: హయత్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 4వ తేదీన అజయ్ అనే విద్యార్థిపై గేటు పడటంతో మృతి చెందిన విషయం తెలిసిందే.. దీంతో అజయ్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని పలు పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాలు అజయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళన చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న రంగారెడ్డి జిల్లా డీఈఓ, కలెక్టర్‌తో మాట్లాడి ఎక్స్‌గ్రేసియా ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అజయ్ కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చెక్కును సోమవారం అందజేశారు. కార్యక్రమంలో హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కులగణనతో గ్రామాల్లో ప్రశాంతతకు భంగం

- మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు



బంజారాహిల్స్: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేతో గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతుందని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్‌రావు ఆరోపించారు. పట్టణాల్లో కులాలకు సంబంధం లేకుండా పక్కపక్కనే ఇళ్లు కట్టుకుని ఉంటుంటారని, గ్రామాల్లో మాత్రం కులాల గురించి ఆరా తీస్తే ఇబ్బందులు ఎదురవుతాయని, ఈ విషయంలో ప్రభుత్వం సంయమనంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. అసలు కులగణన ఎందుకు చేపట్టారో, దాని ఉద్దేశ్యం ఏమిటో స్పష్టత ఇవ్వాలన్నారు. కులం గురించి తెలుసుకోవాలంటే రేషన్‌కార్డుతో పాటు మరెన్నో మార్గాలు ఉన్నాయని వెల్లడించారు. జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–17లోని తన నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కులగణన ద్వారా ఏం చేయాలనుకుంటున్నారో ప్రజలకు తెలియజేయాలన్నారు. కులగణనకు తాను వ్యతిరేకం కాదని, అయితే కొన్ని సూచనలు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. పట్టణాల్లో కులాలను పెద్దగా పట్టించుకోవడం లేదని, గ్రామాల్లో ఇంకా కులాల పట్టింపు బాగా ఉందన్నారు. ఏ పార్టీ అయినా 50 శాతం జనరల్‌కు కేటాయించి, మిగిలిన 50 శాతం అన్ని కులాలకు కేటాయించాలన్నారు. కుల గణనపై పట్టణాల్లో కొంతమేర వ్యతిరేకంగా మాట్లాడుతున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో కుల గణనను ప్రోత్సహిస్తున్నట్లు తెలిసింది. కులం గురించి తెలుసుకోవడం కష్టమేమీ కాదని, అనేక మార్గాల్లో కులం గురించి తెలుసుకోవచ్చన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వయస్సుకు మించి పదవిలో ఉన్నా బాగానే పనిచేస్తున్నారని ప్రశంసించారు. భాషా ప్రాతిపదికన విడిపోయిన రాష్ట్రాలు అంతటితో ఆగకుండా ప్రాంతీయ విభేధాలతో మరింతగా చీలిపోయాయన్నారు. మూసీ ప్రక్షాళన గొప్ప పని అన్నారు. కులగణన గజిబిజి లేకుండా సాఫీగా సాగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కేసీఆర్ పునర్నిర్మాణం చేసిన సచివాలయం అద్భుతంగా ఉందన్నారు. అదేవిధంగా ఎస్సీ వర్గీకరణ తనకు నచ్చలేదన్నారు.

దక్షిణ మధ్య రైల్వేలో ఎన్నికల కోలాహలం

- హైదరాబాద్‌లో విస్తృతంగా సంఘ్ నేతల ప్రచారం
- రైలింజన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థన



ఎన్నికల ప్రచారంలో భరణి భానుప్రసాద్, చిత్రంలో ప్రభురాజ్ వేగి మురళీకృష్ణ

నాంపల్లి: దక్షిణ మధ్య రైల్వేలో ఎన్నికల కోలాహలం నెలకొంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రైల్వే సంఘాలు ప్రచారాన్ని మరింత వేగవంతం చేశాయి. ఇందులో భాగంగానే సోమవారం హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నేతలు విస్తృతంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వచ్చేనెల 4, 5, 6వ తేదీల్లో నిర్వహించే సీక్రెట్ బ్యాలెట్ పోలింగ్‌లో రైలింజన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని వారు అభ్యర్థించారు. సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యులు వేగి మురళీకృష్ణ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఈ ప్రచార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ జాయింట్ జనరల్ సెక్రెటరీ భరణి భాను ప్రసాద్ హాజరయ్యారు. హైదరాబాద్ రెల్వే స్టేషన్ ప్రాంగణంలోని సీ అండ్ డబ్ల్యూ, ట్రెన్ లైటింగ్, టీఆర్‌డీ, కమర్షియల్, రిజర్వేషన్, మెడికల్, ఎలక్ట్రికల్, ఆపరేటింగ్ విభాగాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ప్రచారంలో భాగంగా పెద్ద ఎత్తున బాణా సంచాను కాల్చి కరపత్రాలను పంచారు. ఎంప్లాయిస్ సంఘ్ నాయకులు, కార్యకర్తలు చేపట్టిన సుడిగాలి పర్యటనలో భరణి భానుప్రసాద్ హాజరై రైలింజన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్‌ను గెలిపించి మొదటి స్థానంలో నిలబెట్టారని, ఈ ఎన్నికల్లో కూడా సంఘ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రైల్వే కార్మికుల సంక్షేమం సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌తో సాధ్యమని, ఈ సంఘానికి నేతృత్వం వహిస్తున్న ఎన్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి, కార్మికుల పక్షపాతి మర్రి రాఘవయ్య నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు. డివిజన్ సెక్రెటరీ ప్రభురాజ్, జోనల్ అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎస్‌వీఎన్. చౌదరి, సంఘ్ మహిళా విభాగం అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ సంధ్యారాణి, ఏసీ అండ్ ఎలక్ట్రికల్ బ్రాంచ్ చైర్మన్ నర్సింహరావు, హైదరాబాద్ బ్రాంచ్ సెక్రెటరీ దశరథ్‌కుమార్, జోన్ మీడియా కో ఆర్డినేటర్ ముక్తేవి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అస్కాని నరసింహసాగర్ అభినందనీయుడు

సాక్షి, సిటీబ్యూరో: 'అంతఃపురాలలో కాదు పురంలలో పూలు వికసించాలి' అని ఐదు దశాబ్దాల క్రితం ఒక గేయ ఖండ కావ్యాన్ని తన రచన ద్వారా తీసుకువచ్చిన దివంగత కవి అస్కాని నరసింహసాగర్ అభినందనీయుడని పలువురు వక్తలు కొనియాడారు. నగర శివార్లలో '50 వసంతాల ఎడారి పూలు' డిజిటల్ రూపంలో తీసుకొచ్చిన పుస్తకాన్ని తెలంగాణ తొలి మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ తొలి టీఎస్పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి, తెలంగాణ తొలి సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ఆవిష్కరించారు. నరసింహసాగర్ తెలుగు పండితుడైనందు వల్ల చదువు విషయంలో విద్యార్థులు అశ్రద్ధ చేయరాదనే కోణంలో కూడా తన పుస్తకంలో గేయాల రూపంలో రాయడం, తద్వారా జరిగే నష్టాలను వివరించడం స్పష్టంగా కనిపించిందన్నారు. ఆనాడు మహిళల కోసం తెచ్చిన పథకాలు వారి జీవితాల్లో వచ్చిన మార్పును సైతం తన గేయాలలో ప్రస్తావించడం, అప్పట్లోనే గొర్ల పెంపకం, బర్ల పెంపకం ఆర్థిక పటిష్టతకు దోహదపడతాయని చెప్పడాన్ని వక్తలు ప్రశంసించారు. ఆధునిక తరానికి ఈ గేయాలను అందుబాటులోకి తేవడానికి కుటుంబ సభ్యులు పుస్తకాన్ని డిజిటల్ రూపం చేయించడం శుభపరిణామం అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, సీనియర్ జర్నలిస్టులు రమేష్ హజారి, వర్దెల్లి వెంకన్న, రమణ కుమార్, యోగానంద్, శేఖర్‌తో పాటు కుటుంబ సభ్యులు అస్కాని శ్రీనివాస్ సాగర్, అస్కాని మారుతి సాగర్, కుసుమ, గౌని సత్యనారాయణ, నీలవేణి, బుచ్చన్న, శారద, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా ముసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆయన జ్ఞాపకార్థం డిజిటల్ లైబ్రరీకి రెండు కంప్యూటర్లను కుటుంబ సభ్యులు బహూకరించారు.





కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో రిత్విక్

అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ ప్లేయర్ బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకున్నాడు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో 23 ఏళ్ల రిత్విక్ ఐదు స్థానాలు ఎగబాకి 75వ ర్యాంక్‌లో నిలిచాడు. గతవారం మోజెల్లి ఓపెన్ ఏటీపీ–250 టోర్నీలో రిత్విక్ సెమీఫైనల్ చేరుకోవడంతో అతని ర్యాంక్ మెరుగైంది. భారత్‌కే చెందిన రోహన్ బోపన్న 12వ ర్యాంక్‌లో, యూకీ బాంబ్రీ 49వ ర్యాంక్‌లో ఉన్నారు.

భారత కొత్త నంబర్‌వన్‌గా శ్రీవల్లి రష్మిక



మహిళల టెన్నిస్ సింగిల్స్ విభాగంలో భారత కొత్త నంబర్‌వన్ ప్లేయర్‌గా హైదరాబాద్‌కు చెందిన భమిడిపాటి శ్రీవల్లి రష్మిక అవతరించింది. సోమవారం విడుదల చేసిన మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) ర్యాంకింగ్స్‌లో 22 ఏళ్ల రష్మిక రెండు స్థానాలు పడిపోయి 302వ స్థానంలో నిలిచింది. మూడు నెలలుగా భారత నంబర్‌వన్‌గా ఉన్న తెలంగాణ ప్లేయర్ సహజ యామలపల్లి ఏకంగా 18 స్థానాలు పడిపోయి 304వ ర్యాంక్‌కు చేరుకోవడం రష్మికకు కలిసొచ్చింది. భారత్‌కే చెందిన అంకిత రైనా 306వ ర్యాంక్‌లో, వైదేహి 405వ ర్యాంక్‌లో ఉన్నారు.


సంగీత

భారత్ శుభారంభం

- మలేసియాపై 4–0తో విజయం
- రెండు గోల్స్ చేసిన సంగీత
- నేడు కొరియాతో టీమిండియా పోరు

రాజ్‌గిర్ (బిహార్): ఆసియా మహిళల చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు శుభారంభం చేసింది. సోమవారం జరిగిన తొలి రౌండ్ లీగ్ మ్యాచ్‌లో సలీమా టెటె నాయకత్వంలోని భారత జట్టు 4–0 గోల్స్ తేడాతో మలేసియా జట్టుపై గెలిచింది. భారత్ తరఫున సంగీత కుమారి (8వ, 55వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేయగా... ప్రీతి దూబే (43వ నిమిషంలో), ఉదిత (44వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. ఇతర తొలి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో పారిస్ ఒలింపిక్స్ రజత పతక విజేత చైనా 15–0తో థాయ్‌లాండ్‌ను చిత్తు చేయగా... జపాన్, కొరియా మధ్య మ్యాచ్ 2–2తో 'డ్రా'గా ముగిసింది. మలేసియా చేతిలో ఓటమి ఎరుగని భారత జట్టు ఈసారీ పూర్తి ఆధిపత్యం చలాయించింది. ఎనిమిదో నిమిషంలో లభించిన రెండో పెనాల్టీ కార్నర్‌ను సంగీత లక్ష్యానికి చేర్చడంతో భారత్ ఖాతా తెరిచింది. ఆ తర్వాత భారత్ జోరు కొనసాగించినా ఫినిషింగ్ వేధించింది. ఫలితంగా 42వ నిమిషం వరకు భారత్ ఖాతాలో మరో గోల్ చేరలేదు. అయితే రెండు నిమిషాల వ్యవధిలో లభించిన రెండు పెనాల్టీ కార్నర్‌లను ప్రీతి దూబే, ఉదిత సద్వినియోగం చేసుకోవడంతో భారత్ ఒక్కసారిగా 3–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మ్యాచ్ మరో ఐదు నిమిషాల్లో ముగుస్తుందనగా సంగీత ఫీల్డ్ గోల్‌తో భారత ఆధిక్యం 4–0కు పెరిగింది. ఓవరాల్‌గా ఈ మ్యాచ్‌లో భారత్‌కు 11 పెనాల్టీ కార్నర్‌లు, మలేసియాకు ఒక పెనాల్టీ కార్నర్ లభించాయి.

సంధి కాలం కాదు... సత్తా చాటాల్సిన సమయం!

సొంతగడ్డపై టెస్టు సిరీస్‌లో న్యూజిలాండ్ చేతిలో అనూహ్యంగా చిత్తయిన తర్వాత భారత క్రికెట్ జట్టు అతి పెద్ద సమరానికి సిద్ధమైంది. ఐదు టెస్టుల బోర్డర్–గావస్కర్ ట్రోఫీలో పాల్గొనేందుకు టీమిండియా ఆస్ట్రేలియాకు బయలదేరింది. స్వదేశంలో ప్రదర్శన తర్వాత జట్టుపై అంచనాలు తక్కువగానే ఉన్నా... కంగారూ గడ్డపై గత రెండు సిరీస్‌లూ నెగ్గి ఆధిపత్యం ప్రదర్శించిన తమ ఆట తీరు స్ఫూర్తిగా కొత్త ఆశలు రేపుతోంది. ఈ నేపథ్యంలో తాజా ఓటమిని మరచి ఆసీస్‌పై సత్తా చాటుతామని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ చెబుతున్నాడు. రోహిత్, కోహ్లి ఫామ్‌లోకి వచ్చి తమ స్థాయికి తగ్గ ప్రదర్శన ఇస్తారని అతను విశ్వాసం వ్యక్తం చేస్తున్నాడు. విరాట్ కోహ్లితో కలిపి జట్టులోని ఏడుగురు ఆటగాళ్లు ముందే ఆస్ట్రేలియాకు చేరుకోగా... కెప్టెన్ రోహిత్ శర్మ మినహా మిగతా వారంతా సోమవారం బయలుదేరి వెళ్లారు. నవంబర్ 22 నుంచి పెర్త్‌లో తొలి టెస్టు జరుగుతుంది.


బోర్డర్–గావస్కర్ ట్రోఫీ సిరీస్‌పై గంభీర్ ఆశాభావం
- సీనియర్లు రాణిస్తారని విశ్వాసం
- తనపై ఒత్తిడి లేదన్న భారత హెడ్ కోచ్
- ఆస్ట్రేలియాకు బయలుదేరిన టీమిండియా

గంభీర్

ముంబై: భారత జట్టు సంధి దశలో ఉందా లేదా అనే విషయాన్ని తాను పట్టించుకోనని, ప్రస్తుతానికి ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌పైనే తన దృష్టి ఉందని భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ స్పష్టం చేశాడు. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్‌కు చేరే అంశాన్ని కూడా పట్టించుకోవడం లేదని అతను వ్యాఖ్యానించాడు. కోచ్‌గా తనపై ఎలాంటి ఒత్తిడీ లేదన్న గంభీర్ ఆస్ట్రేలియాకు బయలుదేరే ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో పలు ప్రశ్నలకు సమాధానమిచ్చాడు. విశేషాలు అతని మాటల్లోనే...

కోచ్‌గా ఒత్తిడి ఎదుర్కోవడంపై...

న్యూజిలాండ్ చేతిలో ఓటమిపై నన్ను విమర్శించడంలో తప్పు లేదు. వాటిని స్వీకరించేందుకు నేను సదా సిద్ధం. మా ఓటమికి సాకులు వెతకడం లేదు. కివీస్ అన్ని రంగాల్లో చాలా బాగా ఆడింది. అయితే ఇప్పుడు సోషల్ మీడియాలో నాపై విరుచుకుపడటంలో అర్థం లేదు. దాని వల్ల మా జీవితాల్లో ఏమైనా తేడా వస్తుందా? నేను ఈ బాధ్యతలు తీసుకున్నప్పుడే చాలా కష్టమైన పని అని తెలుసు. ఒత్తిడి బాగా ఉంటుందనేది కూడా తెలుసు. నా బాధ్యతను నేను నిజాయితీతో నిర్వర్తిస్తున్నా. కాబట్టి ఒత్తిడి నాకు సమస్య కాదు. భారత జట్టుకు కోచ్‌గా వ్యవహరించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా.

రోహిత్, కోహ్లి ఫామ్‌పై...

ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల ఫామ్‌పై ఎలాంటి ఆందోళన లేదు. వారిద్దరూ మానసికంగా చాలా దృఢమైన వారు. ఇప్పటికే భారత్ తరఫున ఎంతో సాధించిన వారిద్దరు మరిన్ని ఘనతలకు సిద్ధంగా ఉన్నారు. వారిలో ఇంకా ఎంతో తపన మిగిలి ఉంది. దాని కోసం చాలా కష్టపడుతున్నారు. గత సిరీస్ వైఫల్యం తర్వాత పరుగులు సాధించాలనే కసి వారిలో కనిపిస్తోంది. దేశం తరఫున వారి అంకితభావాన్ని ఎప్పుడూ ప్రశ్నించవద్దు. ఇది పూర్తిగా కొత్త సిరీస్. కాబట్టి అక్కడ బాగా ఆడి సిరీస్ గెలవడమే అందరి లక్ష్యం.

టీమిండియా సంధి దశపై...

ఎంతో సాధించాలనే ఆటగాళ్లు పెద్ద సంఖ్యలో మా డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నారు. జట్టుకు సంబంధించి ఇది సంధి కాలం అనే మాటను నేను నమ్మను. బయటి వారు ఎలా అనుకున్నా నేను అలాంటి పదాలను వాడను. పేరు ఏం పెట్టుకున్నా మార్పు అనేది సహజం. గతంలోనూ భారత జట్టులో ఇలాంటివి జరిగాయి కాబట్టి ఇక ముందూ జరుగుతాయి. నా ధ్యాసంతా ప్రస్తుతం ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌పైనే ఉంది. ఇప్పుడు నాకు అన్నింటికంటే అదే ముఖ్యం.

ఆసీస్‌లో పరిస్థితులపై...

మా ముందు అన్నింటికంటే పెద్ద సవాల్ అక్కడి పరిస్థితులకు అలవాటు పడటమే. వచ్చే పది రోజులు అందుకే చాలా కీలకం. ఈ సమయంలో తగిన విధంగా సన్నద్ధమైతే తొలి మ్యాచ్‌కు ముందు అంతా బాగుంటుంది. గతంలో ఆస్ట్రేలియాలో ఆడిన అనేక మంది అనుభవజ్ఞులు జట్టులో ఉండటం సానుకూలాంశం. వారి అనుభవం యువ ఆటగాళ్లకు కూడా పనికొస్తుంది. ఈ పది రోజులు సన్నాహాలు బాగా సాగితే 22న ఉదయం తొలి బంతి నుంచే చెలరేగిపోయే అవకాశం ఉంటుంది. వారు ఎలాంటి పిచ్‌లు ఇస్తారనేది అనవసరం. మేం అన్నింటికీ సిద్ధంగా ఉన్నాం. పిచ్ ఎలా ఉన్నా మా సామర్థ్యానికి తగినట్లు ఆడితే ఎవరినైనా ఓడించగలం.

జట్టులోని యువ ఆటగాళ్లపై...

గతాన్ని పక్కన పెట్టి ముందుకు వెళ్లడం అవసరం కాబట్టి అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకున్న తర్వాతే వీరిని ఎంపిక చేశారు. విజయానికి ఉపయోగపడగలరనే నమ్మకంతో అత్యుత్తమ జట్టునే ఎంపిక చేశాం. వ్యక్తిగత రికార్డులకంటే జట్టు ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇవ్వాలని జూనియర్లకు గట్టిగా చెప్పాను. నితీశ్ కుమార్ రెడ్డి మంచి ప్రతిభావంతుడు. అవకాశం లభిస్తే అతను సత్తా చాటగలడు. సుదీర్ఘ టెస్టు సిరీస్‌కు ముందు పేసర్లు అలసట లేకుండా ఉండాలనే కారణంతోనే హర్షిత్ రాణాను 'ఎ' జట్టుతో పంపలేదు. రంజీ ట్రోఫీలో అతను తగినంత బౌలింగ్ కూడా చేశాడు కాబట్టి ఈ నిర్ణయం తీసుకున్నాం. మా ఐదుగురు పేసర్లూ భిన్నమైన శైలి కలవారు కాబట్టి బౌలింగ్‌లో మంచి పదును ఉంది.


విమానాశ్రయంలో ఆకాశ్‌దీప్, సిరాజ్

ఓపెనర్‌గా రాహుల్!

కెప్టెన్ రోహిత్ శర్మ తొలి టెస్టు ఆడటంపై ఇంకా సందేహాలు ఉన్నాయి. మ్యాచ్ సమయానికే దీనిపై స్పష్టత వస్తుంది. అయితే ఓపెనర్‌గా భారత్‌కు తగినన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయని గంభీర్ చెప్పాడు. అయితే అభిమన్యు ఈశ్వరన్‌తో పోలిస్తే అనుభవజ్ఞుడైన రాహుల్‌కే అవకాశం దక్కవచ్చని పరోక్షంగా వెల్లడించాడు. 'అటు ఓపెనర్‌గా, ఇటు మిడిలార్డర్‌లోనూ ఆడగలిగే సామర్థ్యం ఉన్న బ్యాటర్లు ప్రపంచ క్రికెట్‌లో చాలా తక్కువ మంది ఉంటారు. రాహుల్ అలాంటి వారిలో ఒకడు. తనకు ఏ బాధ్యత అయినా అప్పగించవచ్చు' అని గంభీర్ వ్యాఖ్యానించాడు.

చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ టోర్నీ విజేత అరవింద్



చెన్నై: వరుసగా రెండో ఏడాది చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ చెస్ టోర్నీ టైటిల్ భారత గ్రాండ్‌మాస్టర్‌కు దక్కింది. గత ఏడాది ఈ టైటిల్‌ను తమిళనాడు ప్లేయర్ దొమ్మరాజు గుకేశ్ దక్కించుకోగా... ఈ ఏడాది తమిళనాడుకే చెందిన గ్రాండ్‌మాస్టర్ అరవింద్ చిదంబరం సొంతం చేసుకున్నాడు. ఎనిమిది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య ఏడు రౌండ్లపాటు ఈ టోర్నీ జరిగింది. నిర్ణీత ఏడు రౌండ్ల తర్వాత అరవింద్, అరోనియన్ (అమెరికా), భారత నంబర్‌వన్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 4.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. చివరిదైన ఏడో రౌండ్‌లో అరవింద్ 64 ఎత్తుల్లో పర్హామ్ (ఇరాన్)పై గెలుపొందగా... లాగ్రెవ్‌తో అర్జున్; అరోనియన్‌తో అమీన్; విదిత్‌తో అలెక్సీ తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. విజేతను నిర్ణయించేందుకు టైబ్రేక్‌ను నిర్వహించారు. ఓవరాల్‌గా మెరుగైన టైబ్రేక్ స్కోరు కారణంగా అరవింద్ నేరుగా ఫైనల్లోకి ప్రవేశించగా... అర్జున్, అరోనియన్ మధ్య జరిగిన సెమీఫైనల్లో అరోనియన్ గెలిచి ఫైనల్లో అరవింద్‌తో తలపడ్డాడు. ఫైనల్లో అరవింద్ 2–0తో అరోనియన్‌ను ఓడించి చాంపియన్‌గా అవతరించాడు. అర్జున్‌కు మూడో స్థానం లభించింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా

నన్ను అలా పిలవొద్దు



– కమల్ హాసన్

'ఉలగనాయగన్, విశ్వ నటుడు, లోక నాయకుడు'... ఇలా కమల్ హాసన్‌ను ఆయన అభిమానులు ప్రేమగా, ఆప్యాయంగా పిలుచుకుంటుంటారు. అయితే ఇకపై తనను ఆ తరహా స్టార్ ట్యాగ్స్‌తో పిలవొద్దని, కమల్ హాసన్ అని పిలిస్తే చాలంటూ 'ఎక్స్'లో ఓ లేఖను షేర్ చేశారు కమల్ హాసన్. ''నా పనిని మెచ్చి, నాకు ఎన్నో బిరుదులు ఇచ్చిన నా అభిమానులు, ప్రేక్షకులు, నా తోటి నటీనటులకు కృతజ్ఞతలు. ఎంతోమంది నటీనటులు, సాంకేతిక నిపుణులు, ప్రేక్షకులు కలిస్తే ఓ సృజనాత్మక సినిమా అవుతుంది. కళ కంటే కళాకారుడు గొప్ప కాదని నా అభిప్రాయం. అలాగే ఓ వ్యక్తిగా నా మూలాలకు నేను కట్టుబడి ఉండాలనుకుంటున్నాను. సినిమా రంగంలో నిత్య విద్యార్థిగా నేను నేర్చుకోవాల్సింది చాలా ఉంది. దయచేసి ఇకపై నన్ను ఎవరూ బిరుదుల పేర్లతో పిలవొద్దు. ఎంతో ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నాను. కమల్ హాసన్ లేదా కమల్ లేదా కేహెచ్ అని పిలిస్తే చాలని నా ఫ్యాన్స్, నా తోటి నటీనటులు, నా స్నేహితులు, నా శ్రేయోభిలాషులను కోరుకుంటున్నాను'' అంటూ ఆ లేఖలో పేర్కొన్నారాయన. ఇక కమల్ హాసన్ హీరోగా మణిరత్నం దర్శకత్వం వహించిన 'థగ్ లైఫ్' చిత్రం జూన్ 5న విడుదల కానుంది.

కళాకారులకు మద్దతుగా నిలబడాలి

– కోమటిరెడ్డి వెంకటరెడ్డి


రమేశ్ ప్రసాద్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రతాని

''నాకు సినిమాలంటే ఇష్టం. అయితే చిత్ర పరిశ్రమ ఎవరో ఐదారుగురు పెద్ద వారిదే కాదు.. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల్లో సినిమా పట్ల ఆసక్తి ఉన్న అందరిదీ. వీరందరికీ నటన రాదు. వచ్చిన కళాకారులకు మనం మద్దతుగా నిలబడాలి'' అని తెలంగాణ రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరారు. ఇటీవల జరిగిన 'తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్'(టీఎఫ్‌సీసీ) ఎన్నికల్లో గెలిచిన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ–''టీఎఫ్‌సీసీకి ఆరోసారి చైర్మన్‌గా ఎన్నికైన రామకృష్ణ గౌడ్‌కి శుభాకాంక్షలు. టీఎఫ్‌సీసీకి 800 గజాల స్థలం ఇప్పించేందుకు ప్రభుత్వం తరఫున కృషి చేస్తాం'' అని తెలిపారు. ''మా కార్యాలయానికి ఫిలింనగర్‌లో 800 గజాల స్థలం ఇప్పిస్తే సొంత భవనం నిర్మించుకుంటాం'' అన్నారు టీఎఫ్‌సీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్. ఈ కార్యక్రమంలో ప్రసాద్ సంస్థల అధినేత, నిర్మాత రమేశ్ ప్రసాద్, టీఎఫ్‌సీసీ వైస్ ప్రెసిడెంట్ ఎత్తరి గురురాజ్, సెక్రటరీలు జేవీఆర్, కాచం సత్యనారాయణ మాట్లాడారు.

ముహూర్తం ఖరారు

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'పుష్ప2: ది రూల్'. ఈ చిత్రంలో రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లోని ఓ స్టూడియోలో జరుగుతోంది. కాగా ఈ మూవీ ట్రైలర్ విడుదలకు ముహూర్తం ఖరారు అయింది. ఈ నెల 17న పాట్నాలో 'పుష్ప 2: ది రూల్' ట్రైలర్ లాంచ్ వేడుక నిర్వహించనున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించి, అల్లు అర్జున్ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 17న సాయంత్రం 6 గంటల మూడు నిమిషాలకు ట్రైలర్ విడుదలకానుంది. ఫాహద్ ఫాజిల్, రావు రమేష్, సునీల్, అనసూయ భరద్వాజ్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.


అల్లు అర్జున్

కంగువ కిక్ ఇచ్చింది – శివ



''సిల్వర్ స్క్రీన్‌పై కొత్త ప్రపంచాలను, సరికొత్త నేపథ్యాలను చూసేందుకు ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం ఆ తరహా సినిమాలకు ఎక్కువ ఆదరణ దక్కుతోంది. ఈ అంశాలే నన్ను 'కంగువ' సినిమా చేసేలా ప్రేరేపించాయి. 'కంగువ' పూర్తిగా కల్పిత కథ. ప్రతి ఒక్కరి లోపల ఓ యుద్ధం ఉంటుంది. అలాగే బయట పరిస్థితులతోనూ యుద్ధం చేస్తుంటారు. ఈ రెండు యుద్ధాలను బ్యాలెన్స్ చేసిన ఓ యుద్ధవీరుడి కథే 'కంగువ'' అని దర్శకుడు శివ అన్నారు. సూర్య, దిశా పటానీ జోడీగా నటించిన చిత్రం 'కంగువ'. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు శివ మాట్లాడుతూ–''కంగువ, ఫ్రాన్సిస్' అనే రెండు పాత్రల్లో సూర్య కనిపిస్తారు. వెయ్యేళ్ల క్రితం నాటి పాత్ర కంగువ. ప్రస్తుత పాత్ర ఫ్రాన్సిస్. నాన్–లీనియర్ స్క్రీన్ ప్లేతో ఈ కథ రెండు డిఫరెంట్ టైమ్‌లైన్స్‌లో జరుగుతుంది. ఈ రెండు టైమ్‌లైన్స్, క్రియేటివ్ స్పేస్, కమర్షియల్ అంశాలు.. ఇవన్నీ 'కంగువ'లో పర్‌ఫెక్ట్‌గా బ్లెండ్ చేయడం ఓ దర్శకుడిగా నాకు కిక్ ఇచ్చింది. ఈ సినిమా కోసం సూర్య చాలా కష్టపడ్డారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ ప్రోత్సాహంతోనే ఇంత పెద్ద సినిమా చేయగలిగాను. 'యానిమల్' సినిమాకి ముందే బాబీడియోల్‌గారు మా చిత్రంలో భాగమయ్యారు. ఓ షాడో కాప్‌గా దిశాపటానీ చేశారు. దేవిశ్రీ ప్రసాద్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. నా దగ్గర కొన్ని కథలున్నాయి. అవకాశం వస్తే తెలుగు హీరోలతో చేసేందుకు సిద్ధంగా ఉన్నాను'' అని తెలిపారు.

అనన్యకు ఆహ్వానం



సాయిధరమ్ తేజ్ హీరోగా రోహిత్ కేపీ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ పీరియాడికల్ యాక్షన్ డ్రామా రూపు దిద్దుకుంటున్న సంగతి తెలిసిందే. ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో జగపతి బాబు, శ్రీకాంత్, సాయికుమార్ ఇతర లీడ్ రోల్స్‌లో నటిస్తున్నారు. తాజాగా హీరోయిన్ అనన్యకు ఈ చిత్ర యూనిట్ నుంచి ఆహ్వానం అందింది. ఈ చిత్రంలోని ఓ పవర్‌ఫుల్ పాత్రకు అనన్యను ఎంపిక చేసినట్లు సోమవారం చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమాకు సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్.

కొత్తవారి కోసమే దిల్ రాజు డ్రీమ్స్

– 'దిల్' రాజు



''చిత్ర పరిశ్రమలో కొత్త వాళ్లను, కొత్త కంటెంట్‌ను ప్రోత్సహించేందుకే 'దిల్ రాజు డ్రీమ్స్' అనే నిర్మాణ సంస్థను ప్రారంభించాను. దర్శక, నిర్మాతలు, హీరో, హీరోయిన్లు, రచయితలు.. ఇలా ఆసక్తి ఉన్న ఎవరైనా మా టీమ్‌ని సంప్రదించవచ్చు. ఇందుకోసం నా బర్త్‌డే(డిసెంబరు 18) లేదా జనవరి 1న వెబ్ సైట్‌ను ప్రారంభిస్తాం'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'దిల్ రాజు డ్రీమ్స్' లోగోను ఆయన విడుదల చేసి, మాట్లాడుతూ–''ఇండస్ట్రీలో చాలా చిత్రాలు వస్తున్నట్టుగా, పోయినట్టుగా కూడా ఎవరికీ తెలీదు. ఎంత డబ్బు వృథాగా పోతోందో నాకు తెలుసు. అందుకే ఈ డ్యామేజ్‌ని కంట్రోల్ చేయాలని, ప్రతిభ ఉన్న కొత్తవారికి సరైన వేదిక ఉండాలని 'దిల్ రాజు డ్రీమ్స్'ను స్థాపించాను. ఇప్పటికే ఇద్దరు ఎన్నారై నిర్మాతలు 'దిల్ రాజు డ్రీమ్స్' ద్వారా రెండు ప్రాజెక్టులు చేస్తున్నారు. ఈ సంస్థ కార్పొరేట్ స్టైల్‌లో ఉంటుంది. ఇక్కడ పనిచేసే వారందరికీ జీతాలు ఇస్తాం. ఏడాదికి నాలుగైదు సినిమాలు చేస్తాం.. వాటిలో కచ్చితంగా రెండు అయినా హిట్ కావాలని షరతు విధించాను. మంచి ప్రతిభావంతులకు నా బ్యానర్‌లో సినిమా చేసే అవకాశం కూడా ఉంటుంది. ఇక్కడ ఎలాంటి సిఫారసులు ఉండవు. అందరూ వెబ్ సైట్ ద్వారానే సంప్రదించాలి'' అని తెలిపారు.



'వేదం, గమ్యం, కంచె వంటి చిత్రాల దర్శకుడు క్రిష్ జాగర్లమూడి పెళ్లి చేసుకున్నారు. డాక్టర్ ప్రీతి చల్లాతో ఆయన ఏడడుగులు వేశారు. ప్రస్తుతం వీరి పెళ్లి ఫొటోలు, వీడియో నెట్టింట వైరల్‌గా మారాయి. కాగా గతంలో రమ్య అనే డాక్టర్‌ని వివాహం చేసుకున్నారు క్రిష్. అయితే ఆ తర్వాత ఇద్దరూ విడిపోయారు. తాజాగా సీనియర్ గైనకాలజిస్ట్ ప్రీతి చల్లాని రెండో వివాహం చేసుకున్నారు క్రిష్. ఇదిలా ఉంటే.. ప్రీతి చల్లాకి కూడా ఇది రెండో పెళ్లి అని టాక్. కొత్త జీవితంలోకి అడుగుపెట్టిన వీరికి పలువురు శుభాకాంక్షలు చెబుతున్నారు. కాగా ప్రస్తుతం అనుష్కతో 'ఘాటీ' సినిమా తెరకెక్కిస్తున్నారు క్రిష్.

ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తున్నారు

– గోపీమోహన్


రామ్ కుమార్, గోపీమోహన్

''కొడుకుని ప్రేమించే తండ్రి.. తండ్రిని ప్రేమించే కొడుకు.. ఇదే మా 'ధూం ధాం'కి మూలకథ. మేం అనుకున్నట్లే పాటలు, వినోదాన్ని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. గల్లా జయదేవ్ రెండో అబ్బాయి హీరోగా నా దర్శకత్వంలో ఓ సినిమా ఉంటుంది.. వివరాలు త్వరలోనే చెబుతాం'' అని 'ధూం ధాం' చిత్ర కథ, స్క్రీన్‌ప్లే రచయిత గోపీమోహన్ అన్నారు. చేతన్ కృష్ణ, హెబ్బా పటేల్ జంటగా సాయి కిషోర్ మచ్చా దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ధూం ధాం'. రామ్ కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 8న విడుదలైంది. ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ– ''మా సినిమా చూసిన ప్రతి ప్రేక్షకుడు ఎంటర్‌టైన్ అవుతున్నాడు. మేం ఆశించినంత కలెక్షన్స్ లేకున్నా మాకు సంతృప్తికరమైన వసూళ్లు వస్తున్నాయి. మా సినిమాని, మా అబ్బాయి చేతన్ కృష్ణని ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్. మా అబ్బాయితోనే నా తర్వాతి చిత్రం ఉంటుంది'' అన్నారు.


రాజావారు వస్తున్నారు

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్ హీరోగా నటించిన సినిమా 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు'. 'శతమానం భవతి' చిత్రంతో జాతీయ అవార్డు అందుకున్న డైరెక్టర్ సతీష్ వేగేశ్న తెరకెక్కించిన ఈ సినిమాలో సంపద హీరోయిన్‌గా నటించారు. శ్రీ వేధాక్షర మూవీస్ పతాకంపై చింతపల్లి రామారావు, ఎం.సుబ్బారెడ్డి నిర్మించిన 'శ్రీ శ్రీ శ్రీ రాజావారు' ని ఈ నెల 28న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ–''మంచి గ్రామీణ నేపథ్యంలో సాగే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ చిత్రమిది. పూర్తి వాణిజ్య అంశాలతో తెరకెక్కించారు సతీష్ వేగేశ్న'' అని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: కైలాష్ మీనన్, కెమెరా: దాము నర్రావుల, సమర్పణ: రంగాపురం రాఘవేంద్ర, మురళీ కృష్ణ చింతలపాటి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సీహెచ్‌వీ శర్మ, రాజీవ్ కుమార్.


నార్నె నితిన్, సంపద

కోర్టు నేపథ్యంలో...

త్రిగున్, దీప్సిక జంటగా నటించిన చిత్రం 'ఉద్వేగం'. మహిపాల్ రెడ్డి దర్శకత్వంలో కళా సృష్టి ఇంటర్నేషనల్, మణిదీప్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై జి.శంకర్, ఎల్. మధు నిర్మించారు. పరుచూరి గోపాలకృష్ణ, శివకృష్ణ, అంజలి, శ్రీకాంత్ భరత్, సురేష్ నాయుడు ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమాని ఈ నెల 22న విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ''కోర్టు రూమ్ డ్రామా నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఉద్వేగం'. త్రిగున్ కెరీర్‌లో ఇది 25వ చిత్రం కావడం విశేషం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్ కొడగండ్ల, కెమెరా: అజయ్.



పరుచూరి గోపాలకృష్ణ, త్రిగున్

సాక్షి బిజినెస్
మంగళవారం
12-11-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▼
10	7
79,496	24,141

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,255	▼	30
డోజోన్స్	44,347	▲	358
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,125	▲	53
డాక్స్	19,449	▲	223
షాంఘై	3,470	▲	17
నికాయ్	39,533	▲	33

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,840
బంగారం (99.5 స్వచ్ఛత)	76,532
వెండి (కేజీ)	90,859

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.98	85.00
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	109.61	113.46
€	యూరో	ఎస్‌బీఐ	90.62	94.32
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.41	55.80
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.58	56.78
S$	సింగపూర్ డాలర్	ధామస్‌కుక్	61.55	66.32
SAR	సౌదీ రియాల్	ధామస్‌కుక్	21.61	23.16
UAE D	యూఏఈ దిర్హామ్	ధామస్‌కుక్	22.09	23.87
¥	చైనా యువాన్	ధామస్‌కుక్	10.84	12.66

మారుతీ సుజుకీ సరికొత్త డిజైర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ ఫోర్త్ జనరేషన్ సరికొత్త డిజైర్‌ను భారత్‌లో సోమవారం ప్రవేశపెట్టింది. మన్నిక, మైలేజ్ కారణంగా నాలుగు మీటర్లలోపు కాంపాక్ట్ సెడాన్స్ విభాగంలో కొన్నేళ్లుగా బెస్ట్ సెల్లింగ్ మోడల్‌గా ఇది కొనసాగుతోంది. భారత్‌సహా వివిధ మార్కెట్లలో ఇప్పటికే 30 లక్షల పైచిలుకు డిజైర్ కార్లు పరుగెడుతున్నాయని మారుతీ సుజుకీ ఇండియా ఎండీ, సీఈవో హిసాటీ టాకేయూచీ తెలిపారు. డిజైర్ ఎక్స్‌షోరూం ధర రూ.6.79 లక్షలు మొదలుకుని రూ.10.14 లక్షల వరకు ఉంది. ఈ పరిచయ ఆఫర్ ధర డిసెంబర్ 31 వరకే ఉంటుంది. జీఎన్‌సీ



ఏపీ 5 స్టార్ రేటింగ్ దీని ప్రత్యేకత. ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, 360 డిగ్రీ కెమెరా, ఏబీఎస్, ఈబీడీ, 6 ఎయిర్‌బ్యాగ్స్, 9 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ యూనిట్ తదితర ప్రత్యేకతలున్నాయి.

ఎన్‌ఎండీసీ బోనస్ షేర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్‌ఎండీసీ 2:1 నిష్పత్తిలో బోనస్ షేర్లు ప్రకటించింది. అంటే రూ.1 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రెండు అదనపు షేర్లు జారీ చేస్తారు. అధీకృత మూలధన్నాన్ని రూ.400 కోట్ల నుంచి రూ.1,000 కోట్లకు పెంచాలని సోమవారం సమావేశమైన బోర్డు నిర్ణయించింది. సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో ఎన్‌ఎండీసీ నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 15 శాతం వృద్ధి చెంది రూ.1,030 కోట్ల నుంచి రూ.1,189 కోట్లకు ఎగసింది. పన్నుకు ముందు లాభం రూ.1,404 కోట్ల నుంచి రూ.1,614 కోట్లుగా ఉంది. వ్యయాలు రూ.2,931 కోట్ల నుంచి రూ.3,665 కోట్లను తాకాయి. ఈపీఎస్ రూ.3.50 నుంచి రూ.4.13కు పెరిగింది. టర్నోవర్ 22% అధికమై రూ.5,280 కోట్లు నమోదైంది. ఫలితాల నేపథ్యంలో ఎన్‌ఎండీసీ షేరు ధర బీఎస్‌ఈలో సోమవారం 1.15% క్షీణించి రూ.233 వద్ద స్థిరపడింది.

ఎయిరిండియాలో విస్తారా విలీనం

న్యూఢిల్లీ/ముంబై: విమానయాన సంస్థలు ఎయిరిండియా–విస్తారా విలీనం నవంబర్ 12 నుంచి అమల్లోకి వస్తుంది. దీంతో విస్తారా ఇప్పటివరకు తమ ఫ్లయిట్స్‌కి ఉపయోగిస్తున్న యూకే కోడ్ కనుమరుగు అవుతుంది. మంగళవారం నుంచి 'ఏఐ2ఎక్స్‌ఎక్స్‌ఎక్స్' కోడ్‌తో విస్తారా ఫ్లయిట్స్ నడుస్తాయి. నవంబర్ 11న రాత్రి పొద్దుపోయాక విస్తారా విమానం యూకే 986 కోడ్‌తో ముంబై నుంచి ఢిల్లీకి, యూకే 115 కోడ్‌తో ఢిల్లీ నుంచి సింగపూర్‌కి ఆఖరుసారిగా ప్రయాణించేలా షెడ్యూల్‌ను రూపొందించినట్లు కంపెనీ వర్గాలు సోమవారం తెలిపాయి. టాటా గ్రూప్, సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ) జాయింట్ వెంచర్‌గా విస్తారాను ఏర్పాటు చేశాయి. విలీనానంతరం ఎయిరిండియాలో ఎస్ఐఏకి 25.1% వాటాలు ఉంటాయి. విలీన సంస్థలో ఎస్ఐఏ రూ. 3,194.50 కోట్లు ఇన్వెస్ట్ చేస్తుంది.



టాటా గ్రూప్‌లోనే భాగమైన ఏఐఎక్స్ కనెక్ట్‌ను ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఇప్పటికే విలీనం చేయగా, విస్తారాను కూడా విలీనం చేయడంతో ఇకపై ఎయిరిండియా ఫుల్ సర్వీస్ విమానయాన సంస్థగా నడుస్తుంది. 2006–07లో తర్వాత ఏవియేషన్ రంగంలో విలీనాలు జరగడం ఇదే ప్రథమం. నష్టాల్లో కుదేలవుతున్న ఎయిరిండియాను టాటా గ్రూప్ 2022లో తిరిగి దక్కించుకోవడం తెలిసిందే.

ట్రంప్ రీఎంట్రీ..

- ట్రంప్ పాలసీలతో మన ఎకానమీకి ఇక్కట్లే...
- రూపాయి పతనం.. దిగుమతులు భారం
- ద్రవ్యోల్బణం ఎగబాకే అవకాశం... వడ్డీరేట్ల కోత ఆశలపై నీళ్లు!
- మార్కెట్లో కొంతకాలం ఆటుపోట్లు తప్పవంటున్న విశ్లేషకులు

మార్కెట్ గతేంటి?

'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదంతో ట్రంప్ విజయ విహారం చేశారు. అయితే, ఇప్పుడు 'మేక్ వరల్డ్ అన్-ప్రెడిక్టబుల్ అగైన్'గా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా మార్కెట్లలో జోష్ నెలకొన్నప్పటికీ, మన మార్కెట్లో మళ్లీ అమ్మకాలు పోటెత్తడంతో ఇన్వెస్టర్లలో గందరగోళం నెలకొంది. ఇప్పటికే కరెక్షన్ బాటలో ఉన్న దేశీ సూచీల పయనమెటన్నది అర్థం కావడం లేదు. అయితే, ట్రంప్ 'అమెరికా ఫస్ట్' పాలసీలతో పాటు సుంకాల పెంపు వంటి చర్యలతో అగ్రరాజ్యంలో వడ్డీరేట్ల తగ్గింపునకు బ్రేకులు పడొచ్చని... డాలరు బలోపేతం, ద్రవ్యోల్బణం పెరుగుదల ఎఫెక్ట్‌తో రూపాయి మరింత బలహీన పడొచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాల పరంపర కొనసాగడంతో... స్వల్పకాలానికి మన మార్కెట్లో ట్రంప్ సెగలు తప్పవంటున్నారు!

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఆల్‌టైమ్ గరిష్టాల నుంచి కొండ దిగుతున్న దేశీ సూచీలు.. గత నెలన్నర రోజుల్లో 8 శాతానికి పైగానే పడ్డాయి. ముఖ్యంగా విదేశీ ఇన్వెస్టర్ల తిరోగమనం దీనికి ప్రధాన కారణం. ఎన్నికల తర్వాత సెప్టెంబర్ వరకు పెట్టుబడుల మోత మోగించిన విదేశీ ఇన్వెస్టర్లు... అక్టోబర్‌లో రికార్డు స్థాయిలో రూ.1.15 లక్షల కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇక నవంబర్లోనూ రివర్స్ గేర్ కొనసాగుతోంది. 6 ట్రేడింగ్ సెషన్లలో రూ.23,000 కోట్లకు పైగా నిధులను వెనక్కి తీసుకున్నారు. మొత్తంమీద ఈ ఏడాది ఇప్పటిదాకా రూ.2.9 లక్షల కోట్ల మేర విదేశీ నిధులు తరలిపోయాయి. ఇలాంటి తరుణంలో అధ్యక్ష ఎన్నికల్లో రెండోసారి గ్రాండ్ విక్టరీ కొట్టిన ట్రంప్.. మళ్లీ సుంకాల జూలు విదిల్చే అవకాశం ఉండటంతో పాటు 'అమెరికా ఫస్ట్' పాలసీలను ఆచరణలో పెడితే మన ఎకానమీపై ప్రతికూల ప్రభావానికి దారితీసే అవకాశం ఉందనేది ఆర్థిక వేత్తల అభిప్రాయం.

మళ్లీ ద్రవ్యోల్బణం గుబులు...

ట్రంప్ చెబుతున్నట్లుగా కార్పొరేట్ ట్యాక్స్ కోతకు తోడు సుంకాల పెంపునకు తెరతీస్తే మళ్లీ ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం ఎగబాకే అవకాశాలున్నాయి. సుంకాలు రెండు వైపులా పదునున్న కత్తిలాంటివని కూడా విశ్లేషకులు చెబుతున్నారు. వస్తు, సేవలపై కనీసం 10 శాతం సుంకాలు పెంచినా, అక్కడ 0.8 శాతం ద్రవ్యోల్బణం పెరిగే అవకాశాం ఉందని ఎకనమిస్టులు లెక్కలేస్తున్నారు. దీనివల్ల యూఎస్ ఫెడ్ వడ్డీరేట్ల కోత అవకాశాలు సన్నగిల్లి.. డాలరు పుంజుకోవడానికి దారితీస్తుంది. వెరసి, ఇప్పుడిప్పుడే వడ్డీరేట్ల తగ్గింపు బాటలో వెళ్తున్న వివిధ దేశాల సెంట్రల్ బ్యాంకులు దీనికి బ్రేక్ వేసే చాన్స్ ఉంటుంది. మరోపక్క, టారిఫ్ వార్‌కు తెగబడితే ఎగుమతులు దెబ్బతినడం... దిగుమతులు గుదిబండగా మారడం వల్ల మన దేశంలోనూ మళ్లీ ద్రవ్యోల్బణం పురి విప్పుతుంది. ఇప్పటికే జారుడుబల్లపై ఉన్న రూపాయిని (తాజాగా డాలరుతో 84.38 ఆల్‌టైమ్ కనిష్టానికి పడింది) ఇది మరింత దిగజార్చుతుంది. దీంతో ఆర్‌బీఐ వడ్డీరేట్ల కోతపై ఆశలు ఆవిరైనట్లేననేది ఆర్థిక వేత్తల మాట. 'ట్రంప్ ట్యాక్స్ కట్ అంటే అమెరికాలో రుణ భారం మరింత పెరుగుతుంది. అధిక వడ్డీరేట్లు, డాలరు బలంతో భారత్ లాంటి వర్ధమాన దేశాల మార్కెట్లకు కచ్చితంగా ప్రతికూలమే' అని ఏఎస్‌కే వెల్త్ అడ్వయిజర్స్‌కు చెందిన సోమ్‌నాథ్ ముఖర్జీ పేర్కొన్నారు. అయితే, చైనాపై భారీగా సుంకాలు విధించి, భారత్‌పై కాస్త కనికరం చూపితే, మన ఎగుమతులు.. కొన్ని రంగాలకు సానుకూలంగా మారుతుందని కూడా కొంత మంది నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఏదేమైనా.. ట్రంప్ పగ్గాలు చేపట్టి (జనవరి 20న), విధానపరమైన స్పష్టత వచ్చే వరకు మన మార్కెట్లలో తీవ్ర ఆటుపోట్లు తప్పవనేది పరిశీలకుల అభిప్రాయం.



> ట్రంప్ విక్టరీ నేపథ్యంలో చైనా, భారత్ సహా పలు దేశాలపై దిగుమతి సుంకాల మోతకు అవకాశం ఉంది. ఇది అక్కడ ద్రవ్యోల్బణం పెరుగుదలకు దారితీయొచ్చు. దీంతో అమెరికాలో వడ్డీ రేట్ల కోత జాప్యం కావచ్చు. దీనికి తోడు ట్రంప్ హామీ మేరకు కార్పొరేట్ ట్యాక్స్ తగ్గిస్తే, యూఎస్ బాండ్ మార్కెట్లో ఈల్డ్‌లు ఎగబాకుతాయి. ఈ పరిణామాలు భారత్ వంటి వర్ధమాన మార్కెట్ల నుంచి విదేశీ ఇన్వెస్టర్ల తిరోగమనానికి మరింత పురిగొల్పుతాయి.
>
> – వితిన్ అగర్వాల్, క్లయింట్ అసోసియేట్స్ డైరెక్టర్

ట్రంప్ తొలి జమానాలో..

2017లో ట్రంప్ తొలిసారి గద్దెనెక్కినప్పుడు.. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి ఉంది. ముఖ్యంగా చైనా స్టాక్ మార్కెట్లో అలజడి, క్రూడ్ ధరల క్రాష్, గ్రీస్ దివాలా.. బ్రెగ్జిట్ ప్రభావాలతో స్టాక్ మార్కెట్లు తిరోగమనంలో ఉన్నాయి. అయితే, ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రభావం ఉన్నప్పటికీ.. ప్రపంచ మార్కెట్ల ట్రెండ్‌కు అనుగుణంగా మన మార్కెట్లు మళ్లీ పుంజుకోగలిగాయి. 2017 నుంచి 2020 వరకు ట్రంప్ తొలి విడతలో నిఫ్టీ 50 శాతం మేర పుంజుకోగా... జో బైడెన్ జమానాలో ఈ ఏడాది సెప్టెంబర్ వరకు ఏకంగా 120 శాతం పైగా నిఫ్టీ ఎగబాకడం విశేషం. ఇక ట్రంప్ 1.0 హయాంలో డాలర్‌తో రూపాయి విలువ 11% క్షీణిస్తే, 2.0 కాలంలో 8–10% క్షీణించే అవకాశం ఉందని ఎస్‌బీఐ తాజా నివేదిక తెలిపింది!

ఒడిదుడుకుల ట్రేడింగ్

ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు ● ఎఫ్ఐఐల తిరోగమనం

ముంబై: రోజంతా తీవ్ర ఒడిదుడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో స్టాక్ సూచీలు సోమవారం మిశ్రమంగా ముగిశాయి. ఇంట్రాడేలో 1,101 పాయింట్ల పరిధిలో కదలాడిన సెన్సెక్స్ చివరికి 10 పాయింట్ల స్వల్ప లాభంతో 79,496 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 7 పాయింట్లు నష్టపోయి 24,141 వద్ద నిలిచింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస విక్రయాలు, కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు నిరాశపరచడం, ఆసియా మార్కెట్లలో ప్రతికూల సంకేతాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. చిన్న, మధ్య తరహా షేర్లలో మూడోరోజూ అమ్మకాలు కొనసాగాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 1.14%, 0.79% చొప్పున నష్టపోయాయి. ఇండెక్సుల వారీగా బీఎస్‌ఈలో కమోడిటీస్ 1.25%, మెటల్, ఎఫ్ఎంసీజీ సూచీలు ఒకశాతం క్షీణించాయి. ఆయిల్అండ్‌గ్యాస్, ఆటో ఇండెక్సులు అరశాతానికి పైగా నష్టపోయాయి. క్యూ2 నికరలాభం 44% క్షీణత నమోదుతో ఏషియన్ పెయింట్స్ షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్‌ఈలో 8% నష్టపోయి రూ.2,543 వద్ద ముగిసింది.



'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

రఘు వంశీ గ్రూప్ చేతికి పీఎంసీ గ్రూప్	ఓఎన్‌జీసీ లాభం అప్.. రూ. 11,948 కోట్లు

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

హెచ్ఏఎల్, హైదరాబాద్‌లో 57 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులు

హైదరాబాద్‌లోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్), ఏవియానిక్స్ డివిజన్.. నాలుగేళ్ల ఒప్పంద ప్రాతిపదికన నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 57.
- » **పోస్టుల వివరాలు:** డిప్లొమా టెక్నీషియన్ (మెకానికల్)–10, డిప్లొమా టెక్నీషియన్ (ఎలక్ట్రికల్)–05, డిప్లొమా టెక్నీషియన్(ఎలక్ట్రానిక్స్)–35, డిప్లొమా టెక్నీషియన్ (కెమికల్)–01, ఆపరేటర్–06.
- » **అర్హత:** ఆపరేటర్ పోస్టులకు సంబంధిత ట్రేడులో ఐటీఐ, డిప్లొమా టెక్నీషియన్ పోస్టులకు సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 24.11.2024 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **వేతనం:** బేసిక్ పే నెలకు డిప్లొమా టెక్నీషియన్ పోస్టులకు రూ.23,000. ఆపరేటర్ పోస్టులకు రూ.22,000.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **పోస్టింగ్ ప్రదేశం:** హైదరాబాద్, శ్రీనగర్, సిర్సా, భటిండా, బరేలీ, గోరఖ్‌పూర్, గ్వాలియర్, తేజ్‌పూర్, చబువా, బగ్‌డోగ్రా, హసిమారా, కలైకుండ, బీదర్, పుణె, భుజ్, జామ్‌నగర్, జోధ్‌పూర్, ఉత్తరలై, మాముస్, మిస్సమారి, గోవా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.11.2024
- » **రాతపరీక్ష తేది:** 22.12.2024.
- » **వెబ్‌సైట్:** https://hal-india.co.in

ఎన్ఐఆర్‌డీపీఆర్, హైదరాబాద్‌లో 14 పోస్టులు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్(ఎన్ఐఆర్‌డీపీఆర్).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 14.
- » **పోస్టుల వివరాలు:** కన్సల్టెంట్–04, రీసెర్చ్ అసిస్టెంట్–10.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగాల్లో ఎంబీఏ,పీజీ(అగ్రికల్చర్), పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం కలిగి ఉండాలి.
- » **వేతనం:** నెలకు కన్సల్టెంట్ పోస్టులకు రూ.40,000, రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు రూ.22,000.
- » **వయసు:** కన్సల్టెంట్ పోస్టులకు 63 ఏళ్లు, రీసెర్చ్ అసిస్టెంట్ పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.11.2024
- » **వెబ్‌సైట్:** http://career.nirdpr.in

నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వేలో 5,647 యాక్ట్ అప్రెంటిస్‌లు

గువాహటి (అస్సాం)లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే ఎన్ఎఫ్ఆర్ పరిధిలోని డివిజన్/వర్క్‌షాపుల్లో యాక్ట్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 5,647.
- » **డివిజన్/వర్క్‌షాప్:** కటిహార్–తింధారియా, అలీపుర్‌దువార్, రంగియా, లుమ్‌డింగ్, టిన్‌సుకియా, న్యూ బొంగైగావ్ వర్క్‌షాప్–ఇంజనీరింగ్ వర్క్‌షాప్, దిబ్రూగర్, ఎన్ఎఫ్ఆర్ హెడ్ క్వార్టర్/మాలిగావ్.
- » **విభాగాలు:** మెకానికల్,ఎలక్ట్రికల్,ఇంజనీరింగ్, ఎస్–టి, పర్సనల్, అకౌంట్స్, మెడికల్.
- » **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ, 12వ తరగతి, ఎంఎల్‌టీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
- » **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 03.12.2024
- » **వెబ్‌సైట్:** https://www.rrcpryj.org

టీచర్ కొలువుకు మార్గం.. టెట్!

- » టీఎస్ టెట్-2024(2) నోటిఫికేషన్ విడుదల
- » 2025 జనవరి 1 నుంచి పరీక్షలు నిర్వహణ
- » డీఎస్సీ దరఖాస్తుకు టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి
- » టెట్ స్కోర్‌కు జీవిత కాల గుర్తింపు

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్.. సంక్షిప్తంగా టెట్! ప్రభుత్వ పాఠశాలల్లో.. ఉపాధ్యాయులుగా కొలువు సాధించాలంటే డీఎస్సీ కొట్టాలి. డీఎస్సీ నియామకాలకు తప్పనిసరి అర్హత టెట్! ఇందులో విజయం సాధిస్తే భవిష్యత్తులో నిర్వహించనున్న డీఎస్సీ (టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్)కు అర్హతతోపాటు వెయిటేజీ సైతం లభిస్తుంది. తాజాగా తెలంగాణలో టెట్ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. టీఎస్ టెట్-2024(2) నోటిఫికేషన్ వివరాలు, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర సమాచారం..

నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం–టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు హాజరు కావాలంటే.. బీఈడీ, డీఈడీలతో పాటు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో ఉత్తీర్ణత తప్పనిసరి. అప్పుడే టీఆర్‌టీకి దరఖాస్తుకు అవకాశం లభిస్తుంది. టీచర్ పోస్టుల భర్తీలో టెట్ స్కోర్‌కు వెయిటేజ్ కల్పిస్తారు. టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్‌కు 80 శాతం, టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.కాబట్టి అభ్యర్థులు టెట్‌లో ఉత్తీర్ణత పొందేలా కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

రెండు పేపర్లుగా టెట్

- ✦ డీఈడీ, బీఈడీ అర్హతతో నిర్వహించనున్న టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)లో రెండు పేపర్లు ఉంటాయి. అవి.. పేపర్–1, పేపర్–2.
- ✦ **పేపర్–1:** ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించేందుకు, ఎస్‌జీటీ పోస్టుల అభ్యర్థులు పేపర్ 1కు హాజరవుతారు. ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ లేదా నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ లేదా రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్) పొసైన వారు పేపర్–1కు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ✦ **పేపర్–2:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించేందుకు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ప్రామాణిక పరీక్ష టెట్ పేపర్–2. బీఏ/బీఎస్సీ/బీకాంలలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతో పాటు బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (స్పెషల్ ఎడ్యుకేషన్) లేదా నాలుగేళ్ల బీఏ ఎడ్యుకేషన్/బీఎస్సీ ఎడ్యుకేషన్‌లలో ఉత్తీర్ణత లేదా నాలుగేళ్ల బీఏ బీఈడీ/బీఎస్సీ బీఈడీలలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి.
- ✦ లాంగ్వేజ్ పండిట్ పోస్టుల అభ్యర్థులు సంబంధిత లాంగ్వేజ్ ఆప్షనల్ సబ్జెక్ట్‌గా బ్యాచిలర్ డిగ్రీ లేదా బ్యాచిలర్ ఆఫ్ ఓరియెంటల్ లాంగ్వేజ్/లిటరేచర్‌లో బ్యాచిలర్ లేదా పీజీ డిగ్రీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. దీంతోపాటు లాంగ్వేజ్ పండిట్ ట్రెయినింగ్ సర్టిఫికెట్ లేదా సంబంధిత లాంగ్వేజ్ మెథడాలజీలో బీఈడీ ఉత్తీర్ణత పొందాలి. (లేదా) బీఈ/బీటెక్‌లో 50 శాతంతో ఉత్తీర్ణత సాధించి బీఈడీ/బీఈడీ (స్పెషల్ ఎడ్యుకేషన్) చదువుతున్న వారు కూడా అర్హులే. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు సైతం టెట్ పేపర్లకు దరఖాస్తు చేసుకోవచ్చు.

150 మార్కులకు పేపర్–1

టెట్ పేపర్–1ను అయిదు విభాగాల్లో 150 ప్రశ్నలు–150 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహిస్తారు.అవి..చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ(30 ప్రశ్నలు–30 మార్కులు), లాంగ్వేజ్–1(30 ప్రశ్నలు–30 మార్కులు), లాంగ్వేజ్–2 (30 ప్రశ్నలు–30 మార్కులు), మ్యాథమెటిక్స్ (30 ప్ర. –30 మా.), ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ (30 ప్ర.–30 మా.) నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి విభాగంలో ఆరు ప్రశ్నలు పెడగాజీ నుంచి ఉంటాయి.

పేపర్–2

టెట్ పేపర్–2ను కూడా నాలుగు విభాగాలుగా 150 ప్రశ్నలు–150 మార్కులకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో నిర్వహిస్తారు. ఈ పేపర్ పూర్తిగా బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలో జరుగుతుంది. ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ 30 ప్రశ్నలు–30 మార్కులకు; లాంగ్వేజ్1, 30 ప్రశ్నలు–30 మార్కులకు; లాంగ్వేజ్ 2, (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు–30 మార్కులకు; సంబంధిత సబ్జెక్ట్ 60ప్రశ్నలు–60 మార్కులకు ఉంటాయి. నాలుగో విభాగంలో మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్,సైన్స్ విభాగాన్ని.. సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని ఎంచుకుని పరీక్ష రాయాలి.

కనీస అర్హత మార్కులు

రెండు పేపర్లుగా నిర్వహించే టెట్ పేపర్–1, పేపర్–2లలో అభ్యర్థులు తప్పనిసరిగా కనీస అర్హత మార్కులు సాధించాలనే నిబంధన విధించారు. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం అరవై శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. ఈ మార్కులు సాధించిన వారికే టెట్ సర్టిఫికెట్లు జారీ చేస్తారు.

మంచి స్కోర్ సాధించాలంటే

పేపర్–1కు ఇలా

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీలో బోధన, లెర్నింగ్‌కు సంబంధించిన ఎడ్యుకేషనల్ సైకాలజీపై ప్రాథమిక స్థాయిలో ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థులు ప్రధానంగా శిశువు సైకాలజీ సంబంధించిన అంశాలపై ఎక్కువగా దృష్టిసారించాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. సైకాలజీ అంశాలను చదివేటప్పుడు కీలక భావనలు, సాంకేతిక పదాలు, సిద్ధాంతాలు–సూత్రాలు, ప్రతిపాదించిన శాస్త్రవేత్తలు, వారి గ్రంథాలు తదితర విషయాలను విశ్లేషణాత్మకంగా చదవాలి. పెడగాజీ అంటే బోధన శాస్త్రం. ఇందులో సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక, బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజీలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేయాలి.

మ్యాథమెటిక్స్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

ఇందులో ఒకటి నుంచి అయిదో తరగతి స్థాయి వరకు ప్రశ్నలు ఉంటాయి. క్లిష్టత స్థాయి పదో తరగతి వరకు ఉండే అవకాశం ఉంది. ఆయా సబ్జెక్టుల్లో ఒక్కో సబ్జెక్టుకు కేటాయించే 30 ప్రశ్నల్లో 24 ప్రశ్నలు కంటెంట్‌పై, మిగతా 6 ప్రశ్నలు పెడగాజీపై ఉంటాయి. పేపర్–2లో మ్యాథమెటిక్స్, సైన్స్‌పై ప్రశ్నలు అడుగుతారు. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టులపై ప్రశ్నలు ఎదురవుతాయి. ప్రశ్నల క్లిష్టత ఇంటర్ స్థాయిలో ఉంటుంది. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్, తెలంగాణ నుంచి ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు తెలంగాణ ప్రాముఖ్యం ఉన్న అంశాలను ప్రత్యేక దృష్టితో చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.

పేపర్–2 ప్రిపరేషన్

- ✦ **సైన్స్:** ఈ విభాగంలో మార్కుల కోసం మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. గత టెట్‌లో ఈ విభాగంలో ప్రశ్నలు కాసింత క్లిష్టంగానే ఉన్నాయని చెప్పొచ్చు.
- ✦ **సోషల్ స్టడీస్:** ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠ్య పుస్తకాలను క్షుణ్నంగా చదవాలి. భూగోళ శాస్త్రంలో ఒక ప్రాంతం గురించి చదువుతున్నప్పుడు ఆ ప్రాంతానికి సంబంధించిన అన్ని అంశాలను చదివాలి. వాతావరణ, భౌగోళిక పరిస్థితులు, నదులు వంటి వాటిపై అవగాహన పెంచుకోవాలి. అదేవిధంగా సివిక్స్, ఎకనామిక్స్ అంశాలను సమకాలీన అంశాలతో అప్‌డేట్ చేసుకుంటూ అధ్యయనం చేయాలి.
- ✦ **మ్యాథమెటిక్స్:** ఈ సబ్జెక్ట్‌లోనూ ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాల్సిన విధంగా ప్రశ్నలు అడుగుతారు. ట్రిగ్నోమెట్రీ, జామెట్రీ, కో–ఆర్డినేట్ జామెట్రీ, ఆల్జీబ్రా, కాలిక్యులస్ వంటి కీలక సబ్జెక్ట్‌ల కాన్సెప్ట్‌లను అర్థం చేసుకుంటూ ప్రాక్టీస్ చేయాలి.
- ✦ **మెథడాలజీ:** ఇందులో ప్రధానంగా బోధనా పద్ధతులు; టీచర్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం); బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి.పేపర్–1,పేపర్–2లో అడిగే అంశాలు ఒక్కటే అయినా.. వాటి క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. దీన్ని గుర్తించి ప్రిపరేషన్ కొనసాగించాలి.

టైమ్ మేనేజ్‌మెంట్

- ✦ గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తూ.. ఇంగ్లిష్, తెలుగు, పెడగాజీ విభాగాన్ని అధ్యయనం చేసి బిట్స్ ఎక్కువ సంఖ్యలో ప్రాక్టీస్ చేయాలి. కంటెంట్‌కు సంబంధించి పేపర్–1 అభ్యర్థులు మూడు నుంచి అయిదో తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లోని ముఖ్యాంశాలను రివిజన్ చేయాలి.
- ✦ పేపర్–2 అభ్యర్థులు కంటెంట్ కోసం 6, 7, 8 తరగతుల పాఠ్యపుస్తకాల్లోని కీలకాంశాలను చదవాలి. కంటెంట్‌కు సంబంధించి ఎక్కువగా సమాచార ఆధారిత ప్రశ్నలే ఉంటాయి. కాబట్టి అభ్యర్థులు జ్ఞాపకశక్తిని పెంపొందించుకునేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- ✦ టెట్‌లో కాసింత క్లిష్టమైన విభాగం మెథడాలజీ. ఇందులో ఎక్కువ మార్కులు సాధించాలంటే లక్ష్యాలు, బోధనా పద్ధతులు, బోధనోపకరణాలు, మూల్యాంకనం, కరిక్యులం అంశాలపై ఎక్కువ దృష్టిసారించాలి.
- ✦ ముఖ్యంగా పేపర్ –2 సోషల్ స్టడీస్ అభ్యర్థులు తెలంగాణ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి.
- ✦ పరీక్షకు ముందు వేగంగా రివిజన్ చేసుకునేలా షార్ట్‌నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి.
- ✦ ముఖ్యంగా పెడగాజీ, మెథడాలజీలకు ఇలాంటి నోట్స్ వల్ల అధిక ప్రయోజనం ఉంటుంది.



ముఖ్య సమాచారం

- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తు చివరి తేదీ:** 2024, నవంబర్ 20
- ✦ **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** 2024, డిసెంబర్ 26 నుంచి
- ✦ **టెట్ తేదీలు:** 2025 జనవరి 1 నుంచి 20 వరకు (పేపర్ 1 ఉదయం 9 నుంచి 11:30 వరకు; పేపర్–2 మధ్యాహ్నం 2 నుంచి 4:30 వరకు).
- ✦ **ఫలితాల వెల్లడి:** 2025, ఫిబ్రవరి 5
- ✦ **వివరాలకు వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in, https://tgtet2024.aptonline.in/tgtet

'స్టార్టప్'లతో వికసిత భారత్!

విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహిస్తున్నాం..

వినూత్న ఆలోచనలతో స్టార్టప్‌లను ప్రారంభించే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామని... ఇందుకోసం ప్రత్యేక విధానాలు అమలు చేస్తున్నామని ఐఐటీ–హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ బూదరాజు శ్రీనివాస మూర్తి (బీఎస్ మూర్తి) తెలిపారు. విద్యార్థి కేంద్రీకృత విద్యా విధానం రావాలని.. నచ్చిన రంగాలకు సంబంధించిన కోర్సులు ఎంచుకుంటేనే విద్యార్థి ఆ రంగంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. తాము దేశంలోనే తొలిసారిగా 2019లోనే కృత్రిమ మేధ (ఏఐ) బీటెక్ కోర్సును ప్రవేశపెట్టామని.. ఇప్పుడు సెమీకండక్టర్ల రంగానికి సంబంధించి 'ఎంటెక్ ఇన్ ఐసీ డిజైన్ అండ్ టెక్నాలజీ', 'బీటెక్ ఇన్ ఇంజనీరింగ్ సైన్స్' వంటి కోర్సులను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ఇన్నోవేషన్‌తోనే వికసిత భారత్ సాధ్యమవుతుందన్నారు. ఐఐటీహెచ్‌లో పరిశోధనలతోపాటు పలు ఇతర అంశాలపై బీఎస్ మూర్తి 'సాక్షి'తో మాట్లాడారు. ఈ విశేషాలు ఆయన మాటల్లోనే..

- సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి

'సాక్షి' ఇంటర్వ్యూలో ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి

టెస్లా తరహాలో డ్రైవర్ రహిత వాహనాల సాంకేతికత అభివృద్ధి చేస్తున్నాం.. 6జీ టెక్నాలజీ, కోల్ రీసెర్చ్‌పై పరిశోధనలు జరుగుతున్నాయి

పలు అంశాల్లో ప్రభుత్వం, సింగరేణితో కలసి పనిచేస్తున్నట్టు వెల్లడి



స్టార్టప్‌ల దిశగా ప్రోత్సహిస్తున్నాం..

విద్యార్థులు వారి అభిరుచులకు అనుగుణంగా బీటెక్‌లో సబ్జెక్టులను ఎంచుకునే స్వేచ్ఛ కల్పిస్తున్నాం. విద్యార్థులెవరికైనా స్టార్టప్ పెట్టాలనే ఆసక్తి ఉంటే బీటెక్ రెండో సంవత్సరం తర్వాత బయటికి వెళ్లి స్టార్టప్‌పై పనిచేసేందుకు అనుమతి ఇస్తున్నాం. ఐదేళ్లలో వారు తిరిగొచ్చి మిగతా రెండేళ్ల చదువు పూర్తి చేసే అవకాశం కల్పిస్తున్నాం. ఇన్నోవేటివ్ ఐడియా ఉంటే వారికి రూ.లక్ష ఫండింగ్ ఇచ్చి.. స్టార్టప్‌ల దిశగా పనిచేసుకునేందుకు ప్రోత్సహిస్తున్నాం. గత 14 ఏళ్లలో మా విద్యార్థుల భాగస్వామ్యంతో ఏకంగా 260 స్టార్టప్‌లు వచ్చాయి. వాటికి రూ.1,500 కోట్ల వరకు పెట్టుబడులు వచ్చాయంటే సక్సెస్ రేట్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

అటానమస్ నావిగేషన్‌పై విస్తృత పరిశోధన

➤ టెస్లా కార్ల తరహాలో డ్రైవర్ రహిత వాహనాల (అటానమస్ నావిగేషన్)పై విస్తృత పరిశోధన జరుగుతోంది. రూ.150 కోట్లతో థిహాన్ ప్రాజెక్టు ప్రగతిలో ఉంది. ఇప్పటికే మా క్యాంపస్‌లో డ్రైవర్ లెస్ వాహనాలు నడుపుతున్నాం. మన దేశ రోడ్లు, ట్రాఫిక్‌కు అనుగుణంగా సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నాం. పరిశ్రమలు, పెద్ద కంపెనీల్లో వాడుకునేందుకు ఈ టెక్నాలజీ సిద్ధమైంది. ఈ అటానమస్ నావిగేషన్‌పై మరో రూ.300 కోట్ల కొత్త ప్రాజెక్టు ప్రతిపాదన దశలో ఉంది.

ప్రభుత్వం, సింగరేణితో కలసి పనిచేస్తున్నాం

➤ తెలంగాణ ప్రభుత్వంతో 'ఏఐ ఫర్ స్మార్ట్ సిటీస్' ప్రాజెక్టు కోసం ఎంఓయూ చేసుకుంటున్నాం. క్రిటికల్ మినరల్ ఏరియా ప్రాజెక్టును సింగరేణి కాలరీస్‌తో కలిసి చేపట్టనున్నాం. ఐఐటీహెచ్ సమీపంలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకున్నాం. మా విద్యార్థులు, ఫ్యాకల్టీ రోజూ ఓ గంట పాటు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ వంటి సబ్జెక్టులు బోధిస్తున్నారు. ఆ గ్రామాల్లో వేస్ట్ మేనేజ్‌మెంట్, శానిటేషన్, తాగునీటి సరఫరా అంశాల్లో సాంకేతికతను అందిస్తున్నాం.

పరిశోధనలకే ప్రాధాన్యం..

ఐఐటీహెచ్ మొదటి నుంచీ పరిశోధనలపై ఫోకస్ పెట్టింది. 6జీ, 5జీ వంటి టెలికం, హెల్త్‌కేర్, మాన్యుఫ్యాక్చరింగ్, కోల్ రీసెర్చ్, కంప్యూటేషనల్ వంటి రంగాల్లో పరిశోధనలు ప్రగతిలో ఉన్నాయి. 2023–24లో పరిశోధనల కోసం రూ.250 కోట్ల నిధులు వచ్చాయి. ఐఐటీహెచ్‌లో చదువుతున్న 5,300 మంది విద్యార్థుల్లో 60 శాతం మంది పీహెచ్‌డీ, ఎంటెక్ వాళ్లే. అందులోనూ సుమారు 1,500 మంది పీహెచ్‌డీ వాళ్లున్నారు.



ఆ.. ముడతలను

మడతపెట్టి..

కిందన పొట్ట.. పైన బట్ట..
40+ లోకి ఎంటర్ కాగానే..
పిలవని అతిథుల్లా..
వద్దన్నా వచ్చి పడతాయి.
దాంతోపాటే ముఖంపై
ముడతలు కూడా..
మొదటి రెండింటిని
తప్పించుకోవచ్చేమోగానీ..
మూడోది మాత్రం మహా మొండి..
అది పోదు.. మనం 'పోవాల్సిందే'!



- సాక్షి సెంట్రల్ డెస్క్

అయితే.. పోయే ముందు దీనికో పరిష్కారం చూపే పనిలో పలువురు శాస్త్రవేత్తలు, కంపెనీలు ఉన్నాయి. కాలానుగుణంగా పలు రకాల ఉత్పత్తులు కూడా వచ్చాయి. అయితే.. ఓసారి ఈ క్రయోగ్లో మాస్క్‌ను చూడండి. ముడతలను మడతపెట్టేయడానికి ప్రస్తుతం మార్కెట్లో ఇదే అత్యుత్తమ సాధనం అని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఈ విభాగంలో ప్రాచుర్యం పొందిన రెటినాల్(విటమిన్ ఏ తాలూకు ఓ రూపం) స్థానాన్ని ఇది భర్తీ చేయడం తథ్యమంటున్నారు. దీన్ని వాక్యూం క్లీనర్లు, ఎయిర్ ఫ్రయర్ల ఉత్పత్తి కంపెనీ షార్క్ నింజా రూపొందించింది.

ఎలా పనిచేస్తుంది? ఇదో రకమైన థెరపీ మాస్క్. ఇందులో ఉండే ఎల్ఈడీలు ఎరుపు, నీలంతోపాటు ఇన్‌ఫ్రా రెడ్ కిరణాలను విడుదల చేస్తాయి. అవి వివిధ స్థాయిల్లో శరీరంలోకి చొచ్చుకుపోయి.. చికిత్స మొదలు పెడతాయట. 4 వారాలపాటు రోజూ దీన్ని ఉపయోగించి చూసినప్పుడు ముడతలు తగ్గడంతోపాటు మేని ఛాయ 16 శాతం దాకా మెరుగైందని దీన్ని వాడిన వారు చెబుతున్నారు. అంతేకాదు.. ఇందులో ఉండే అండర్ ఐ కూలింగ్ ఎల్ఈడీల వల్ల కళ్ల కింద క్యారీ బ్యాగులు కూడా తగ్గుతున్నాయట. రేటెంతనే కదా డౌటు.. మన కరెన్సీలో రూ.30 వేలు.

క్లుప్తంగా...

జస్టిస్ షమీమ్ అక్తర్ బాధ్యతల స్వీకరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ కోసం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ సోమవారం కొలువు దీరింది. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా వర్గీకరణ చేసేందుకు ఈ ప్రత్యేక కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. 60 రోజుల్లోగా అధ్యయనం పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాల్సి ఉంది. బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని మొదటి అంతస్తు బి–బ్లాక్‌లో ఏకసభ్య కమిషన్‌కు కార్యాలయాన్ని ప్రభుత్వం కేటాయించింది. సోమవారం బాధ్యతలు స్వీకరించిన జస్టిస్ షమీమ్ అక్తర్‌ను ఎస్సీ అభివృద్ధి శాఖ అదనపు సంచాలకులు ఉమాదేవి, శ్రీధర్ తదితరులు కలిశారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు కార్యాలయంలో వినతులు సమర్పించవచ్చని, onemancommission.scsc@gmail.com మెయిల్ ఐడీకి కూడా పంపవచ్చని శ్రీధర్ చెప్పారు.

రాష్ట్రంలో పెట్టుబడులకు సైబర్ వ్యూ ఆసక్తి: దుద్దిళ్ల



సాక్షి, హైదరాబాద్: టెక్నాలజీ హబ్‌ల నిర్మాణం, నూతన పరిశోధనలకు అనువైన వాతావరణం కల్పించడంలో విశేష అనుభవం ఉన్న సైబర్ వ్యూ అనే మలేసియన్ సంస్థ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి కనబరిచింది. మలేసియా పర్యటనలో ఉన్న ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో ఆ సంస్థ ప్రతినిధులు సోమవారం కౌలాలంపూర్‌లో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల పట్ల చర్చలు జరిపారు. సమావేశంలో తెలుగు మూలాలున్న సెలంగోర్ ప్రావిన్స్ డిప్యూటీ ప్రెసిడెంట్ గణబతిరావు వీరమన్, హైదరాబాద్‌కు చెందిన టీ కన్సల్ట్ సంస్థ చైర్మన్ సందీప్ మక్తల పాల్గొన్నారు. తెలంగాణలో జరిగిన సాంకేతిక పురోగతులు, డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను స్వయంగా చూసేందుకు గణబతిరావును తెలంగాణకు ఆహ్వానించినట్లు శ్రీధర్‌బాబు వెల్లడించారు.

సీఎంఏ–యూకే రాష్ట్ర ప్రతినిధిగా ప్రభుకుమార్



సాక్షి, హైదరాబాద్: కామన్‌వెల్త్ మెడికల్ అసోసియేషన్ (సీఎంఏ–యునైటెడ్ కింగ్‌డమ్) తెలంగాణ ప్రతినిధిగా ప్రభుకుమార్ చల్లగాలి ఎంపికయ్యారు. శని, ఆదివారాల్లో రాత్రి చెన్నైలో 'ఐకాన్–2024' సదస్సుకు 56 దేశాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశాల్లో భాగంగా సీఎంఏ అధ్యక్షుడిగా (ఐఎంఏ జాతీయ నాయకుడు) జేఏ జయలాల్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో తమిళనాడు ఎంజీఆర్ మెడికల్ వర్సిటీ వీసీ కె.నారాయణస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుకుమార్‌ను తెలంగాణ నుంచి ప్రతినిధిగా ఎంపికచేశారు. 5 వేలకు పైగా మెడికల్ క్యాంపులు, వేలాది అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రభుకుమార్‌ను నారాయణస్వామి అభినందించారు.

రెండేళ్లలో గుంతల్లేని రాష్ట్రంగా మారుస్తాం

నూతన టెక్నాలజీని వినియోగించి ఆదర్శంగా నిలుస్తాం: మంత్రి కోమటిరెడ్డి

అధికారులంతా ఫీల్డ్‌లో ఉండాలి.. బాధ్యతగా పని చేయాలి.. అధికారులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదు

చిలుకూరులో పైలట్ ప్రాజెక్టు ప్రారంభించిన మంత్రి



రోడ్డుపై గుంతను పూడుస్తున్న యంత్రం పనితీరును పరిశీలిస్తున్న కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: నూతన టెక్నాలజీతో రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపై గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీని కోసం త్వరలోనే ఒక టోల్ ఫ్రీ నంబర్‌ను తేనుంది. ఈ కార్యక్రమానికి ఓ పేరు కూడా పెట్టనుంది. గ్రామాల్లో, రహదారులపై ఉండే గుంతలను పూడ్చేందుకు అధునాతన ఎయిర్ ప్రెషర్ జెట్ ప్యాచర్, పాట్‌హోల్ అండ్ రోడ్ మెయింటెనెన్స్ యంత్రాలను వినియోగించనుంది. దీనికి సంబంధించిన పైలట్ ప్రాజెక్టును సోమవారం రంగారెడ్డి జిల్లా చిలుకూరులో రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రోజుకు 10–20 కి.మీ. మేర గుంతలను పూడ్చే సామర్థ్యం కలిగిన రెండు మిషన్ల పనితీరును పరిశీలించారు. అనంతరం కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ... రానున్న రెండేళ్లలో గుంతల్లేని రాష్ట్రంగా మార్చి తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. దీని కోసం అధికారులంతా ఫీల్డ్ విజిట్‌కు వెళ్లాలని, ఎక్కడ గుంత ఉన్నా తక్షణమే పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధునాతన పద్ధతులతో రోడ్లపై గుంతలను వేగంగా పూడ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 90% కర్బన ఉద్గారాలను తగ్గించే ఎకోఫ్రెండ్లీ విధానంలో రద్దీగా ఉండే రహదారులపైనా పనులు వేగంగా చేయొచ్చని తెలిపారు.

బీఆర్ఎస్ ప్రజలకు ఏం చేసింది?

పదేళ్ల అధికారంలో ఉన్నా బీఆర్ఎస్ ప్రజలకు ఏం చేయలేకపోయిందని, కనీసం రోడ్లపై ఉన్న చిన్న చిన్న గుంతలను కూడా పూడ్చలేకపోయిందని కోమటిరెడ్డి ధ్వజమెత్తారు. నాడు రోడ్డుపై గుంతలు చూపిస్తే వేయి రూపాయలు ఇస్తానన్నారని, కానీ రాష్ట్రం మొత్తం గుంతలే ఉన్నాయన్నారు. రూ.7 లక్షల కోట్ల అప్పు చేసిన బీఆర్ఎస్... గుంతలకు రూ.20 కోట్లు కేటాయించి ఉంటే తెలంగాణ గుంతల్లేని రాష్ట్రంగా మారేదన్నారు. రోడ్లపై గుంతలతో రోజూ అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారని, కొంతమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయం తీసుకోవడానికి వెళ్లిన అధికారులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. మంత్రి వెంట ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలే యాదయ్య, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు.

ప్యాచ్ వేసినట్లు కాకుండా..

మామూలుగా రోడ్లపై గుంతలను సిమెంట్ లేదా తారుతో పూడుస్తారు. వీటి కోసం ఏటా కోట్లు ఖర్చు చేస్తున్నా వర్షాలు, ఇతర కారణాలతో అవి కొద్దిరోజులు మాత్రమే ఉంటున్నాయి. దీంతో రోడ్లపై ఉన్న గుంతలను మళ్లీ మళ్లీ పూడ్చాల్సి వస్తోంది. అదే నూతన టెక్నాలజీతో ఒక్కసారి రోడ్డు మీద ఉన్న గుంతను పూడ్చితే అది రెండు నుంచి మూడేళ్లు ఉంటుంది. అలాగే, గుంతలను పూడ్చే సమయంలో ట్రాఫిక్‌ను ఆపడం, దాని కోసం ఒకరోజు మొత్తం రోడ్డును బ్లాక్ చేయడం లాంటివి చేయనక్కర్లేదు. గుంతను పూడ్చిన 20–30 నిమిషాల్లోనే ఆ రోడ్డుపై నుంచి ప్రయాణం చేయొచ్చు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇలాంటివి మూడు యంత్రాలున్నాయి. వీటి వ్యయం తక్కువే. కచ్చితత్వంతో ప్యాచ్ వేయగలిగే మెకనైజ్డ్ సిస్టం వల్ల ప్యాచ్ వేసినట్టు కనిపించకుండా సహజంగా రోడ్డు వేసినట్టే ఉంటుందని, దానివల్ల వాహనాలు కుదుపులకు గురికావని మంత్రి చెప్పారు.

లారీ కింద జుట్టు ఇరుక్కొని..



లారీ కింద దివ్యశ్రీ



బాధితురాలితో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

హుజూరాబాద్ రూరల్: ఓ మహిళ ప్రమాదవశాత్తూ లారీ కింద పడగా త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అయితే ఆమె జుట్టు లారీ టైరు కింద ఇరుక్కొని కొంత దూరం వెళ్లడంతో నరకయాతన అనుభవించింది. ఈ ఘటన హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులో కరీంనగర్–వరంగల్ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మానకొండూర్ మండలంలోని కెల్లెడ గ్రామానికి చెందిన దివ్యశ్రీ, ఆమె భర్త, ఇద్దరు పిల్లలు సోమవారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. సింగాపూర్ శివారులో వాహనం అదుపుతప్పింది. దీంతో దివ్యశ్రీ రోడ్డుపై పడి నేరుగా లారీ చక్రాల మధ్యలోకి జారిపోయింది. లారీ టైరు కింద ఆమె జుట్టు ఇరుక్కుపోయింది. స్థానికులు కేకలు వేయడంతో డ్రైవర్ వాహనాన్ని నిలిపివేశాడు. అటుగా వెళ్తున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఆగి, బాధితురాలికి ధైర్యం చెప్పారు. ఆయన సూచనతో స్థానికులు దివ్యశ్రీ జుట్టును కత్తిరించి, ఆమెను కాపాడారు. రక్తమోడుతున్న తల్లిని చూసిన పిల్లలు బోరున విలపించారు. ఆమెను కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆమె వైద్య ఖర్చులను తానే చెల్లిస్తానని సంజయ్ వైద్యులకు తెలిపారు.

కొరత తీరాలంటే కెపాసిటీ పెంచాలి..



వచ్చే పదేళ్లలో విద్యుత్ కొరత

2034–35లో వార్షిక వినియోగం 1.50 లక్షల మిలియన్ యూనిట్లు	5,092 మెగావాట్ల థర్మల్, 7,818 మెగావాట్ల స్టోరేజీ విద్యుత్ సామర్థ్యం పెంచుకోవాలి

రిసోర్స్ ప్లాన్ 2024–35 నివేదికలో కేంద్రం స్పష్టీకరణ

వచ్చే దశాబ్ద కాలంలో రాష్ట్రంలో పెరగనున్న విద్యుత్ వార్షిక అవసరాలు, రోజువారీ గరిష్ట డిమాండ్‌ను పట్టికలో చూడవచ్చు.

సంవత్సరం	వార్షిక విద్యుత్ అవసరాలు (మిలియన్ యూనిట్లలో)	గరిష్ట డిమాండ్ (మెగావాట్లలో)
2025-26	90,962	18,138
2026-27	1,0,2732	19,529
2027-28	1,0,8932	20,968
2028-29	1,15,347	22,488
2029-30	1,22,627	24,215
2030-31	1,28,032	25,639
2031-32	1,33,211	27,059
2032-33	1,38,600	28,558
2033-34	1,44,206	30,139
2034-35	1,50,040	31,809

సాక్షి, హైదరాబాద్: వచ్చే పదేళ్లలో రాష్ట్రం విద్యుత్ కొరతను ఎదుర్కొనే అవకాశముంది. తెలంగాణ రాష్ట్ర విద్యుత్ అవసరాలు 2024–35 పేరుతో కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ రూపొందించిన ఓ నివేదికలో ఈ విషయాన్ని స్పష్టం చేసింది. 2023–24లో రాష్ట్ర వార్షిక విద్యుత్ అవసరాలు 84,623 మిలియన్ యూనిట్లు(ఎంయూ) కాగా, 2034–35 నాటికి 1,50,040 ఎంయూలకు పెరగబోతోంది. రోజువారీ గరిష్ట విద్యుత్ డిమాండ్ 2023–24లో 15,622 మెగావాట్లు కాగా, 2034–35 నాటికి 31,809 మెగావాట్లకు చేరుతుంది. ప్రస్తుతం రాష్ట్రం 19,475 మెగావాట్ల రోజువారీ గరిష్ట విద్యుత్ సరఫరా సామర్థ్యాన్నికలిగి ఉండగా, ఈ నివేదిక ప్రకారం వచ్చే 10 ఏళ్లలో 31,809 మెగావాట్లకు పెంచుకోవాలి. ఇందుకుగాను కొత్త విద్యుత్ కేంద్రాల నిర్మాణంతోపాటు కొత్త విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను చేసుకోవాల్సి ఉంటుంది. వినియోగంలో హెచ్చుతగ్గులకు అనుగుణంగా విద్యుత్ డిమాండ్ నిత్యం ఒడిదుడుకులకు లోనవుతూ ఉంటుంది. రోజులోని ఒకానొక సమయంలో డిమాండ్ అమాంతంగా పెరిగి గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. కొద్ది నిమిషాలే గరిష్ట స్థాయికి డిమాండ్ నెలకొని ఉన్నా, ఆ మేరకు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఎల్లప్పుడు సంసిద్ధతతో ఉండాలి. లేకుంటే విద్యుత్ కోతలు విధించక తప్పదు.

పదేళ్లలో 10,164 మెగావాట్ల సామర్థ్యం వృద్ధి

వచ్చే పదేళ్లలో 4,684 మెగావాట్ల థర్మల్, 2,899 మెగావాట్ల సోలార్, 2,581 మెగావాట్ల ఇతర పునరుత్పాదక విద్యుత్ కలిపి మొత్తం 10,164 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని రాష్ట్రం పెంచుకోనుంది. కొత్త విద్యుత్ కేంద్రాల నిర్మాణం/విద్యుత్ కొనుగోలు ఒప్పందాలతో ఇది సాధ్యం కానుంది. వచ్చే పదేళ్లలో 1,916 మెగావాట్ల థర్మల్ విద్యుత్, 807 మెగావాట్ల గ్యాస్ ఆధారిత విద్యుత్, 160 మెగావాట్ల అణు విద్యుత్, ఇతరత్రాలు కలిపి మొత్తం 2,938 మెగావాట్ల విద్యుత్ లభ్యతను రాష్ట్రం కోల్పోనుంది. పాత విద్యుత్ కేంద్రాల జీవిత కాలం ముగియడం, విద్యుత్ ఒప్పందాల గడువు తీరనుండటమే దీనికి కారణం.

మున్ముందు విద్యుత్ కొరత

ప్రస్తుత విద్యుత్ సరఫరా సామర్థ్యంతోపాటు కొత్తగా సామర్థ్యం పెంపుదలకు తీసుకుంటున్న చర్యలను పరిగణనలోకి తీసుకున్నా.. తెలంగాణ రాష్ట్రం 2024–35 మధ్యకాలంలో ఆద్యంతం విద్యుత్ కొరతను ఎదుర్కొనే అవకాశముందని ఈ నివేదికలో కేంద్రం అంచనా వేసింది. 2034–35లో 16,684 ఎంయూల విద్యుత్ కొరత ఉంటుందని స్పష్టం చేసింది. ప్రధానంగా ఫిబ్రవరి–మార్చి నెలల మధ్యకాలంలో సౌర విద్యుదుత్పత్తి ఉండని వేళల్లో కొరత తీవ్రంగా ఉంటుందని తెలిపింది. పెరగనున్న డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా చేసేందుకుగాను రాష్ట్రంలో అదనంగా 5,092 మెగావాట్ల థర్మల్, 7,818 మెగావాట్ల స్టోరేజీ విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సి ఉంటుందని సూచించింది.

ఇంటింటికీ కాదు.. బడిలోనే సర్వే!





పాఠశాలలో ఇంటింటి సర్వే కోసం వచ్చిన గ్రామస్తులు. (ఇన్‌సెట్‌లో) పాఠశాలలో సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్లు

వెంకటాపురం (కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండలంలోని బోధాపురం గ్రామ పంచాయతీ పరిధి సీతారాంపురం గ్రామంలో ఎన్యుమరేటర్లు సోమవారం పాఠశాలను అడ్డాగా చేసుకొని సర్వే నిర్వహించారు. మారుమూల అటవీప్రాంతంలోని పాఠశాలలో ఒకపక్క విద్యార్థులకు తరగతులు జరుగుతుండగా.. మరోపక్క ఎన్యుమరేటర్లు గ్రామస్తులను అక్కడికి పిలిపించుకొని ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించారు.

మా కులం లేదు.. బహిష్కరిస్తున్నాం

పెద్దకొడప్‌గల్ (జుక్కల్): కామారెడ్డి జిల్లా పెద్దకొడప్‌గల్ మండలంలోని పెద్దదేవిసింగ్ తండాలో సమగ్ర కులగణనను బహిష్కరించడంతో సబ్ కలెక్టర్ కిరణ్మయి తండాను సందర్శించారు. తండా వాసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్య ఏమిటని తెలుసుకున్నారు. కులగణనలో ఉపకులం లేనందున తాము ఏ కులంలో సర్వే చేయించుకోవాలని సబ్ కలెక్టర్‌ను తండా వాసులు ప్రశ్నించారు. కులగణన పట్టికలో మధుర అని మాత్రమే ఉందని అది తమ కులం కాదన్నారు. మధుర (లాబాన) అని ఉండాలని సబ్ కలెక్టర్‌ను కోరారు. అలా ఉంటేనే సర్వే చేయించుకుంటామని స్పష్టం చేశారు. దీన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మధుర(లాబాన) వచ్చే విధంగా చూస్తానని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు.

మహిళా పారిశ్రామికవేత్తల కోసం 'వి ఎంగేజ్'

సాక్షి, హైదరాబాద్: మహిళా పారిశ్రామికవేత్తల అభ్యున్నతే లక్ష్యంగా 'వి హబ్'కొత్తగా 'వి ఎంగేజ్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. అర్బన్ ఇన్నోవేషన్ విభాగం ద్వారా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో నిపుణులు, మార్గదర్శకుల ఆధ్వర్యంలో వ్యాపార మెళకువలు, మార్కెటింగ్, నిధుల సేకరణ, వ్యాపార పరిధి విస్తరణ తదితరాలపై మహిళా పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్గదర్శనం చేస్తారు. పారిశ్రామిక రంగంలో మహిళలు ఎదుర్కొనే ప్రత్యేకమైన సవాళ్లకు వి ఎంగేజ్ పరిష్కారాలు చూపుతుంది. వి ఎంగేజ్ కార్యక్రమం ప్రారంభం నేపథ్యంలో 21 మహిళా స్టార్టప్‌లకు 'వి ఎంగేజ్ లిఫ్టాఫ్', 'వి ఎంగేజ్ ప్రొఫైల్'కార్యక్రమం కింద వ్యాపారం విస్తరించేందుకు అవసరమైన సాధనాలు, వనరులు అందిస్తామని వి హబ్ ప్రకటించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
మంగళవారం: 12-11-2024



తినేవాటికి తిన్నంత

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం కొనుగోలు కేంద్రంలోని ధాన్యపురాశిపై సోమవారం ఉదయం ఇరవైకిపైగా కోతులు చేరాయి. వాటిని అదిలించేవారు లేకపోవడంతో ఓపిక ఉన్నంతసేపు ధాన్యం తిన్నాయి. కోతులగుంపును చూసి అటుగా వెళ్లేవారు అదిలించే ధైర్యం కూడా చేయలేక పోయారు. రైతులు కేంద్రం వద్దకు వచ్చాక కోతుల మూకను అక్కడి నుంచి తరమివేశారు. రోజూ ఈ తతంగం జరుగుతోందని, పట్టాలను చించి కూడా ధాన్యం తింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

– రామన్నపేట

రేపు గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖి

హాజరు కానున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్‌: ప్రజలు, కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తల సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించేందుకు మంత్రితో ముఖాముఖి కార్యక్రమం బుధవారం గాంధీభవన్‌లో జరగనుంది. కార్యక్రమానికి రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరు కానున్నారు. ఉదయం 11 గంటల నుంచి మంత్రి పొంగులేటి గాంధీభవన్‌లో అందుబాటులో ఉంటారని, ప్రజలు, కాంగ్రెస్‌ కార్యకర్తల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి.

రాజన్న ఆలయంలో కిక్కిరిసిన భక్తులు



కార్తీక సోమవారం కావడంతో వేములవాడ రాజన్న దర్శనానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ముందు రావిచెట్టు వద్ద కార్తీకదీపాలు వెలిగించారు. ఆలయ ఆవరణ, క్యూలైన్, ధర్మగుండం భక్తులతో కిక్కిరిసిపోయింది. గుడి చెరువు కట్టలోని పార్కింగ్‌ స్థలం వాహనాలతో నిండిపోయింది.

– వేములవాడ అర్బన్‌

నౌహీరా ఆస్తుల వేలానికి సుప్రీం అనుమతి

హీరా గోల్డ్‌ కేసులో విచారణ డిసెంబర్‌ 17కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా స్కీముల పేరుతో అక్రమంగా డిపాజిట్లు సేకరించి వేల కోట్ల కుంభకోణానికి తెరలేపిన హీరా గోల్డ్‌ ఎండీ నౌహీరా షేక్‌ ఆస్తులను వేలం వేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ (ఈడీ)కి దేశ సర్వోన్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. ఎలాంటి వివాదాలు లేకుండా ఉన్న ఆస్తుల వివరాలను ఈడీకి ఇవ్వాలని నౌహీరాకు ధర్మాసనం స్పష్టం చేసింది. హీరా గోల్డ్‌ స్కాం కేసులో దాఖలైన పలు పిటిషన్లపై అక్టోబర్‌ 18న విచారించిన సుప్రీంకోర్టు ఆ సంస్థ ఎండీకి గతంలో ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేసింది. అలాగే ఈ కేసుకు సంబంధించి దాఖలైన అన్ని పిటిషన్లను డిస్మిస్‌ చేసింది. అయితే... ఈ కేసులో ఉపశమనం కల్పించాలని కోరుతూ గత నెల 22న నౌహీరా సుప్రీంకోర్టులో 'మిస్‌లీనియస్‌' అప్లికేషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్‌ జేబీ పార్దివాలా, జస్టిస్‌ ఆర్‌.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ఆస్తులు వేలం వేసి డిపాజిటర్ల డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు నౌహీరా షేక్‌ తరపు న్యాయవాది ధర్మాసనానికి తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రెండు ఆస్తులను వేలం వేసేందుకు ఈడీకి న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. మూడు నెలల్లో ఈ ప్రక్రియ అంతా ముగించాలని, వివరాలు తెలపడంతో ఎలాంటి వివాదాలు సృష్టించవద్దని నౌహీరాకు ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. తదుపరి విచారణ డిసెంబర్‌ 17కు వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది.

మావోల కట్టడికి పదునైన వ్యూహాలు

- డీజీపీ జితేందర్‌ నేతృత్వంలో భద్రాద్రి జిల్లాలో రెండు రాష్ట్రాల పోలీసుల సమావేశం
- బస్తర్‌లో మావోయిస్టులపై పెరిగిన నిర్బంధం
- పొరుగు రాష్ట్రాలకు కేడర్‌ను పంపే యోచనలో మావోలు
- వారి రాకపోకలకు బ్రేకులు వేసేలా పోలీస్‌ ప్లాన్‌



సారపాక ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ జితేందర్, పక్కన ఆయా జిల్లాల పోలీస్‌ అధికారులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వ నిర్బంధం పెరిగిన నేపథ్యంలో దాడుల సంగతి పక్కన పెట్టి కేడర్, నాయకత్వాన్ని కాపాడుకోవడంపై మావోయిస్టులు దృష్టి సారించారు. ఈ క్రమంలో నిర్బంధం తీవ్రంగా ఉన్న బస్తర్‌కు ప్రత్యామ్నాయ ప్రదేశాలను వెతికే పనిలో మావోలు పడ్డారు. వాటికి అడ్డుకట్ట వేసేందుకు మావోయిస్టు ప్రభావిత రాష్ట్రాల యాంటీ నక్సల్స్‌ ఆపరేషన్స్‌ నిర్వహించే గ్రేహౌండ్స్‌ దళాలు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు తెలంగాణ డీజీపీ జితేందర్‌ నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి (తెలంగాణ), బస్తర్‌ (ఛత్తీస్‌గఢ్‌) జిల్లాలకు చెందిన అధికారులతో సోమవారం భద్రాద్రి జిల్లా సారపాకలో జరిగిన సమావేశంలో ఈ అంశంపై ఫోకస్‌ చేసినట్టు తెలుస్తోంది.

మావోయిస్టులను అరికడతాం

దేశంలో మావోయిస్టులను 2026 మార్చి నాటికి పూర్తిగా నిర్మూలిస్తామని గత ఆగస్టులో కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే మావోయిస్టులకు గెరిల్లా జోన్‌గా ఉన్న బస్తర్‌లో యాంటీ మావోయిస్టు ఆపరేషన్లు ఈ ఏడాది ఆరంభం నుంచి ఉధృతంగా సాగుతున్నాయి. ఫలితంగా ఈ ఏడాదిలో ఇప్పటివరకు 200 మందికి పైగా మావోయిస్టులు మృతిచెందగా, అంతకు రెట్టింపు సంఖ్యలో లొంగిపోవడం లేదా అరెస్టు అయ్యారు. మరీ ముఖ్యంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పాటైన తర్వాత గత నెల 4న జరిగిన ఎదురుకాల్పుల్లో అత్యధికంగా 38 మంది మావోయిస్టులు మరణించారు. ఈ ఘటన ద్వారా దండకారణ్యంతోపాటు అబూజ్‌మడ్‌ అడవులపై కూడా పట్టు సాధిస్తున్నామనే సంకేతాలను ఛత్తీస్‌గఢ్‌ పోలీసులు, పారామిలిటరీ బలగాలు పంపాయి.

వెనక్కి తగ్గిన మావోలు

కమ్యూనిస్టు విప్లవాలు మొదలైన తర్వాత మార్క్సిస్టు, లెనినిస్టు పద్ధతుల్లోనే ఎక్కువగా పోరాటాలు జరిగాయి. కార్మిక నియంతృత్వ ప్రభుత్వాలపై పోరాటాన్ని మార్క్స్‌ ప్రతిపాదిస్తే, దానికి రాజకీయ రూపాన్ని ఇచ్చి ఆచరణ సాధ్యమనిపించాడు లెనిన్‌. వీరిద్దరి పద్ధతులకు అదనంగా రైతులు, రైతు కూలీలను ఏకం చేసి ఆయుధాలు చేతబట్టి గెరిల్లా జోన్ల ద్వారా విప్లవం తేవొచ్చని మావో నిరూపించాడు. దేశంలో 1967లో నక్సల్బరీతో మొదలైన తీవ్రవాద మార్క్సిస్టు పోరాటాలు దేశంలో అనేక రాష్ట్రాలకు విస్తరించడంతోపాటు అనేక పార్టీలుగా చీలిపోయాయి. చివరకు అన్ని విప్లవ శక్తులు ఆర్మ్‌డ్‌ గెరిల్లా ఫైట్‌కే మొగ్గు చూపుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా 2004 సెప్టెంబర్‌ 21న ఏర్పడ్డాయి. అప్పటి నుంచి మావో ప్రతిపాదించిన గెరిల్లా పోరాట పంథాలో.. విశ్రమించే శత్రువు (రాజ్యం–పోలీసులు, పారామిలిటరీ)ను (గెరిల్లా దళాలు) ఇబ్బంది పెట్టడం, శత్రువు ఆలోచనల్లో ఉన్నప్పుడే దెబ్బతీయడం, శత్రువు వెనుకంజ వేస్తే వెంటపడి తరమడం, శత్రువు ముందంజ వేస్తే వెనకడుగు వేయాలనే విధానాలు అమలు చేస్తోంది.

పొరుగు రాష్ట్రాల దిశగా..

ప్రస్తుతం మావోయిస్టులపై కేంద్రం ఉక్కుపాదం మోపి అణచివేస్తుండటంతో వ్యూహాత్మకంగా వెనకడుగు వేయాలనే యోచనలో మావోయిస్టు నాయకత్వం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. అందువల్లే ఈ ఏడాదిలో గెరిల్లా దళాలకు ప్రతికూల సమయంగా భావించే వేసవిలో వ్యూహాత్మక ఎదురుదాడులు చేయలేదు. అనుకూలంగా ఉండే వానాకాలంలోనూ ఎటాక్‌ల్లో మావోయిస్టుల దూకుడు తగ్గిందని భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధం తగ్గే వరకు అగ్రనాయకత్వంతో పాటు కేడర్‌ను కాపాడుకునే అంశానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు సమాచారం. అందులో భాగంగానే మావోయిస్టుల గెరిల్లా జోన్‌గా ఉన్న బస్తర్‌ అడవులతో సరిహద్దులు పంచుకుంటున్న ఏపీ, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్రపై మావోయిస్టులు మరోసారి సీరియస్‌గా దృష్టి సారించినట్టు తెలుస్తోంది.

తెలంగాణలో దెబ్బ

తెలంగాణలో మరోసారి పాగా వేసేందుకు మావోయిస్టులు ప్రయత్నించారు. ఈ మేరకు 15 మందితో కూడిన దళం భద్రాద్రి కొత్తగూడెం –ములుగు జిల్లాల్లో ఈ ఏడాది సంచరించింది. అయితే మావోయిస్టులు–పోలీసులకు మధ్య భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండుసార్లు జరిగిన ఎదురుకాల్పుల్లో మొత్తం ఏడుగురు మావోయిస్టులు చనిపోయారు. దీంతో తెలంగాణలోకి చొచ్చుకురావడం మావోయిస్టులకు కష్టంగా మారింది. మరోవైపు బస్తర్‌లోనూ నిర్బంధం పెరుగుతోంది. ఇక వచ్చే వేసవి నాటికి కచ్చితంగా ఏపీ, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్రల్లో తమకు అనుకూలంగా ఉండే జిల్లాల్లోకి ఎంట్రీ కోసం మావోలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో బస్తర్‌ నుంచి ఇతర ప్రాంతాలకు మావోలు చేపడుతున్న విస్తరణ చర్యలను కట్టుదిట్టంగా ఎదుర్కొనేందుకు తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌ యాంటీ నక్సల్స్‌ ఆపరేషన్‌ దళాలు సంయుక్త కార్యాచరణతో ముందుకు వెళ్లేందుకు మరోసారి రెడీ అవుతున్నాయి.

రేవంత్‌ అరాచక పాలనను ఎండగడదాం

ఎన్నారై లండన్‌ విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావొస్తున్నా హామీలు మాత్రం అమలు చేయడం లేదని బీఆర్‌ఎస్‌ పార్టీ ఎన్నారై లండన్‌ విభాగం వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌ కూర్మాచలం విమర్శించారు. బీఆర్‌ఎస్‌ ఎన్నారై విభాగం లండన్‌ శాఖ అధ్యక్షుడు దూసరి అశోక్‌గౌడ్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనిల్‌ మాట్లాడారు. హామీల అమలును పక్కన పెట్టి రాష్ట్రంలో రేవంత్‌ అరాచరక పాలన చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో రాష్ట్రాన్ని కాంగ్రెస్‌ 20 ఏళ్లు వెనక్కి తీసుకెళ్తోందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను సోషల్‌ మీడియా వేదికగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు లండన్‌లో ప్రత్యేక నిరసన కార్యక్రమం చేపట్టాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌ పార్టీని అడుగడుగునా ప్రశ్నించేలా కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎన్నారై లండన్‌ విభాగం ఏర్పాటై 14 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా కేక్‌ కట్‌ చేశారు. సమావేశంలో లండన్‌ విభాగం ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, రత్నాకర్‌ కడుదుల, సిక్క చంద్రశేఖర్‌గౌడ్, రవి ప్రదీప్‌ పులుసు తదితరులు పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్‌ ఉపాధ్యక్షుడు సాయిబాబా కోట్ల ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటించారు.

టీజీపీఎస్సీ చైర్మన్‌ కోసం దరఖాస్తుల ఆహ్వానం

- డిసెంబర్‌ 3వ తేదీతో ముగియనున్న మహేందర్‌రెడ్డి పదవీకాలం
- ఆన్‌లైన్‌లో ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌(టీజీపీఎస్సీ) నూతన చైర్మన్‌ నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణకు ఉపక్రమించింది. టీజీపీఎస్సీ చైర్మన్‌ ఎం.మహేందర్‌రెడ్డి పదవీకాలం వచ్చే డిసెంబర్‌ 3వ తేదీతో ముగియనుంది. దీంతో నూతన చైర్మన్‌ ఎంపిక కోసం క్షేత్రస్థాయి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో సీఎస్‌ శాంతికుమారి సోమవారం నోటిఫికేషన్‌ విడుదల చేశారు. దరఖాస్తు రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. దీనిని డౌన్‌లోడ్‌ చేసుకొని నిర్దేశించిన వివరాలను నమోదు చేయాలి. ఆ తర్వాత దరఖాస్తు స్కాన్డ్‌ కాపీని జీఏడీ ముఖ్యకార్యదర్శి మెయిల్‌కు ఈనెల 20వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు పంపాలి. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఎంపిక ప్రక్రియను చేపడతామని, సెర్చ్‌ కమ్‌ స్క్రీనింగ్‌ కమిటీ ఏర్పాటు ద్వారా చైర్మన్‌ నియామకం చేపట్టనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది.



సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మను మర్యాదపూర్వకంగా కలిసిన మిజోరం గవర్నర్‌ కంభంపాటి హరిబాబు

బీజేపీకి బీటీమ్‌గా బీఆర్‌ఎస్‌: మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్‌: బీజేపీకి బీటీమ్‌గా మాజీ సీఎం కేసీఆర్, ఇతర నేతలు వ్యవహరిస్తున్నారని పంచాయతీరాజ్‌ శాఖ మంత్రి సీతక్క ఆరోపించారు. అధికారంలో ఉన్నపుడు చేసిన అక్రమాలు, అవినీతికి సంబంధించిన కేసుల నుంచి తప్పించుకోవడానికే బీజేపీతో బీఆర్‌ఎస్‌ అంటకాగుతోందన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీకి లబ్ధి చేకూర్చేందుకు బీఆర్‌ఎస్‌ కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. మహారాష్ట్ర ఎన్నికల షెడ్యూల్‌ విడుదలైనప్పటి నుంచి పక్కా ప్రణాళికతో బీఆర్‌ఎస్‌ విషప్రచారం చేస్తోందని సీతక్క ఒక ప్రకటనలో ధ్వజమెత్తారు. అందులో భాగంగానే పదే పదే తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజా ప్రభుత్వంపై ఆ పార్టీ విషం చిమ్ముతోందన్నారు. అత్యవసర సమయాల్లో చేతిలో చిల్లిగవ్వ లేకున్నా మహిళలు ఉచిత ప్రయాణాలు చేస్తున్నారని సీతక్క గుర్తుచేశారు. ఉచిత రవాణా పథకంపైనా దుష్ప్రచారం చేస్తూ.. ఆటో డ్రైవర్లను ఉసిగొల్పి ధర్నాలు చేయిస్తున్నారని ఆరోపించారు. ఓలా, ఉబర్‌ క్యాబ్‌లు, బైక్‌ ట్యాక్సీలకు ప్రగతి భవన్‌లో పచ్చా జెండాలు ఊపి ప్రారంభించినప్పుడు ఆటో డ్రైవర్లు గుర్తుకు రాలేదా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యుమరేటర్లను నిలదీయాలంటూ కేటీఆర్‌ చేసిన వ్యాఖ్యలను సీతక్క ఖండించారు. పబ్బులు, క్లబ్బులు, డ్రగ్స్‌ బంద్‌ అయ్యాక కొందరు పిచ్చి ముదిరి అరాచకంగా మాట్లాడుతున్నారని విరుచుకుపడ్డారు.

అజారుద్దీన్‌కు సుప్రీం నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్‌ మహ్మద్‌ అజారుద్దీన్‌కు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌ నుంచి గెలుపొందిన తన ప్రత్యర్థి మాగంటి గోపినాథ్‌ ఎన్నికను రద్దు చేయాలని అజారుద్దీన్‌ తెలంగాణ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ కొట్టివేయాలని గోపినాథ్‌ హైకోర్టులో కౌంటర్‌ పిటిషన్‌ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా గోపినాథ్‌ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. దీన్ని సవాల్‌ చేస్తూ గోపినాథ్‌ ఈ నెల 6వ తేదీన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను జస్టిస్‌ సూర్యకాంత్, జస్టిస్‌ ఉజ్జల్‌ భూయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టులో జరుగుతున్న విచారణపై స్టే విధించింది. అలాగే ప్రతివాదిగా ఉన్న అజారుద్దీన్‌కు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వచ్చే ఏడాది జనవరి మొదటి వారానికి వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ఆ ఉత్తర్వుల్లో వెల్లడించింది.

సమగ్ర సర్వే ఎన్యుమరేటర్లపై ఒత్తిడి చేయొద్దు: టీఎస్‌యూటీఎఫ్‌

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్లపై తీవ్ర ఒత్తిడి చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని, లక్ష్యాలను నిర్దేశిస్తూ షోకాజ్‌ నోటీసులు, కఠిన చర్యలంటూ ఉన్నతాధికారులు ఇబ్బందులు పెడుతున్నారని టీఎస్‌యూటీఎఫ్‌ అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావ రవి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. సర్వేకు ముందు ఉపముఖ్యమంత్రితో జరిగిన చర్చల్లో మధ్యాహ్నం ఒంటిగంట తర్వాతే సర్వే చేపట్టాలనే నిబంధనకు అంగీకరించామని, కానీ నిబంధనలకు విరుద్ధంగా సర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నారన్నారు. ఈ అంశంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం టీఎస్‌యూటీఎఫ్‌ రాష్ట్ర బాధ్యులు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రణాళిక శాఖ, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శులకు లేఖలు రాశారు.

సమగ్ర కుటుంబ సర్వే నివేదిక బయటపెట్టాలి: వీహెచ్‌



సాక్షి, హైదరాబాద్‌: సమగ్ర కుటుంబ సర్వే చేసిన వాళ్లు కూడా కులగణనను వ్యతిరేకిస్తున్నారని మాజీ ఎంపీ, సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు వి.హనుమంతరావు విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన వెంటనే నిర్వహించిన ఈ సమగ్ర కుటుంబ సర్వే నివేదికను బయటపెట్టాలని ఆయన డిమాండ్‌ చేశారు. సోమవారం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కులగణనతో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తానని తమ నాయకుడు రాహుల్‌గాంధీ చెబుతుంటే.. మోదీ మాత్రం దాన్ని విభజన అంటున్నారని విమర్శించారు. ఈడబ్ల్యూఎస్‌ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు అగ్రవర్ణాలకు ఇస్తే తాము అడ్డుకున్నామా? అని వీహెచ్‌ ప్రశ్నించారు. ప్రజలకు ఏం చేస్తామో చెప్పకుండా మహారాష్ట్ర, జార్ఖండ్‌లకు వెళ్లి తెలంగాణ నుంచి డబ్బులు వస్తున్నాయని మోదీ చెప్తున్నారని ఎద్దేవా చేశారు. తాను కూడా రెండురోజుల పాటు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారానికి వెళ్తున్నట్టు వీహెచ్‌ చెప్పారు.

అసలు ఢిల్లీకి ఎవరు పిలిచారని కేటీఆర్‌ వెళ్లాడు

ప్రభుత్వ విప్‌ ఆది శ్రీనివాస్‌

సాక్షి, హైదరాబాద్‌: 'మాజీమంత్రి కేటీఆర్‌కు ఢిల్లీలో ఏం పని ఉంది..అసలు ఆయన్ను ఎవరు పిలిచారని ఢిల్లీకి వెళ్లారు' అని ప్రభుత్వవిప్‌ ఆది శ్రీనివాస్‌ ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. అమృత్‌ టెండర్లలో ఎలాంటి అవినీతి జరగలేదని స్వయంగా బీఆర్‌ఎస్‌ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. అమృత్‌ టెండర్లపై కేటీఆర్‌కు అవగాహన లేదని, గతంలో ఇష్టమొచ్చినట్టు వాగి పరువు తీసుకున్నాడని, కేంద్రానికి ఫిర్యాదు చేయడం కాదని, తన పార్టీ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డికి ఆయన జవాబు చెప్పాలని ఎద్దేవా చేశారు. ఫార్ములా రేస్‌ వ్యవహారం బయటకు వచ్చినందుకు దాని నుంచి బయటపడేందుకు బీజేపీ నేతల కాళ్లు మొక్కేందుకు కేటీఆర్‌ ఢిల్లీకి వెళ్లారేమోనని వ్యాఖ్యానించారు. కేటీఆర్‌ ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదని, అడ్డగోలుగా పెట్టిన ఖర్చులకు లెక్క చెప్పాల్సిందేనని ఆది శ్రీనివాస్‌ స్పష్టం చేశారు.

క్లుప్తంగా...

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె కాలపు వేతనాలు విడుదల

సాక్షి, అమరావతి: కేజీబీవీల్లో పనిచేస్తున్న వారితో పాటు జిల్లాలు, మండలాల్లో సమగ్ర శిక్షా పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్ల కోసం గతేడాది డిసెంబరు, జనవరి నెలల్లో చేసిన 21 రోజుల సమ్మె కాలానికి నిలిపివేసిన వేతనాలను సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు విడుదల చేశారు.

రెరాలో పోస్టుల భర్తీకి సెర్చ్ కమిటీ

సాక్షి, అమరావతి: రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (ఏపీ రెరా)లో చైర్‌పర్సన్‌తో పాటు ఖాళీగా ఉన్న సభ్యుల పోస్టుల భర్తీకి ప్రభుత్వం ముగ్గురు అధికారులతో సెర్చ్ కమిటీని నియమించింది. ఈమేరకు మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాము ఉత్తర్వులు జారీ చేశారు. సెర్చ్ కమిటీలో గృహ నిర్మాణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ సభ్యులుగా నియమించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దీపం-2 పథకంలో ఉచిత గ్యాస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని దీపం-2 పథకంగా పేర్కొంటూ పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో సెక్రటరీ జి.వీరపాండియన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పథకంలో ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు.

జీసీసీ చైర్మన్‌గా కిడారి శ్రావణ్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గిరిజన సహకార సంస్థ(జీసీసీ) చైర్మన్‌గా కిడారి శ్రావణ్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన రెండేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగనున్నారు. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు సోమవారం ఉత్తర్వులిచ్చారు.

నాటక అకాడమీ చైర్మన్‌గా గోపాలకృష్ణ

సాక్షి, అమరావతి: ఏపీ నాటక అకాడమీ చైర్మన్‌గా గుమ్మడి గోపాల కృష్ణను, రాష్ట్ర క్రియేటివ్ అండ్ కల్చర్ కమిషన్ చైర్‌పర్సన్‌గా తేజస్వినిని నియమిస్తూ పర్యాటక, సాంస్కృతిక-యువజన సర్వీసుల శాఖ కార్యదర్శి వి.వినయ్‌చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిరువురు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని పేర్కొన్నారు.



మబ్బులకు పైనుండే గిరి శిఖరాలు, కొండల నడుమ పాలనురగలా తేలియాడే మంచు మేఘాలు, పొద్దు పొడుస్తూనే భానుడు పొన్నపూవు ఛాయలో అలా..అలా.. పైకివస్తూంటే, మబ్బుల అలల మధ్య నిల్చొని ఉషోదయ భానుని అందాలు తనివితీరా ఆస్వాదిస్తుంటే.. ఆ అనుభూతి వర్ణనాతీతం. చెట్ల ఆకులపైన తుషార బింధువులు సూర్యుని లేలేత కిరణాలుపడి మెరిసిపోతుంటే, ఆమెరుపు పర్యాటకుల ముఖంలో ప్రతిబింబిస్తుంది. మన్యం రుచులు, మంచు అందాలతో వంజంగి పర్యాటకులకు మధురానుభూతులు పంచుతోంది.

మబ్బుల్లో తేలుదాం.. మంచును ముద్దాడదాం

పర్యాటకుల స్వర్గధామం వంజంగి హిల్స్ | పొగమంచు అందాలకు పర్యాటకులు ఫిదా | సీజన్ కావడంతో పోటెత్తుతున్న పర్యాటకులు

వంజంగి హిల్స్‌లో ప్రకృతి అద్భుతం

సాక్షి,పాడేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరుకు 7 కిలోమీటర్ల దూరంలోని వంజంగిహిల్స్ పర్యాటక కేంద్రంగా మంచి గుర్తింపు పొందింది. గత నాలుగేళ్లుగా వంజంగి శిఖరాలకు పర్యాటకుల తాకిడి పెరిగింది. ఎత్తయిన వంజంగి కొండల మీదుగా కొత్తవలస ప్రాంతానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తారు రోడ్డు సౌకర్యం కల్పించడంతో పర్యాటకులకు మరింత అనుకూలతగా మారింది. అక్టోబర్ నుంచి జనవరి నెల వరకు ప్రతి ఏడాది వంజంగి హిల్స్ ప్రాంతానికి తండోప తండాలుగా పర్యాటకులు తరలివస్తుంటారు. ప్రస్తుతం పర్యాటక సీజన్ కావడంతో వంజంగి హిల్స్‌లోని ప్రకృతి అందాలను వీక్షించేందుకు పర్యాటకులు భారీగానే తరలివస్తున్నారు..

శీతాకాలం ప్రారంభమైన తర్వాత ఈ వంజంగి కొండలపై మంచు ,మేఘాల అందాలు చూపరులను మరింత కనువిందు చేస్తున్నాయి. వంజంగి ఘాట్ ప్రాంతం నుంచి దిగువన ఉన్న కొండలన్ని మంచు ముసుగులో అద్భుతంగా కనిపించడంతో పాటు అక్కడ నుంచి రెండు గంటల పాటు కాలినడకన ఎత్తయిన బోలెంగమ్మ పర్వతానికి చేరుకుంటే సూర్యోదయం అందాలు, పాలసముద్రంలా మేఘాలు,పొగమంచు అందాలతో పర్యాటకులు ఫిదా అవుతున్నారు. బోలెంగమ్మ పర్వతానికి తెల్లారకముందే పర్యాటకులు చేరుకుంటున్నారు. సూర్యోదయం



అయ్యే సమయంలో ఇక్కడ రమణీయ దృశ్యాలు వారిని మరింత అబ్బుర పరుస్తున్నాయి. వంజంగి హిల్స్ ప్రాంతం విశ్వవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. గూగుల్‌లో ఈ పర్యాటక ప్రదేశం గురించి సెర్చ్ చేసేవారి సంఖ్య భారీగా పెరుగుతోంది.

పర్యాటక స్వర్గం

వంజంగి హిల్స్‌తో పాటు సముద్ర మట్టానికి సుమారు 3000 అడుగుల ఎత్తున ఉన్న బోలెంగమ్మ పర్వత శిఖరం అద్భుత పర్యాటక కేంద్రంగా మారింది. దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి పర్యాటకులు ఇక్కడికి వస్తున్నారు. వణికించే చలిని సైతం లెక్కచేయకుండా రాత్రంతా వంజంగి హిల్స్ సమీపంలోని కాటేజీలు, గుడారాల్లో మకాం వేసి సూర్యోదయం అవకముందే బోలెంగమ్మ పర్వతానికి కాలినడకన చేరుకుంటున్నారు. వంజంగి ఘాట్‌తో పాటు బోలెంగమ్మ శిఖరం వరకు ఇక్కడ మంచు అందాలు పాలసముద్రంలా పర్యాటకులను కనువిందు చేస్తున్నాయి.



వంజంగి హిల్స్ అందాలు అద్భుతం

వంజంగి హిల్స్‌కు వచ్చే పర్యాటకులకు వసతి సౌకర్యాలను కల్పించేందుకు ఐటీడీఏ చర్యలు తీసుకుంది.వంజంగి హిల్స్‌కు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసాం.పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పలుశాఖల అధికారులను అప్రమత్తం చేసాం.వంజంగి హిల్స్‌లో పర్యాటక అభివృద్ధి,గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు లక్ష్యంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు.

కాటేజీలు నిర్మిస్తే బాగుంటుంది

వంజంగి హిల్స్‌లో సూర్యోదయం, పాలసముద్రం లాంటి మేఘాలు, పొగమంచు అందాలు అద్భుతంగా ఉన్నాయి. గంటన్నర సమయం నడిచి వంజంగి హిల్స్‌పై సూర్యోదయంతో పాటు మంచు అందాలను వీక్షించడం సంతోషంగా ఉంది.వంజంగి హిల్స్‌లోనే కాటేజీలు నిర్మిస్తే పర్యాటకులకు మరింత మేలు జరుగుతుంది.వంజంగి నుంచి అరకులోయ ప్రాంతం వరకు రోడ్డు అభివృద్ధితో పర్యాటకుల వాహనాల ప్రయాణానికి ఇబ్బందులు తప్పాయి.

– కనకల ఈశ్వరరావు, పర్యాటకుడు,విశాఖపట్నం

ప్రభుత్వమే 108 అంబులెన్స్‌లను నిర్వహించాలి

108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్

సాక్షి, అమరావతి: 108 నిర్వహణ సంస్థ మారిన ప్రతిసారీ తాము నష్టపోతున్నామని, ఈ క్రమంలో తమను వైద్య శాఖ ఉద్యోగులుగా గుర్తించాలని ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కిరణ్ సోమవారం డిమాండ్ చేవారు. 108 సర్వీస్‌ను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. 15 డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు ప్రభుత్వానికి అందజేశామని వాటి పరిష్కారానికి ఈ నెల 25 లోగా అడుగులు వేయకపోతే సమ్మెకు వెళతామని ఈ మేరకు వైద్య, ఆరోగ్య, కార్మిక శాఖలతో పాటు, నిర్వహణ సంస్థ అరబిందోకూ నోటీసులు ఇచ్చామని చెప్పారు. గత ప్రభుత్వంలో రద్దు చేసిన జీవో 49ని పునరుద్ధరించాలని కోరారు. వైద్య కళాశాలల్లో భర్తీ చేస్తోన్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు లేనందున విద్యార్హతలు సడలించి 108 ఈఎంటీలకు అవకాశం కల్పించాలన్నారు. తెలంగాణలో వైద్య శాఖ నియామకాల్లో 108 ఉద్యోగులకు వెయిటేజ్ మార్కులు ఇస్తున్నారని, ఆ విధానాన్ని ఏపీలోనూ ప్రవేశపెట్టాలన్నారు. ప్రస్తుత నిర్వహణ సంస్థ అరబిందోను తప్పిస్తున్నట్టు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిందని..ఆ సంస్థ నుంచి తమకు రావాల్సిన ఇంక్రిమెంట్, వేతనాలు, సెలవుల బకాయిలను ఉద్యోగులకు చెల్లించేలా భరోసా ఇవ్వాలన్నారు. అంబులెన్స్ సేవల్లో పనిచేస్తూ మరణించిన ఉద్యోగి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు.



రూ.15 వేల కోట్ల రుణంపై చర్చలు

- అమరావతి అభివృద్ధికి రుణమిచ్చే అంశంపై ప్రపంచ బ్యాంకు, ఏడీబీ ప్రతినిధులతో సీఆర్‌డీఏ అధికారుల మంతనాలు
- డిసెంబర్ 17 తరువాతే తుది నిర్ణయం

సాక్షి, అమరావతి: ఏపీ రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15 వేల కోట్లను బహుపాక్షిక అభివృద్ధి ఏజెన్సీల ద్వారా సమకూరుస్తామని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 కేంద్ర వార్షిక బడ్జెట్ సందర్భంగా ప్రకటించారు. నాలుగు నెలలు గడిచినా ఈ ఆర్థిక సాయంపై పూర్తి స్పష్టత లేకపోవడంతో.. ఈ అంశంపై చర్చించేందుకు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ అధికారులతో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక శాఖల అధికారులు, ఏపీ కేపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఆర్‌డీఏ) అధికారులు ఢిల్లీలోని ప్రపంచ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. ఉదయం నుంచి రాత్రి వరకూ సీఆర్‌డీఏ కమిషనర్ కాటంనేని భాస్కర్ ఆధ్వర్యంలో పలు విభాగాల అధికారులు సుదీర్ఘ చర్చలు జరిపారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పిన విధంగా అమరావతికి రూ.15 వేల కోట్లు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి రుణంగా ఇవ్వనున్నట్టు, ఇందులో రూ.3 వేల కోట్లు కేంద్ర గ్రాంటుగా ఇవ్వనున్నట్టు సమాచారం. చర్చల్లో భాగంగా ఏపీ అధికారులు దాదాపు 400 పేజీల డాక్యుమెంట్లను సమర్పించారు. ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి రూ.15 వేల కోట్ల రుణ ఒప్పందానికి సంబంధించిన ఫైల్ డిసెంబర్ 17 తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి అందనున్నట్టు సమాచారం. డిసెంబర్ 17న ప్రపంచ బ్యాంకు సమావేశం జరగనున్న నేపథ్యంలో అదే రోజు ఈ రుణంపై పూర్తి స్పష్టత రానున్నట్టు తెలిసింది. ఆ సమావేశం అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సీఆర్‌డీఏ ఒప్పందంపై సంతకాలు చేసే అవకాశాలు ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం.

వ్యవసాయ రంగానికి మొండిచేయి

ఏపీ కౌలు రైతు సంఘం మండిపాటు

సాక్షి, అమరావతి: వ్యవసాయ రంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గిపోవడం ఆందోళన కల్గిస్తోందని ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాము అధికారంలోకి వస్తే ఏటా రూ.20 వేల చొప్పున ప్రతి రైతుకు పెట్టుబడి సాయం అందిస్తామని చంద్రబాబు, కూటమి నేతలు హామీ ఇచ్చి దగా చేశారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.14,200 కోట్లు కేటాయించాల్సి ఉండగా.. బడ్జెట్‌లో రూ.1,000 కోట్లు మాత్రమే విదల్చడం దారుణమన్నారు. కౌలు రైతులకు పెట్టుబడి సాయం విషయంలో స్పష్టత ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ధరల స్థిరీకరణ నిధికి పైసా కూడా కేటాయించకపోవడం అన్యాయమన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని అటకెక్కించి బీమా ప్రీమియం భారాన్ని రైతులపై మోపడం తగదన్నారు.

మేడిపండు రీతిన బాబు రోడ్ల నిర్మాణం



మాటలు ఘనం... కేటాయింపులు అంతంతమాత్రం

- ఇక టోల్ బాదుడే
- బడ్జెట్ కేటాయింపు ముసుగులో కనికట్టు
- ఇదీ కూటమి ప్రభుత్వ రోడ్ల నిర్మాణ ప్రణాళిక

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రోడ్ల నిర్మాణంపై చంద్రబాబు ప్రభుత్వ విధానం మేడిపండును గుర్తుకు తెస్తోంది. రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి రూ.9,554 కోట్లు కేటాయించినట్టు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. కానీ కేటాయింపులను పరిశీలిస్తే టీడీపీ కూటమి ప్రభుత్వ కనికట్టు బట్టబయలైంది. వాహనదారులపై 'టోల్ ఫీజుల' భారీ బాదుడే తమ విధానమని చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్ సాక్షిగా తేల్చిచెప్పింది. పోనీ రోడ్ల నిర్మాణం కోసం నిధుల కేటాయింపు అయినా సక్రమంగా చేశారంటే అదీ లేదు.

పీపీపీ విధానంలోనే..

అత్యంత ముఖ్యమైన రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులన్నీ కూడా పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలోనే నిర్మిస్తామని బడ్జెట్‌లో ప్రభుత్వం స్పష్టం చేయడం గమనార్హం. అంటే ఇక రోడ్డు ఎక్కితే వాహనదారులపై టోల్ ఫీజుల బాదుడు తప్పదన్నది సుస్పష్టం. ఇప్పటి వరకు జాతీయ రహదారులను మాత్రమే పీపీపీ విధానంలో నిర్మిస్తున్నారు. టోల్‌వసూలు చేస్తున్నారు. ఇప్పటివరకు రాష్ట్ర రహదారులను పీపీపీ విధానంలో నిర్మించ లేదు. ఇక మీదట జిల్లా ప్రధాన కేంద్రాలు, మండల ప్రధాన కేంద్రాలను అనుసంధానించే రాష్ట్ర రహదారులపై ప్రయాణించినా టోల్ ఫీజు బాదుడు భరించాల్సిందేనని ప్రభుత్వం బడ్జెట్ ద్వారా ముందస్తు హెచ్చరిక జారీ చేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటే తక్కువ కేటాయింపులే

గుంతలు లేని రోడ్లు అంటూ ప్రచారార్భాటం చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి మాత్రం అరకొర కేటాయింపులతోనే సరిపుచ్చింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023-24లో కేటాయింపుల కంటే టీడీపీ కూటమి ప్రభుత్వం 2024-25లో తక్కువ నిధులు కేటాయించడం గమనార్హం.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్ అండ్ బీ శాఖకు అన్ని పద్దుల కింద 2023-24లో రూ.8,766.89 కోట్లు కేటాయించింది. కానీ ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వం మాత్రం రూ.8,322 కోట్లు మాత్రమే కేటాయించింది.
- రైల్వే పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు, వంతెనల నిర్మాణం, జిల్లా ప్రధాన, ఇతర రహదారులు, రహదారి భద్రత పనులు, తుంగభద్ర పుష్కర పనులు, రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారుల ఉన్నతీకరణ పనులకు కలిపి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023-24లో రూ.725.92 కోట్లు కేటాయించింది. 2024-25కుగాను టీడీపీ కూటమి ప్రభుత్వం రూ.468.88కోట్లే కేటాయించడం గమనార్హం.
- ఆర్ఐఏడీ కింద మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి నిధులు, ఎన్‌డీబీ బ్యాంకు రుణ సహాయం, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, గ్రామీణ రోడ్లు, ఎన్ఆర్ఈజీపీ నిధులతో రోడ్ల నిర్మాణం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023-24లో రూ.1,481.59 కోట్లు కేటాయించింది. కాగా చంద్రబాబు ప్రభుత్వం అవే పనులకు 2024-25లో రూ.721.78కోట్లే కేటాయించి చేతులు దులిపేసుకుంది.
- ఏలూరు-గుండిగొలను-కొవ్వూరు రహదారి నిర్మాణంలో భాగంగా గోదావరి నదిపై వంతెన నిర్మాణం, కడప యాన్యూటీ పనులు, రాష్ట్ర ప్రధాన రహదారుల నిర్మాణం పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023-24లో రూ.1,472.51కోట్లు కేటాయించింది. కాగా ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం 2024-25 బడ్జెట్‌లో రూ.1,115.68 కోట్లే కేటాయించడం గమనార్హం.

అన్నదాతలకు మొండిచేయి



అనుకున్నట్టుగానే అన్నదాతలను టీడీపీ కూటమి ప్రభుత్వం నిలువునా మోసగించింది. మంత్రి అచ్చెన్నాయుడు రైతులకు మొండిచేయి చూపారు. వేట నిషేధ సమయంలో ప్రతీ మత్స్యకార కుటుంబానికి రూ.20వేల చొప్పున వేట నిషేధ భృతి ఇస్తామని నమ్మబలికి పూర్తిగా పక్కన పెట్టేశారు.

– వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురాం

ఉద్యోగుల బకాయిలు, పీఆర్‌సీ ఊసేది





ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన రూ.22వేల కోట్ల బకాయిలు, 12వ పీఆర్‌సీ గురించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం తీవ్ర నిరాశకు గురి చేసింది. పాఠశాల విద్యకు రూ.29,909 కోట్లు కేటాయించినప్పటికీ.. అది మొత్తం బడ్జెట్ వ్యయంలో 10 శాతం కంటే తక్కువే.

– పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు

హామీల అమలును ప్రస్తావించని ప్రభుత్వం



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎప్పటి నుంచి అమలు చేస్తారనే విషయాన్ని కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కనీస ప్రస్తావన చేయలేదు. ఇది ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడమే. ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందతో నిండిపోయింది. – సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజలపై విద్యుత్ భారాలు



నాలుగు నెలల కాలానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ కంటే ఈ బడ్జెట్ మొత్తాన్ని అధికంగా చూపారు. విద్యుత్ రంగం విషయంలో ప్రజలపైన భారాలు పడుతున్నాయి. ప్రజలపై విద్యుత్ భారాలు మోపకుండా పరిష్కారం చూపలేకపోయారు. –సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గిరిజన సంక్షేమం సంగతేంటి?



రాష్ట్రంలో గిరిజన సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తే.. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థుల మరణాలను అరికట్టడానికి ఏ చర్యలు తీసుకుంటారో ప్రస్తావించలేదు.

– ఏపీ ట్రైకార్ మాజీ చైర్మన్ గుండా సురేంద్ర

మైనార్టీలకు మోసం



మైనార్టీలను కూటమి ప్రభుత్వం మోసం చేసింది. ముస్లిం మైనార్టీలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలుగా మేలు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు బడ్జెట్‌లో చర్యలు తీసుకోలేదు.

– ఎండీ సద్‌రుద్దీన్ ఖురేషి, మైనార్టీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి

ఉత్తరాంధ్రకు మరోసారి అన్యాయం

బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచింది. ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలు పెద్ద ఎత్తున పోరాడుతున్నా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను రక్షిస్తామనే కనీస ప్రస్తావన కూడా బడ్జెట్ ప్రసంగంలో లేదు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామనడం ప్రజలను మోసగించడం తప్ప మరొకటి కాదన్నారు.

– ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ

దళితుల సంక్షేమం ఎక్కడ?

కూటమి ప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో దళితుల సంక్షేమ ఎక్కడుంది. గత ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో ఎస్సీ కాంపోనెంట్‌కు రూ.20,005.68కోట్లు కేటాయిస్తే.. ప్రస్తుత ప్రభుత్వం(2024-25) రూ.18,497.68 కోట్లు కేటాయించింది. అంటే గత ప్రభుత్వం కంటే నిధుల కేటాయింపు పెంచాల్సింది పోయి రూ.1,507.54కోట్లు తగ్గించడం దారుణం.

– కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఒ.నల్లప్ప, అంద్ర మాల్యాద్రి

ఈ నిధులెలా సరిపోతాయి?

పరిశ్రమల సబ్సిడీల బకాయిలే రు. 5000 కోట్లు పైగా ఉంటే కేవలం 3,127 కోట్లు ఏ మూలకు సరిపోతాయి. పారిశ్రామిక రంగానికి ఎక్కువ నిధులు కేటాయించకపోవడం వల్ల రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడుల లక్ష్యం సాధించడం ఆసాధ్యం. బడ్జెట్లో సబ్సిడీ బకాయిల ఊసేది.

–దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మామిడి సుదర్శన్

అబద్ధాల నిఘంటువు చంద్రబాబు

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ నేత విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: 'చంద్రబాబు రాజకీయ జీవితమే అబద్ధాల నిఘంటువు.. అందులో బడ్జెట్ లెక్కలు ఎంత.!' అని రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి అన్నారు. 'దేన్నైనా తారుమారు చేయడంలో నేర్పరి, మోసాలకు మోసం, నేరాలకు చిరునామా, పాపాలకు నిలయం, వెన్నుపోటు రాజకీయాల ఆద్యుడు.. ఇంకా చెప్పాలంటే నిఘంటువులో పదాలు చాలవు' అని విజయసాయిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. ఏపీ బడ్జెట్ టీడీపీ తప్పుడు వాదనలను మాత్రమే చూపుతోందని అన్నారు. రుణాలకు వ్యతిరేకమని ఆర్థిక మంత్రి చెబుతున్నారని, కేంద్ర ప్రభుత్వం నుంచి రుణాలు 2023-24లో రూ.5011 కోట్ల నుంచి 2024-25లో రూ.18,249 కోట్లకు పెరిగినట్లు బడ్జెట్ పత్రాలు చూపిస్తున్నాయని తెలిపారు. మొత్తం పబ్లిక్ రుణం కూడా రూ.76,209 కోట్ల నుంచి రూ.91,433 కోట్లకు పెరుగుతుందని వివరించారు. అప్పులు పెరిగి గ్రాంట్లు తగ్గుతున్నాయన్నారు. మూలధన వ్యయం కేటాయింపు 2023-24లో రూ.31,061 కోట్ల నుంచి ఈ సంవత్సరం రూ.32,712 కోట్లు, ఆర్థిక లోటు కూడా రూ.62,719 కోట్ల నుంచి రూ.68,742 కోట్లకు పెరుగుతుందన్నారు. అంటే కొత్త ఆలోచనలు లేకుండా, బడ్జెట్ పేలవంగా ఉందని వివరించారు. వలంటీర్లు, గ్రామ, వార్డు సచివాలయాలు, కమీషనరేట్‌ల కోసం 2023-24లో మొత్తం కేటాయింపులు రూ.4,877 కోట్లు కాగా, 2024-25కి రూ. 3,085 కోట్లకు ఎందుకు తగ్గిందని ప్రశ్నించారు. మంత్రివర్గంలో చోటు దక్కకపోవడం, టీటీడీలో ప్రాతినిధ్యం లేకపోవడం, నామినేటెడ్ పదవులు లేకపోవడంతో కడప నేతలను టీడీపీ పక్కన పెడుతోందని, వారంతా రెండేళ్లలోగా వైఎస్సార్‌సీపీలో చేరడం ఖాయమని విజయసాయిరెడ్డి తెలిపారు.

లైంగికదాడి చేసిన ఉపాధ్యాయుడిని గుర్తుపట్టిన బాలిక

- పాఠశాలలోని ఉపాధ్యాయులందరి ఫొటోలు చూపిన డీఎస్పీ
- అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని గుర్తించిన బాలిక

టంగుటూరు : ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని ఓ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికపై లైంగిక దాడి ఘటన సోమవారం మరో మలుపు తిరిగింది. ఇప్పటి వరకు బాలిక ఒక్కోసారి ఒక్కో మాట చెబుతోందంటూ పోలీసులు చెబుతూ వచ్చారు. అయితే సోమవారం పోలీసులు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల ఫొటోలను చూపించారు. ఆ రోజు తనపై లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిని బాలిక గుర్తించింది. అయితే ఇప్పటి వరకూ ప్రచారంలో ఉన్న వ్యక్తి కాకుండా కొత్త వ్యక్తి కావడం గమనార్హం. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు సమక్షంలో బాలిక సదరు ఉపాధ్యాయుడి ఫొటోను గుర్తించి లైంగిక దాడికి పాల్పడింది అతనే అని చూపించినా.. డీఎస్పీ పలుమార్లు.. ప్రశ్నించడంతో బాలిక అసహనానికి గురైంది. మీకు ఎన్ని సార్లు చెప్పాలి.. నాపై లైంగిక దాడి చేసింది ఈయనే అని స్పష్టం చేసింది. నన్ను ఆడుకోనీయడం లేదు.. ఎవరితో మాట్లాడనీయటం లేదు.. అంటూ అంటూ వాపోయింది. ఇదే విషయాన్ని సోమవారం బాలిక తల్లి ఆడియో రూపంలో సామాజిక మాధ్యమాల్లో బయటపెట్టింది. నా కూతురుపై లైంగిక దాడి జరిగిందని చికిత్స కోసం గురువారం జీజీహెచ్‌కు వెళ్లామని, అప్పటి నుంచి ఇప్పటి వరకు పోలీసులు తమకు నరకం చూపించారని బాధితురాలి తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. మేము మొదటి నుంచి టీచర్ అని చెబుతున్నామేగానీ ఎవరి పేరూ చెప్పలేదని.. ఈ రోజు ఫొటోలు చూపితే లైంగిక దాడి చేసిన వ్యక్తిని తన కూతురు గుర్తించిందని వివరించింది. అయితే పోలీసుల విచారణలో సదరు టీచరు పేరు తెలిసినా.. మరో టీచర్‌ను ఇరికించే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పరిశ్రమల అనుమతులకు ఒకే శాఖ ఉండాలి

ఐక్యరాజ్య సమితి వాతావరణ సదస్సులో ఎంపీ మిథున్ రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: పరిశ్రమల అనుమతుల కోసం మూడు, నాలుగు మంత్రిత్వ శాఖలకు తిరిగే విధానానికి స్వస్తి పలకాలని, ఇందు కోసం ఒకే మంత్రిత్వ శాఖ ఉండాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి సూచించారు. ఇస్తాంబుల్లో జరుగుతున్న ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ వాతావరణ మార్పుల సదస్సుకు 40 దేశాల నుంచి ప్రతినిధులు హాజరవ్వగా.. భారత్ తరఫున ఎంపీ మిథున్ రెడ్డి ఒక్కరే ప్రాతినిధ్యం వహించారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, అనుసరించాల్సిన వ్యూహాలపై ఇస్తాంబుల్ గ్రీన్ ఇన్వెస్ట్‌మెంట్ డైలాగ్, గ్రీన్ జోన్లలో పెట్టుబడుల ద్వారా సమీకరణకు ఎదురవుతున్న సవాళ్లపై ఈ సదస్సులో చర్చలు జరిగాయి.

హెల్త్ సాక్షి ప్లస్
మంగళవారం ॥ 12-11-2024

పిల్లల్లో చొల్లు..?



చిన్న పిల్లలకు నోటి నుంచి చొల్లు కారుతూ ఉండటం చాలా సాధారణం. నెలల వయసులో ఉన్న చిన్నారుల్లో ఇలా చొల్లు కారుతూ ఉండటమన్నది చూడ్డానికి కాస్తంత ముచ్చటగా ఉండచ్చు కానీ పెద్దయ్యాక కూడా ఇలా జరుగుతుంటే కాస్త సీరియస్‌గా పరిగణించాల్సిన విషయమే. పెద్దయ్యాక కూడా చొల్లు కారడానికి కారణాలూ, అలాంటప్పుడు ఏం చేయాలో తెలుసుకుందాం. పిల్లల్లో చొల్లు/జొల్లు కారుతూ ఉండే కండిషన్‌ను వైద్య పరిభాషలో 'సైలోరియా' అంటారు. దాదాపు పద్దెనిమిది నెలల వచ్చే వరకు చిన్నారుల్లో చొల్లు కారడమన్నది జరుగుతుంటుంది. వారి దవడలోని ఓరల్ మోటార్ ఫంక్షన్స్ అభివృద్ధి చెందవు కాబట్టి అలా జరుగుతుండటం చాలా మామూలు విషయం. చాలావరకు పిల్లల్లో చొల్లు కారడం అన్నది దానంతట అదే తగ్గిపోయే సమస్య. అయితే కొందరు పిల్లల్లో చొల్లు కారడం మరింత ఎక్కువగా ఉంటే... దాన్ని ప్రత్యేకమైన డెంటల్ అప్లయెన్సెస్‌తో ఆ అలవాటు మాన్పించవచ్చు. **పెద్దయ్యాకా చొల్లు కారుతుంటే...** అరుదుగా కొంతమంది పిల్లల్లో పద్దెనిమిది నెలల వయసు దాటాక కూడా చొల్లు కారుతుంది. అలా జరుగుతుండటాన్ని మాత్రం మామూలుగా తీసుకోవడం సరికాదు. అలాంటి పిల్లలకు మానసిక సమస్యలు లేదా ఇతర నరాల సమస్యలు ఉన్నాయేమోనని అనుమానించాలి. పద్దెనిమిది నెలలు దాటాక కూడా చొల్లు వస్తుంటే పిల్లలను పీడియాట్రీషియన్‌కు లేదా చైల్డ్ సైకియాట్రిస్ట్‌కు చూపించాలి.

బెడ్ వెట్టింగ్

సాధారణంగా పిల్లల్లో 95 శాతం మంది దాదాపుగా ఐదారేళ్ల వయసు వచ్చేసరికి నిద్రలో మూత్ర విసర్జనపై నియంత్రణ (బ్లాడర్ కంట్రోల్) సాధిస్తారు. కానీ నాలుగు శాతం మంది పిల్లల్లో ఇది కొద్దిగా ఆలస్యం కావచ్చు. చాలా కొద్దిమందిలో అంటే... ఒక శాతం (1%) మందిలో పెద్దయ్యాక కూడా నిద్రలో మూత్రవిసర్జనపై నియంత్రణ సాధించడం సాధ్యం కాకపోవచ్చు. దాంతో కాస్త పెద్దయ్యాక కూడా... అంటే 10 - 12 ఏళ్లు వచ్చాక కూడా కొందరు పిల్లలు రాత్రివేళ పక్క తడుపుతుంటారు. ఇలా పిల్లలు రాత్రిపూట నిద్రలో మూత్రవిసర్జన చేసే సమస్యను వైద్యపరిభాషలో 'నాక్టర్నల్ అన్యురిసిస్' అంటారు. ఇది అబ్బాయిల్లో ఎక్కువ. ఇది కుటుంబంలో ఎవరికైనా ఉంటే... అలాంటి కుటుంబాల్లో 50 శాతం మందిలో... వాళ్ల పిల్లల్లోనూ ఈ సమస్య కనిపిస్తుంది.



అన్యురిసిస్ సమస్యలోనూ రెండు రకాలు ఉంటాయి. మొదటిది 'ప్రైమరీ అన్యురిసిస్. రెండోది సెకండరీ అన్యురిసిస్.

ప్రైమరీ అన్యురిసిస్ : చిన్నారులు ఒక్క రోజు కూడా విడవకుండా ప్రతిరోజూ పక్క తడుపుతుంటే దాన్ని 'ప్రైమరీ అన్యురిసిస్' అంటారు.

సెకండరీ అన్యురిసిస్ : ఇలా రాత్రుళ్లు పక్క తడిపే పిల్లలు కొన్నాళ్ల పాటు పక్కతడపకుండా బాగానే ఉండి, కొంతకాలానికి వాళ్లలో సమస్య మళ్లీ తిరగబెట్టడాన్ని 'సెకండరీ అన్యురిసిస్'గా చెప్పవచ్చు. ఇలా సెకండరీ అన్యురిసిస్ సమస్య రావడానికి తల్లిదండ్రుల మధ్య సయోధ్య లేకపోవడం, ఇంట్లో ప్రశాంత వాతావరణం లేకపోవడం, కుటుంబంలోకి తమ్ముడో, చెల్లెలో వచ్చినప్పుడు కలిగే ఈర్ష్య (సిబ్లింగ్ జెలసీ) వంటి కారణాలతో పిల్లల్లో నెలకొన్న మానసిక ఆందోళన వంటి అంశాలను ప్రధాన కారణాలుగా చెప్పవచ్చు.

ప్రైమరీ అన్యురిసిస్ కు కారణాలు...

ప్రైమరీ అన్యురిసిస్‌కు పిల్లల్లో నాడీ సంబంధమైన వికాసం కాస్త ఆలస్యంగా జరుగుతుండటం అంటే న్యూరోనల్ మెచ్యురేషన్ డిలే, మూత్రం ఉత్పత్తి కాస్త ఎక్కువగా జరుగుతుండటం (ఇన్‌క్రీజ్‌డ్ యూరిన్ ప్రొడక్షన్), బ్లాడర్ సామర్థ్యం కాస్త తక్కువగా ఉండటం (డిక్రీజ్‌డ్ బ్లాడర్ కెపాసిటీ)తో పాటు జన్యుపరమైన అంశాలు కూడా ఇందుకు కారణమవుతాయి.

ఇతర కారణాలు...

ఇలా పెద్దయ్యాక కూడా రాత్రి నిద్రలో పక్కతడిపే సమస్య ఉన్న 20 శాతం మంది పిల్లల్లో యూరినరీ ట్రాక్ అబ్‌నార్మాలిటీస్, బ్లాడర్ డిస్‌ఫంక్షన్, నిద్రకు సంబంధించిన రుగ్మతలు (స్లీప్ డిజార్డర్స్), యాంటీ డైయూరెటిక్ హార్మోన్ (ఏడీహెచ్) లోపాలు, మానసికమైన కారణాలు, మలబద్ధకం, కొన్ని సందర్భాల్లో అడినాయిడ్స్ వల్ల నిద్ర సంబంధమైన సమస్యలు (స్లీప్ ఆప్నియా) వంటివి ఉన్నప్పుడు కూడా రాత్రివేళల్లో తెలియకుండానే మూత్ర విసర్జన చేస్తుంటారు.

పిల్లల్లో ఈ సమస్య ఉంటే మూత్రపరీక్షలతో పాటు హార్మోనల్ స్టడీస్ చేయించడం, బ్లాడర్ అనాటమీ అండ్ ఫంక్షనల్ టెస్ట్ చేయించడం అవసరం. వాటిని బట్టి ఇది హార్మోన్లకు సంబంధించిన సమస్యా, కాదా అని తెలుసుకోవచ్చు.

ఈ పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

● నిద్రలో మూత్రవిసర్జన చేసే పిల్లలను కించపరచడం, శిక్షించడం వంటివి అస్సలు చేయకూడదు. ● సాయంత్రం ఆరు గంటల తర్వాత ద్రవాహారం చాలా తక్కువగా ఇవ్వడం, నాలుగు దాటాక కెఫిన్, చక్కెర ఉన్న పదార్థాలు పూర్తిగా ఇవ్వకపోవడం అవసరం. రోజులో తీసుకునే ద్రవపదార్థానికి 20 శాతానికి మించి 5 గంటల తర్వాత ఇవ్వకూడదు. ● పడుకునేముందు ఒకసారి మూత్రవిసర్జన చేయించడం, నిద్రపోయిన గంటలోపు లేపి మళ్లీ ఒకసారి మూత్రవిసర్జన చేయించడం వల్ల పక్క తడిపే అవకాశాలను తగ్గించవచ్చు.

మేనేజ్‌మెంట్ / కేర్...

ఇటీవల అందుబాటులోకి వచ్చిన అలారం వంటి పరికరాలతో బ్లాడర్‌పై నియంత్రణ సాధించేలా ప్రాక్టీస్ చేయించాలి.

దీంతోపాటు డెస్మోప్రెసిన్, ఇమిప్రమిన్ వంటి కొన్ని మందులు బాగా పనిచేస్తాయి.

● అలాంటి పిల్లలను కొన్ని ట్రిప్పుల సహాయంతో సామాజిక ఉత్సవాలకు నిర్భయంగా తీసుకెళ్లవచ్చు. అలాంటి చర్యల వల్ల పిల్లల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ● ఈ సమస్యకు హార్మోన్‌లోపాలు కారణం అయితే 3-6 నెలలపాటు మందులు వాడటం వల్ల ఈ సమస్యను 50 శాతం మందిలో సమర్థంగా అదుపు చేయవచ్చు.



డాక్టర్ రమేశ్ బాబు దాసరి,
సీనియర్ పీడియాట్రీషియన్



నాలుక తిరగదేమి?

కొందరు చిన్నారుల్లో మాటలు రావడం చాలా ఆలస్యమవుతుంది. దాంతో తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలవుతుంది. తమకు దగ్గరి వాళ్లలో లేదా తమ బంధువుల్లో ఇలాగే జరిగిందనీ, మాటలు రావడం కొందరిలో ఇలాగే ఆలస్యమవుతుంటుందని సముదాయించడం మామూలే. ఇలా పిల్లలకు మాటలు రావడంలో ఆలస్యం జరగడానికి కారణాలేమిటి, ఆ సమస్యలను అధిగమించడడం ఎలా అన్న అంశాలపై అవగాహన కోసం ఈ కథనం.



పిల్లల్లో సాధారణంగా 10 నెలలు లేదా ఏడాది నాటికి కొన్ని కొన్ని ముద్దుమాటలు (బాబ్లింగ్) మొదలవుతుంది. రెండేళ్ల వయసు నాటికి తమ భావాలను చాలావరకు కమ్యూనికేట్ చేయ గలుగుతుంటారు. మూడేళ్లకు దాదాపుగా అన్ని మాటలూ వచ్చేస్తాయి. కానీ కొందరు పిల్లల్లో మాట రావడం కాస్త ఆలస్యమవుతుంది. వినికిడి వ్యవస్థ బాగుందని తెలిశాక... అలా మాటలు రావడం ఆలస్యమైన పిల్లల్లో చాలామంది సాధారణంగా స్కూల్లో చేర్చే వయసు నాటికి తమంతట తామే మాట్లాడగలుగుతారు.

కారణాలు...

పిల్లల్లో మాటలు రావడం ఆలస్యం కావడానికి అనేక కారణాలు ఉంటాయి. వీటిల్లో... వినడానికి అవసరమైన వినికిడి వ్యవస్థ, అలాగే మాట్లాడటానికి అవసరమైన వోకల్ కార్డ్స్, మాట్లాడేందుకు ఉపయోగపడే గొంతులోని కండర నిర్మాణం... ఇవన్నీ బాగానే ఉన్నప్పటికీ, కొందరిలో సహజంగానే మాటలు రావడం ఆలస్యమవుతుంటుంది. అలాగే చిన్నారుల్లో వారి భాష ఓ స్థాయి పరిణతికి రావడంలో జరిగే ఆలస్యం (లాంగ్వేజ్ మెచ్యురేషన్ డిలే) కావడం కూడా దీనికి కారణం. చాలా వరకు వంశపారంపర్యంగా ఇలా జరుగుతుంటుంది. అమ్మాయిలతో పోలిస్తే ఈ సమస్య అబ్బాయిల్లోనే ఎక్కువ.

కొన్ని సందర్భాల్లో అనారోగ్యాలకు సూచిక...


కొందరు చిన్నారుల్లో మాటలు రావడంలో ఆలస్యం జరగడం అనేది కొన్ని సందర్భాల్లో అండర్‌లైయింగ్ ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చు. ఇలా మాటలు రాకపోవడం చాలా రకాల ఆరోగ్య సమస్యలను సూచించే ఒక లక్షణం కావచ్చు. ఉదా: వినికిడి లోపాలు, మానసికమైన సమస్యలూ, ఆటిజం వంటి కండిషన్, భాషను అర్థం చేసుకోవడం, అభివ్యక్తీకరించడంలో సమస్యలు... మొదలైనవాటిల్లో ఏదో ఒకదానివల్ల మాటలు రావడం ఆలస్యం కావచ్చు. కొన్నిసార్లు అది ఎదుగుదల సమయంలో వచ్చే ఇతర ఆరోగ్య లోపాల వల్ల కూడా అయి ఉండవచ్చు. ఎక్స్‌ప్రెసివ్ లాంగ్వేజ్ డిజార్డర్ ఉన్న పిల్లలు భాషను ఒక కమ్యూనికేటివ్ సాధనంగా వాడటంలో విఫలమవుతారు. అయితే వారిలోని తెలివితేటలు, వినికిడి, ఉద్వేగభరితమైన ఫీలింగ్స్... తదితర విషయాల్లోనూ మామూలుగానే ఉంటారు. తమ సంజ్ఞలు, సైగల ద్వారా కమ్యూనికేషన్ అంతా సాధారణంగానే చేస్తుంటారు గానీ, మాటలు లేదా పదాలు పలకడం (వర్బల్ ఎక్స్‌ప్రెషన్స్) ద్వారా తమ అభిప్రాయాలను వెల్లడించడం మాత్రం చాలా పరిమితంగా ఉంటుంది.

ఈ పిల్లల విషయంలో పరిష్కారాలేమిటి?

ఇలాంటి పిల్లల విషయంలో... వారు మాటలు నేర్చుకోవడం / మాట్లాడటం అనే ప్రక్రియ ఎందుకు ఆలస్యం అవుతోందో తెలుసుకోవడం తప్పనిసరి. ఇందుకు పూర్తిస్థాయి ఇవాల్యుయేషన్ అవసరం. ఇందుకోసం... 'ఎర్లీ లాంగ్వేజ్ మైల్‌స్టోన్ స్కేల్ టెస్ట్', 'స్టాన్‌ఫోర్డ్ ఇంటెలిజెన్స్ టెస్ట్', ఆడియోమెట్రీ, బ్రెయిన్ స్టిమ్యులస్ రెస్పాన్స్ టెస్ట్ వంటి పరీక్షలు చేయించాల్సి ఉంటుంది. ఈ పరీక్షల వల్ల మాటలు రాకపోవడానికి కారణాలేమిటి, ఆ కారణాల తీవ్రత ఎంత, వాటి ప్రభావాలు ఏ మేరకు ఉన్నాయన్న పలు విషయాలు తెలుస్తాయి. ఇలాంటి పిల్లలున్నవారు ఒకసారి మీ కుటుంబ పిల్లల డాక్టర్‌కూ అటు తర్వాత అవసరాన్ని బట్టి స్పీచ్ థెరపిస్ట్‌కూ చూపించాలి. ఒకసారి సమస్యనూ, తీవ్రతనూ తెలుసుకుంటే... ఆ తర్వాత 'స్పీచ్ పాథాలజిస్ట్'లు పిల్లలకు మాటలు వచ్చే శిక్షణను మొదలుపెడతారు.

తల్లి దండ్రులకూ కొంత శిక్షణ అవసరం...

ఇలాంటి పిల్లలకు మాటలు నేర్పే విషయంలో తల్లిదండ్రులు చాలా ఓపికతో వ్యవహరించాల్సి ఉంటుంది. వాళ్లకూ కొంత శిక్షణ అవసరమవుతుంది. తల్లిదండ్రులు పూర్తి సహనంతో ఉంటూ, భాష విషయంలోతామూ పిల్లల స్థాయికి చేరుకుని, వాళ్లకు మాటలు నేర్పాలి. తల్లిదండ్రులు నిత్యం ఆ పిల్లలను ఉత్సాహపరుస్తూ... వారికి భాషతో పాటు ఇతర నైపుణ్యాలూ నేర్పడానికి సంసిద్ధంగా ఉండాలి.



నలుపు తరిగేదెలా?



చిన్నారుల ఒంటిమీద, ముఖం మీద పుట్టుమచ్చల్లాంటి నల్లమచ్చలు కనిపిస్తుండటం మామూలే. అయితే కొందరు చిన్నారుల్లో ఇవి చాలా ఎక్కువ సంఖ్యలో వస్తుంటాయి. ఈ కండిషన్‌ను 'నీవస్' అంటారు. ఇలా నల్లమచ్చలు ఎక్కువగా వచ్చే ఈ కండిషన్‌ను వైద్యపరిభాషలో 'మల్టిపుల్ నీవస్' అని పేర్కొంటారు.

చర్మంలోని రంగునిచ్చే మెలనోసైట్స్ అనే కణాలే పుట్టుమచ్చలకూ, ఇలా ఎక్కువ సంఖ్యలో వచ్చే 'నీవస్' అని పిలిచే మచ్చలకు కారణం. ఈ మచ్చలు శరీరంలో ఎక్కడైనా రావచ్చు. ఈ లక్షణమున్న కొందరిలో ఇవి అరచేతుల్లో, అరికాళ్లలో, ఆఖరుకు గోళ్లమీద కూడా కూడా కనిపిస్తుంటాయి. కుటుంబ చరిత్రలో ఇలాంటి మచ్చలు రావడంతో పాటు సూర్యకాంతికి చాలా ఎక్కువగా ఎక్స్‌పోజ్ కావడం వంటి అంశాలు ఇవి వచ్చేందుకు కారణమవుతాయి.

రకాలు ...

ఈ మచ్చలను ప్రధానంగా రెండు రకాలుగా చెప్పవచ్చు. మొదటిది హానికరం కాని సాధారణ 'బినైన్' మచ్చలు. రెండోది హానికరంగా మారే 'మెలిగ్నెంట్' మచ్చ. అయితే ఈ మెలిగ్నెంట్ అన్నది చాలా చాలా అరుదు. బినైన్ నీవస్ పెరుగుతున్నప్పుడు ఒకసారి పరీక్షించి, ఆ తర్వాత అది మెలిగ్నెంట్ కాదని నిర్ధారణ చేసుకుని ఆ తర్వాత నిశ్చింతగా ఉండాలి. ఈ మచ్చల్లో కొన్ని పుట్టుకతోనే రావచ్చు. మధ్యలో వచ్చే మచ్చలు 10 నుంచి 30 ఏళ్ల మధ్య కాలంలో రావచ్చు.

బినైన్ మచ్చల విషయానికి వస్తే... చాలామంది పిల్లల్లో కనిపించే పుట్టుమచ్చల్లో... హానికరం కాని నీవస్ వాటివల్ల ఎలాంటి ప్రమాదమూ లేదని తెలిశాక నిశ్చింతగా ఉండవచ్చు. క్యాన్సర్‌గా మారే అవకాశం కూడా చాలా తక్కువ. అయితే... కొన్ని నీవస్‌లు క్యాన్సర్ లక్షణాలను సంతరించుకునే అవకాశం ఉంది. కాబట్టి ఇలాంటివి ఉన్న వారు క్రమం తప్పకుండా డర్మటాలజిస్ట్‌లతో ఫాలో అప్‌లో ఉండటం మంచిది.

కొన్ని సందర్భాల్లో నీవాయిడ్ బేసల్ సెల్ కార్సినోమా అనే కండిషన్ కూడా రావచ్చు. ఇది పుట్టుకనుంచి ఉండటంతో పాటు, యుక్తవయస్సు వారిలోనూ కనిపిస్తుంది. వారికి మచ్చలతో పాటు జన్యుపరమైన అబ్‌నార్మాలిటీస్‌నూ డాక్టర్లు చూస్తుంటారు. ఇలాంటి పిల్లల్లో ముఖ ఆకృతి, పళ్లు, చేతులు, మెదడుకు సంబంధించిన లోపాలు కూడా కనిపించేందుకు ఆస్కారం ఉంది. ఇవన్నీ చాలా అరుదైన కండిషన్స్.

మచ్చలు ఉన్నప్పుడు గమనించాల్సిన ఏ, బీ, సీ, డీలు...

అది ఎలాంటి నల్లమచ్చ లేదా నీవస్ అయినా... ఏ, బీ, సీ, డీ అన్న నాలుగు అంశాల్ని పిల్లల తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలి. ఇక్కడ ఏ- అంటే ఎసిమెట్రీ... అంటే పుట్టుమచ్చ సౌష్టవంలో ఏదైనా మార్పు కనిపిస్తుంటుందేమో అని గమనించడం, బీ- అంటే బార్డర్... అంటే పుట్టుమచ్చ అంచుల్లో ఏదైనా మార్పు ఉందా లేక అది ఉబ్బెత్తుగా మారుతోందా అని చూడటం, సీ- అంటే కలర్... అంటే పుట్టుమచ్చ రంగులో ఏదైనా మార్పు కనిపిస్తోందేమో గమనిస్తుండటం, చివరగా... డీ- అంటే డయామీటర్... అంటే మచ్చ తాలూకు వ్యాసం పెరుగుతోందా అని పరిశీలిస్తూ ఉండటం... ఈ నాలుగు మార్పుల్లో ఏది కనిపించినా తక్షణం డర్మటాలజిస్టును సంప్రదించాలి.

నివారణ ఇలా...

పిల్లల్లో నల్లమచ్చల నివారణకు... చిన్నారులను మరీ ఎర్రటి ఎండకు ఎక్కువగా ఎక్స్‌పోజ్ కాకుండా జాగ్రత్త తీసుకోవాలి. చిన్నారుల చర్మం చాలా సున్నితంగా ఉంటుంది కాబట్టి వీలైనంతవరకు అది హానికారక అల్ట్రావయొలెట్ కిరణాలకు ఎక్స్‌పోజ్ కాకుండా చూసుకోవాలి. చిన్న పిల్లల్ని బయటకు తీసుకెళ్లేప్పుడు, వారికి కూడా 30 ఎస్‌పీఎఫ్ ఉన్న సన్ స్క్రీన్ లోషన్స్ రాయాలి.

చికిత్స...

ఇక కొన్ని నల్లమచ్చలు హానికరం కాని నీవస్ మచ్చలే అయినప్పటికీ కొన్ని అవి చిన్నారుల లుక్స్‌కు కాస్మటిక్‌గా ఇబ్బంది కలిగిస్తుంటే... నిపుణులు వాటిని షేవ్ ఎక్సిషన్ థెరపీ వంటి ప్రక్రియల ద్వారా తొలగించడానికి ప్రయత్నిస్తారు. ఒకవేళ అవి ప్రమాదకరమైన మచ్చలైతే... సంబంధిత నిపుణుల చేత వాటికి అవసరమైన చికిత్సలు అందించాలి.



డా. స్వప్నప్రియ
సీనియర్ డర్మటాలజిస్ట్

ఫుడ్ సపోర్టింగ్



చిన్నారులకు ఆర్నెల్ల వయసు వచ్చాక, వారికి ఇచ్చే తల్లిపాలతో పాటు క్రమంగా ఘనాహారాన్ని ఇవ్వడం మొదలుపెడతారు. ఇలా తల్లిపాలతో పాటు చిన్నారిని ఘనహారం వైపునకు మళ్లించడానికి ఇచ్చే ఆహారాన్ని కాంప్లిమెంటరీ డైట్‌గా చెప్పవచ్చు. అయితే పిల్లలకు ఆర్నెల్లు నిండేవరకు తల్లిపాలు మినహా ఎలాంటి ఇతర ఆహారాలూ ఇవ్వాల్సిన అవసరం ఉండదు. నిజానికి ఆర్నెల్ల వయసు వరకు పిల్లలకు నీళ్లు కూడా తాగించాల్సిన అవసరమూ ఉండదు.

వాణిజ్య ప్రయోజనాల దృష్ట్యా ఇలా చిన్నారులను ఘనాహారం వైపునకు మళ్లించేందుకు ఇచ్చే కాంప్లిమెంటరీ ఆహారం గురించి మార్కెట్ ప్రకటనల హడావుడి ఇటీవలి రోజుల్లో చాలా ఎక్కువగానే ఉంటోంది. నిజానికి కాంప్లిమెంటరీ డైట్ అనేది... తల్లిపాలతో పాటు పిల్లలకు ఆర్నెల్ల వయసు నుంచి అదనంగా ఇవ్వాల్సిన అనుబంధ ఆహారం మాత్రమే. కాబట్టి కాంప్లిమెంటరీ ఆహారమంటే అదేదో మార్కెట్‌లో మాత్రమే లభ్యమయ్యే ఆహారం అని అపోహపడాల్సిన అవసరం లేదు.

కాంప్లిమెంటరీ డైట్ ఇవ్వాల్సిందిలా...

ఘనాహారంలో భాగంగా పిల్లలకు ఉడికించిన అన్నం (రైస్), ఉడికించిన పప్పు (దాల్), అరటిపండు, ఉడకబెట్టిన కూరగాయలు (ఆలూ వంటివి) చిదిమి, మెత్తగా చేసి పెట్టాలి. అలాగే ఘనాహారం మొదలుపెట్టిన నాటి నుంచి వాళ్లకు కాచి చల్లార్చిన నీళ్లు పట్టాలి. ఇది మినహా మార్కెట్‌లో లభించే వాణిజ్య ప్రయోజనాలతో తయారు చేసిన ఎలాంటి ఆహారమూ ఇవ్వాల్సిన అవసరం లేదు. పైన చెప్పిన ఈ ఆహారాన్ని ఆర్నెల్ల పిల్లలకు రోజూ 150 నుంచి 200 ఎమ్‌ఎల్ పరిమాణంలో రెండు నుంచి మూడు సార్లు తినిపించవచ్చు. పాలు ఎక్కువగా పట్టని పిల్లలకు రోజూ 3 నుంచి 5 సార్లు తినిపించవచ్చు.

ఇక ఎనిమిది/తొమ్మిది నెలలు నిండిన పిల్లలకు పైన పేర్కొన్న ఆహారమేగాక... ఇకపై మెత్తగా చిదిమిన రోటీ, కాస్తంత గట్టిగా వండిన పప్పు, ఇడ్లీ, రవ్వతో కాస్తంత జావలా వండిన ఆహారం (పారిడ్జ్), సపోటా, బొప్పాయి వంటి ఆహారం ఇవ్వవచ్చు. ఇక్కడ మనం పైన పేర్కొన్న ఆహారం కూడా కాంప్లిమెంటరీ ఆహారమే.

కాంప్లిమెంటరీ ఆహారానికి నిర్వచమిదీ...

అసలు కాంప్లిమెంటరీ ఆహారానికి ఉండాల్సిన లక్షణాలు ఏమిటంటే... పిల్లలకు సరైనది, మృదువుగా ఉండేది, తేలిగ్గా జీర్ణమయ్యేది, స్థానిక సంస్కృతి ఆమోదించేది, తేలిగ్గా వండగలిగేది, భరించగలిగే ఆర్థిక స్తోమతను బట్టి చూస్తే చవకగా లభించేది అని అధ్యయనాల నిర్వచనం. ఇప్పుడు దీన్ని 'కాంప్లిమెంటరీ ఆహారం'గా అభివర్ణిస్తున్నారు గానీ... గతంలో ఘనాహారాన్ని మొదలుపెట్టే ప్రక్రియను ఇంగ్లిష్‌లో 'వీనింగ్' అనేవారు. కానీ ఈ ప్రక్రియను వీనింగ్ అనడం అంత సమంజసం కాదని నిపుణులు అభిప్రాయం. నిజానికి వీనింగ్ అంటే పాలు పట్టడాన్ని క్రమంగా ఆపేస్తూ / నిలిపేస్తూ ఘనాహారానికి మళ్లడం అని అర్థం. కానీ... పిల్లలకు రెండేళ్లు నిండేవరకు తల్లిపాలు పట్టడం కొనసాగిస్తూనే ఈ ఘనాహారాన్ని అనుబంధంగా ఇవ్వాలి కాబట్టి దీన్ని ఇప్పుడు అనుబంధ ఆహారం (కాంప్లిమెంటరీ ఫుడ్) అంటున్నారు.

ఇక ఆరు నెలలు నిండిన పిల్లలకు ఈ వయసు నుంచి ఎదుగుదలకు దోహదం చేసే ఆహారం అవసరం కాబట్టి ఈ టైమ్‌లో దీన్ని మొదలుపెట్టాలి. నిజానికి ప్రపంచవ్యాప్తంగా కేవలం 30% నుంచి 35% మంది మాత్రమే పిల్లలకు ఆర్నెల్ల వయసు నుంచి అనుబంధ ఆహారాన్ని మొదలుపెడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) పేర్కొంటోంది.

త్వరగా మొదలుపెట్టడమూ, లేట్ చేయడం ఈ రెండూ సరి కాదు...

ఇక కొద్దిమంది తల్లిదండ్రులు తమ పిల్లలకు కాస్తంత త్వరగా అంటే... మూడు లేదా నాలుగు నెలల వయసు నుంచే ఘనాహారాన్ని మొదలుపెడుతున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ఇలా మొదలుపెట్టిన పిల్లల్లో కొందరికి ఆహారం గొంతులో తట్టుకోవడం (చోకింగ్), నీళ్లవిరేచనాలు (డయేరియా), అలర్జీ వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే ఆలస్యంగా మొదలుపెడితే అది వాళ్ల సాధారణ పెరుగుదలపై దుష్ప్రభావం చూపవచ్చు. అందుకే సరైన సమయంలో పిల్లలకు ఘనాహారం / అనుబంధ ఆహారం మొదలుపెట్టడం అన్నది ముఖ్యం. అలాగే ఘనాహారం ఇస్తున్నప్పటికీ పిల్లలకు రెండేళ్లు వచ్చేవరకు తల్లిపాలు ఇవ్వడం మేలు. అదే ఆరోగ్యకరం కూడా.

ఎక్కువసేపు నిద్రా? ఆందోళన వద్దు...



చాలామంది తల్లిదండ్రులు క్రమశిక్షణ పేరుతోనో లేదా బద్ధకం అలవాటవుతుందనో పిల్లలను ఎక్కువ సేపు నిద్రపోనివ్వరు. వాళ్ల కంటి నిండా నిద్రపోకముందే నిద్రలేపేస్తుంటారు. కారణం... వాళ్ల అలా నిద్రపోతూ ఉండటం, చురుగ్గా లేకపోవడంతో వాళ్లకేమైందో అన్న ఆందోళన వాళ్లను అలా నిద్రలేపేలా చేస్తుంది.

పిల్లలు కంటినిండా నిద్రపోకపోవడం వల్ల వాళ్లు చికాకుగా, చిరాగ్గా ఉంటారని తెలుసుకోవాలి. రానున్నది చలికాలం. ఈ కాలంలో పిల్లలు ఎక్కువగా సేపు నిద్రపోవడం చాలా సాధారణం.

చలికాలంలో ఎక్కువ సేపు నిద్ర ఎందుకు?

పిల్లలు చలికాలంలో కొద్దిగా ఎక్కువగా నిద్రపోవడం చాలా సాధారణం. దీనికి మొదటి కారణం చలికాలంలో పగటి సమయం తక్కువ, రాత్రి నిడివి ఎక్కువ; రెండోకారణం వెలుగు తగ్గిపోయి చీకటి పడగానే నిద్రను ప్రేరేపించే మెలటోనిన్ హార్మోన్ స్రావాలు పెరగడం, నిద్ర మేల్కోడానికి ఉపయోగపడే సెరటోనిన్ స్రావాలు తగ్గడం... వంటి మార్పుల వల్ల చలికాలంలో నిద్ర పెరుగుతుంది.

పిల్లలు ఎక్కువసేపు పడుకోవడానికి కొన్ని కారణాలు... ● బరువు ఎక్కువగా ఉన్న చిన్నారులు ● శ్వాస తీసుకోవడంలో సమస్యలున్నప్పుడు ● సర్కాడియన్ రిథమ్‌లో మార్పులు (మనుషుల్లో నిద్రపోవడం, నిద్రలేవడంలోని క్రమబద్ధతను నిర్వహించే రిథమ్‌ను సర్కాడియన్ రిథమ్ అంటారు) ● మెదడు పనితీరులో కొన్ని లోపాలు ● దగ్గు, జలుబు, అలర్జీలకు వాడే కొన్ని మందులు ● ఆహార పదార్థాలు, హార్మోన్లలో మార్పుల వల్ల నిద్ర వ్యవధిలో మార్పులు రావడం వంటి అంశాలు నిద్ర పెరగడానికి కారణమవుతాయి.

మరి... ఎన్ని గంటల నిద్ర నార్మల్...? పిల్లల్లోగాని, పెద్దల్లోగాని ఖచ్చితంగా నిద్రపోవాల్సిన వ్యవధి ఇదీ అంటూ ఎవరూ నిర్దిష్టంగా, నిర్ధారణగా చెప్పలేరు. మనుషులకు ఎన్ని గంటల నిద్ర సరిపోతుందన్న అంశం ఎప్పుడూ చర్చనీయాంశమైన విషయమే. అయితే సాధారణంగా పిల్లలు 8-9 గంటల పాటు నిద్రపోవడాన్ని నార్మల్‌గా పరిగణించవచ్చు. రోజూ పది గంటలకు మించి నిద్రపోవడాన్ని మాత్రమే కొన్ని రుగ్మతలకు సూచికగా చెప్పవచ్చు. ఒక ఉజ్జాయింపుగా చెప్పాలంటే రోజుకు పదిగంటల కంటే ఎక్కువ, నాలుగు గంటల కంటే తక్కువ నిద్రపోవడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. చిన్నారులు ఈ వ్యవధి కంటే తక్కువగా నిద్రపోతుంటే ఒకసారి థైరాయిడ్ హార్మోన్ పరీక్షలు చేయించి, పిల్లల డాక్టర్‌ను సంప్రదించడం తప్పనిసరి.

బిజినెస్ రీల్

రూ. 600 కోట్ల ఐపీవోకి పరమేశు బయోటెక్

ముంబై: జొన్నల ఆధారిత స్పెషాలిటీ ఉత్పత్తులను తయారు చేసే పరమేశు బయోటెక్ రూ. 600 కోట్ల ఐపీవోకి సంబంధించి ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి సమర్పించింది. ఇష్యూలో భాగంగా రూ. 520 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ కింద రూ. 80 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించనుంది. ఈ నిధులను మధ్యప్రదేశ్‌లో కొత్త ప్లాంటు ఏర్పాటుకు, నిర్దిష్ట రుణాల చెల్లింపునకు ఉపయోగించుకోనుంది. కంపెనీకి ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లిలో ప్లాంటు ఉంది. 14 రాష్ట్రాలు.. 4 కేంద్ర పాలిత ప్రాంతాలతో పాటు 10 దేశాల్లో ఉత్పత్తులను విక్రయిస్తోంది. 2022 ఆర్థిక సంవత్సరంలో రూ. 495 కోట్లుగా ఉన్న ఆదాయం 2024 ఆర్థిక సంవత్సరంలో రూ. 628 కోట్లకు, లాభం రూ. 34 కోట్ల నుంచి రూ. 40 కోట్లకు చేరాయి.

ఎస్‌బీఐ లైఫ్ స్పెల్ బీ రీజనల్ ఫినాలే ప్రారంభం

హైదరాబాద్: 'బీ స్పెల్‌బౌండ్' పేరిట నిర్వహిస్తున్న 14వ ఎడిషన్ స్పెల్‌బీ 2024కి సంబంధించి ప్రాంతీయ స్థాయి పోటీలు ప్రారంభమైనట్లు ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. హైదరాబాద్ రీజియన్‌లో 27 స్కూళ్ల నుంచి 8,425 మంది విద్యార్థులు పాల్గొనగా రీజనల్ ఫినాలేకు 52 మంది ఎంపికైనట్లు పేర్కొంది. ఇందులో తొమ్మిదో తరగతి విద్యార్థి యశ్విన్ పచౌరీ (13) విజేతగా నిల్చినట్లు వివరించింది. వివిధ రీజియన్ల స్థాయిలో నిర్వహించే పోటీల్లో గెలుపొందిన వారు డిసెంబర్‌లో జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటారు. ఇందులో గ్రాండ్ చాంపియన్‌గా నిల్చిన వారికి రూ. 1 లక్ష బహుమతితో పాటు హాంకాంగ్‌లోని డిస్నీల్యాండ్ సందర్శన అవకాశం లభిస్తుందని సంస్థ రీజనల్ డైరెక్టర్ (హైదరాబాద్ రీజియన్) అభిషేక్ కర్ మజుందార్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-11-2024

విశాఖ	550-00
చిత్తూరు	593-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	560-00
విజయవాడ	565-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	555-00
వరంగల్	557-00
రిటైల్ ధర	6.15

నేటి బోర్డు సమావేశాలు

హ్యుందాయ్ మోటార్స్, భాష్, బోకర్డ్, నైకా, హికాల్, జీఎస్ఈ లిమిటెడ్, సువెన్ ఫార్మా, మెడిప్లస్ హెల్త్, రిలయన్స్ పవర్, మదర్‌సన్ సుమీ, ఫినోలెక్స్ కేబుల్స్, జ్యోతీ లాబ్స్, కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, జైడస్ లైఫ్‌సైన్సెస్, జువారీ ఇండస్ట్రీస్, టీసీఎం, ధమ్‌పూర్ షుగర్ మిల్స్

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ASIANPAINT	2,547.80	-8
BRITANNIA	5,404.95	-5.95
APOLLOHOSP	7,155.00	-3.59
CIPLA	1,549.75	-2.69
ONGC	257.25	-2.02

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	6,278.00	-3.5
COALINDIA	423.5	-2.72
ASIANPAINT	2,767.00	-2.67
TATASTEEL	147.3	-2.42
SBIN	841.1	-2.15

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,172
ఎన్ఎస్ఈ	1,21,376
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,83,416
ఎఫ్ఐఐ	- 2,307
డీఐఐ	+ 20.27

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11:00 గంటలకు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	68.16	$ 70.38
బ్రెంట్	71.81	$ 73.87

రూ.12.11 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ 20 వరకు ప్రత్యక్ష పన్ను వసూళ్లు మెరుగ్గా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 15.41 శాతం అధికంగా రూ.12.11 లక్షల కోట్ల నికర పన్ను ఆదాయం వచ్చింది. ఇందులో రూ.5.10 లక్షల కోట్లు కార్పొరేట్ పన్ను రూపంలో రాగా, రూ.6.62 లక్షల కోట్లు నాన్ కార్పొరేట్ రూపంలో సమకూరింది. ఇక స్థూల ప్రత్యక్ష పన్ను వసూళ్లు ఏప్రిల్ నుంచి నవంబర్ 10 వరకు రూ.15.02 లక్షల కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చితే 21 శాతం పెరిగింది. ఈ కాలంలో రూ.2.92 లక్షల కోట్ల రిఫండ్‌లను ఆదాయపన్ను శాఖ పూర్తి చేసింది.

ఆర్‌బీఐపై వెబ్ సిరీస్

న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 90 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంపై స్టార్ ఇండియా వెబ్ సిరీస్‌ను రూపొందించనుంది. దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలో కేంద్ర బ్యాంక్ కీలక పాత్ర గురించి ఈ వెబ్ సిరీస్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తారు. 1935లో ప్రారంభమైన ఆర్‌బీఐ.. ఈ ఏడాది ఏప్రిల్‌లో 90 వసంతాలు పూర్తి చేసుకుంది. వెస్ సిరీస్ రూపొందించేందుకు ఆర్‌బీఐ 2024 జూలైలో టెండర్లను పిలిచింది. స్టార్ ఇండియా, వయాకామ్ 18, జీ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్, డిస్కవరీ కమ్యూనికేషన్స్ ఇండియా పోటీపడ్డాయి. స్టార్ ఇండియా రూ.6.5 కోట్ల విలువైన ఈ టెండర్‌ను దక్కించుకుంది. 25-30 నిముషాల నిడివిగల అయిదు ఎపిసోడ్స్ నిర్మిస్తారు. జాతీయ టీవీ చానెళ్లు, ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌లో ఈ ఎపిసోడ్స్ ప్రసారం చేస్తారు.

రూపాయి కొత్త కనిష్టాలు


మూడు పైసల శ్రేణిలో కదలికలు...



ముంబై: రూపాయి సోమవారం ఇంటర్ బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్‌లో క్రితం ముగింపుతో పోల్చితే ఒక పైసా నష్టంతో 84.38 వద్ద ముగిసింది. ఒక దశలో 84.39ని సైతం చూసింది. 84.37 మించి రూపాయి ఏ దశలోనూ బలపడకపోవడం గమనార్హం. అంటే రోజంతా కేవలం మూడు పైసల శ్రేణిలో రూపాయి తిరిగింది. రూపాయి వరుసగా నాలుగు రోజుల నుంచి నష్టాలను చూస్తున్న సంగతి తెలిసిందే. విదేశీ నిధులు వెనక్కు మళ్లడం, ఈక్విటీ మార్కెట్ల బలహీన ధోరణి దీనికి నేపథ్యం. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) బ్యాంకర్లకు, ఎగుమతిదారులకు డాలర్ల సరఫరాను మెరుగుపరచకుండా ఉంటే, రూపాయి మరింత పతనమై ఉండేదని నిపుణుల అంచనా.

ఆరేళ్లలో ఎగుమతుల లక్ష్యం 2 ట్రిలియన్ డాలర్లు!

- సమిష్టి కృషి అవసరమన్న వాణిజ్యశాఖ మంత్రి గోయల్
- ఐఐఎఫ్‌టీ వార్షిక స్నాతకోత్సవ ప్రసంగం



న్యూఢిల్లీ: భారత్ 2030 నాటికి 2 ట్రిలియన్ డాలర్ల ''భారీ'' ఎగుమతుల లక్ష్యాన్ని సాధించడానికి సమిష్టి కృషి అవసరమని వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ పేర్కొన్నారు. ఐఐఎఫ్‌టీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్) వార్షిక స్నాతకోత్సవంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి ప్రసంగిస్తూ భారత్ వచ్చే ఆరేళ్ల కాలంలో ఎగుమతుల లక్ష్యాన్ని సాధించగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ''2030 నాటికి 2 ట్రిలియన్ల డాలర్ల ఎగుమతి లక్ష్యాన్ని సాధించడానికి మనమంతా భాగస్వాములు అవుదాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2024-25) భారత్ ఎగుమతుల విలువ 800 బిలియన్ డాలర్లను అధిగమిస్తుంది. 2 ట్రిలియన్ డాలర్ల లక్ష్యాన్ని సాధించడానికి మనం నిజంగా సమిష్టిగా ఎంతో కృషి చేయవలసి ఉంటుంది. ఇది యాదృచ్ఛికంగా జరగదు. నిర్దిష్ట చర్యల ద్వారానే ఇది సాధ్యమవుతుంది. అయితే ఈ భారీ లక్ష్యాన్ని సాధించగలమని నేను విశ్వసిస్తున్నాను'' అని గోయల్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. భారత్ మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో 778 బిలియన్ డాలర్ల వస్తు, సేవల ఎగుమతులు జరిగింది. ఆయా అంశాలపై ఇంకా గోయల్ ఏమన్నారంటే.. ఇతర దేశాలలో భారత్ ఉత్పత్తులు ఎదుర్కొంటున్న నాన్-టారిఫ్ అడ్డంకులను అధ్యయనం చేయడానికి విద్యార్థులు, అధ్యాపకులు సహకరించాలి. తద్వారా అధికారులు వాటిని పరిష్కరించడానికి వీలవుతుంది. త్వరలో దుబాయ్‌లో ఏర్పాటు చేయనున్న ఐఐఎఫ్‌టీ కొత్త క్యాంపస్ ఎగుమతుల పురోగతికి మరింత చొరవ చూపుతుంది.

స్నాతకోత్సవంలో ఎవరేమన్నారంటే...



చర్చల కోసం ఒక కేంద్రాన్ని కూడా ఐఐఎఫ్‌టీ త్వరలో ఏర్పాటు చేయనుంది. ఈ తరహా చొరవ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, నైపుణ్యం వంటి అంశాలకు సంబంధించి ముఖ్యమైనది. ఈ కేంద్రం విద్యార్థులకు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై చర్చల్లో అనుసరించాల్సిన నైపుణ్యాలను అందించడానికి దోహదపడుతుంది. భారత్ ఎగుమతుల పురోగతి విషయంలో కేస్ స్టడీస్‌ను సిద్ధం చేయడానికి కూడా ఈ కేంద్రం దోహదపడుతుంది.

\- సునీల్ భరత్వాల్, వాణిజ్య కార్యదర్శి

పెరిగిన ర్యాంకింగ్



ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్) ర్యాంకింగ్ 2024లో మేనేజ్‌మెంట్ విభాగంలో ఐఐఎఫ్‌టీ పన్నెండు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరుకుంది. రిక్రూట్‌మెంట్ కోసం అనేక పెద్ద సంస్థలు క్యాంపస్‌ను సందర్శిస్తున్నాయి.

\- రాకేష్ మోహన్ జోషి, ఐఐఎఫ్‌టీ వైస్ ఛాన్సలర్

రఘు వంశీ గ్రూప్ చేతికి పీఎంసీ గ్రూప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అంతర్జాతీయ దిగ్గజ సంస్థలకు హై-ప్రెసిషన్ ఉత్పత్తులను అందించే రఘు వంశీ గ్రూప్ తాజాగా బ్రిటన్‌కు చెందిన పీఎంసీ గ్రూప్‌ను కొనుగోలు చేసింది. ఆయిల్, గ్యాస్ పరిశ్రమ సంస్థలకు అవసరమైన యంత్రపరికరాలను పీఎంసీ గ్రూప్ తయారు చేస్తుంది. కంపెనీలో వంద మంది పైచిలుకు ఉద్యోగులు, రూ. 180 కోట్ల ఆదాయం ఉంది. మరోవైపు, బోయింగ్, జీఈ ఏవియేషన్, హనీవెల్, రోల్స్ రాయిస్ వంటి కంపెనీలు రఘు వంశీ గ్రూప్ క్లయింట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయంగా కార్యకలాపాలను విస్తరించేందుకు పీఎంసీ గ్రూప్ కొనుగోలు తోడ్పడుతుందని సంస్థ వెల్లడించింది. భారత్‌లో యూకే డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఒవెన్, తెలంగాణ వాణిజ్య.. పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్, రఘు వంశీ గ్రూప్ ఎండీ వంశీ వికాస్ తదితరులు ఇందుకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్యామ్స్, కేఫిన్‌టెక్ జాయింట్ వెంచర్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎంఎఫ్ సెంట్రల్ ప్లాట్‌ఫాం నిర్వహణ కోసం జాయింట్ వెంచర్‌గా ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేస్తున్నట్లు క్యామ్స్ (కంప్యూటర్ ఏజ్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్), కేఫిన్‌టెక్ వెల్లడించాయి. ఎంఎఫ్ సెంట్రల్ సాంకేతిక అంశాలు, సేల్స్, మార్కెటింగ్ తదితర కార్యకలాపాలన్నింటిని ఈ సంస్థ నిర్వహిస్తుందని పేర్కొన్నాయి. ఒకే వేదికపై వివిధ ఫండ్ హౌస్‌లకు చెందిన మ్యుచువల్ ఫండ్స్‌లో లావాదేవీలు జరిపేందుకు ఇన్వెస్టర్లకు వీలు కల్పించే దిశగా ఎంఎఫ్ సెంట్రల్‌ను 2021లో క్యామ్స్, కేఫిన్‌టెక్ ప్రతిపాదించాయి. తర్వాత మొబైల్ యాప్‌గా దీన్ని ఆవిష్కరించి, 2023 నుంచి పూర్తి స్థాయి ఆర్థిక సేవలను అందుబాటులోకి తెచ్చాయి.

శ్రీ సిమెంట్ లాభం... నేలచూపు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం శ్రీ సిమెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 83 శాతం పడిపోయి రూ. 77 కోట్లకు పరిమితమైంది. రుతుపవనాలు దీర్ఘకాలం కొనసాగడంతో మందగించిన డిమాండ్, ధరలు క్షీణించడం ప్రభావం చూపాయి. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 447 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 14 శాతం వెనకడుగుతో రూ. 4,235 కోట్లను తాకింది. నిర్వహణ లాభం(ఇబిటా) రూ. 870 కోట్ల నుంచి రూ. 593 కోట్లకు క్షీణించింది. మొత్తం వ్యయాలు 4 శాతం తగ్గి రూ. 4,212 కోట్లుగా నమోదయ్యాయి. మొత్తం సిమెంట్ అమ్మకాలు 7 శాతం క్షీణించి 7.6 మిలియన్ టన్నులకు పరిమితమయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో శ్రీ సిమెంట్ షేరు బీఎస్ఈలో 0.7 శాతం నీరసించి రూ. 24,390 వద్ద ముగిసింది.

రామ్‌కో సిమెంట్ లాభం... డౌన్



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ రామ్‌కో సిమెంట్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 26 శాతం క్షీణించి రూ. 26 కోట్లకు పరిమితమైంది. డిమాండ్‌తోపాటు, ధరలు క్షీణించడం ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 72 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 13 శాతం వెనకడుగుతో రూ. 2,054 కోట్లను తాకింది. సిమెంట్ విక్రయాలు 3 శాతం తక్కువగా 4.49 మిలియన్ టన్నులను తాకాయి. ముడివ్యయాలు టన్నుకి నామమాత్రంగా పెరిగి రూ. 903కు చేరాయి. మొత్తం వ్యయాలు 9 శాతం తగ్గి రూ. 2,019 కోట్లుగా నమోదయ్యాయి. సిమెంట్ తయారీ సామర్థ్యం 1 మిలియన్ టన్నులు పెరిగి 24 ఎంటీపీఏకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో రామ్‌కో సిమెంట్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం బలపడి రూ. 870 వద్ద ముగిసింది.

హిందుస్తాన్ కాపర్... ప్రోత్సాహకరం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ కాపర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 67 శాతం జంప్‌చేసి రూ. 102 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 61 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 381 కోట్ల నుంచి రూ. 518 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2.7 శాతం క్షీణించి రూ. 274 వద్ద ముగిసింది.

సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాలు — Q2 RESULTS

ఓఎన్‌జీసీ లాభం అప్

షేరుకి రూ. 6 డివిడెండ్



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 17 శాతం జంప్‌చేసి రూ. 11,948 కోట్లను తాకింది. చమురు ధరలు నీరసించినప్పటికీ విండ్‌ఫాల్‌సహా ఇతర పన్నులు తగ్గడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 10,238 కోట్లు మాత్రమే ఆర్జించింది. చట్టబద్ధ సుంకాలు రూ. 10,791 కోట్ల నుంచి రూ. 7,830 కోట్లకు క్షీణించాయి. అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరలు పెరిగితే ప్రభుత్వం విండ్‌ఫాల్ లాభాల పన్ను విధిస్తుంది. వాటాదారులకు షేరుకి రూ. 6 చొప్పున తొలి మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

78.33 డాలర్లు

తాజా సమీక్షా కాలంలో ఓఎన్‌జీసీ ఒక్కో బ్యారల్ చమురు విక్రయంపై 78.33 డాలర్ల ధరను అందుకుంది. గత క్యూ2లో 84.84 డాలర్లు చొప్పున లభించింది. అయితే కంపెనీ ఉత్పత్తి చేసిన గ్యాస్ ధరలు ఒక్కో ఎంబీటీయూకి 6.5 డాలర్లుగా కొనసాగాయి. చమురు వెలికితీత నామమాత్ర వృద్ధితో 4.576 మిలియన్ టన్నులుగా నమోదైంది. 2 శాతం తక్కువగా 4.912 బిలియన్ ఘనపు మీటర్ల గ్యాస్‌ను ఉత్పత్తి చేసింది. ఇకపై ముడిచమురు ఉత్పత్తి పెరగనున్నట్లు కంపెనీ తెలియజేసింది. కేజీ బేసిన్ బ్లాక్ కేజీ-డీడబ్ల్యూఎన్ 98/2లో ఉత్పత్తి పుంజుకోనుండటం ఇందుకు తోడ్పడనున్నట్లు పేర్కొంది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 35,163 కోట్ల నుంచి రూ. 33,881 కోట్లకు క్షీణించింది. అయితే ఇతర ఆదాయం రెట్టింపై రూ. 4,766 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఓఎన్‌జీసీ షేరు బీఎస్ఈలో 2 శాతం క్షీణించి రూ. 257 వద్ద ముగిసింది.

గాడ్‌ఫ్రే ఫిలిప్స్ లాభం ప్లస్

న్యూఢిల్లీ: సిగరెట్ల తయారీ దిగ్గజం గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 23 శాతం జంప్‌చేసి రూ. 248 కోట్లను అధిగమించింది. అమ్మకాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 202 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,375 కోట్ల నుంచి రూ. 1,651 కోట్లకు ఎగసింది. అయితే మొత్తం వ్యయాలు రూ. 1,194 కోట్ల నుంచి రూ. 1,416 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో గాడ్‌ఫ్రే ఫిలిప్స్ షేరు బీఎస్ఈలో 2.5 శాతం క్షీణించి రూ. 6,527 వద్ద ముగిసింది.

బ్యాంక్ ఆఫ్ ఇండియా... జూమ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం బ్యాంక్ ఆఫ్ ఇండియా(బీవోఐ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 63 శాతం జంప్‌చేసి రూ. 2,374 కోట్లను తాకింది. వడ్డీయేతర ఆదాయం పుంజుకోవడం ఇందుకు తోడ్పాటునిచ్చింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 1,458 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 16,659 కోట్ల నుంచి రూ. 19,872 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 4 శాతం పుంజుకుని రూ. 5,986 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.26 శాతం నీరసించి 2.82 శాతానికి పరిమితమయ్యాయి. వడ్డీయేతర ఆదాయం 49 శాతం జంప్‌చేసి రూ. 2,518 కోట్లను తాకింది. ఇందుకు రూ. 685 కోట్ల రికవరీలు, రూ. 730 కోట్ల ట్రెజరీ లాభాలు దోహదపడ్డాయి. కనీస మూలధన నిష్పత్తి 16.63 శాతంగా నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో బీవోఐ షేరు ధర 0.6% బలపడి రూ. 112 వద్ద ముగిసింది.

యూపీఎల్ నష్టాలు పెరిగాయ్



న్యూఢిల్లీ: ఆగ్రోకెమికల్స్ రంగ దిగ్గజం యూపీఎల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర నష్టం భారీగా పెరిగి రూ. 443 కోట్లకు చేరింది. అధిక వ్యయాలు ప్రభావం చూపాయి. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 189 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 10,275 కోట్ల నుంచి రూ. 11,201 కోట్లకు బలపడింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 11 శాతం పెరిగి రూ. 11,505 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో యూపీఎల్ షేరు బీఎస్ఈలో 8 శాతం పతనమై రూ. 515 వద్ద ముగిసింది.

జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్... లాభం డౌన్



న్యూఢిల్లీ: ఫాస్ట్ ఫుడ్ చైన్ దిగ్గజం జూబిలెంట్ ఫుడ్‌వర్క్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం రూ. 67 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 97 కోట్లకుపైగా ఆర్జించింది. డోమినోస్ పిజ్జా, డంకిన్ స్టోర్ల కంపెనీ మొత్తం అమ్మకాలు మాత్రం రూ. 1,955 కోట్లకు ఎగశాయి. గత క్యూ2లో రూ. 1,369 కోట్ల టర్నోవర్ సాధించింది. మొత్తం వ్యయాలు సైతం రూ. 1,290 కోట్ల నుంచి రూ. 1,896 కోట్లకు పెరిగాయి. అయితే ఫలితాలు పోల్చి చూడతగదని కంపెనీ పేర్కొంది. సొంత అనుబంధ సంస్థ జూబిలెంట్ ఫుడ్ నెదర్లాండ్స్ బీవీ.. 2024 మార్చికల్లా డీపీ యూరేషియా ఎన్‌వీలో మెజారిటీ వాటాను కొనుగోలు చేయడాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ కాలంలో 139 స్టోర్లను కొత్తగా జత చేసుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. దేశీ ఆదాయం 8 శాతం పుంజుకుని రూ. 1,467 కోట్లను తాకింది. అంతర్జాతీయ అమ్మకాలు దాదాపు రూ. 461 కోట్లకు చేరాయి.

ఫలితాల నేపథ్యంలో జూబిలెంట్ ఫుడ్ షేరు బీఎస్ఈలో 1 శాతం నీరసించి రూ. 602 వద్ద ముగిసింది.

ఆయిల్ కంట్రీ... తగ్గిన నష్టాలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆయిల్ కంట్రీ ట్యూబ్యులార్ సెప్టెంబర్ త్రైమాసికంలో నష్టాలు తగ్గించుకుంది. ఈ కాలంలో రూ.9.9 కోట్ల నష్టం నమోదు చేసింది. 2023 సెప్టెంబర్ త్రైమాసికంలో కంపెనీ రూ.12.4 కోట్ల నష్టం చవిచూసింది. టర్నోవర్ రూ.79 లక్షల నుంచి రూ.23 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో ఆయిల్ కంట్రీ ట్యూబ్యులార్ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్ఈలో సోమవారం 4.99 శాతం దూసుకెళ్లి రూ.56.76 వద్ద స్థిరపడింది.

బ్రిటానియా... తగ్గిన 'టేస్ట్'



న్యూఢిల్లీ: బేకరీ ఫుడ్ దిగ్గజం బ్రిటానియా ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జులై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 9 శాతం నీరసించి రూ. 532 కోట్లకు పరిమితమైంది. కమోడిటీ ధరల పెరుగుదల కారణంగా కన్జూమర్ డిమాండ్ మందగించడం ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 587 కోట్లు ఆర్జించింది. మొత్తం అమ్మకాలు మాత్రం 4 శాతం పుంజుకుని రూ. 4,566 కోట్లను దాటాయి. గుడ్‌డే, మేరీ గోల్డ్, న్యూట్రిచాయిస్ తదితర బ్రాండ్ల కంపెనీ మొత్తం ఆదాయం సైతం 5 శాతంపైగా బలపడి రూ. 4,714 కోట్లకు చేరింది. అయితే మొత్తం వ్యయాలు 8 శాతం పెరిగి రూ. 3,995 కోట్లను తాకాయి.

ఫలితాల నేపథ్యంలో బ్రిటానియా షేరు బీఎస్ఈలో 6 శాతం పతనమై రూ. 5,425 వద్ద ముగిసింది.

జ్యోతి సురేఖకు కాంస్య పతకం



సాక్షి, హైదరాబాద్: జేవీడీ ఓపెన్ ఇండోర్ ఆర్చరీ అంతర్జాతీయ టోర్నమెంట్‌లో భారత స్టార్ ప్లేయర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ కాంస్య పతకాన్ని సాధించింది. నెదర్లాండ్స్‌లో జరిగిన ఈ టోర్నీలో జ్యోతి సురేఖ 900 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానాన్ని సంపాదించింది. 18 మీటర్ల దూరం ఉన్న లక్ష్యం వైపు ఆయా ప్లేయర్లు 30 బాణాలను మూడుసార్లు చొప్పున సంధించారు. నిర్ణీత 90 బాణాల తర్వాత సురేఖతోపాటు ఎలీసా రోనెర్ (ఇటలీ), అలెజాంద్రా ఉస్కియానో (కొలంబియా), ఆండ్రియా మునోజ్ (స్పెయిన్) 900 పాయింట్లు స్కోరు చేసి సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే పతకాల వర్గీకరణ కోసం కేంద్ర బిందువుపై కొట్టిన అత్యధిక షాట్‌లను లెక్కలోకి తీసుకున్నారు. ఫలితంగా ఎలీసా రోనెర్ (87)కు స్వర్ణ పతకం, అలెజాంద్రా (80) రజతం, జ్యోతి సురేఖ (79)కు కాంస్య పతకం ఖరారయ్యాయి.

ఉమామహేశ్‌కు నాలుగో స్థానం

న్యూఢిల్లీ: వరల్డ్ యూనివర్సిటీ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమామహేశ్ త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకున్నాడు. సోమవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఫైనల్లో ఉమమహేశ్ 208.8 పాయింట్లు స్కోరు చేసి నాలుగో స్థానంలో నిలిచాడు.



అయాన్

పట్నా పైరేట్స్ ప్రతాపం

గుజరాత్ జెయింట్స్‌పై విజయం • 10 పాయింట్లతో మెరిసిన అయాన్

నోయిడా: ప్రొ కబడ్డీ లీగ్‌లో మాజీ చాంపియన్ పట్నా పైరేట్స్ జోరు కొనసాగుతోంది. గుజరాత్ జెయింట్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో పట్నా పైరేట్స్ 40-27 పాయింట్లతో ఏకపక్ష విజయం సాధించింది. పైరేట్స్ తరఫున రెయిడర్ అయాన్ 10 పాయింట్లతో టాపర్‌గా నిలవగా... దేవాంక్ (6 పాయింట్లు), సందీప్ (5 పాయింట్లు) సహకరించారు. గుజరాత్ ఆటగాళ్లలో అంతా సమష్టి ప్రదర్శన చేసినా అది ఓటమి నుంచి తప్పించుకునేందుకు సరిపోలేదు. గుమన్ సింగ్, పార్తీక్ దహియా చెరో 5 పాయింట్లు స్కోరు చేశారు. తొలి అర్ధభాగంలో 21-16తో ముందంజలో నిలిచిన పట్నా చివరి వరకు దానిని నిలబెట్టుకుంది. టోర్నీ తొలి మ్యాచ్‌లో నెగ్గిన గుజరాత్ టీమ్‌కు ఇది వరుసగా ఏడో పరాజయం కావడం విశేషం. పట్టికలో ప్రస్తుతం పట్నా పైరేట్స్ నాలుగో స్థానంలో (27 పాయింట్లు), గుజరాత్ జెయింట్స్ చివరి స్థానంలో (7 పాయింట్లు) కొనసాగుతున్నాయి. నేడు జరిగే పోటీల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో బెంగళూరు బుల్స్... పుణేరీ పల్టన్‌తో దబంగ్ ఢిల్లీ తలపడతాయి.

హరియాణా స్టీలర్స్ హ్యాట్రిక్

మరోవైపు హరియాణా స్టీలర్స్ జట్టు తమ అగ్రస్థానాన్ని మరింత పటిష్ట పర్చుకుంది. లీగ్‌లో వరుసగా మూడో విజయంతో స్టీలర్స్ నంబర్‌వన్‌గా కొనసాగుతోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా 48-39 పాయింట్ల తేడాతో మాజీ చాంపియన్ యు ముంబాను ఓడించింది. విశాల్, శివమ్, మొహమ్మద్ రెజా జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. రెయిడర్లు విశాల్, శివమ్ చెరో 11 పాయింట్లతో సత్తా చాటగా... ఆల్‌రౌండర్ రెజా 10 పాయింట్లు సాధించాడు. ముంబా తరఫున అజిత్ చౌహాన్ ఒంటరి పోరాటం చేసినా లాభం లేకపోయింది. రెయిడర్ అజిత్ ఒక్కడే ఏకంగా 18 పాయింట్లు సాధించగా... మిగతా వారంతా విఫలమయ్యారు. తొలి అర్ధ భాగం ముగిసేసరికి ముంబా 23-23 పాయింట్లతో ఆధిక్యంలో ఉన్నా... రెండో అర్ధభాగంలో అనూహ్యంగా వెనుకబడిపోయింది. ముంబా 16 పాయింట్లు మాత్రమే సాధించగా... హరియాణా ఖాతాలో 25 పాయింట్లు చేరాయి. 8 మ్యాచ్‌లలో 6 విజయాలు సాధించిన హరియాణా మొత్తం 31 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... 29 పాయింట్లతో ముంబా మూడో స్థానంలో కొనసాగుతోంది.

బట్లర్ ధనాధన్

45 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 83

- 14.5 ఓవర్లలో 159 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఇంగ్లండ్
- రెండో టి20లోనూ ఓడిన విండీస్



బట్లర్

బ్రిడ్జ్‌టౌన్: వెస్టిండీస్ పర్యటనలో వన్డే సిరీస్‌ను కోల్పోయిన ఇంగ్లండ్ జట్టు టి20 సిరీస్‌లో జోరు మీదుంది. సిరీసే లక్ష్యంగా వరుసగా రెండో మ్యాచ్‌లోనూ గెలిచింది. కెప్టెన్ జోస్ బట్లర్ (45 బంతుల్లో 83; 8 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగడంతో రెండో టి20లో ఇంగ్లండ్ 7 వికెట్ల తేడాతో మెరుపు విజయాన్ని నమోదు చేసింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక జరిగిన ఈ మ్యాచ్‌లో 14.5 ఓవర్లలోనే ఇంగ్లండ్ లక్ష్యాన్ని చేరుకుంది. టాస్ నెగ్గిన ఇంగ్లండ్ ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన కరీబియన్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసింది. టాప్-4 బ్యాటర్లు వరుసగా బ్రాండన్ కింగ్ (1), ఎవిన్ లూయిస్ (8), నికోలస్ పూరన్ (14), రోస్టన్ ఛేజ్ (13) విఫలమవ్వగా... కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (41 బంతుల్లో 43; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆదుకున్నాడు. రొమారియో షెఫర్డ్ (12 బంతుల్లో 22; 4 ఫోర్లు), మాథ్యూ ఫోర్డ్ (13 నాటౌట్; 3 ఫోర్లు) ధాటిగా ఆడటంతో విండీస్ జట్టు 150 పైచిలుకు స్కోరు చేయగలిగింది. ప్రత్యర్థి బౌలర్లలో సకిబ్, లివింగ్‌స్టోన్, డాన్ మౌస్లీ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం 159 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్ 15వ ఓవర్ పూర్తవకముందే 3 వికెట్లు కోల్పోయి 161 పరుగులు చేసి గెలిచింది. తొలి టి20 మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఓపెనర్ ఫిల్ సాల్ట్ (0) డకౌట్ కాగా... విల్ జాక్స్ (29 బంతుల్లో 38; 5 ఫోర్లు, 1 సిక్స్), బట్లర్ రెండో వికెట్‌కు 12 ఓవర్లలోనే 129 పరుగులు జోడించారు. పరుగు తేడాతో ఇద్దరు అవుట్ కాగా... లివింగ్‌స్టోన్ (11 బంతుల్లో 23 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), జాకబ్ బెథెల్ (3 నాటౌట్) మరో వికెట్ పడకుండా 31 బంతులు మిగిలుండగానే లాంఛనాన్ని పూర్తిచేశారు. బట్లర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' లభించింది. ఐదు టి20ల సిరీస్‌లో ప్రస్తుతం ఇంగ్లండ్ 2-0తో ఆధిక్యంలో ఉంది. ఈనెల 15న గ్రాస్ ఐలెట్‌లో మూడో టి20 మ్యాచ్ జరుగుతుంది.

భారత్ రాదు... నిర్ణయం మీదే!

పాకిస్తాన్ క్రికెట్ బోర్డుకు తేల్చి చెప్పిన అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్



కరాచీ: వచ్చే ఏడాది పాకిస్తాన్ అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) చాంపియన్స్ ట్రోఫీ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌కు ఆతిథ్యమివ్వనుంది. అయితే పాక్‌లో ఆడేందుకు భారత్ ససేమిరా అంటోంది. మరోవైపు హైబ్రిడ్ మోడల్ (భారత్ ఆడే మ్యాచ్‌లు తటస్థ వేదికపై నిర్వహణ)కి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సుముఖంగా లేదు. ఈ నేపథ్యంలో తమ దేశంలో భారత్ మెగా టోర్నీ ఆడే విషయమై ఐసీసీని మరింత స్పష్టత కోరాలని పీసీబీ భావిస్తుండగా... ఐసీసీ నాన్చకుండా తేల్చేసింది. భారత్ ఆడే మ్యాచ్‌లు యూఏఈలో... ఫైనల్ పోరు దుబాయ్‌లో నిర్వహించే హైబ్రిడ్ పద్ధతికే తాము అంగీకరిస్తామని భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఇప్పటికే తమకు స్పష్టం చేసిందని పాక్ బోర్డుకు ఐసీసీ తేల్చిచెప్పింది. భారత్ ఆడే మ్యాచ్‌లు కోల్పోయినప్పటికీ నష్టపరిహారం పూర్తిగా భర్తీ చేస్తామని ఐసీసీ హామీ ఇచ్చింది. ఇక కాదు... కూడదంటే... మీ ఇష్టమని పాక్ బోర్డుకు స్పష్టం చేయడంతో పీసీబీ కినుక వహించింది. నిరసనగా ఆతిథ్య హక్కులు వదిలేసుకోవాలని బోర్డు యోచిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దీంతో ఐసీసీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేసింది. టోర్నీ ఆతిథ్యం నుంచి ఒకవేళ పాక్ తప్పుకుంటే టోర్నీని దక్షిణాఫ్రికాకు తరలించాలని ఐసీసీ భావిస్తోంది. ఎలాగైనా పాక్‌లో భారత క్రికెట్ జట్టు అడుగుపెట్టాలనే ఉద్దేశంతో హైబ్రిడ్ మోడల్‌కు పీసీబీ విముఖత వ్యక్తం చేస్తోంది. 'హైబ్రిడ్ పద్ధతిలో చాంపియన్స్ ట్రోఫీ నిర్వహించే ఆలోచన పీసీబీకి లేదు. ప్రస్తుత పరిస్థితిని బోర్డు అంచనా వేస్తోంది. (పాక్) ప్రభుత్వాన్ని సంప్రదించాకే తదుపరి నిర్ణయం తీసుకోవాలనుకుంటుంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా బోర్డు పనిచేస్తుంది' అని పీసీబీ అధికారి ఒకరు చెప్పారు. కాగా చిరకాల ప్రత్యర్థుల మధ్య గడిచిన 16 ఏళ్లుగా ద్వైపాక్షిక సిరీసే జరగడం లేదు. 2008లో ముంబైపై పాక్ ఉగ్రదాడి అనంతరం రాజకీయ, క్రికెట్ బంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి భారత్, పాక్ జట్లు కేవలం ఐసీసీ ప్రపంచకప్ టోర్నీల్లో, చాంపియన్స్ ట్రోఫీల్లోనే తలపడుతున్నాయి.

సినెర్ సులువుగా...



సినెర్

ట్యూరిన్: పురుషుల టెన్నిస్ సీజన్ ముగింపు టోర్నీ అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) ఫైనల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్ యానిక్ సినెర్ శుభారంభం చేశాడు. 'ఇలీ నస్టాసే గ్రూప్'లో భాగంగా జరిగిన లీగ్ మ్యాచ్‌లో టాప్ సీడ్ సినెర్ 6-3, 6-4తో అలెక్స్ డిమినార్ (ఆస్ట్రేలియా)పై విజయం సాధించాడు. 85 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సినెర్ ఎనిమిది ఏస్‌లు సంధించాడు. ఒక డబుల్ ఫాల్ట్ చేశాడు. తన సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేశాడు. నెట్ వద్దకు 14 సార్లు దూసుకొచ్చి 12 సార్లు పాయింట్లు గెలిచాడు. 18 విన్నర్స్ కొట్టిన ఈ ఇటలీ స్టార్ 24 అనవసర తప్పిదాలు చేశాడు. మరోవైపు అలెక్స్ మూడు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. కేవలం ఏడు విన్నర్స్ కొట్టిన అలెక్స్ ఏకంగా 28 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకున్నాడు.

అల్‌కరాజ్ ఓటమి

మరోవైపు 'జాన్ న్యూకోంబ్ గ్రూప్'లో భాగంగా జరిగిన లీగ్ మ్యాచ్‌లో కాస్పర్ రూడ్ (నార్వే) 6-1, 7-5తో ప్రపంచ మూడో ర్యాంకర్ కార్లోస్ అల్‌కరాజ్ (స్పెయిన్)పై గెలిచాడు. గతంలో అల్‌కరాజ్‌తో జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఓడిన రూడ్ ఐదో ప్రయత్నంలో విజయాన్ని అందుకోవడం విశేషం. ఈ ఏడాది రెండు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ (ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్) నెగ్గిన అల్‌కరాజ్ ఈ ఓటమితో సెమీఫైనల్ అవకాశాలను క్లిష్టం చేసుకున్నాడు. సెమీఫైనల్ చేరాలంటే అల్‌కరాజ్ ఇదే గ్రూప్‌లోని మిగతా ఇద్దరు ప్రత్యర్థులు అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), ఆండ్రీ రుబ్లెవ్ (రష్యా)లపై గెలవాల్సి ఉంటుంది.

బోపన్న జంట పరాజయం

ఏటీపీ ఫైనల్స్ టోర్నీలోని డబుల్స్ విభాగంలో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ తొలి లీగ్ మ్యాచ్‌లో ఓడిపోయింది. 'బాబ్ బ్రయాన్ గ్రూప్'లో భాగంగా జరిగిన మ్యాచ్‌లో సిమోన్ బొలెలీ-ఆండ్రియా వవసోరి (ఇటలీ) ద్వయం 6-2, 6-3తో బోపన్న-ఎబ్డెన్ జంటపై గెలిచింది.



శుభారంభంపై సింధు దృష్టి

నేటి నుంచి జపాన్ మాస్టర్స్ టోర్నీ

కుమమొటో: భారత స్టార్ షట్లర్లు పూసర్ల వెంకట (పీవీ) సింధు, లక్ష్యసేన్ వైఫల్యాలను అధిగమించి టైటిళ్ల వేటలో పడాలనే పట్టుదలతో జపాన్ ఓపెన్ టోర్నీ బరిలోకి దిగుతున్నారు. నేటి నుంచి జపాన్ మాస్టర్స్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 టోర్నమెంట్ జరగనుంది. ఇద్దరు భారత అగ్రశ్రేణి షట్లర్లు పారిస్ ఒలింపిక్స్ తర్వాత బరిలోకి దిగిన ఏ టోర్నీలోనూ చెప్పుకోదగ్గ ప్రదర్శనే చేయలేకపోయారు. గతంలో ఒక సీజన్‌లో వరుస టైటిల్స్ సాధించిన వారు ఇప్పుడు కనీసం క్వార్టర్ ఫైనల్ దశను దాటలేకపోవడం ఇబ్బందికరంగా మారింది. రెండు ఒలింపిక్ పతకాల విజేత, ఆంధ్రప్రదేశ్ వెటరన్ స్టార్ పీవీ సింధు ఫిన్‌లాండ్‌లో జరిగిన ఆర్కిటిక్ ఓపెన్‌లో తొలి రౌండ్లోనే విఫలమైనా... డెన్మార్క్ ఓపెన్‌లో మాత్రం క్వార్టర్ ఫైనల్ చేరింది. కానీ లక్ష్యసేన్ మాత్రం ఈ రెండు టోర్నీల్లో ఆరంభ రౌండ్లలోనే కంగుతిని ఇంటిదారి పట్టాడు. బుధవారం జరిగే మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో 29 ఏళ్ల సింధు... థాయ్‌లాండ్‌కు చెందిన ఎనిమిదో సీడ్ బుసానన్‌తో తలపడనుండగా, పురుషుల ఈవెంట్‌లో 23 ఏళ్ల లక్ష్యసేన్ మలేసియాకు చెందిన లియోంగ్ జున్ హవోను ఎదుర్కొంటాడు. తొలి రౌండ్ అడ్డంకిని అధిగమిస్తే... అతను రెండో రౌండ్లో ఎనిమిదో సీడ్ ఆంథోనీ గిన్‌టింగ్ (ఇండోనేసియా)తో పోటీపడే అవకాశముంది. ఇక డబుల్స్‌లో ఒకే ఒక్క భారత జోడీ బరిలో ఉంది. పుల్లెల గాయత్రి గోపీచంద్-ట్రిసా జాలీ జంట మహిళల డబుల్స్ మొదటి రౌండ్లో చైనీస్ తైపీకి చెందిన సూ యిన్ హుా-లిన్ జి యున్ జోడీతో తలపడుతుంది. కొత్త కోచ్‌ల మార్గదర్శనంలో టోర్నీ కోసం సిద్ధమైనట్లు సింధు చెప్పింది. 'నేనిపుడు బాగా ఆడుతున్నాను. శారీరకంగా, మానసికంగానూ దృఢంగా ఉన్నాను. కొన్ని లోపాలపై కసరత్తు చేశాం. కోర్టులో డిఫెన్స్, స్పీడ్ మెరుగుపర్చుకునేందుకు ఇటీవల బాగా శ్రమించాను. జపాన్‌తో పాటు త్వరలో చైనాలో జరిగే టోర్నీలోనూ రాణిస్తాను' అని సింధు ఆశాభావం వ్యక్తం చేసింది. ప్రస్తుతం కొరియన్ దిగ్గజం, కోచ్ లీ స్యూన్, అనూప్ శ్రీధర్‌లతో ఆమె శిక్షణ తీసుకుంటుంది.

గత మూడేళ్లు కష్టకాలం!

లోపాలను సరిదిద్దుకున్నానన్న భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి



పోర్ట్ ఎలిజబెత్: మూడేళ్ల క్రితం వరుణ్ చక్రవర్తి 'మిస్టరీ స్పిన్నర్'గా గుర్తింపు తెచ్చుకొని భారత జట్టులోకి ఎంపికయ్యాడు. శ్రీలంకతో టి20 సిరీస్‌లో మూడు మ్యాచ్‌లలో పొదుపైన బౌలింగ్ ప్రదర్శన కనబర్చడంతో కొద్ది రోజులకే యూఏఈలో జరిగిన టి20 వరల్డ్ కప్‌లో ఆడే అవకాశం కూడా దక్కింది. అయితే 3 మ్యాచ్‌లలో కలిపి 11 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు! దాంతో అతను తీవ్ర విమర్శలపాలై సెలక్టర్ల నమ్మకం కోల్పోయాడు. జట్టులో స్థానం చేజార్చుకున్న అతను ఐపీఎల్‌లో మాత్రం ఆకట్టుకున్నాడు. 2024 ఐపీఎల్‌లో మళ్లీ సత్తా చాటి కోల్‌కతా నైట్‌రైడర్స్ టైటిల్ విజయంలో కీలకపాత్ర పోషించడంతో ఎట్టకేలకు మళ్లీ టీమిండియా చాన్స్ లభించింది. పునరాగమనంలో ఆడిన 5 టి20ల్లో కలిపి 13 వికెట్లతో వరుణ్ సత్తా చాటాడు. తాజాగా దక్షిణాఫ్రికాతో రెండో టి20 మ్యాచ్‌లో 5 వికెట్ల ప్రదర్శనతో చెలరేగిన అతను తన ఆనందాన్ని వ్యక్తం చేశాడు. 'వైఫల్యాలు వచ్చిన తర్వాత నేను మళ్లీ నా ఆటలో మూలాలకు వెళ్లిపోయాను. నా వీడియోలు చూసి లోపాలేమిటో తెలుసుకునే ప్రయత్నం చేశా. నా సైడ్ స్పిన్ బౌలింగ్ అంతర్జాతీయ స్థాయిలో పనికి రాదని అర్థమైంది. అందుకే నా బౌలింగ్‌లో సమూల మార్పులు చేసుకున్నాను. దానికి రెండేళ్లు పట్టింది. ఐపీఎల్‌తో పాటు స్థానిక లీగ్‌లలో అది మంచి ఫలితాలు ఇవ్వడంతో దానినే ఇక్కడా కొనసాగించాను. ఆదివారం మ్యాచ్‌లో నా శైలికి పిచ్ కూడా సహకరించింది. ఇకపై కూడా ఇలాగే రాణించాలని కోరుకుంటున్నా' అని వరుణ్ స్పందించాడు. మూడేళ్ల క్రితం భారత జట్టులో స్థానం కోల్పోయిన తర్వాత తన పరిస్థితి బాగా ఇబ్బందికరంగా మారిందని అతను గుర్తు చేసుకున్నాడు. దానిని కష్టకాలంగా అతను పేర్కొన్నాడు. 'గత మూడేళ్లు చాలా కఠినంగా సాగాయి. ఆపై మరింత ఎక్కువ క్రికెట్ ఆడటమే నేను చేయగలిగిందని అర్థమైంది. అందుకే టీఎన్‌పీఎల్ వంటి దేశవాళీ లీగ్‌లలో పాల్గొన్నా. అది నా ఆటను మరింత అర్థం చేసుకునేందుకు, ఆపై మెరుగు పర్చుకునేందుకు ఉపకరించింది' అని వరుణ్ చెప్పాడు. ఇటీవల బంగ్లాదేశ్‌తో సిరీస్ ఆడిన సమయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన బాధ్యతలపై స్పష్టత ఇవ్వడం మేలు చేసిందని అతను అన్నాడు. 'నువ్వు 30-40 పరుగులు ఇచ్చినా సరే ఆందోళన చెందవద్దు. వికెట్లు తీయడమే నీ పని అంటూ నా బాధ్యత ఏమిటో గంభీర్ స్పష్టంగా చెప్పారు. అది మంచి చేసింది' అని ఈ స్పిన్నర్ వ్యాఖ్యానించాడు.

వాడీవేడిగా 'కాప్' సదస్సు

విభేదాలను పరిష్కరించుకోండి ● సభ్యదేశాలను కోరిన ఆతిథ్య అజర్‌బైజాన్



బాకు/న్యూఢిల్లీ: భూతాపంలో పెరుగుదలను కట్టుదిట్టంచేసి పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ప్రపంచ దేశాలు ఒక్కతాటిమీదకొచ్చే ఐక్యరాజ్యసమితి చర్చావేదిక 'కాప్'సదస్సు సోమవారం అజర్‌బైజాన్ దేశంలో ఆరంభమైంది. పర్యావరణ పరిరక్షణ కోసం భారీగా నిధులు సమీకరించడం, వెచ్చించడంసహా గత ఉమ్మడి కార్యాచరణ పటిష్ట అమలుపై సభ్యదేశాల మధ్య నెలకొన్న స్పర్థ సమసిపోవాలని ఆతిథ్య అజర్‌బైజాన్ దేశం ఈ సందర్భంగా కోరింది. నవంబర్ 22వ తేదీదాకా జరిగే కాన్ఫెరెన్స్ ఆఫ్ పార్టీస్(కాప్) 29వ సమావేశాలు అజర్‌బైజాన్‌లోని బాకు నగరంలో సోమవారం ప్రారంభంకాగా సభ్యదేశాల అగ్రనేతలు, ప్రతినిధి బృందాలు, పెద్దసంఖ్యలో పర్యావరణవేత్తలు పాల్గొన్నారు. శిలాజఇంధనాల అతివినియోగం దుష్ప్రభావాలను ఎదుర్కొంటున్న బాధిత గ్లోబల్ సౌత్ వర్ధమాన దేశాలకు కాలుష్య కారక సంపన్న దేశాలు రుణాలకు బదులు అధిక గ్రాంట్లు(నిధులు) ఇవ్వాలన్న ప్రధాన డిమాండ్ మళ్లీ తెరమీదకు తెచ్చారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి వాతావరణమార్పుల విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి సీమన్ స్టియెల్ ప్రారంభోపన్యాసం చేశారు. ''అత్యధిక కర్బన ఉద్గారాలను వెదజల్లుతున్న దేశాల్లో మూడింట రెండొంతుల దేశాలు కాలుష్యాన్ని తగ్గించుకోలేకపోతే భారీమూల్యం చెల్లించుకోకతప్పదు. సరకు రవాణా గొలుసులు తెగిపోకుండానే కాలుష్యాన్ని తగ్గిస్తూ వస్తూత్పత్తిని కొనసాగించే సమర్థ చర్యల అమలుకు దేశాలు కంకణబద్ధంకావాలి. లేదంటే ప్రపంచ ఆర్థికవ్యవస్థ కునారిల్లుతుంది. వాతావరణ పరిరక్షణకు నిధుల సమీకరణకు నవ్య మార్గాలను చూపించండి. ఇది ప్రతి ఒక్కదేశం బాధ్యత''అని చెప్పారు.

దారుణ దిశలో పయనిస్తున్నాం: కాప్ అధ్యక్షుడు

కాప్29 అధ్యక్షుడు ముఖ్తార్ బాబాయేవ్ మాట్లాడారు. ''మానవ కార్యకలాపాలు, అధికంగా శిలాజ ఇంధనాల వినియోగంతో భూతాపోన్నతి ఏటా 3 డిగ్రీసెల్సియస్ అధికమవుతోంది. ఈ పెడపోకడ ఇలాగే కొనసాగితే వందల కోట్ల ప్రజానీకం దారుణకష్టాల కడలిలో కొట్టుకుపోకతప్పదు. నూతన సమ్మిళిత లక్ష్యం(న్యూ కలెక్టివ్ క్వాంటిఫైడ్ గోల్-ఎన్‌సీక్యూజీ)ని సాధించాలంటే 2009లో ఏటా 100 బిలియన్ డాలర్ల నిధులివ్వాలన్న కాలంచెల్లిన నిధుల లక్ష్యాన్ని సవరించుకోవాల్సిందే. సమస్య తీవ్రత, విస్తృతిని దృష్టిలో ఉంచుకుని సభ్యదేశాలు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, భూతాపం కట్టడిలో మెరుగైన భాగస్వామ్య పాత్ర పోషించాలి''అని ముఖ్తార్ పిలుపునిచ్చారు. అయితే వర్ధమానదేశాలు తమ పరిధిలో కాలుష్యాన్ని తగ్గించుకునేందుకు గరిష్టంగా 6.85 ట్రిలియన్ డాలర్ల నిధులు అవసరమవుతాయని ఐరాస వాతావరణవిభాగం చెప్పడం గమనార్హం.



ఏమిటీ కాప్?

వాతావరణాన్ని కాపాడేందుకు ప్రపంచదేశాలు ఒకచోట చేరి చర్చించే అంతర్జాతీయ కూటమి వేదికే కాప్. ఐరాస వాతావరణ మార్పు కూటమి(యూఎన్‌ఎఫ్‌సీసీసీ) కార్యనిర్వాహక విభాగాన్నే కాన్ఫెరెన్స్ ఆఫ్ పార్టీ(కాప్)గా పిలుస్తారు. వాతావరణ మార్పు ఒప్పందం అమలు, భవిష్యత్ కార్యాచరణ, కాలుష్యాల కట్టడి, శిలాస ఇంధనాల వాడకాన్ని కనిష్టానికి దించడం, వాతావరణమార్పుల దుష్ప్రభావాల బారినపడిన పేదదేశాలకు నిధులు ఇచ్చేందుకు సంపన్న, కాలుష్యకారక దేశాలను ఒప్పించడం వంటి కీలక బాధ్యతలను కాప్ చూస్తుంది. అయితే భారీ నిధులిస్తామంటూ సమావేశాలప్పుడు భీష్మ ప్రతిజ్ఞలు చేస్తున్న సంపన్న దేశాలు తర్వాత నిధులివ్వకుండా ముఖంచాటేస్తున్నాయి. దీంతో సంపన్న దేశాల సంయుక్త ప్రకటనలు కార్యాచరణకు నోచుకోక కాగితాలకే పరిమితమవుతున్నాయి. పారిశ్రామికయుగం మొదలుకాకముందు నాటితో పోలిస్తే ఉష్ణోగ్రతలో పెరుగుదలను 1.5 డిగ్రీ సెల్సియస్‌కు పరిమితం చేయాలని కాప్ కోరుకుంటోంది. కానీ అది ఈఏడాది ఏకంగా 3 డిగ్రీ సెల్సియస్ దాటిరాబోయే అతివృష్టి, అనావృష్టి, తుపాన్లు, వరదలు, కరువులు వంటి అనూహ్య వాతావరణ పరిస్థితులను సర్వసాధారణం చేసేస్తూ భావి తరాలకు భవిష్యత్తేలేకుండా చేస్తోంది.



సన్నని వెదురు గొట్టం మాదిరిగా ఉండే సరికొత్త తూనీగ జాతిని కేరళలో పశ్చిమ కనుమల ప్రాంతంలో తాజాగా గుర్తించారు. దీని పొట్ట భాగం పొడవైన స్థూపాకృతిలో అచ్చం సన్నటి వెదురు గొట్టాన్ని తలపించేలా ఉంటుంది. అందుకే దీనికి అగస్త్యమలై బాంబూటెయిల్ (వెదురుతోక) అని పేరు పెట్టారు. దీని శాస్త్రీయనామం మెలనోనౌరా అగస్త్యమలైకా. ఇది మెలనోనౌరా జెనస్ కుటుంబానికి చెందినది. ఆ కుటుంబంలో వెలుగులోకి వచ్చిన రెండో జాతి ఇదని సైంటిస్టులు చెబుతున్నారు. ఈ తూనీగలు కేరళలో తిరువనంతపురం జిల్లాలో పెప్పర వణ్యప్రాణి సంరక్షణ కేంద్రంలో మంజడినిన్నవిల ప్రాంత పరిధిలో పుణెలోని ఎంఐటీ వరల్డ్ పీస్ వర్సిటీ, కేరళ క్రైస్ట్ కాలేజీ సైంటిస్టుల బృందం కంటబడ్డాయి. అనంతరం పొన్ముడి కొండల్లో కూడా వీటి ఉనికిని గుర్తించారు. మెలనోనౌరా కుటుంబంలో తొలి తూనీగ జాతిగా మలబార్ బాంబూటెయిల్ గుర్తింపు పొందింది. దాన్ని కూర్గ్-వయనాడ్ ప్రాంతంలో తొలుత గుర్తించారు. వాటితో పోలిస్తే అగస్త్యమలై తూనీగ జాతిలో దాదాపు 7 శాతం దాకా జన్యుపరమైన తేడాలున్నట్టు తేలింది. పొడవాటి నల్లని శరీరం, నీలిరంగు చారికలు దీని సొంతం. ఇంతటి జీవ వైవిధ్యానికి నిలయమైన పశ్చిమ కనుమలను మరింతగా సంరక్షించాల్సిన అవసరం ఎంతో ఉందని ఎంఐటీ వర్సిటీకి చెందిన డాక్టర్ పంకజ్ కోర్పడే అభిప్రాయపడ్డారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

జపాన్ ప్రధానిగా ఇషిబా మళ్లీ ఎన్నిక

టోక్యో: జపాన్ పార్లమెంట్ సోమవారం ప్రధానమంత్రిగా షిగెరు ఇషిబాను మళ్లీ ఎన్నుకుంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికార సంకీర్ణం ఘోర పరాజయం మూటగట్టుకోవడం తెలిసిందే. ఎన్నికలు ముగిసిన 30 రోజుల్లోగా కొత్త నేతను పార్లమెంట్‌లోని శక్తివంతమైన దిగువ సభ ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు జరిగిన ప్రత్యేక సమావేశంలో ఇషిబా ప్రతిపక్ష నేత యోషిహికో నొడాను 221-160 ఓట్ల తేడాతో ఓడించారు. దీంతో, ఇషిబా కొత్త కేబినెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. తాజా ఎన్నికల్లో ఓటమి పాలైన ముగ్గురు మినహా దాదాపు పాత మంత్రి వర్గమే కొనసాగే అవకాశాలున్నాయి.

ప్రధాని లగేజీనీ సోదా చేస్తారా?

ఎన్నికల అధికారులను నిలదీసిన ఉద్ధవ్ ఠాక్రే

యావత్మాల్: మహారాష్ట్ర మాజీ సీఎం, శివసేన(ఉద్ధవ్)చీఫ్ ఉద్ధవ్ ఠాక్రేకు ఊహించని అనుభవం ఎదురైంది. యావత్మాల్ జిల్లాలోని వనిలో సోమవారం ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఉద్ధవ్ హెలికాప్టర్‌ను, ఆయన బ్యాగేజీని స్థానిక హెలిప్యాడ్ వద్ద ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆయన విడుదల చేశారు. ప్రధాని మోదీ, హోం మంత్రి బ్యాగులను కూడా ఇలాగే తెరిచి చూస్తారా అంటూ ఉద్ధవ్ అక్కడున్న ఎన్నికల అధికారులను అడుగుతున్నట్లుగా అందులో ఉంది. సీఎం షిండే, డిప్యూటీ సీఎంలు ఫడ్నవీస్, అజిత్ పవార్‌ల బ్యాగులను కూడా ఇలాగే సోదా చేస్తారా అంటూ వారిని ప్రశ్నించారు. అధికారుల గుర్తింపు కార్డులను పరిశీలించాలంటూ తమ కార్యకర్తలకు ఠాక్రే సూచనలు చేశారు. 'ప్రజాస్వామ్యంలో అందరూ సమానులే. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనేవి ఉండవు. ఇది ప్రజాస్వామికం కాదు. దీనిని ప్రజాస్వామిక చర్యగా భావించడం లేదు. ఇవన్నీ వృథా చర్యలు'అని ఉద్ధవ్ పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉండటంతో ఓటర్లను మభ్యపెట్టేందుకు రాజకీయ పార్టీలు చేపట్టే బహుమతులు, నగదు పంపిణీని అడ్డుకునేందుకు అధికారులు ఆకస్మిక తనిఖీలు జరుపుతున్నారు. అనంతరం వనిలో జరిగిన బహిరంగ సభలోనూ తన బ్యాగేజీ తనిఖీ విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ప్రచారానికొచ్చే అధికార పార్టీల సీనియర్ నేతల బ్యాగులను సోదా జరపాలంటూ ఓటర్లను కోరారు.

హిందూ-ముస్లిం ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షాలు హిందువులు, ముస్లింల్లో చీలికలు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఉద్ధవ్ ఠాక్రే ఆరోపించారు. 'మోదీ గ్యారెంటీలు మహారాష్ట్రలో పనిచేయవు. హిందూ హృదయ సమ్రాట్ అయిన బాలా సాహెబ్ ఠాక్రే మాటే ఇక్కడ చెల్లుబాటవుతుంది'అని పేర్కొన్నారు. 'రాష్ట్రంలో ప్రధాని మోదీ, అమిత్ షాలు ఎన్నికల ప్రచారంలో పాల్గొనడంపై నాకెలాంటి సమస్యా లేదు. అయితే, 'విడిపోతే నష్టపోతాం..'వంటి వ్యాఖ్యలతో హిందూముస్లింల మధ్య విభేదాలను సృష్టించేందుకు వారు చేస్తున్న ప్రయత్నాలపైనే నా అభ్యంతరమంతా'అని చెప్పారు. మణిపూర్‌లో హింస, దేశంలో మహిళలకు భద్రత వంటి అంశాల్లో ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించిన ఆర్టికల్ 370 రద్దు చేశామని మహారాష్ట్ర రైతులకు చెప్పడం ఎందుకని ప్రశ్నించారు. రైతులకు అందించే గిట్టుబాటు ధరలపై మాట్లాడాలన్నారు. ఈ నెల 20వ తేదీన జరిగే ఎన్నికల్లో శివసేన(ఉద్ధవ్), ఎన్సీపీ(శరద్), కాంగ్రెస్‌లతో కూడిన మహా వికాస్ అఘాడీ కూటమి అధికార బీజేపీ, శివసేన, ఎన్సీపీల మహాయుతితో హోరాహోరీగా తలపడుతున్న విషయం తెలిసిందే.

కుమారస్వామి నల్లన్న!

నలుపు రంగు మనిషి అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన కర్ణాటక కాంగ్రెస్ నేత

రామనగర(కర్ణాటక): కర్ణాటక మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత బీజెడ్ జమీర్ అహ్మద్ ఖాన్.. జేడీఎస్ నేత, కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామిపై అనుచిత వ్యాఖ్యలుచేశారు. గతంలో కాంగ్రెస్‌ను వీడి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి తర్వాత బీజేపీలో చేరి చివరకు మళ్లీ కాంగ్రెస్ గూటికొచ్చిన సీపీ యోగీశ్వరనుద్దేశించి ప్రసంగిస్తూ జమీర్ అహ్మద్ ఈ వివాదాస్పద వ్యాఖ్యలుచేశారు. ఆదివారం రామనగర పట్టణంలో జరిగిన చన్నపట్న అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారసభలో సమీర్ మాట్లాడారు. ''కాంగ్రెస్ మనస్పర్థల కారణంగా యోగీశ్వర స్వతంత్ర్య అభ్యర్థిగా పోటీచేశారు. తర్వాత గతిలేక బీజేపీలో చేరారు. తర్వాత జేడీఎస్ తీర్థం పుచ్చుకోవాలనుకున్నారు. కానీ ప్రమాదకరమైన మనిషి నల్ల కుమారస్వామి జేడీఎస్‌లో ఉండటంతో ఆ ప్రయత్నం విరమించుకుని సొంత గూటికి వచ్చారు''అని అన్నారు. చెన్నపట్నలో కుమారస్వామి కుమారుడు నిఖిల్‌పై యోగీశ్వర పోటీచేస్తున్న విషయం తెల్సిందే. జమీర్ వ్యాఖ్యలపై బీజేపీ, జేడీఎస్ తీవ్రంగా మండిపడ్డాయి. ''కుమారస్వామి నలుపంటూ జాత్యహంకార వ్యాఖ్యలు చేస్తున్నారు. రాహుల్ సైతం గతంలో దక్షిణాది వాసులు ఆఫ్రికన్లలా ఉంటారని, ఈశాన్య రాష్ట్రాల వాళ్లు చైనీయుల్లా ఉంటారని, ఉత్తర భారత ప్రజలు అరబ్బుల్లా కనిపిస్తారని వ్యాఖ్యానించారు''అని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు మండిపడ్డారు. అయితే తన వ్యాఖ్యలను మంత్రి సమీర్ పూర్తిగా సమర్థించుకున్నారు. ''నేను గతంలో చాలా సంవత్సరాలు జేడీఎస్‌లో పనిచేశా. దేవెగౌడ నాకు రాజకీయగురువు. అప్పుడు కుమారస్వామి నాకు చాలా క్లోజ్. పొట్టిగా ఉన్న నన్ను ఆయన పొట్టోడా అనేవాడు. నేను ఆయనను నల్ల సోదరా అనేవాడిని. మాది పాత స్నేహం. ఆ చనువుతో సరదాగా అలా అన్నాను. ఇందులో వివాదం చేసేంత విషయం లేదు''అని అన్నారు. కుమారస్వామిని జమీర్ మూడేళ్ల క్రితం సైతం ఇలాగే సంబోధించారు. ''నేను పొట్టోడిని. దేవుడు నన్నిలా చేశాడు. ఆయనను నల్లగా పుట్టించాడు. అందుకే ఆయన నల్లగా ఉన్నాడు. తెల్లగా ఉన్నోళ్లని నలుపు అంటే తప్పు. నల్లగా ఉన్న వాళ్లని నలుపంటే తప్పేంటి?' అని బీదర్‌లో ఓ కార్యక్రమంలో అన్నారు.

క్షీణిస్తున్న సునీత ఆరోగ్యం?

వాషింగ్టన్: బోయింగ్ తయారీ స్టార్‌లైనర్ సంస్థ పంపిన రాకెట్‌లో ప్రొపల్షన్ వ్యవస్థలో లోపం కారణంగా భూమికి తిరిగిరాలేక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో ఉండిపోయిన వ్యోమగామి సునీతా విలియమ్స్ ఆరోగ్యంపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఐఎస్ఎస్‌కు వెళ్లేటపుడు పుష్టిగా ఉన్న సునీత తర్వాత బక్కచిక్కిపోయారని వార్తలొచ్చాయి. బుగ్గలు నొక్కుకుపోయిన ఫొటో ఒకటి సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం కావడంతో చివరకు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ(నాసా) వివరణ ఇవ్వక తప్పని పరిస్థితి ఎదురైంది. ముందస్తు సన్నద్ధత లేకుండా సుదీర్ఘకాలంపాటు భారరహిత స్థితిలో గడపడం వల్ల ఆమె ఆరోగ్యం దెబ్బతిన్నదని మీడియాతో కథనలు వెలువడటం తెల్సిందే. ఈ వార్తలను నాసా తాజాగా తోసిపుచ్చింది. ''అక్కడి వ్యోమగాముల ఆరోగ్యస్థితిని ఫ్లైట్ సర్జన్లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అందరూ ఆరోగ్యంగా ఉన్నారు''అని నాసా స్పేస్ ఆపరేషన్స్ మిషన్ డైరెక్టరేట్ అధికార ప్రతినిధి జిమ్మీ రస్సెల్ అన్నారు. ''ఎనిమిది రోజుల్లో తిరిగొస్తారనుకుంటే ఆరునెలలపాటు అక్కడే ఉంచుతున్నారు. సుదీర్ఘకాలం భారరహిత స్థితిలో ఉంటే కండరాల క్షీణత బారిన పడే వీలుంది. ఎముకల పటిష్టత తగ్గుతుంది. పోషకాలలేమి సమస్యలు వస్తాయి'' అని కొందరు వైద్యనిపుణలు అభిప్రాయపడటం తెల్సిందే. సునీతతోపాటు బేరీ బుచ్‌విల్మోర్ సైతం అదేరోజున ఐఎస్ఎస్‌కు వెళ్లిన విషయం విదితమే.

ఉక్రెయిన్‌పై దాడుల తీవ్రత పెంచిన రష్యా

ఆరుగురు మృతి, 30 మందికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా ఆర్మీ దాడుల తీవ్రతను మరింత పెంచింది. బాలిస్టిక్ క్షిపణి, గైడ్ బాంబులు, డ్రోన్లతో ఉక్రెయిన్ దక్షిణ, తూర్పు ప్రాంత నగరాలపై సోమవారం విరుచుకుపడింది. ఈ దాడుల్లో ఆరుగురు చనిపోగా, 30 మంది వరకు గాయపడ్డారు. సుమారు 600 మైళ్ల మేర ఉన్న యుద్ధక్షేత్రానికి అతి సమీపంలోని ప్రధాన నగరాలపైనే దాడులు జరిగాయి. ఒక్క మైకలోవ్ నగరంలోనే ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. జెలెన్‌స్కీ సొంత పట్టణం క్రివ్యిరిహ్‌లోని అపార్టుమెంట్‌లోని ఐదంతస్తుల భవనం క్షిపణి దాడిలో ధ్వంసమైంది. ప్రతి రోజు, ప్రతిరాజు, రష్యా భయానక వాతావరణం సృష్టిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వ్యాఖ్యానించారు. తమ పౌరుల మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసే లక్ష్యంతో నివాస ప్రాంతాలే లక్ష్యంగా దాడులను ఉధృతం చేసిందన్నారు. కాగా, మాస్కో ప్రాంతంలోని వైమానిక క్షేత్రంలో పార్క్ చేసి ఉంచిన ఎంఐ-24 యుద్ధ హెలికాప్టర్‌ను ధ్వంసం చేసినట్లు ఉక్రెయిన్ నిఘా విభాగం ప్రకటించింది. కస్క్ ప్రాంతంలో 17 ఉక్రెయిన్ డ్రోన్లను ధ్వంసం చేసినట్లు రష్యా ఆర్మీ తెలిపింది.

అమెరికా వ్యాప్తంగా... జాత్యహంకార మెసేజ్‌లు

నల్ల జాతీయులే లక్ష్యంగా ఫోన్లకు సందేశాలు

వాషింగ్టన్: జాత్యాహంకార సందేశాలు అమెరికాలో ఆందోళన రేపుతున్నాయి. మిడిల్ స్కూల్ విద్యార్థులతో పాటు నల్ల జాతీయులనే లక్ష్యంగా చేసుకుని బెదిరింపు ఫోన్ సందేశాలు వెల్లువెత్తుతున్నాయి. న్యూయార్క్, అలబామా, కాలిఫోర్నియా, ఒహాయో, పెన్సిల్వేనియా, టెనెసీ వంటి పలు రాష్ట్రాల్లో ఈ ఉదంతాలపై కేసులు నమోదయ్యాయి. సందేశాల్లో వాడిన పదాలు భిన్నంగా ఉన్నా బెదిరింపులు మాత్రం ఒకేలా ఉన్నాయని బాధితులు చెబుతున్నారు. కొందరిని స్వస్థలం చిరునామా చెప్పాలంటూ బెదిరించగా మరికొందరిని రాబోయే అధ్యక్ష పాలన గురించి హెచ్చరించారు. ఈ సందేశాలపై న్యాయ శాఖతో సంప్రదింపులు జరుపుతున్నట్టు ఎఫ్‌బీఐ తెలిపింది. ఫెడరల్ కమ్యూనికేషన్స్ కమిషన్, ఫెడరల్, స్టేట్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో కలిసి దీనిపై దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపింది. ఒహాయో అటార్నీ జనరల్ కార్యాలయం కూడా ఈ విషయాన్ని పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది.

కించపరిచే వ్యాఖ్యలు

పోలింగ్ జరిగిన గత బుధవారం సాయంత్రం తన 16 ఏళ్ల కుమార్తె ఫోన్‌కు సందేశం వచ్చినట్టు కాలిఫోర్నియాలోని లోడీకి చెందిన తాషా డన్హామ్ చెప్పారు. ''నా కూతురిని తక్షణం నార్త్ కరోలినాలోని ఒక తోటకు రావాలని ఆదేశించారు. ఆరా తీస్తే అక్కడో మ్యూజియం ఉంది''అని తెలిపారు. ఈ పరిణామాలు తమను కలవరపరుస్తున్నాయన్నారు. పెన్సిల్వేనియాలోని మాంట్‌గోమెరీ కౌంటీలో ఆరుగురు మిడిల్ స్కూల్ విద్యార్థులకు కూడా ఇలాంటి సందేశాలే అందాయి. దక్షిణ కరోలినాలోని క్లెమ్సన్, అలబామా వంటి పలు విశ్వవిద్యాలయాల విద్యార్థులు తమకూ ఇలాంటి సందేశాలు వచ్చినట్టు చెప్పారు. పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తూ టెనెసీలోని నాష్‌విల్లేలో ఉన్న చరిత్రాత్మక నల్లజాతి విశ్వవిద్యాలయం ఫిస్క్ ప్రకటన విడుదల చేసింది. కొంతమంది విద్యార్థులను లక్ష్యంగా చేసుకున్న ఈ సందేశాలు తీవ్రంగా కలవరపెడుతున్నాయని తెలిపింది. మిస్సోరీ స్టేట్ వర్సిటీ చాప్టర్‌లో సభ్యులుగా ఉన్న నల్లజాతి విద్యార్థులకు కూడా సందేశాలు వచ్చాయి. వాటిలో ట్రంప్ గెలుపును ప్రస్తావించారు. నల్లజాతి విద్యార్థులను పత్తి ఏరడానికి ఎంపిక చేశారంటూ అందులో పేర్కొన్నారని మిస్సోరి ఎన్‌ఏఏసీపీ అధ్యక్షుడు నిమ్రోద్ చాపెల్ చెప్పారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. ఈ సందేశాల వెనుక ఎవరున్నారో ఇంకా తెలియలేదని లాయర్స్ కమిటీ ఫర్ సివిల్ రైట్స్ అండర్ లా డిజిటల్ జస్టిస్ ఇనిషియేటివ్ డైరెక్టర్ డేవిడ్ బ్రాడీ తెలిపారు. మేరీలాండ్, ఓక్లహామా వంటి 10కి పైగా రాష్ట్రాలతో పాటు డీసీలోనూ ఇలాంటి ఈ ఉదంతాలు చోటుచేసుకున్నట్టు అంచనా వేశారు. దీనిపై తమ ఇంటెలిజెన్స్ విభాగం దర్యాప్తు చేస్తోందని పోలీసులు తెలిపారు. ఈ విద్వేష ఘటనలపై పలు పౌర హక్కుల చట్టాలను వర్తింపజేయవచ్చని బ్రాడీ చెప్పారు. సదరన్ పావర్టీ లా సెంటర్ ప్రెసిడెంట్, సీఈఓ మార్గరెట్ హువాంగ్ సహా పలు ఇతర పౌర హక్కుల సంస్థల నేతలు ఈ సందేశాలను ఖండించారు. ''విద్వేషాలకు అమెరికాలో స్థానం లేదు. 2024లోనూ బానిసత్వ ప్రస్తావనలు తీవ్రంగా కలవరపరుస్తున్నాయి. నల్లజాతి అమెరికన్ల జీవితాలు ప్రమాదంలో పడ్డాయి''అని ఎన్‌ఏఏసీపీ అధ్యక్షుడు, సీఈఓ డెరిక్ జాన్సన్ ఆందోళన వెలిబుచ్చారు.

నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా

ప్రధాని మోదీకి కర్ణాటక సీఎం సిద్ధరామయ్య సవాల్

హావేరి: ఎన్నికలు జరిగే రాష్ట్రాల కోసం కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం రూ.700 కోట్లు వసూలు చేసిందంటూ తనపై చేసిన ఆరోపణలను ప్రధాని మోదీ రుజువు చేయాలని ఆ రాష్ట్ర సీఎం సిద్ధరామయ్య సవాల్ విసిరారు. నిరూపించిన పక్షంలో రాజకీయాలకు గుడ్‌బై చెబుతానన్నారు. అబద్ధమని తేలితే ప్రధాని పదవికి రాజీనామా చేస్తారా అంటూ మోదీని నిలదీశారు. మహారాష్ట్రలోని అకోలా జిల్లాలో ఆదివారం రాత్రి జరిగిన ఎన్నికల ర్యాలీలో సిద్ధ రామయ్య ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన..మహారాష్ట్ర, జార్ఖండ్‌తోపాటు ఉప ఎన్నికలు జరిగే రాష్ట్రాల కోసం కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం మద్యం శాఖ ద్వారా రూ.700 కోట్లు వసూలు చేసిందంటూ ఇటీవల మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ ఆరోపణలు చేశారంటూ పై సవాల్ చేశారు. సాక్షాత్తూ దేశ ప్రధానే ఇలా అసత్యాలు మాట్లాడటం చూసి ఆశ్చర్యమేస్తోందన్నారు.

బెంగాల్ బీజేపీ చీఫ్‌కి ఈసీ షోకాజ్ నోటీస్

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి, పశ్చిమ బెంగాల్ బీజేపీ అధ్యక్షుడు సుకాంత మజుందార్‌కు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) సోమవారం షోకాజ్ నోటీసిచ్చింది. ఈ నెల 7న పశ్చిమ బెంగాల్‌లో ఉప ఎన్నిక జరుగనున్న తల్డాంగ్రాలో జరిగిన బహిరంగ సభలో సుకాంత మజుందార్ జాతీయ చిహ్నం అశోక స్తంభం, రాష్ట్ర పోలీసులపై ఆరోపణలు చేశారు. టీఎంసీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర పోలీసులు తమ యూనిఫాంపైని అశోక స్తంభాన్ని తీసేసి సీఎం మమత ధరించే స్లిప్పర్లను చిహ్నంగా పెట్టుకోవాలంటూ వ్యాఖ్యానించారు. దీనిపై ఈసీకి అధికార టీఎంసీ ఫిర్యాదు చేసింది. స్పందించిన ఎన్నికల సంఘం సోమవారం రాత్రి 8 గంటలలోగా సమాధానమివ్వాలని సుకాంతను ఆదేశించింది. గడువులోగా స్పందించని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించింది. ఉప ఎన్నికలకు సోమవారంతో ప్రచారం ముగిసింది.

ప్రతిపక్షాలను అణగదొక్కే కుట్ర: ఖర్గే

రాంచీ: విపక్ష ఎమ్మెల్యేలను మేకల మాదిరిగా కొనుగోలు చేసి ప్రతిపక్షాలను అణగదొక్కాలని ప్రధాని మోదీ భావిస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. 'ప్రభుత్వాలను కూలదోయడానికి మోదీ ప్రయత్నిస్తున్నారు. ఆయన ఎమ్మెల్యేలను కొంటారు. మేకల మాదిరిగా మేపి, ఆ తర్వాత వారితో విందు చేసుకుంటారు. ఇదే మోదీ నైజం'అని నిప్పులు చెరిగారు. 'అబద్ధాలు మోదీకి అలవాటు. ఏ ఒక్క హామీనీ నెరవేర్చింది లేదు. సొంత రాష్ట్రం గుజరాత్‌కు స్వర్ణయుగం ఇప్పటి వరకు వచ్చిందా? ముఖ్యమంత్రి, ఆ తర్వాత ప్రధానమంత్రి అయిన మోదీని మనం 25 ఏళ్లుగా భరిస్తున్నాం. మహిళలు, వెనుకబడిన వర్గాల ప్రజలను వేధింపులకు గురిచేసే వారికే ఆయన మద్దతిస్తున్నారు. కల్లోల పరిస్థితులు నెలకొన్న మణిపూర్‌కు ఆయన ఇప్పటి వరకు వెళ్లనేలేదు. చేతనైతే ఆ రాష్ట్రానికి వెళ్లాలని మోదీకి సవాల్ విసరుతున్నా'అనిఖర్గే పేర్కొన్నారు.

భూ బదలాయింపు అడ్డుకుంటాం

జార్ఖండ్ ఎన్నికల ర్యాలీలో హోం మంత్రి అమిత్ షా ప్రకటన

రాంచీ: జార్ఖండ్‌లో బీజేపీకి అధికారమిస్తే గిరిజనుల్ని పెళ్లి చేసుకునే చొరబాటుదార్లకు భూమి బదలాయింపును అడ్డుకుంటుందని హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. చొరబాటుదార్ల పేరుతో ఇప్పటికే భూములుంటే వాటిని స్వాధీనం చేసుకుని, అసలైన గిరిజన కుటుంబాలకే తమ ప్రభుత్వం తిరిగి అందజేస్తుందని హామీ ఇచ్చారు. సెరాయికేలాలో సోమవారం జరిగిన బీజేపీ ఎన్నికల ర్యాలీలో అమిత్ షా మాట్లాడారు. 'జార్ఖండ్‌లో గిరిజన జనాభా తగ్గుముఖం పడుతోంది. చొరబాటుదార్లు వీరి కుమార్తెలను పెళ్లి చేసుకుని భూములను కబ్జా చేస్తున్నారు. గిరిజన మహిళలను పెళ్లి చేసుకునే చొరబాటుదార్లకు భూ బదలాయింపును అడ్డుకునేందుకు చట్టం తీసుకొస్తాం. అటువంటి వారిని గుర్తించి వెళ్లగొట్టి, ఆ భూములను స్వాధీనం చేసుకుంటాం'అని హామీ ఇచ్చారు. గిరిజనుల హక్కులు, చొరబాట్లకు వ్యతిరేకంగా మాట్లాడినందుకే మాజీ సీఎం, జేఎంఎం మాజీ సీనియర్ నేత చంపయ్ సోరెన్‌ను హేమంత్ సోరెన్ ప్రభుత్వం అవమానించిందని, సీఎం పదవి నుంచి దించేసిందని అమిత్ షా ఆరోపించారు.

రాహుల్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు

చర్య తీసుకోవాలంటూ ఈసీకి బీజేపీ ఫిర్యాదు

న్యూఢిల్లీ: మహారాష్ట్ర ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని గురించి తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారని, రాష్ట్రాల మధ్య విభేదాలు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఆరోపించింది. ఆ పార్టీ ప్రతినిధి వర్గం సోమవారం ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో)ని కలిసింది. ఎన్నికల నియమావళిని తీవ్రంగా ఉల్లంఘిస్తున్న రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చీఫ్ ఖర్గేలపై చర్యలు తీసుకోవాలని, వారిపై కేసు నమోదు చేయాలని కోరింది. కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ మీడియాకు ఈ విషయం తెలిపారు. భారత రాజ్యాంగాన్ని బీజేపీ నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోందంటూ ఈ నెల 6న మహారాష్ట్రలో జరిగిన ఎన్నికల ర్యాలీలో రాహుల్ గాంధీ రాజ్యాంగ ప్రతిని చేబూని అసత్యాలు ప్రచారం చేశారన్నారు. అదేవిధంగా, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకిచ్చిన రిజర్వేషన్లను లాగేసుకుని మైనారిటీలకు ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్న బీజేపీ యాడ్, మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలకు సంబంధించిన మరో ఏడు ఫిర్యాదులను సోమవారం ఎన్నికల సంఘానికి అందజేసింది.

మణిపూర్‌లో 11 మంది మిలిటెంట్లు హతం

ఇంఫాల్: మణిపూర్‌లోని జిరిబం జిల్లాలో సోమవారం భద్రతా బలగాలతో జరిగిన హోరాహోరీ పోరులో 11 మంది మిలిటెంట్లు హతమయ్యారు. ఈ సందర్భంగా ఇద్దరు సీఆర్‌పీఎఫ్ జవాన్లు కూడా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. బొరొబెక్రా సబ్ డివిజన్‌లోని జకురడోర్ కరోంగ్ వద్ద మిలిటెంట్లు ఘటన జరిగిందన్నారు. యూనిఫాం ధరించి, అత్యాధునిక ఆయుధాలు ధరించిన మిలిటెంట్లు బొరొబెక్రా పోలీస్‌స్టేషన్‌పైకి, అక్కడే ఉన్న సీఆర్‌పీఎఫ్ క్యాంపుపైకి మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో కాల్పులకు దిగారు. అదే సమయంలో కొందరు మిలిటెంట్లు సమీపంలోని జకురడోర్ కరోంగ్ మార్కెట్‌లోకి చొరబడి కొన్ని దుకాణాలకు నిప్పుపెట్టారు. కొన్ని నివాసాలపై దాడికి దిగారు. వెంటనే స్పందించి భద్రతా బలగాలు కాల్పులకు దిగాయి. రెండు వర్గాల మధ్య గంటపాటు కొనసాగిన ఎన్‌కౌంటర్‌లో 11 మంది మిలిటెంట్లు హతమయ్యారు. పోలీస్ స్టేషన్ ఆవరణలోనే ఉన్న సహాయక శిబిరంలోని ఐదుగురు కనిపించకుండా పోయారు. వీరిని మిలిటెంట్లు ఎత్తుకుపోయారా లేక భయంతో పారిపోయారా అనేది తెలియాల్సి ఉందని అధికారులు వివరించారు.

మద్యం దుకాణాల్లో వయో నిబంధన అమలు

కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీస్

న్యూఢిల్లీ: మద్యం దుకాణాల్లో వయో నిబంధనలు అమలయ్యేలా పకడ్బందీ విధానాన్ని తేవాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం కేంద్ర ప్రభుత్వ స్పందన కోరింది. మద్యం తాగేందుకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అనుమతిస్తున్న వయస్సు 18-25 ఏళ్ల మధ్య ఉందని పిటిషనర్ 'కమ్యూనిటీ ఎగెనెస్ట్ డ్రంకెన్ డ్రైవింగ్'అనే ఎన్‌జీవో తెలిపింది. మద్యం తాగడం, మద్యాన్ని కలిగి ఉండడాన్ని నిషేధిస్తూ రాష్ట్రాలు చట్టాలు చేశాయని వివరించింది. అయితే, వీటిని తు.చ. తప్పక అమలు చేసేందుకు మద్యం దుకాణాలు, బార్లు, పబ్‌ల వద్ద యంత్రాంగమేదీ లేదని పేర్కొంది. అదేవిధంగా, మద్యాన్ని డోర్ డెలివరీ చేయడం వల్ల కూడా చిన్న వయస్సులోనే మద్యానికి బానిసలుగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది. విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం కేంద్రప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

జెట్ ఎయిర్‌వేస్ గోయల్‌కు బెయిల్

ముంబై: కేన్సర్‌తో బాధపడుతున్న జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్(75)కు చికిత్స కోసం బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ ఎన్‌జే జమాదార్ సారథ్యంలో ఏకసభ్య ధర్మాసనం మే 2వ తేదీన గోయల్ కేన్సర్ చికిత్సగాను రెండు నెలల మధ్యంతర బెయిలిచ్చింది. అనంతరం పొడిగిస్తూ వచ్చింది. బెయిల్ పొడిగించాలంటూ అందిన పిటిషన్‌పై సోమవారం విచారించిన ధర్మాసనం మధ్యంతర బెయిల్‌ను శాశ్వత బెయిల్‌గా మార్చుతూ ఆదేశాలిచ్చింది. జెట్ ఎయిర్‌వేస్‌కు కెనరా బ్యాంకు ఇచ్చిన రూ.538 కోట్ల రుణాన్ని సొంతానికి వాడుకున్నారనే ఆరోపణలపై ఈడీ2023లో గోయల్‌ను అరెస్ట్ చేసింది.

పాలిటీ.. పటిష్ట వ్యూహం

సివిల్ సర్వీసెస్ నుంచి రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్లు, ఎస్ఐ ఆఫ్ పోలీస్, జూనియర్ లెక్చరర్స్, డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్ తదితర అన్ని పోటీ పరీక్షలకు అవసరమైనది జనరల్ స్టడీస్. ఇందులో అతి ముఖ్యమైన విభాగం ఇండియన్ పాలిటీ లేదా భారత రాజ్యాంగం, రాజకీయ వ్యవస్థ. పరీక్ష ప్రాముఖ్యతను బట్టి ఈ విభాగం నుంచి వచ్చే ప్రశ్నల సంఖ్య మారుతూ ఉంటుంది.సాధారణంగా 25 నుంచి 30 ప్రశ్నలు రావచ్చు. ఈ నేపథ్యంలో.. టీఎస్‌పీఎస్సీ, ఏపీపీఎస్సీ గ్రూప్1, గ్రూప్ 2 వంటి పోటీ పరీక్షల్లో పాలిటీ ప్రాధాన్యత, అనుసరించాల్సిన ప్రిపరేషన్ వ్యూహంపై విశ్లేషణ...



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

గ్రూప్-2 పరీక్షల్లో ప్రత్యేకమైన సిలబస్ నిర్దేశించడం వలన ప్రశ్నల సంఖ్య 75 వరకు ఉంటుంది. అభ్యర్థులు సిలబస్ పరిధిని, ప్రశ్నల స్థాయిని, సరళిని గమనించి సిద్ధమైతే.. ఈ విభాగంలో గరిష్ట మార్కులు సాధించవచ్చు. జనరల్ స్టడీస్‌లో ఇండియన్ పాలిటీ విభాగానికి ఎంతో ప్రత్యేకత ఉంది. సిలబస్ నిర్దేశించినప్పటికీ.. రాజకీయ, రాజ్యాంగ గతి విధినాలు నిరంతరం మారుతూ విస్తృతమవడం వల్ల ప్రతిసారి తాజా సమాచారాన్ని సేకరించుకోవలసిన ఆవశ్యకత ఏర్పడుతుంది. ప్రతి సమకాలీన రాజకీయ పరిణామం రాజ్యాంగంపై ప్రభావం చూపుతుంది. కాబట్టి అభ్యర్థులు జాగ్రత్తగా ఆ పోకడలను గమనించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి.

నిర్దేశిత సిలబస్

- ఇండియన్ పాలిటీలో సాధారణంగా ఈ కింది అంశాలను పొందుపరుస్తారు. రాజ్యాంగ చరిత్ర, రచన, రాజ్యాంగ ఆధారాలు, పీఠిక,పౌరసత్వం, ప్రాథమిక హక్కులు, నిర్దేశిక సూత్రాలు, రాష్ట్రపతి, ప్రధానమంత్రి, మంత్రి మండలి, పార్లమెంటు నిర్మాణం, బిల్లుల రకాలు, శాసన నిర్మాణ ప్రక్రియ, పార్లమెంటు కమిటీలు, న్యాయవ్యవస్థ -సుప్రీంకోర్టు, హైకోర్టు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, గవర్నర్, ముఖ్యమంత్రి, స్థానిక సంస్థలు -పంచాయతీ వ్యవస్థ, రాజ్యాంగ సంస్థలు, సంక్షేమ యంత్రాంగం, గవర్నెన్స్, రాజ్యాంగ సవరణ పద్ధతి మొదలగు అంశాలు ఉన్నాయి.

పరిపాలన-తాజా పరిణామాలు

పైన పేర్కొన్న అంశాలతో పాటు ప్రపంచీకరణ, ఆర్థిక సరళీకరణ నేపథ్యంలో రాజ్య విధులు, అధికారాలలో గుణాత్మకమైన మార్పులు వచ్చాయి. ముఖ్యంగా పరిపాలన-సుపరిపాలన, ఈ-గవర్నెన్స్, హక్కుల సమస్యలు, అణగారిన వర్గాల వికాసం, సంక్షేమ పరిపాలన, అభివృద్ధి పరిపాలన, అంతర్జాతీయ తీవ్రవాదం, పౌరసమాజం, సుప్రీం కోర్టు తాజా తీర్పులు, పరిణామాలను కూడా అభ్యర్థులు అధ్యయనం చేయాలి.

ప్రశ్నల స్థాయి-సరళి

ప్రస్తుత పోటీ పరీక్షల్లో చాలా భాగం బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో ఉన్నాయి. ఒక ప్రశ్నకు నాలుగు సమీప సమాధానాలు ఇచ్చి.. వాటిలో సరైనదేదో, సరికానిదేదో గుర్తించమని అడుగుతారు. వీటికి సమాధానాలు గుర్తించాలంటే.. సబ్జెక్టుకు సంబంధించి ప్రాథమిక సమాచారాన్ని చదివి అర్థం చేసుకుని.. దానిపై పట్టు సాధించాలి. ప్రశ్నల స్థాయిని బట్టి విషయాన్ని మరింత విస్తృతంగా చదువుతూ తర్కబద్ధంగా, విశ్లేషణాత్మకంగా,విచక్షణా జ్ఞానంతో అన్వయించడానికి ప్రయత్నం చేయాలి.సాధారణంగా ప్రశ్నల స్థాయిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. అవి..1.జ్ఞానాత్మకమైనవి లేదా పరిజ్ఞానాన్ని పరిశీలించేవి; 2. విషయ అవగాహనకు సంబంధించినవి;3. విషయ అనువర్తనకు సంబంధించినవి.

జ్ఞానాత్మకమైనవి లేదా పరిజ్ఞానాన్ని పరిశీలించేవి

ఈ తరహా ప్రశ్నల్లో ప్రధానంగా కంటెంట్‌కు సంబంధించి అభ్యర్థి జ్ఞాపక శక్తిని గుర్తించే పరిజ్ఞానాన్ని పరిశీలిస్తారు. ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలను గుర్తించాలంటే.. విస్తృతమైన పఠనంతోపాటు పదే పదే పునశ్చరణ చేయాల్సి ఉంటుది. ఈ తరహా ప్రశ్నల సంఖ్య పరీక్ష స్థాయిని బట్టి మారుతూ ఉంటుంది. ఒక మేరకు తయారైన అభ్యర్థులు అందరూ ఇలాంటి సమాధానాలు గుర్తిస్తారు. ఉదాహరణకు ప్రశ్నలు.

- **ఒక రాష్ట్రంలో పంచాయితీ లేదా మున్సిపాలిటీల సంఖ్యను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది? (ఎ)**
  ఎ. రాష్ట్ర ప్రభుత్వం; బి.కేంద్ర ప్రభుత్వం; సి. జిల్లా కలెక్టర్; డి. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి.

వివరణ: పై ప్రశ్నకు సమాధానం గుర్తించడం తేలిక. ఇందులో ఎలాంటి అవగాహన తర్కం ఉపయోగించాల్సిన అవసరం ఉండదు. చదివిన అంశాన్ని గుర్తుంచుకుంటే చాలు.అయితే కొన్ని ప్రశ్నలు సమాచారానికి సంబంధించినవి అయినా రేర్ లేదా రిమోట్ అంశానికి సంబంధించినవి అయితే కొంత ఇబ్బంది ఉంటుంది. ఉదాహరణకు..

- **ఈ క్రింది పేర్కొన్న ఏ రాజ్యాంగ నిపుణుడు బర్మా(మయన్మార్) రాజ్యాంగ రచనల్లో కూడా పాల్గొన్నారు? (బి)**
  ఎ.డా.బి.ఆర్.అంబేద్కర్; బి.డా.బి.ఎస్.రావు; సి.పొ.కె.టి.షా; డి.అల్లాడి కృష్ణస్వామి అయ్యర్.

వివరణ: అన్ని పేర్లూ అభ్యర్థికి తెలిసినవే. కానీ ఆ వ్యక్తులకు సంబంధించి లోతైన అంశం కనుక సాధారణంగా చదివి ఉండరు. ఇలాంటి ప్రశ్నలు విస్తృత పఠనంతో తెలుస్తాయి.

విషయ అవగాహనకు సంబంధించినవి

- కొన్ని ప్రశ్నల ద్వారా అభ్యర్థి అవగాహనను, తెలివితేటలను పరిశీలిస్తారు. అవగాహన, తెలివితేటలు అనేవి నిరంతర సాధన ద్వారా సాధ్యం అవుతాయి.
- ఈ కింది పేర్కొన్న వారిలో ఎవరు అత్యధిక ఎన్నికల్లో ఓటర్లుగా ఉంటారు? (బి)
  ఎ. పార్లమెంటు సభ్యులు; బి.రాష్ట్ర విధాన సభ సభ్యులు; సి.విధాన పరిషత్ సభ్యులు; డి. సాధారణ ఓటరు

వివరణ:పై ప్రశ్నకు సమాధానం గుర్తించాలంటే.. ఇచ్చిన నాలుగు ఐచ్చికాలలో ఒకదానికొకటి ఉన్న సంబంధం, వాటి విస్తృతిపై సమగ్ర అవగాహన ఉండాలి. ఎవరెవరు ఏ ఎన్నికల్లో ఓటర్లుగా ఉంటారో విశ్లేషించుకోవాలి. వెంటనే సమాధానాన్ని గుర్తించడం సాధ్యం కాదు. రాష్ట్ర విధాన సభ సభ్యులు రాష్ట్రపతి, రాజ్యసభ, రాష్ట్ర విధాన పరిషత్ సభ్యులను ఎన్నుకోవడమే కాకుండా.. సాధారణ ఓటరుగా లోక్‌సభ, విధాన సభ.. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఓటర్లుగా ఉంటారు. విషయ అనువర్తనకు సంబంధించినది ఈ తరహా ప్రశ్నల్లో అభ్యర్థి అసాధారణ తెలివితేటలు ప్రదర్శించాలి. లోతుగా ఆలోచించాలి. సహజ ప్రతిభ, విచక్షణా శక్తి ఉపయోగించాలి. సమాచారం, అవగాహన ఉంటే సరిపోదు.

- **ద్రవ్య బిల్లుపై రాజ్యసభకు ఉన్న అధికారాలు(డి)**
  1. వాయిదా వేసే అధికారం; 2. సవరించే అధికారం; 3. సిఫార్సులు చేసే అధికారం; 4. ఓటు చేసే అధికారం.
  ఎ. పైవన్నీ సరైనవే; బి. 1, 2, 3 మాత్రమే సరైనవి; సి. 3,4 మాత్రమే సరైనవి; డి. 1,3 మాత్రమే సరైనవి

వివరణ: రాజ్యసభకు ద్రవ్య బిల్లుపై ఎలాంటి అధికారం ఉంటుందో సమగ్రమైన అవగాహన ఉండాలి. అవగాహనతోపాటు ఇచ్చిన ఐచ్ఛిక అంశాల్లో సందర్భాన్ని బట్టి సరిపోయే అంశాలనే గుర్తించగలగాలి. ఇందుకు అభ్యర్థి స్వతహాగా విచక్షణతో నిర్ణయం తీసుకునే శక్తిని కలిగి ఉండాలి.

- రాజ్యసభ ద్రవ్యబిల్లును 14రోజుల వరకు వాయిదా వేయవచ్చు. సిఫార్సులు చేయవచ్చు. కానీ సవరించే అధికారం, ఓటు చేసే అధికారం ఉండదు.
- **రాజ్యాంగంలో వితరణశీల న్యాయాన్ని పెంపొందించే ఆదేశిక నియమాలు?(బి)**
  ఎ. ప్రకరణ 39 ఎ-బి బి. ప్రకరణ 39 బి-సి
  సి. ప్రకరణ 39 సి-డి డి. ప్రకరణ 39 డి-ఇ
- **హిజాబ్ వివాదంపై ఇటీవల తీర్పు వెలువరించిన హైకోర్టు?(ఎ)**
  ఎ. కర్ణాటక; బి. గుజరాత్;
  సి. ఉత్తరప్రదేశ్; డి. తమిళనాడు

సిలబస్‌లోని అంశాల వారీగా విశ్లేషణ

- రాజ్యాంగ రచన ముఖ్య లక్షణాల విభాగంలో ప్రధానంగా ప్రశ్నలు సమాచారానికి సంబంధించి ఉంటాయి. సమావేశాలు, సంబంధిత తేదీలు, కమిటీలు, చైర్మన్లు, తీర్మానాలు వాటిపై నేరుగా ప్రశ్నలు వస్తాయి.
- ప్రవేశిక రాజ్యాంగ తత్వం అనే విభాగంలో ప్రశ్నలు.. ప్రవేశిక లక్ష్యాలు, ఆదేశాలు, వాటి అనువర్తనకు సంబంధించి ఉంటాయి. సుప్రీంకోర్టు తీర్పును కూడా గుర్తించుకోవాల్సి ఉంటుంది.
- ప్రాథమిక హక్కులు,నిర్దేశిక నియమాల పై వచ్చే ప్రతి ప్రశ్న ప్రకరణకు సంబంధించి ఉంటాయి. కాబట్టి ప్రకరణలపై ప్రత్యేక దృష్టిపెట్టాలి.
- ప్రాథమిక హక్కులు, విస్తృతి, సుప్రీంకోర్టు తీర్పులు, తాజా పరిణామాలు, ప్రాథమిక హక్కులకు నిర్దేశిక నియమాలకు మధ్య వివాదాలు, అందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణలను ప్రత్యేకంగా అధ్యయనం చేయాలి.
- కేంద్ర ప్రభుత్వంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రి, మంత్రిమండలి విభాగంలో.. ఎన్నిక, ఎంపిక ప్రక్రియ, అర్హతలు, అధికార విధులు, వివిధ స్థాయిల్లో వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవాలి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధానమంత్రికి సంబంధించి జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి అదనపు సమాచారాన్ని సేకరించుకోవాలి. ఉదాహరణకు..
- ఎంతమంది ముఖ్యమంత్రులు రాష్ట్రపతుల య్యారు?
- అవిశ్వాస తీర్మానాన్ని అత్యధికంగా ఎదుర్కొన్న ప్రధాని ఎవరు?
- కేంద్రంలో ఏ పదవి చేపట్టకుండా ప్రధాని అయినది ఎవరు? మొదలైన అంశాలతో కూడిన విశ్లేషణ సమాచారాన్ని సేకరించుకోవాలి.
- కేంద్ర శాసన సభ పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ నిర్మాణం విభాగంలో.. ఎన్నిక, అనర్హతలు, వివాదాలు, బిల్లులు రకాలు, పార్లమెంటు కమిటీలు, పార్లమెంటు శాసనసభకు మధ్య పోలికలు, తేడాలు మొదలైన అంశాలను బాగా చదవాలి.
- భారత న్యాయ వ్యవస్థ, సుప్రీంకోర్టు, హైకోర్టు విభాగంలో.. నిర్మాణం, నియామకం, అధికార విధులు, తాజా పరిణామాలు, జాతీయ న్యాయ నియమకాల కమిషన్, సుప్రీంకోర్టు తాజా తీర్పులు మొదలైన అంశాలను విస్తృతంగా అధ్యయనం చేయాలి.
- భారత సమాఖ్య వ్యవస్థ, కేంద్ర రాష్ట్ర సంబంధాలు విభాగంలో.. ఆర్థిక వనరుల విభజన, ముఖ్య ప్రకరణలు, కేంద్ర రాష్ట్ర సంబంధాల సమీక్షకు నియమించిన కమీషన్లు, వాటి సిఫార్సులు అధ్యయనం చేయాలి.
- నూతన పంచాయతీ వ్యవస్థ.. 73వ, 74వ రాజ్యాంగ సవరణ ప్రత్యేకతలు, ప్రజాస్వామ్య వికేంద్రీకరణ, స్థానిక సంస్థల పనితీరును, వాటి పరిమితులను సమగ్రంగా తెలుసుకోవాలి.
- రాజ్యాంగ సంస్థలు, చట్టపర సంస్థలు, రాజ్యాంగేతర, చట్టేతర సంస్థల గురించి విస్తృతమైన అధ్యయనం చేయాలి. వీటి నిర్మాణం, నియామకంపై సమాచార సంబంధమైన ప్రశ్నలు ఎక్కువగా ఉంటాయి.

ప్రతి అంశం సమకాలీనమే

రాజ్యాంగంలోని మూల సూత్రాలు, వివిధ వ్యవస్థలు, సమకాలీన రాజకీయాల వల్ల ప్రభావితం అవుతాయి. రాజ్యాంగ స్ఫూర్తికి, వాస్తవికతకూ గుణాత్మక తేడా ఉంటోంది. తాజా పరిణామాలు, సర్వోన్నత న్యాయస్థాన తీర్పులు, వ్యాఖ్యానాలు, సవరణలు మొదలైన అంశాలను జోడించి పాలిటీని చదవాలి. ఉదాహరణకు, తాజా వివాదాలు.. హిజాబ్ వివాదం, వాక్ స్వాతంత్ర్యం, పార్లమెంటు సభ్యుల స్వాధికారాలు, అనుచిత ప్రవర్తన, సస్పెన్షన్, ఆంగ్లో ఇండియన్స్ నామినేషన్స్ ఉపసంహరణ, రాష్ట్ర విధాన మండలి పునరుద్ధరణ, అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ మీడియేషన్ సెంటర్, రాష్ట్ర రాజధానుల మార్పు, న్యాయ శాఖ క్రియాశీలత వివాదాలు, వివాహ వయస్సు పెంపు ప్రతిపాదన, స్థానిక సంస్థల నిర్బంధ ఓటింగ్, ప్రకరణ 370, జమ్మూ కాశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు, గ్రీన్ ట్రిబ్యునల్స్, లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థ, ఉమ్మడి పౌర నియమావళి, మత ప్రార్థనా స్థలాల్లోకి మహిళల ప్రవేశం మొదలైన పరిణామాలపై అభ్యర్థులు అవగాహన పెంచుకోవాలి. పోటీ పరీక్షలకు విస్తృత స్థాయిలో చదవాల్సి ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు జాగ్రత్తగా పుస్తకాలను ఎంపికచేసుకోవాలి. అలాగే రీడింగ్‌కు, రిఫరెన్స్‌కు మధ్య ఉన్న తేడాను గమనించాలి. ప్రాథమిక సమాచారం కోసం ఒకటి లేదా రెండు పుస్తకాలు చదివితే(రీడింగ్) సరిపోతుంది. విస్తృత అధ్యయనం కోసం ప్రామాణిక పుస్తకాలను ఎంచుకోవాలి.

గణిత పరిభాషలో బాయిల్ నియమం?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

ఫిజికల్ సైన్స్

ప్రాక్టీస్ టెస్ట్

1. ఒకే ప్రమాణం గల భౌతిక రాశుల జంట?
   1) ద్రవ్యరాశి, బరువు 2) పని, శక్తి
   3) వేగం, త్వరణం 4) ఒత్తిడి, పీడనం
2. ప్రయోగశాలలో వాడే మీటర్ స్కేలు కనీస కొలత?
   1) 1 సెం.మీ 2) 1 మీటరు
   3) 10 సెం.మీ 4) 1 మి.మీ
3. భూమికి, సూర్యుడికి మధ్య దూరం ఒక?
   1) పార్‌సెక్ 2) ఆంగ్‌స్ట్రామ్ యూనిట్
   3)ఖగోళ ప్రమాణం 4) కాంతి సంవత్సరం
4. వాతావరణంలోని గాలిలో నైట్రోజన్ శాతం (దాదాపుగా)?
   1) 21 2) 54 3) 92 4) 78
5. తుపాను రాకను భారమితి (పాదరస) ఏ విధంగా సూచిస్తుంది?
   1) పాదరస స్తంభం ఎత్తు నెమ్మదిగా తగ్గిపోతుంది
   2) పాదరస స్తంభం ఎత్తు మారదు
   3) పాదరస స్తంభం ఎత్తు అకస్మాత్తుగా పడిపోతుంది
   4) పాదరస స్తంభం ఎత్తు మొదట నెమ్మదిగా తగ్గి అకస్మాత్తుగా పెరుగుతుంది
6. భూమి వయసును నిర్ణయించేందుకు భూగర్భ శాస్త్రవేత్తలు ఉపయోగించే శాస్త్ర పద్ధతి?
   1) రేడియోగ్రఫీ
   2) రేడియో యాక్టివ్ డేటింగ్
   3) సోనోగ్రఫీ
   4) రేడియో ధార్మిక సంలీనం
7. అన్ని సందర్భాల్లోనూ మిథ్యా, నిట్టనిలువు ప్రతిబింబాలను ఏర్పరిచే జత?
   1) పుటాకార కటకం, కుంభాకార దర్పణం
   2) కుంభాకార కటకం, కుంభాకార దర్పణం
   3) పుటాకార కటకం, పుటాకార దర్పణం
   4) కుంభాకార కటకం, పుటాకార దర్పణం
8. తెల్లని కాంతి.. పట్టకం ద్వారా ప్రయాణించినప్పుడు అది ఏ ప్రక్రియకు లోనవుతుంది?
   1) వక్రీభవనం 2) ధ్రువణం, వివర్తనం
   3) వ్యతికరణం, వక్రీభవనం
   4) వక్రీభవనం, నిక్షేపణం
9. కణాల బ్రౌనియన్ చలనాన్ని పరిశీలించడానికి ఉపయోగించే విద్యుదయస్కాంత ఉద్గారం?
   1) మైక్రోతరంగాలు 2) x- కిరణాలు
   3) లేజర్ 4) ధ్వని తరంగాలు
10. అనునాదం చెందే గాలి స్థంభం ప్రయోగం లో 412 Hz శ్రుతి దండాన్ని ఉపయోగించారు. ఈ ప్రయోగంలో మొదటి అను నాదం 20 సెం.మీల వద్ద, రెండో అను వాదం 60 సెం.మీ వద్ద ఏర్పడింది. గాలిలో ధ్వని వేగం ఎంత?
    1) 229.6 మీ/సె 2) 329.6 సెం.మీ/సె
    3) 329.6 మీ/సె 4) 239.6 మీ/సె
11. గాలి పీడనం, సాంద్రతలు వరుసగా p, ρ కి రెండు విశిష్టోష్ణాల నిష్పత్తి γ అయితే గాలి లో ధ్వని వేగం ఎంత?
    1) $V=\sqrt{\frac{\rho}{\gamma p}}$ 2) $V=\sqrt{\frac{\rho p}{\gamma}}$
    3) $V=\sqrt{\frac{\gamma p}{\rho}}$ 4) $V=\sqrt{\frac{p}{\rho}}$
12. వాయువు ఉష్ణోగ్రత పెరిగితే ధ్వని వేగం?
    1) శూన్యమవుతుంది 2) తగ్గుతుంది
    3) పెరగదు 4) పెరుగుతుంది
13. ప్రమాణ ద్రవ్యరాశి ఉన్న ఒక ఇంధనం సంపూర్ణంగా మండి విడుదల చేసే ఉష్ణశక్తి?
    1) ఉష్ణ దక్షత 2) విశిష్టోష్ణం
    3) గుప్తోష్ణం 4) కెలోరిఫిక్ విలువ
14. ఉష్ణ యాంత్రిక తుల్యాంకం విలువ?
    1) 4.18 J/Cal 2) 418 J/Cal
    3) 0.418 J/Cal 4) 41.8 J/Cal
15. ఒక ద్రవం ఉష్ణోగ్రత 105° F. సెల్సియస్ ఉష్ణోగ్రతామానంలో ఆ విలువ?
    1) 38° C 2) 42° C
    3) 40.5° C 4) 98.4° C
16. స్వేచ్ఛా పతన వస్తువు ఒకటి, రెండు, మూడు సెకనుల కాలంలో ప్రయాణించిన దూరాల నిష్పత్తి?
    1) 1:2:3 2) 1:3:5
    3) 1:9:25 4) 1:4:9
17. 100 గ్రాముల బరువున్న బుల్లెట్ 100 m/s వేగంతో పేల్చిన దాని గతిజ శక్తి విలువ జౌల్‌లలో?
    1) 200 2) 500 3) 100 4) 400
18. ఒక సెకండ్ల లోలకం పొడవు 100 సెం.మీ. దాని పొడవును మార్చితే డోలనా వర్తన కాలం 1 సెకను. అయితే ఇప్పుడు లోలకం పొడవు ఎంత?
    1) 25 సెం.మీ 2) 200 సెం.మీ
    3) 50 సెం.మీ 4) 400 సెం.మీ
19. నిశ్చల స్థితి నుంచి బయలుదేరిన వస్తువు 2 సెకనుల్లో 10 మీ. స్థానభ్రంశం చెందితే దాని త్వరణం?
    1) 0.5 మీ/సె^{2} 2) 5 మీ/సె^{2}
    3) 50 మీ/సె^{2} 4) 10 మీ/సె^{2}
20. అయస్కాంత ససెప్టిబిలిటీ (Ψ)కి ప్రమాణం ఏది?
    1) wb/m^2 2) A/m
    3) A-m 4) ప్రమాణాలు లేవు
21. పారా అయస్కాంత పదార్థాల గురించి సరికానిది?
    1) అయస్కాంత క్షేత్రంలో స్వేచ్ఛగా వేలాడదీస్తే, అవి క్షేత్ర దిశకు సమాంతరంగా నిశ్చల స్థితికి వస్తాయి
    2) పారా అయస్కాంత పదార్థాల ససెప్టిబిలిటి తక్కువ, రుణాత్మకం.
    3) పారా అయస్కాంతత్వం ఉష్ణోగ్రత పై ఆధారపడి ఉంటుంది.
    4) పారా అయస్కాంత పదార్థాలు అయస్కాంతంతో బలహీనంగా ఆకర్షితమవుతాయి.
22. వాహకంలో ప్రవహించే విద్యుత్ వల్ల ఏర్పడే అయస్కాంత క్షేత్రంలో అయస్కాంత సూచీ అపవర్తన దిశను తెలియజేసే నిబంధన?
    1) ఆంపియర్ నిబంధన
    2) ఆయిర్ స్టెడ్ ప్రయోగం
    3) ఆంపియర్ కుడి చేతి నిబంధన
    4) ఫ్లెమింగ్ ఎడమ చేతి నిబంధన
23. విద్యుత్ వలయంలో ఎలక్ట్రిక్ ఫ్యూజ్‌లో రక్షక తీగగా ఉపయోగించే తీగ పదార్థ లక్షణం?
    1) ద్రవీభవన స్థానం ఎక్కువ
    2) ద్రవీభవన స్థానం తక్కువ
    3) మంచి విద్యుత్ బంధకం
    4) విశిష్టోష్ణం తక్కువ
24. వోల్టేజి (V) – విద్యుత్ ప్రవాహం (I) ల మధ్య గీసిన గ్రాఫ్ వాలు తెలియజేసేది?
    1) నిరోధం 2) విశిష్ట నిరోధం
    3) వాహకత్వం 4) వాహకత
25. విద్యుదయస్కాంతాలు తయారు చేయడానికి ఉపయోగించే పదార్థం?
    1) ఉక్కు 2) నికెల్
    3) కోబాల్ట్ 4) మెత్తని ఇనుము
26. ఒక ట్రాన్స్‌ఫార్మర్‌లో ప్రధాన వేష్టణంలోని చుట్ల సంఖ్య 20. ఓల్టేజీ 40 V, ఓల్టేజీ 240 Vలకు పెంచగా గౌణ వేష్టణంలో ఉండాల్సిన చుట్ల సంఖ్య?
    1) 20 2) 120 3) 60 4) 40
27. విద్యుత్ మోటార్‌లో ఏం జరుగుతుంది?
    1) విద్యుచ్ఛక్తి యాంత్రిక శక్తిగా మారుతుంది.
    2) యాంత్రిక శక్తి విద్యుచ్ఛక్తిగా మారుతుంది.
    3) అయస్కాంత శక్తి విద్యుచ్ఛక్తిగా మారుతుంది.
    4) యాంత్రిక శక్తి అయస్కాంత శక్తిగా మారుతుంది.
28. పరమాణువులోని ప్రోటానుల సంఖ్య **Z**, న్యూట్రానుల సంఖ్య **N**, పరమాణు ద్రవ్య రాశి సంఖ్య **A**?
    1) A + N = Z 2) A = Z + N
    3) A + Z = N 4) A = Z – N
29. పరమాణువులో రుణావేశమున్న ఎలక్ట్రానులు పుచ్చకాయలోని గింజల మాదిరిగా ఉంటాయన్న నమూనా ఏది?
    1) రూథర్‌ఫర్డ్ నమూనా
    2) థామ్సన్ నమూనా
    3) లీనార్డ్ నమూనా
    4) బోర్ నమూనా
30. 1amuకు సమానమైన ద్రవ్యరాశి?
    1) 1.66×10^{-24} kg 2) 1.66×10^{-24} g
    3) 1.66×10^{-24} mg 4) 1.66×10^{-24} μg
31. $^{238}_{92}U \rightarrow \ldots\ldots\ldots + ^{4}_{2}He$ (α– క్షయం)
    (మాతృ కేంద్రకం) (పుత్రికా కేంద్రకం)
    1) $^{234}_{91}Pa$ 2) $^{234}_{90}Th$
    3) $^{234}_{90}Ra$ 4) $^{234}_{90}Po$
32. 'థోరియం శ్రేణి'ని ఏ విధంగా సూచిస్తారు?
    1) (4n+3) 2) (4n+2)
    3) 4n 4) (4n+1)
33. అస్థిరమైన పరమాణువు నుంచి γ-కిరణం ఉద్గారమైనప్పుడు దానిలో మార్పు?
    1) Z పెరుగుతుంది 2) Z తగ్గుతుంది
    3) A పెరుగుతుంది 4) Z, A మారవు
34. పోత పోసిన పదార్థాల్లోని లోపాలను తెలుసుకోవడానికి ఉపయోగించే ఐసోటోప్?
    1) $^{60}_{27}Co$ 2) $^{131}_{53}I$
    3) $^{24}_{11}Na$ 4) $^{234}_{90}Th$
35. ప్రతి యురేనియం కేంద్రక విచ్ఛిత్తిలో సరాసరి విడుదలయ్యే శక్తి?
    1) 27.2 Mev 2) 200 ev
    3) 200 J 4) 200 Mev
36. అర్ధ వాహకం ఉష్ణోగ్రతను పెంచితే దాని వాహకత్వం?
    1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
    3) స్థిరంగా ఉంటుంది
    4) మొదట పెరిగి తర్వాత తగ్గుతుంది
37. కేథోడ్ కిరణాలకు ప్రతి దీప్తిని కలుగజేసే ధర్మం ఉంటుంది. ఈ కిరణాలు జింక్ సల్ఫైడ్ వంటి పదార్థం పై పడినప్పుడు ఏ రంగు దృశ్య కాంతిని గమనిస్తాం?
    1) ఎరుపు 2) ఊదా
    3) ఆకుపచ్చ 4) ముదురు ఎరుపు
38. కస్టమ్స్ శాఖ వారు దొంగ రవాణా చేసే వస్తువులను తెలుసుకోవడానికి ఏ కిరణాలను ఉపయోగిస్తారు?
    1) γ- కిరణాలు 2) x- కిరణాలు
    3) అతినీలలోహిత కిరణాలు
    4) పరారుణ కిరణాలు
39. కంప్యూటర్‌లో ఉన్నత స్థాయి భాషను యంత్ర భాషగా మార్చేందుకు ఉపయోగించే ప్రోగ్రాం ?
    1) Cobal 2) Fortraw
    3) Compiler 4) Assembler
40. కిందివాటిలో దేనితో మాదీకరణం చేయడం వల్ల ఒక స్వభావజ అర్ధ వాహకం p – రకం అర్ధ వాహకంగా మారుతుంది?
    1) గాలియం (Ga) 2) ఆర్సెనిక్ (As)
    3) ఆంటిమొని (Sb) 4) బిస్మత్ (Bi)
41. STP వద్ద ఉన్న వాయువు ఘనపరిమాణం ఒకటిన్నర రెట్లు చేస్తే ఉష్ణోగ్రతలో మార్పు (°Cలలో) ?
    1) 136.5 2) -136.5
    3) 273 4) -153
42. గణిత పరిభాషలో బాయిల్ నియమం?
    1) సముద్ర మట్టం వద్ద V ∝ P
    2) స్థిర ఘన పరిమాణం వద్ద P ∝ 1/T
    3) స్థిర ఘన పరిమాణం వద్ద P ∝ T
    4) స్థిర ఉష్ణోగ్రత వద్ద V ∝ 1/P
43. మానో మీటరును వేటిని కొలవడానికి ఉపయోగిస్తారు?
    1) వాయువులు కలుగజేసే పీడనాన్ని
    2) వాయువుల ఉద్దీపనాన్ని
    3) వాయువుల వ్యాపనాన్ని
    4) వాయువుల సంకోచాన్ని
44. ప్రధాన క్వాంటం సంఖ్య (n) కక్ష్యా పరిమాణాన్ని లేదా ప్రధాన శక్తి స్థాయిని సూచిస్తుంది. n విలువ పెరిగే కొద్దీ ఎలక్ట్రాన్ శక్తి మొత్తం?
    1) స్థిరం 2) పెరుగుతుంది
    3) తగ్గుతుంది
    4) ఒక్కొక్క పరమాణువు ఒక్కో విధంగా ఉంటుంది
45. మానవుడి చెవి వినగలిగే ధ్వని తీవ్రత అవధి ఎంత?
    1) 50-90 dB 2) 90-140 dB
    3) 60-80 dB 4) 65-75 dB
46. డిబ్రోగ్లీ తరంగదైర్ఘ్యం 1A° కలిగిన కణం ద్రవ్యవేగాన్ని గణిస్తే దాని విలువ (**h=6.6 ×10^{-34} J-s**)?
    1) 6.6 ×10^{-34} kg ms^{-1}
    2) 6.6 ×10^{-24} kg ms^{-1}
    3) 6.6 ×10^{-14} kg ms^{-1}
    4) 6.6 ×10^{-44} kg ms^{-1}
47. ఒక కణం స్థానంలో అనిశ్చితత్వం 10^{-10} m, దాని వేగంతో అనిశ్చితత్వం 5.25×10^{-24} ms^{-1} అయితే ఆ కణం ద్రవ్యరాశిని లెక్కించండి (**h = 6.6×10^{-34} J-s**)?
    1) 1000 g 2) 200 g
    3) 100 g 4) 10 g
48. కిందివాటిలో ఏ పరమాణు సంఖ్య గల మూలకాలు 's' బ్లాక్ మూలకాలు?
    1) 11, 13 2) 1, 17
    3) 20, 31 4) 11, 20
49. Na^+, F^-, O^{2-}, Mg^{2+} (అయాన్‌ల) వ్యాసార్థాల అవరోహణ క్రమాన్ని ఏ విధంగా సూచించవచ్చు?
    1) $Mg^{2+} > Na^+ > F^- > O^{2-}$
    2) $O^{2-} > F^- > Na^+ > Mg^{2+}$
    3) $Mg^{2+} > F^- > Na^+ > O^{2-}$
    4) $O^{2-} > F^- > Mg^{2+} > Na^+$
50. ఎప్సం లవణం ఫార్ములా?
    1) $MgSO_4.7H_2O$
    2) $MgCO_4.7H_2O$
    3) $MgCO_2$ $7H_2O$
    4) $MgSO_2.7H_2O$
51. 'లూనార్ కాస్టిక్' అంటే?
    1) $NaNO_3$ 2) KOH
    3) $AgNO_3$ 4) $AuCl_3$
52. 'Li' బున్సెన్ జ్వాలలో ఏ రంగును ప్రదర్శిస్తుంది?
    1) బంగారు పసిమి 2) ఊదా రంగు
    3) ఎరుపు 4) పసుపు
53. ఎప్పుడూ నీటిలో నిల్వ చేసే మూలకం ఏది?
    1) సోడియం 2) ఫాస్ఫరస్
    3) గంధకం 4) బోరాన్
54. ఎంటాసిడ్‌గా ఉపయోగించే పదార్థం?
    1) NaCl 2) HCl
    3) NaOH 4) $Mg(OH)_2$
55. క్షారీకృత పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం రంగును పోగొట్టే సమ్మేళనం?
    1) C_3H_8 2) C_2H_4
    3) CH_4 4) CCl_4
56. బెంజీన్ అణువులో ఉన్న ఆరు కర్బన పరమాణువులు?
    1) ఒకే రకం 2) 2 రకాలు
    3) 3 రకాలు 4) 4 రకాలు
57. దేన్ని ముద్రణ సిరలో ఉపయోగిస్తారు?
    1) CH_4 2) C_2H_6
    3) CH_3NO_2 4) CH_3OH
58. ఉర్ట్ చర్య ఏ లోహం సమక్షంలో జరుగుతుంది?
    1) Na 2) K 3) Ca 4) Be
59. ఒక సమ్మేళనం అనుభావిక ఫార్ములా CH_2O. దాని అణు భారం 90. ఆ సమ్మేళనం అణు ఫార్ములా?
    1) $C_4H_8O_4$ 2) $C_3H_6O_3$
    3) $C_5H_{10}O_5$ 4) $C_2H_4O_2$
60. Cr_2O_3లో క్రోమియం ఆక్సీకరణ సంఖ్య ఎంత?
    1) -3 2) +6 3) +3 4) +7
61. కెక్యులే నిర్మాణాల్లో బెంజీన్‌కి ఎన్ని σ, π బంధాలున్నాయి?
    1) (12σ + 6π) 2) (12σ + 3π)
    3) (6σ + 12π) 4) (6σ + 6π)
62. గ్రాఫైట్ మంచి విద్యుద్వాహకం. దీనికి కారణం ?
    1) స్ఫటికాకృతిని కలిగి ఉండడం.
    2) స్వేచ్ఛగా ఉండే పరమాణువులను కలిగి ఉండడం.
    3) sp^3 సంకరకరణంలో ఉండడం.
    4) స్వేచ్ఛగా ఉండే ఎలక్ట్రాన్‌లను కలిగి ఉండడం.
63. దంతక్షయం ఎప్పుడు జరుగుతుంది?
    1) నోటి pH విలువ 5.5 కంటే ఎక్కువ అయినప్పుడు
    2) నోటి pH విలువ 5.5 కంటే తక్కువ అయినప్పుడు
    3) నోటి pH విలువ 7 అయినప్పుడు
    4) నోటి pH విలువ 4 అయినప్పుడు

సమాధానాలు

1) 2;	2) 4;	3) 3;	4) 4;	5) 3;
6) 2;	7) 1;	8) 4;	9) 3;	10) 3;
11) 3;	12) 4;	13) 4;	14) 1;	15) 3;
16) 2;	17) 2;	18) 1;	19) 2;	20) 4;
21) 2;	22) 1;	23) 2;	24) 3;	25) 4;
26) 2;	27) 1;	28) 2;	29) 2;	30) 2;
31) 2;	32) 3;	33) 4;	34) 1;	35) 4;
36) 1;	37) 3;	38) 2;	39) 3;	40) 1;
41) 1;	42) 4;	43) 1;	44) 2;	45) 2;
46) 1;	47) 3;	48) 4;	49) 2;	50) 1;
51) 3;	52) 3;	53) 2;	54) 4;	55) 2;
56) 1;	57) 1;	58) 1;	59) 2;	60) 3;
61) 2;	62) 4;	63) 2.		

టెలిఫోన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఫిజిక్స్

విద్యుత్

1. ఎలక్ట్రికల్ బల్బుల్లో వాడే వాయువు?
   1) ఆక్సిజన్ 2) నైట్రోజన్
   3) హైడ్రోజన్ 4) కార్బన్ డై ఆక్సైడ్
2. ఎలక్ట్రిక్ బల్బును సీల్ చేయడానికి ఉపయోగించే పదార్థం?
   1) రాగి 2) స్టీల్
   3) ఇత్తడి 4) ప్లాటినం
3. విద్యుత్ తంతువులో ఉపయోగించే మూలకం ఏది?
   1) అల్యూమినియం 2) టంగ్‌స్టన్
   3) రాగి 4) ప్లాటినం
4. 'విద్యుద్విశ్లేష్య సిద్ధాంతాలు' ప్రతిపాదించిన శాస్త్రవేత్త?
   1) న్యూటన్ 2) హెర్ట్జ్
   3) ఫారడే 4) ఐన్‌స్టీన్
5. విద్యుచ్ఛక్తి ఎల్లప్పుడూ ఏ విధంగా ప్రయాణిస్తుంది?
   1) ఎక్కువ సంభావ్యం నుంచి తక్కువ సంభావ్యం ఉన్న వైపు
   2) తక్కువ సంభావ్యం నుంచి ఎక్కువ సంభావ్యం ఉన్న వైపు
   3) పైన పేర్కొన్న రెండు విధాలుగా
   4) పైవేవీ కావు
6. విద్యుత్ బల్బులోని ఫిలమెంట్ అధికంగా వేడెక్కుతుంది. కానీ ఫిలమెంట్‌కు ఆధారంగా ఉండే తీగలు మాత్రం చాలా తక్కువ వేడిగా ఉండటానికి కారణం?
   1) తక్కువ విద్యుత్ ప్రవహించడం
   2) చాలా తక్కువ నిరోధాన్ని కలిగి ఉండటం
   3) అధికంగా కరిగిపోయే స్థితి కలిగి ఉండటం
   4) నల్లని ఇనుముతో తయారు చేయడం వల్ల
7. కింది వాటిలో విద్యుచ్ఛక్తికి ఉత్తమ ఉదాహరణ?
   1) గ్లాస్ 2) ఎబోనైట్
   3) మానవ శరీరం 4) ప్లాస్టిక్
8. కంప్యూటర్‌లో ఉపయోగించే I.C. తయారీలో ఉపయోగించే మూలకం?
   1) సీసం 2) సిలికాన్
   3) క్రోమియం 4) బంగారం
9. విద్యుత్ వలయంలో కెపాసిటర్‌ను ఉపయోగించడానికి కారణం?
   1) ఓల్టేజ్‌ను తగ్గించడం
   2) ఓల్టేజ్‌ను పెంచడం
   3) విద్యుత్‌ను నిల్వ చేయడం
   4) విద్యుత్ ఉత్పత్తి చేయడం
10. రెండు బిందువుల మధ్య పొటెన్షియల్ భేదాన్ని దేనితో కొలుస్తారు?
    1) గాల్వనో మీటర్ 2) ఓల్ట్ మీటర్
    3) అమ్మీటర్ 4) స్పెక్ట్రోమీటర్
11. కృత్రిమంగా తయారు చేసిన ఉపగ్రహంలో విద్యుచ్ఛక్తికి ఆధారం?
    1) డైనమో 2) సౌర విద్యుద్ఘటం
    3) థర్మోపైల్
    4) చిన్న న్యూక్లియర్ రియాక్టర్
12. కింది వాటిలో భారతదేశంలో ఏ శక్తి నుంచి అధిక విద్యుత్ ఉత్పత్తి అవుతుంది?
    1) థర్మల్ శక్తి 2) అణుశక్తి
    3) జలశక్తి 4) సంప్రదాయేతర శక్తి
13. వెలుతురు కోసం ప్రపంచంలో అత్యధికంగా కింది వాటిలో దేన్ని వాడుతున్నారు?
    1) టంగ్‌స్టన్ ఫిలమెంట్ బల్బ్
    2) ఫ్లోరోసెంట్ బల్బ్
    3) కాపర్ ఫిలమెంట్ బల్బ్ 4) ఫ్లడ్ లైట్
14. 60 వాట్‌ల బల్బ్‌లో ఉండే తీగకు ఎక్కువగా ఉపయోగించే లోహం?
    1) అల్యూమినియం 2) టైటానియం
    3) టంగ్‌స్టన్ 4) నికెల్
15. 'డైనమో'ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) ఎల్. స్టీఫెన్‌సన్ 2) జెడ్. జాన్సన్
    3) ఆర్. డీజిల్ 4) ఫారడే
16. విద్యుత్ ప్రవాహాన్ని ఏ ప్రమాణాల్లో కొలుస్తారు?
    1) ఆంపియర్ 2) ఓల్ట్స్
    3) ఓమ్స్ 4) న్యూటన్
17. విద్యుత్ ప్రవాహ విలువను కొలవడానికి ఉపయోగించే పరికరం?
    1) అమ్మీటర్ 2) ఓల్ట్‌మీటర్
    3) పొటెన్షియో మీటర్ 4) రియోస్టాట్
18. డైనమో నియమాన్ని వివరించినవారు?
    1) సర్ హంఫ్రిడేవి 2) ఫారడే
    3) ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ 4) మాక్స్‌ప్లాంక్
19. అత్యుత్తమ విద్యుత్ వాహకం?
    1) వెండి 2) బంగారం
    3) రాగి 4) సోలార్
20. విద్యుత్ బల్బులో నైట్రోజన్‌ను నింపడానికి కారణం?
    1) గాలి కంటే తేలికైంది
    2) దీపానికి మరింత వెలుగు వచ్చేలా చేస్తుంది
    3) దహన చర్యకు దోహదపడదు
    4) ఒక నాన్ టాక్సిక్
21. సాధారణంగా వాడే ఫ్లోరోసెంట్ ట్యూబ్‌లైట్‌పై రాసి ఉండే విలువ?
    1) 220 K 2) 273 K
    3) 600 K 4) 6500 K
22. కింది వాటిలో విద్యుత్ శక్తికి అంతగా ఉపయోగపడని మూలకం?
    1) సల్ఫర్ 2) బ్రోమిన్
    3) సెలీనియం 4) ఫాస్ఫరస్
23. ఎలక్ట్రిక్ తీగల తయారీలో రాగిని ఉపయోగించడానికి కారణం?
    1) త్వరగా కరుగదు
    2) ఎక్కువ కాలం మన్నికగా ఉంటుంది
    3) రాగిలో ఎలక్ట్రాన్లు అందుబాటులో ఉంటాయి
    4) మంచి థర్మల్ కండక్టివిటీ కలిగి ఉంటుంది
24. కింది వాటిలో ఫ్యూజ్ వైర్‌కు ఉండాల్సిన లక్షణం?
    1) అధిక నిరోధక శక్తి, అధిక ద్రవీభవన స్థానం
    2) అల్ప నిరోధక శక్తి, అధిక ద్రవీభవన స్థానం
    3) అధిక నిరోధక శక్తి, అల్ప ద్రవీభవన స్థానం
    4) అల్ప నిరోధక శక్తి, అల్ప ద్రవీభవన స్థానం
25. సాధారణంగా ఎలక్ట్రిక్ హీటర్‌లో ఉపయోగించే పదార్థం ఏది?
    1) స్టీల్ 2) యురేనియం
    3) నిక్రోమ్ 4) కాపర్
26. డైసెల్‌లో ఎలాంటి శక్తి ఉంటుంది?
    1) విద్యుదయస్కాంత శక్తి
    2) విద్యుత్ శక్తి 3) యాంత్రికశక్తి
    4) రసాయనిక శక్తి
27. కాంతి విద్యుత్ ఘటాల్లో శక్తి ఏ విధంగా రూపాంతరం చెందుతుంది?
    1) కాంతి శక్తి ధ్వని శక్తిగా మారుతుంది
    2) కాంతి శక్తి ఉష్ణ శక్తిగా మారుతుంది
    3) కాంతి శక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది
    4) పైవన్నీ
28. సౌర విద్యుత్ ఘటాలను దేనితో తయారు చేస్తారు?
    1) బంగారం 2) సిలికాన్
    3) వెండి 4) అల్యూమినియం
29. కంప్యూటర్ పరిభాషలో RAM అంటే?
    1) రాండమ్ ఆక్సెస్ మెమొరీ
    2) రాండమ్ ఆక్సెంట్ మెమొరీ
    3) రాండమ్ ఆక్సెస్ మెషిన్
    4) రాండమ్ ఆక్సెస్ మూవ్‌మెంట్
30. కంప్యూటర్ మెమొరీని సాధారణంగా కిలో బైట్స్ లేదా మెగా బైట్స్‌లో కొలుస్తారు. బైట్ అంటే?
    1) ఎనిమిది బైనరీ డిజిట్స్
    2) ఎనిమిది డెసిమల్ డిజిట్స్
    3) రెండు బైనరీ డిజిట్స్
    4) రెండు డెసిమల్ డిజిట్స్
31. ఉష్ణాన్ని దేని ద్వారా విద్యుచ్ఛక్తిగా మారుస్తారు?
    1) ట్రాన్సిస్టర్ 2) తాపయుగ్మం
    3) ఫొటోసెల్ 4) ఓల్టామీటర్
32. విద్యుత్ బల్బును కనుగొన్న శాస్త్రవేత్త?
    1) పాస్కల్ 2) డార్విన్
    3) గెలీలియో
    4) థామస్ ఆల్వా ఎడిసన్
33. టెలివిజన్ సంకేతాలు ఒక నియమిత దూరం నుంచి అందకపోవడానికి కారణం?
    1) సంకేతాలు బలహీనంగా ఉండటం
    2) బలహీన యాంటెన్నా
    3) సంకేతాలు గాలిలో కలిసిపోవడం
    4) భూమి వంపుగా ఉండటం
34. ఆడియో టేపులను దేనితో పూత పూస్తారు?
    1) అల్యూమినియం ఆక్సైడ్
    2) సిల్వర్ అయొడైడ్ 3) ఫెర్రిక్ ఆక్సైడ్
    4) పొటాషియం నైట్రేట్
35. ఒక ఫొటో విద్యుత్ ఘటం ఏ విధమైన మార్పును కలిగిస్తుంది?
    1) విద్యుచ్ఛక్తిని ఉష్ణ శక్తిగా మారుస్తుంది
    2) కాంతి శక్తిని శబ్ద శక్తిగా మారుస్తుంది
    3) విద్యుచ్ఛక్తిని కాంతి శక్తిగా మారుస్తుంది
    4) కాంతి శక్తిని విద్యుచ్ఛక్తిగా మారుస్తుంది
36. టెలిఫోన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
    1) ఆల్ఫ్రెడ్ నోబెల్
    2) అలెగ్జాండర్ గ్రహంబెల్
    3) థామస్ అల్వా ఎడిసన్
    4) చార్లెస్ డార్విన్
37. జి.ఎల్. బయర్డ్ కనుగొన్నది?
    1) డైనమైట్ 2) రేడియోధార్మిక శక్తి
    3) రేడియో 4) టెలివిజన్
38. రేడియోను కనుగొన్న శాస్త్రవేత్త ఎవరు?
    1) న్యూటన్ 2) గ్రాహం
    3) మార్కొని 4) అట్టోహన్
39. కంప్యూటర్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) పాస్కల్ 2) బబేజ్
    3) టారిసెల్లి 4) గెలీలియో
40. కంప్యూటర్‌లో CPU అంటే?
    1) కంప్యూటర్ ప్రాసెసింగ్ యూనిట్
    2) సెంట్రల్ ప్రాసెసింగ్ యూనిట్
    3) కోర్ ప్రోగ్రామబుల్ యూనిట్
    4) కంట్రోల్ ప్లానింగ్ యూనిట్

సమాధానాలు

1) 2; 2) 4; 3) 2; 4) 3; 5) 1;
6) 2; 7) 3; 8) 2; 9) 3; 10) 2;
11) 2; 12) 1; 13) 1; 14) 3; 15) 4;
16) 1; 17) 1; 18) 2; 19) 1; 20) 3;
21) 4; 22) 3; 23) 4; 24) 3; 25) 3;
26) 4; 27) 3; 28) 2; 29) 1; 30) 1;
31) 2; 32) 4; 33) 4; 34) 3; 35) 4;
36) 2; 37) 4; 38) 3; 39) 2; 40) 2.

కాంతి

- కాంతి ఏ తరంగాల రూపంలో ప్రయాణిస్తుంది?
- విద్యుదయస్కాంత తరంగాల రూపంలో.
- శూన్యంలో కాంతి వేగం ఎంత?
- 3×10^{10} cm/ sec లేదా
  3×10^{8} m/ sec లేదా
  3×10^{5} km/ sec.
- వస్తువులను చూడటానికి ప్రధాన కారణమైన కాంతి ధర్మం ఏది?
- పరావర్తనం.
- కెలిడియోస్కోప్ ఏ సూత్రం ఆధారంగా పని చేస్తుంది?
- కాంతి పరావర్తనం.
- పెరిస్కోప్‌లో ఉండే రెండు దర్పణాలు కాంతికి ఎంత కోణంతో అమరి ఉంటాయి?
- 45°
- సైనికులు కందకాల్లో దాగి శత్రువులను చూడటానికి ఉపయోగించే పరికరం ఏది?
- పెరిస్కోప్
- ఒక వ్యక్తి తన పూర్తి ప్రతిబింబాన్ని చూసుకోవాలంటే దర్పణం పొడవు కనీసం ఆ వ్యక్తి ఎత్తులో ఎంత ఉండాలి?
- సగం
- సమతలంగా ఉన్న దర్పణం ముందు మనం 5 మీ. దూరంలో ఉంటే ప్రతిబింబం దర్పణం వెనక ఎంత దూరంలో ఉంటుంది?
- 5 మీ. వ్యక్తికి, ప్రతిబింబానికి మధ్య ఉండే దూరం = 10 మీ.
- కాంతి ఒక యానకం నుంచి మరో యానకంలోకి ప్రయాణించేటప్పుడు సరిహద్దు వద్ద వంగి ప్రయాణించడాన్ని ఏమంటారు?
- వక్రీభవనం
- వక్రీభవనం అనే కాంతి ధర్మానికి నిత్యజీవితంలో కొన్ని ఉదాహరణలు?
- చేతి వేళ్లను నీటిలో ముంచినప్పుడు చిన్నగా కనిపించడం.
- పెన్సిల్‌ను నీటిలో సగం ముంచినప్పుడు వంగిపోయినట్లు కనిపించడం.
- బీకర్‌లో నీరు పోసినప్పుడు దానిలో ఉంచిన నాణెం పైకి లేచినట్లు కనిపించడం.
- నక్షత్రాలు మిణుకు మిణుకుమనడం.
- అక్షరాలపై గాజును ఉంచినప్పుడు అక్షరాలు పైకి లేచినట్లు కనిపించడం.

వివిధ రకాల పదార్థాలు - వక్రీభవన గుణకాలు

1) గాలి = 1; 2) నీరు = 1.33
3) గాజు = 1.5; 4) వజ్రం = 2.42
(వజ్రానికి అన్నింటి కంటే ఎక్కువ వక్రీభవన గుణకం ఉంటుంది).

- కాంతి ఏ ధర్మం వల్ల వజ్రం మెరుస్తుంది?
- సంపూర్ణాంతర పరావర్తనం.
- ఆప్టికల్ ఫైబర్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
- డాక్టర్ నరేంద్రసింగ్ కపాని
- గోళీయ తలాలు ఉండే పారదర్శక వస్తువులను ఏమంటారు?
- కటకాలు
- సరళ సూక్ష్మదర్శినిగా పనిచేసే కటకం ఏది?
- కుంభాకార కటకం
- సరళ సూక్ష్మదర్శిని ప్రయోజనాలు ఏవి?
- 1) ప్రయోగశాలల్లో రీడింగులు తీసుకోవడానికి.
  2) చేతి గడియారాలు రిపేర్ చేసేవారు చిన్న చిన్న భాగాలు చూడటానికి



గమనిక: సరళ సూక్ష్మదర్శినిలో ఒకే ఒక 'కుంభాకార కటకం' ఉంటుంది.
సంయుక్త సూక్ష్మదర్శినిలో 'రెండు కుంభాకార కటకాలు' ఉంటాయి.

- సంయుక్త సూక్ష్మదర్శిని ప్రయోజనాలు ఏవి?
- 1) రక్త పరీక్ష కేంద్రాల్లో ఉపయోగిస్తారు.
  2) జంతు, వృక్ష ప్రయోగశాలల్లో కణాల పరిశీలనకు వినియోగిస్తారు.
  3) బ్యాక్టీరియా, వైరస్‌ల పరిశీలనలో వాడతారు.
- కొలతలు తీసుకోవడానికి ఉపయోగపడే అక్షికటకం ఏది?
- రామ్స్‌డన్
- కటక కేంద్రం నుంచి నాభి వరకు ఉండే దూరాన్ని ఏమంటారు?
- నాభ్యంతరం
- నాభ్యంతరం వ్యుత్క్రమాన్ని ఏమంటారు?
- కటక సామర్థ్యం

What is the colour of milk?



BANK EXAMS

REASONING

Model questions

Directions: Read the questions carefully and answer them.

1. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
   A) Sand B) Stone C) Cement
   D) Brick E) Wall
   Explanation: Sand, stone, Cement and Brick are the raw materials. **Ans:** E
2. If Yellow is called Green, Green is called Black, Black is called White, White is called Red, Red is called Blue, Blue is called Orange then what is the colour of milk?
   A) White B) Black
   C) Red D) Green
   E) None of these
   Explanation: The colour of milk is white, and white is called red.
   Ans: C
3. Pointing to a photograph Seema said "He is the only grandson of my mother's father-in-law, and my father has neither brother nor sister". How is the man in photograph related to Seema?
   A) Father B) Uncle
   C) Cousin D) Brother
   E) None of these
   Ans: D
4. If '+' means '×', '×' means '÷', '÷' means '–' and '–' means '+' what is the value of
   17 + 15 – 135 × 9 ÷ 70?
   A) 270 B) 240 C) 170
   D) 200 E) None of these
   Ans: D
5. If it is possible to make a meaningful word from the fourth, the sixth, the eighth and the eleventh letters of the word GOURMANDISE using each letter only once first letter of the word is your answer. If more than one such word can be formed your answer is X. If no such word can be formed your answer is Y.
   A) D B) R C) M D) X E) Y
   Explanation: READ, DEAR, DARE. **Ans:** D
6. Four of the following five are alike in a certain way and so form a group. Which is the one that does not belong to the group?
   A) Silver B) Gold C) Nickel
   D) CopperE) Brass
   Explanation: Brass is an alloy where as the remaining are elements. **Ans:** E
7. In a certain code EXTRA is written as % 5 # 73 and NOSE is written as 4@8%; how is STORE written in that code?
   A) 5#@7% B) 8#@7%
   C) 8#@%5 D) 8@75%
   E) None of these
   Ans: B
8. In a row of children facing North, Shamika is third to the right of Nikhil who is seventeenth from the right end of the row. Ravi is fifth to the left of Shamika and is twentieth from the left end. Total how many children are there in the row?
   A) 39 B) 38 C) 37
   D) Cannot be determined
   E) None of these
   Explanation: Shamika is 14th from the right end. Ravi is 19th from the right end.
   20 + 19 – 1 = 38 **Ans:** B
9. How many such pairs of letters are there in the word EXAMINATION each of which has as many letters between them in the word, as they have in the English alphabet?
   A) None B) One C) Two
   D) Three E) None of these
   Explanation: EI, NO **Ans:** C
10. In a certain code ACQUIRE is written as EIRUQAC, how is DENSITY written in that code?
    A) YTISNDE B) YITSNED
    C) YTISNED D) YITSNDE
    E) None of these
    Explanation: The letters in the word ACQUIRE
    A=1, C=2, Q=3, U=4, I=5, R=6, E=7 are rearranged as 7564312
    Ans: D

Directions (Q. No. 11-16): Study the following information carefully and answer the questions given below.

An organization wants to recruit System Analysts. The following conditions apply.

The candidate must:

i) be an engineering graduate in Computer/IT with at least 60% marks.
ii) have working experience in the field of Computer at least for 2 years after acquiring the requisite qualification.
iii) have completed minimum 25 years and maximum 30 years of age as on 1.12.2015.
iv) be willing to sign a bond for Rs. 50,000.
v) have secured minimum 55% marks in selection test.

However, if a candidate fulfills all other conditions except-

a) At i) above, but is an Electronics Engineer with 65% or more marks the case is to be referred to the General Manager (GM)-IT.

b) At iv) above, but has an experience of at least 5 years as a Software Manager, the case is to be referred to the VP.

In each question below, detailed information of candidate is given. You have to carefully study the information provided in each case and take one of the following courses of actions based on the information and the conditions given above. You are not to assume anything other than the information provided in each question. All these cases are given to you as on 01.12.2015. You have to indicate your decision by marking answers to each question as follows. Mark answer-

A) If the case is to be referred to VP.
B) If the case is to be referred to GM.
C) If the data provided is not sufficient to take a decision.
D) If the candidate is to be selected.
E) If the candidate is not to be selected.

11. Ms. Suneeta is an IT Engineer with 60% marks at graduation as well as in selection test. She is working as a Software Engineer for last 3 years after completing engineering degree and has completed 27 years of age. She is willing to sign the bond of Rs. 50,000.
12. Rakesh Rao is a Computer Engineer Graduate and thereafter is working as a Software Manager for past 6 years. He has secured 72% marks at graduation and 67% marks in selection test. His date of birth is 5th December 1986. He is not willing to sign the bond for Rs. 50,000.
13. Nishant is an Electronics Engineer passed out in June 2012 at the age of 22 years. Since then he is working as a Programmer in a software company. He has passed the selection test with 66% marks and is willing to sign the bond.
14. Abhijit is a Computer Engineer with 65% marks passed out in 2011 at the age of 22 years. Since then he is working as a Software Engineer, in a private firm. He is willing to sign the bond for the required amount. He has secured 63% marks in selection test.
15. Giridhar is working as a Software Engineer in a reputed company for past 4 years after completing Computer Engineering wi-th 68% marks. He has cleared the selection test with 75% marks & is willing to sign the bond. His DOB is December 17, 1988.
16. Mr. Rajan is working as a Programmer for the last 6 years in an engineering firm after passing engineering examination. He has passed Electronics Engineering with 76% marks. His date of birth is 16.05.88. He has cleared the selection test with 62% marks and is willing to sign the bond for Rs. 50,000.

Explanations:

11. Ms.Suneeta fulfils all the conditions. Hence she is to be selected. **Ans:** D
12. Rakesh Rao fulfils all the conditions except (iv) but he has been working as a software manager for the last 6 years so according to (b) his case is to be referred to V.P. **Ans:** A
13. Since the marks obtained by Nishant in graduation are not given. So the data provided is not sufficient to take a decision. **Ans:** C
14. Abhijit fulfils all the conditions. Hence he is to be selected. **Ans:** D
15. Giridhar fulfils all the conditions. Hence he is to be selected. **Ans:**D
16. Mr.Rajan does not fulfil the condition (i) But he passed the Electronics Engineering will more than 65%. Hence according to (a) his case is to be referred to G.M. **Ans:** B
17. **Directions:** Given a statement followed by two assumptions numbered I and II. You have to consider the statement and the following assumptions and decide which of the assumptions is implicit in the statement.
    Mark (A) if only assumption I is implicit
    Mark (B) if only assumption II is implicit
    Mark (C) if either I or II is implicit
    Mark (D) if neither I or II is implicit

Statement: Even with the increase in the number of sugar factories in India, we still continue to import sugar.

Assumptions:

I) The consumption of sugar per capita has increased in India.
II) Many of the factories are not in a position to produce sugar to their fullest capacity.

Explanation: As the statement says that despite increase in the number of sugar factories in India we are still continuing to import sugar, it must be that either the consumption of sugar has increased or many of the factories are not producing sugar to the maximum capacity.
Ans: C